
కావ్యాలు

# జాషువా రచనలు-2



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

## http://www.new.dli.ernet.in



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని జళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

నవయుగ కవిచక్రవర్తి, పద్మభూషణ్

# జాషువ రచనలు

• రెండవ సంపుటం •

◆ స్వప్నకథ ◆ పిరదౌసి ◆ ముంటాజమహలు

◆ కాందిశీకుడు ◆ బాపూజీ ◆ నేతాజి

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్,

హైదరాబాద్ - 500 001. ఆం.ప్ర.

# విషయసూచిక


| | పేజీ నెం. |
|---|---|
| 1. **స్వప్నకథ** | v |
| హృదయవాది జాషువా కవి | vii |
| స్వప్నకథ-ప్రథమాశ్వాసము | 1 |
| అనాథ-ద్వితీయాశ్వాసము | 19 |
| 2. **పిరదౌసి** | 33 |
| కథా సంగ్రహము | 35 |
| కృతిపతి ప్రశంస | 36 |
| కృతజ్ఞత | 37 |
| పిరదౌసి-ప్రథమాశ్వాసము | 39 |
| పిరదౌసి-ద్వితీయాశ్వాసము | 53 |
| పిరదౌసి-తృతీయాశ్వాసము | 62 |
| 3. **ముంటాజమహలు** | 77 |
| అంకితము | 79 |
| భూమిక | 80 |
| జోతలు | 81 |
| ముంటాజమహలు | 83 |
| 4. **కాందిశీకుఁడు** | 107 |
| అంకితము | 109 |
| భూమిక | 115 |
| కాందిశీకుఁడు | 117 |
| 5. **బాపూజీ** | 139 |
| కృతిపతి ప్రశంస | 142 |
| వినతి | 144 |
| బాపూజీ | 145 |
| రాయబారము | 165 |
| జిన్నా | 168 |
| 6. **నేతాజి** | 177 |
| భూమిక | 178 |
| అంజలి | 179 |
| కన్నతండ్రి | 181 |
| తొలి నిట్టూర్పు | 183 |
| మలి నిట్టూర్పు | 192 |
| 7. **జాషువ రచనలు** | 205 |

# జాషువ రచనలు
# నాలుగు సంపుటాల్లో...

| | | రూ. |
|---|---|---|
| *1వ సంపుటం* | | |
| | గబ్బిలం | 25 |
| *2వ సంపుటం* | | |
| | స్వప్నకథ, ఫిరదౌసి, ముంటాజమహలు, కాందిశీకుఁడు, బాపూజీ, నేతాజి. | 80 |
| *3వ సంపుటం* | | *త్వరలో* |
| | స్వయంవరం, కొత్తలోకం, క్రీస్తుచరిత్ర, ముసాఫరులు, నా కథ రెండు భాగాలు, నాగార్జునసాగర్. | |
| *4వ సంపుటం* | | *త్వరలో* |
| | ఖండ కావ్యాలు | |

ప్రతులకు: **విశాలాంధ్ర బుక్ హౌస్‌లు** మరియు
**ప్రముఖ పుస్తక విక్రేతలు.**

# స్వప్నకథ

# హృదయవాది జాషువా కవి

-అమరేంద్ర

కవులలో కొందరు బుద్ధిమంతులు, కొందరు హృదయవాదులు. సుకుమార మనోభావాలు వెల్లివిరిసే కవితను వెలువరించే కవులు హృదయవాదులు. కవి హృదయాంతరంనుంచి భావాలు ఎగసి వచ్చి చదువరి హృదయ వీణతంత్రులు మీటి అతని అంతరంగపు అనంతమైన ఆకాశంలో రెక్కలు విప్పుకున్న విహంగాలలాగా విహరిస్తాయి.

భారతీయ సాహిత్యంలో హృదయవాది కవిత్వం ప్రవేశపెట్టి, భావ కవికుల గురువుగా రవీంద్ర కవీంద్రుడు నీరాజనాలు అందుకున్నాడు. ఆ కోవకు చెందిన కవిచంద్రుడు జాషువ. అయినప్పటికీ ఆయనను ఎందుకో భావకవిగా విమర్శకులు పరిగణించలేదు. ఉత్తమ భావ కవితా సంకలనంగా ప్రసిద్ధి పొందిన "వైతాళికులు" పుటలలో ఆయనకు తావు దొరకలేదు. దీనికి ముఖ్య కారణం ఆయన భావకవిత్వంలోని అస్పష్టతను తీవ్రంగా నిరసించడమే. అదీకాక, భావకవులు లోకంలోని ఇతర సమస్యలు విస్మరించి ప్రేయసిచుట్టూ అయోమయ కల్పనలు అల్లుకునే సంకుచిత ధోరణిని ఆయన ఏవగించుకున్నారు. పలాయన వాదాన్ని కంటగించుకుని కాలంతో పాటు తాముకూడా కదులుతూ తన కవితతో లోకాన్ని కదిలిస్తూ పుట్టిన వినుకొండనుండి విశ్వాంతరాల దాకా ఆయన కవిత్వం నిరంతర యాత్ర సాగించింది, నిర్భయంగా, నిశ్చయంతో.

భావకవిత్వంలో కనుపించిన దౌర్బల్యాలను, బలహీనతలనూ, పరిహరించిన మాట నిజమే, కాని భావకవిత్వపు ఉత్తమ లక్షణాలను ఆయన కవితలో మనం గుర్తించవచ్చు. భావ కవిత్వానికి ప్రాణమైన ఆత్మాశ్రయ లక్షణమూ, సౌందర్యారాధనమూ, సంస్కరణాభిమానమూ, ప్రణయతత్త్వ విలాసమూ, మానవ మహిమాభివర్ణనమూ, ఆయన రచనల్లో ప్రత్యక్షమవుతున్నాయి. ప్రత్యక్షరంలో, భావకవిత్వపు, ఉత్తమ సంప్రదాయాల వల్ల ఆయన ప్రభావితుడైనట్లు ఆయన కృతులే సాక్ష్యం చెబుతున్నాయి. చెప్పదలచిన విషయం విస్పష్టంగా, తికమక అనేది లేకుండా చెప్పడంలో ఆయన విశిష్టత గోచరిస్తుంది. ఆయన హృదయవాదులైన ఉత్తమ భావకవులందరి మాదిరిగానే పరమాణువు మొదలు పరమాత్మ దాకా, సకల వస్తువులను రసాత్మక దృష్టితో పరిశీలన చేశారు. రసైక దృష్టి ఉంటే ప్రతి అణువులో కవిత్వం సాక్షాత్కరిస్తుందని ఆయన నిరూపించారు. వస్తువు ఏదైనా కావచ్చు. అది కవి హృదయమనే మూస లోపలికి కరిగిపోయిన మైనంలాగా ప్రవహిస్తుంది. అక్కడ రూపు రేఖలు దిద్దుకుని వింతసోయగంతో వెలువడి వస్తుంది. కమనీయమైన సందేశాన్ని అందించగల గాంభీర్యం సంతరించుకుంటుంది. అందుకే కదా కవిత్వం "ఆల్కెమీ" అన్నారు కొందరు. అది తాకిన ప్రతి వస్తువునూ సూచాంపేయ శోభలతో మెరిపించేయగల పరుసవేది. హృదయవాది కవులకు ఈ రహస్యం కరతలామలకం. కనుకనే జాషువాగారు గిజిగాని గూటిలో, చంద్ర మండలములో వెన్నెల దారాలు వడికే అవ్వలో, సాలీడులో ఒక అపూర్వ సౌందర్యాన్ని తామ దర్శించి లోకానికి ప్రదర్శించగలిగారు. దారి ప్రక్క గడ్డి పువ్వులతో స్వర్గాన్ని, ఇసుక రేణువుతో బ్రహ్మాండభాండాన్ని దర్శించగలిగిన ఉత్తమ భావ కవుల సరసన నిలబడగల స్థానం ఏర్పరచుకున్నారు.

భావకవులలాగే ఆయన విస్మయ దృష్టితోనే విశ్వాన్ని పరిశీలించారు. "బ్రహ్మాండ విలాస! నీ కవన మద్భుతమర్థ గభీర మీశ్వరా!" అని సృష్టికర్త లీలావిలాసాలను చూసి ముగ్ధుడైపోయాడు. విత్తనంలో మహావృక్షం దాచి సృష్టించే గారడీ పొటమరించక మునుపె పుష్పసంతులకు వింత వన్నెల రంగులు దిద్దే నైపుణ్యాంను, చూసి మురిసిపోయి "చెలువ మొప్ప పుడమి సృష్టించి మా కిచ్చి, అనుభవింపు మనుచు ఆనతిచ్చి నిలువ నీడ లేక నిలిచిన కలవాడ, కడుపునిండ నన్ను కన్నవాడ!" అంటూ నోరారా కీర్తించారు. ప్రకృతి సౌందర్య విలాసాలను తనివితీరా ఆనందిస్తూ, ఇంతటి అందాన్ని నిర్మించిన అదృశ్య హస్తాన్ని భావించుకుని కృతజ్ఞతా భావంతో ఆయన మనస్సు నిండిపోతుంది.

*"కలవోయి ప్రతి పుష్ప గంధ గర్భమునందు*
*నీ దయా మకరంద నిర్ఝరములు,*
*కలవోయి సాంధ్య రాగ ప్రభాంబుధులందు*
*నీ రూపగత నైగనిగ్య కళలు,*
*కలవోయి గగన నక్షత్ర నేత్రములందు*
*పొటమరించెడి సానుభూతి నదులు*
*కలవోయి ఘన ఘనా ఘన నిస్వనము లందు*
*ననలెత్తు నీదు కంఠస్వరాలు"*

అంటూ, అంతటా దోబూచులాడే అందాల దొరను పోల్చుకుంటాడు. ఆ నిశ్చయంతో ప్రకృతి సౌందర్యంతో రూపాతీతమైన సత్యాన్ని సందర్శిస్తాడు. ఆ సాక్షాత్కారం కోసం అన్వేషిస్తాడు.

*సంజెకెంజాయలో జలకంబు సవరించి*
*పరతెంచు సూర్యబింబంబులోన*
*పదియారు వన్నెల పరువు వచ్చిననాటి*
*చంద్రుని ధవళహాసమ్ములోన*
*పూలతోటలతోడ ముద్దు ముచ్చట సెప్పి*
*చెరలాడు మొలక తెమ్మెరలలోన,*
*నీలి మేఘంబుల నెరియలలో కుల్కి*
*పరువెత్తు మెరుపు గర్భములలోన*

*హాయిగా పవ్వళించి బ్రహ్మాండములను*
*పల్కరించుచునున్న దివ్యస్వరూప!*
*హృదయమును చీల్చి పూజలర్పించుకొందు*
*అందుకొనిపొమ్ము వ్యవధి లేదనక సుమ్ము!*

అని ప్రేమవల్ల కలిగే చనువుతో ఆరాధనాభావం ప్రకటిస్తాడు. ఇంకోసారి "నీకే కానుక లీ సమర్థుడగు నీ నిర్భాగ్య డీ దేహమే నీకిత్తున్ తలవాల్చి పొమ్మిలరాతండ్రి! నా

మనశ్చయ్యలన్" అని ఆహ్వానిస్తాడు. ఇంకొసారి ప్రకృతిలో ఉత్తేజకరములైన సందేశాలను గుర్తించుకుంటాడు. మనిషి ఎంత మారినా చుట్టూ వున్న ప్రకృతి నియతి తప్పకుండా నడిచిపోతూ మానవ లోకానికి సందేశము అందిస్తుంది. హిందీ కవి ప్రదీప్ అన్నట్లు "సూరజ్ న బదలా, చాంద్ న బదలా, నా బదలారే అసాన్, ఇత్‌నా బదల్ గయా ఇన్సాన్!" అని జాషువా కూడా ఆశ్చర్యపోయాడు.

"ఘన ఘనా ఘనము చీకటిమేద వెలిగించు
మెరపు దివ్వెల నూనె తరుగలేదు
పవలు రేలును తీరుబడిలేక ఘోషించు
తోయధీశుని గొంతు రాయలేదు
ఇనబాలకుని దినమ్మును గర్భమున బూను
పొడుపు దిక్సతి కాన్పు లుడగలేదు
ఋతురాజు ధారుణీసతికి సొమ్ములు పెట్టి
కులికించుపని మానుకొనగ లేదు

విశ్వ నిర్మాత చల్లని వీక్షణముల
నేటికిని కెంపుచార కాన్పింపలేదు
మూర్ఖలోకమ! పనియెల్ల ముగియలేదు
దీపమున్నది హృదయమ్ము దిద్దుకొనుము"

అంటూ ప్రకృతిలోవున్న ఆరని వెలుగును మసకబారిన మానవుల కళ్ళలో మెరిపించారు, మనసులు మురిపించారు.

ఈ విస్మయ దృష్టితోనే ఆయన ఉయ్యాలలో పసిపాపనుచూసి ప్రసవాబ్ధి తరియించి వచ్చిన పరదేశిగా సంబోధించి, బోటనవేలముల్లోకములు జూచి లోలోన ఆనందపడు నోరులేని యోగిగా, గాన మాలింపక కన్ను మూయని రాజుగా, అమృతంబు విషమను వ్యత్యాస మెరుగక ఆస్వాదించే వెర్రిబాగుల వానిగా వర్ణించి ఉత్తమ భావకవితా సంప్రదాయాన్ని అనుసరించారు. పసిపాప ఏడిస్తే ఊరడిస్తూ

"ఏడువకన్న నిన్ను వలె యేడిచినా
రొకనాడు భూపతుల్
కూడ, మహీతలంబనెడి
కుంపటిలో బడినాడవప్పుడే
మూడు నిమేషముల్ గడిచె,
ముందిక నీ కుదయించి యెంద రి
ట్లేడుతురో గ్రహింపు మిది సృష్టి
రహస్యమురా స్తనంధయా!"

అంటారు. ఈ శరీరంలోంచి మళ్లీ స్వర్గ ధామానికి మరలి పోవాలని యేడుస్తున్నావా! నీకున్నాక లోకంబు క్రమ్మరి రాదోయిదిగంబరీ!" అని హెచ్చరించి

*"ఊరుం బేరునులేని యే గగన*
*మందో లీనమై యున్న ఆ*
*త్మారామున్నిను రక్త మాంస ఘట*
*మధ్యంబందు బంధించి, ని*
*స్సారంబైన మనుష్య మండల*
*నివాసప్రాప్తి శాసించెనా*
*దేరాజో యతడే సమర్థు*
*డగునోయీ ముక్తి నీ కీయగన్"*

అనే సత్యం ప్రబోధించి శైశవ వైభవాన్ని అపూర్వంగా వర్ణించి

*"జగత్ పారాబారేర్ తీరే*
*చేలారా కొరే మేలా*
*అంతహీన గగన్‌తొలో*
*మాధారపొరే అచంచలో"*

అనే రవీంద్ర కృతిలోవున్న భావనా వైశాల్యాన్ని గుర్తుకు తెస్తారు.

ప్రణయమే సృష్టికి మూలాధారమని హృదయవాదుల స్థిర విశ్వాసం. మానవ హృదయం కారుణ్యంతో కరిగిపోయి పవిత్రం కావాలని భావకవు లందరిలాగే జాషువా భావించి కరుణారసం తన కవితలో వెల్లివిరిసేట్లు చేశారు. ఒక కావ్యఖండికలో కవి నడి వేసవిలో ఒక చోట వడదెబ్బ తగిలి పడిపోయినప్పుడు ఆపద్బాంధవుడుగా ఒక వ్యక్తి అక్కడికి వచ్చి ఆదుకున్న సన్నివేశం వర్ణించారు. దేవదూతలాగ అక్కడికి వచ్చిన వ్యక్తిని గురించి చెబుతూ "నా కొదవిన కష్టమచ్చువడి యున్నది వాని ముఖాంబుజంబునన్" అంటారు. ఆ సందర్భంలో

*"కిరణములతోడ నను కంటగించిచూచు*
*తరణి కెవడిచ్చె లోకబాంధవ సమాఖ్య?*
*పరుల బాధలుగని వేగ కరిగిపోవు*
*పాంథ! నీవయ్య త్రైలోక్య బాంధవుడవు"*

అంటూ కవిత్వానికి పరమావధియైన కారుణ్య ప్రబోధం ధ్వనింప జేశారు. తన కవితలో జనుల మనస్సులు కరిగించి, కడిగివేసి సానుభూతితో నింపి వేయాలని ఆయన ఆదర్శం. అందుకే "అంతరమ్ముల దయారామాభివృద్ధికి అమృతంబు చిల్కు వర్షాగమంబు" అని కవిత్వాన్ని అభివర్ణించారు. "అతి వినిర్మల భావనాకాశ పథంలో ప్రాలు మాలిక పల్లిటీలు కొడుతూ, శిరీష కుసుమ శయ్యల మేను వాల్చుతూ, కవిత్వం అందమైన అబద్ధంగా సత్యమును కమ్మని వాక్కుల నిర్భయమ్ముగా" ప్రకటించాలని ఆయన అభిప్రాయం.

వెర్రితలలు వేసిన విజ్ఞానం మానవులను ఉద్ధరించలేదని ఆయన తలపోసారు. "దాన గుణహీనమైన విజ్ఞాన మేల?" అని ప్రశ్నిస్తూ ప్రకృతిని మార్గదర్శకంగా చిత్రించారు.

మకరందమును తేటులకు భోజనమువెట్టు
సుమవల్లరుల వింత చుట్టరికము,
అలిచిప్పలకు ముత్యాల పాపల నిచ్చు
స్వాతి మేఘముల దాంపత్య గరిమ,

*తలిరాకుహస్తాల బిలిచి నీడనిచ్చు*
*ధరణిజమ్ముల దానధర్మదీక్ష*
*కష్టజీవుల మేని గండుచెమ్మటలూడ్చి*
*యెదార్చు పిల్లవాయువుల నెనరు*
*ప్రకృతి నిండారు జడపదార్థముల కిచ్చి*
*జ్ఞానధనుడైన నేటి మానవునికీక*
*నరసమాజంబు నవమానపరిచినావు!"*

అని సృష్టికర్తతో ఫిర్యాదు చేశారు. ఇది ఆధునిక కాలంలో మేధావులందరినీ వేధిస్తున్న సమస్య. మెదడుకూ, గుండెకూ మధ్య సజీవమైన అనుబంధం తెగిపోయినందువల్ల మేధాశక్తి పెరిగి హృదయ సంపద తరిగిపోతుంది. ఆలోచనకూ, ఆవేశానికి, సమన్వయం కల్పించినప్పుడే మానవ వికాసం సమగ్రంగా సర్వాంగ సుందరంగా అలరారగలదు. తమ భావనలద్వారా అటువంటి సమన్వయానికి దోహదం చేసిన సత్కవులలో జాషువగారిది సమున్నతస్థానం.

కలమును కులముతో కొలిచి బేరాలు సాగించే కాలంలోకూడా ఆయన కలంతో కాలాన్ని జయించగలిగారు. కాలదేవత కపోలతలంలో మిల మిల మెరిసే పాలరాతి బాష్ప బిందువు వంటి తాజమహలు లాగా ఆయన కవిత తన రాజసాన్నీ లావణ్యాన్నీ విడువదు. కలకాలం అపూర్వ భావ సౌందర్యంతో అనుపమాన శైలీ మాధుర్యంతో, విశ్వజనీనమైన ఆదర్శ వైభవంతో అలరారగలదు. కులమతాల ఇరుకు చట్రాలనూ, "చీనా పడంతి ముచ్చెలవంటి సాంఘిక ప్రతిబంధకాలనూ" పగులదన్నిన విప్లవ స్ఫూర్తితో వెలుగుతుంది.

"సకల మానవ మానసముల సామ్రాజ్యంబు
సలుపజాలినదీ నీ సత్యవాణి"

అన్న కవితా శక్తి వర్ణన ఆయన కవిత్వానికి కూడా అక్షరాలా వర్తిస్తుంది. మాటల గారడీలు లేవు. అలంకారాలు ఆడంబరాలు లేవు. పాండిత్యపు కసరత్తులు లేవు. గుండెలల్లోంచి దూసుకువచ్చి గుండెలని పలకరించి జలదరించేట్లు పన్నీరు చిలకరించడమే ఆయన ప్రత్యేకత. అందుకే జాష్వా నవ్యకవిత్వ మహారాష్ట్రానికి మకుటంలేని పీష్వా అన్నారు కవితాప్రియులు.

(కీ.శే.చతుర్వేదుల నరసింహశాస్త్రి 'అమరేంద్ర' కలం పేరుతో సాహితీ లోకంలో వెలిగిన కవి, విమర్శకులు. జాషువా కవితారసాన్ని దోసిళ్ళతో ఆస్వాదించిన కవితాభిమాని 'Gems of JOSHUA' అని జాషువా పద్యాలను నూరింటిని ఆంగ్లానువాదం చేసి తన అభిమాన కవికి కతాభిషేకం చేశారు.)

## సహృదయులకు.

పోషించు దాతలు లేక వర్తమాన యుగమున c గవితాకళ సన్నగిల్లినది. 'నిరంకుశాఃకవయ' అనుసూక్తి కపార్థములను కల్పించి, వ్యర్థరచనలు సేయు బుద్ధిమంతులు బయలుదేరినారు. సహృదృష్టి యుపన్యాస వేదికల కాహుతియై పోవుచున్నది. దుర్భర దారిద్ర్యము కవుల నాశ్రయించుటంజేసి యుత్తమ కావ్యము లముద్రితములై మూలుగు చున్నవి. ధనవంతుల పసిcడిసంచులు కారణాంతరములకు ఖర్చు పెట్టబడుచున్నవి. పరిస్థితులెట్లున్నను రచనాకండూతికి గుఱియగు నాకలమూరకుండక స్వప్నకథను ప్రసవించినది. ఇక్కావ్యమున "స్వప్నకథ, అనాథ" యను రెండు కథలు కలవు. ఇందు మొదటిది సమగ్రము, రెండవదసమగ్రము. ఒకటి మూట గట్టబడిన గాలి, యొకటి సలసల గ్రాగి చిందిన కన్నీటి బిందువు. అసంపూర్ణమైన 'యనాథ' కథ పాఠకులకు వింతగాc దోపవచ్చును. కాని, మనోగతభావము సమగ్రముగా వ్యక్తీకరింపబడిన మీదట నా దృష్టికిక్కథ సమగ్రము. అందువలన ననాథ పురవీధులలో విడిచిపెట్టబడినది. కావ్యశిల్పమున కన్న నభిప్రాయ ప్రకటనమే నా పరమావధి. సహృదయులకు యుద్దేశము స్పష్టము. వారాదరించినc జాలును; తదితరులతో నాకుcబనిలేదు.

'నా పిరదౌసి' కావ్యము తమ తండ్రిగారికిc గృతియిప్పించి, పితౄణమును దీర్చికొన్న శ్రీ సింగరాజు మల్లపరాజారావుగారి కోర్కెపై వారి ప్రథమ ధర్మపత్నియుc గీర్తి మిగిల్చిచన్న పతివ్రతాశిరోరత్నమునగు శ్రీ సింగరాజు లక్ష్మి కళావతీదేవి కిక్కావ్యము నంకితము సేయుచున్నాను. ఆమెగారి యాత్మకును, కథానాయికల యాత్మలకును భగవంతుండు శాంతి నెలకొల్పుcగాక!

గ్రంథకర్త

# స్వప్నకథ

## ♦ ప్రథమాశ్వాసము ♦

నేనొకనాఁడు స్వప్నమున
　　నింగికి రివ్వున లేచి చంద్రబిం
బానకు దాపునం గనుల
　　పండువు సేయుచునున్న వింత మై
దానమునందు వ్రాలి భ్రమ
　　దంబున దిక్కులు సూచుచుండ నా
పై నును లేఁత వెన్నెల తు
　　పానులు వీచె మనోహరంబుగన్.

అచ్చెరువు పడుచుఁ బచ్చల
పచ్చికబయలునఁ జరింపవలెనని తిరుగం
జొచ్చితి నపుడొక కమ్మని
యుచ్చైర్నాదంబు శ్రవణయుగళిన్ దాకెన్.

ఇంద్రధనువువంటి హృదయంగమంబైన
వన్నె చిన్నె లీను వలువఁగట్టి
బాలుఁ డొక్కరుండు కేళి సల్పుచు నుండె
కాఱుమబ్బు డోలికలఁ బరుండి.

నన్ను రాచుకొనుచు నలువంకలకుఁ బారు
మెఱువుఁ దీవియలను నొరయుచున్న
వాని చక్కఁదనము వర్ణింపవలెనని
కలము నందికొంటిఁ గౌతుకమున.

అతఁడు కికాకిక న్నగి వి
　　యత్తల మెల్ల ధ్వనించిపోవ, స్వా
గతము కవీశ! ర మ్మిచటి
　　కాలువ గట్టున నున్న రత్న రం
జితమగు నస్మదీయ గృహ
　　సీమను నించుక విశ్రమించి నీ
కత వివరింపుమం చెదురు
　　గా నడచెం గురు లల్లలాడగన్.

కలయో? నిక్కువమో! యను
తలంపు చిత్తంబునందఁ దళుకొత్తఁగ భూ
తలమునఁ బడియెదనో యని
యులుకుచు గగనమునఁ దిరుగుచుంటి నతనితోన్.

మొలిచెన్ తెక్కలు మూపునం బులకరిం
పుల్ దేహమం దెల్ల శో
భిలె మాధుర్యము లైన భావములతో
విన్వీథిఁ బొన్నంగి పి
ట్టలతోఁ దేలికగాఁ జరించితి మఖండం
బైన వేగంబునన్
దలపై ముత్తెపుగుత్తులట్లు గ్రహము
ల్దారల్ బ్రకాశింపఁగన్.

గగన గంగమ్మ కవ్వలిగట్టునందు
దేవతలు స్నానమాడెడు రేవు పొంత
రాజహంసల పాదముద్రలు రహించు
నిసుకతిన్నెల వ్రాలితి మిద్దఱమును.

ప్రాకిన యేలకీ లతల
పందిటితోడ, సనాతనంపు నా
జూకుల కిక్కయైన యొక
సుందర సౌధముఁ జొచ్చి చూచినా
మేకులు రాట్నముం గలుగు
వృద్ధవిలాసినిఁ బ్రాయ మంతయున్
జీకినదాని వెండి నగి
షీ పని దంతపుఁగట్ల పీఁటపై.

చూపులు వాడిపోయినవి
శోభిలు దేహపటుత్వ మెన్నఁడో
కోపము సేసె, యౌవనముఁ
గూరికె నా యనువారు బిడ్డలుం
బాపలు లే రహో! తుహిన
మండల మెన్నఁడు సొచ్చి యున్నదో
యోపిక మాత్రమే నిలిచి
యున్నది తోడయి గ్రుడ్డి గువ్వకున్.

పదముల చప్పుడు విని మా
కెదురు నడిచివచ్చి మధురహృదయంబున న
ప్పది రెం డేడుల బాలుని
వదనము ముద్దాడి విపుల వాత్సల్యమునన్.

తేరకొని చూచి పిలిచి, యాతిథ్య మిచ్చి
నాయనా! రమ్మటంచుఁ జందనపుఁ బీట
వయిచి భుజియింపుఁడని నాకు బాలకునకుఁ
దామరాకులలో నమృతంబు వోసె.

ఎలమై సముద్రపుం జిలుక
యీకల కుంచియఁ బూని తాటి క
మ్మల భర మాపలేని జిగి
మాలిన కర్ణము లూఁగియాడఁ గో
మలమగు జాజిపూవుల దు
మార మలంది చరించు లేఁత గా
డ్పు లొలయ వీచుచుండె నగు
మోమున సాదర వీక్షణంబులన్.

ముసలమ్మ చేతియన్నము
మెసవుచు బాలకునితోడ మెలఁగుచు నేదో
వ్యసనమునఁ జిక్కి మఱచితి
వసుంధరాతలము రెండు పదివాసరముల్.

ముంజేత పదు వెన్నపూస ముద్దలవంటి
మింటిచుక్కలతోడ మేలమాడి
మొగలి పుప్పొడివర్షమును బోలు తఱచైన
పొగమంచు తెరల దోబూచులాడి
కటికి సంధ్యాగ్నిలోఁ గరఁగిపోవని క్రొత్త
స్వాతి మబ్బుగుఱాల స్వారి జేసి
చదలేటి నీట మజ్జనమాడు తెరగంటి
రాచకన్నెలమీఁద రాలు రువ్వి

మంచువాలు చందమామ మండలమున
నిల్లు మఱచి తిరుగు పిల్లవానిఁ
బ్రమ్మరింప మూడు కాళుల ముసలమ్మ
తిరుగుచుండు నౌగఁ దినదినంబు.

ముక్కున నూపిరి నిలిచిన
దిక్కు దెసయు లేని ముసలితెఱవ సహనమున్
జక్కని గుణంబుఁ గనుగొని
యక్కజ పడుచుండుఁ బ్రత్యహంబు నెడందన్.

ఒకనాఁ డగ్గలమైన వేగమున నే
    యుం జీరలున్ త్రైక లిం
కొంకనాఁ డింపుదలిర్ప రాట్నమున దీ
    యుం జంద్రికాధారలన్
జికిలీజేసిన పట్టు నూ ల్జిలుఁగు వ
    న్నెల్ గన్నులన్ దన్ప దై
వికి శక్తుల్ గల వృద్ధురాలికడ స్తం
    భించుం దిశాగోళముల్.

అవగారి చిత్రచరితము
సవిస్తరముగా నెఱింగి చనవలెనని దూ
ది వడుకు సమయంబునఁ జే
రువగా గూర్చుంటి నొక్కరో జుదయమునన్.

కరమున దూదిపింజలు, మొ
    గంబున నవ్వు దుఱంగలింప న
న్నరసి "విశేషమేమి? కొడుకా!" యని
    తీయగఁ బల్కరించినం
జరణములంటి మ్రొక్కి "దివసంబులు
    పెక్కుగతించె నేను చం
దురుని పొలంబుఁ జేరి కృపతో ననుఁ
    గ్రమ్మఱఁ బంపు మవ్వరో!"

నీవు మహత్తు గల్గిన మ
        నీషిణి వెన్ని యుగాలు దాటె న
వ్వా! వనజారిలోకమున
        వాసము సేయఁదొడంగి యెవ్వరీ
భావుకుఁ? డాప్తులుం గులము
        వారు గలారటె?మర్త్యకాంతవో?
దేవతవో? వచింపుమని
        తీయని పల్కున హెచ్చరించితిన్.

ముగ్గిన పండగు నమ్మది
వగ్గది విని రెండు మూడు బాష్పకణంబుల్
నిగ్గుడిగియున్న చెక్కులు
డిగ్గన్ గాద్గదిక సంఘటిలిన యెలుఁగునన్.

నా వయస్సెంతొ చంద్రమండలము వయసు
నించుమించుగ సరిపోవు నెంచిచూడ
నా చరిత్రంబు నిన్న మొన్నటిది గాదు
యెన్ని యుగములు దాటిపోయెనొ కుమార!

ఆకాశరామ నీళ్ళాడు చక్కదనాల
        బుడుత చుక్కల కెల్ల బురుదువోసి
అలవోక నిండు జాబిలి రాట్నములమీఁద
        మేలైన వెన్నెల నూలు వడికి
విభుని దుర్దశఁ జూచి విలపించు రోహిణీ
        నారీవతంసంబు నూఱడించి
గ్రహణకాలమునందుఁ గలుషితం బై పోవు
        నుడుపతి పుట్టంబు లుదికిపెట్టి

ప్రసవవేదనఁ బడు వేల్పు బడతుకలకు
సాము మిగిలిన మంతరసాని నగుచు
నమవసకుఁ గూడఁ గన్ను మూయను కుమార!
కవులు వర్ణించు జింకను గాను నేను.

ఏను పరోపకారమున
　　కే తనువెల్ల వ్యయించినాను అఅ!
జ్ఞానులు దాచుకొందురు క్ష
　　ణక్షణ కర్కశ తైలయంత్ర మె
వ్వానిబలంబుఁ బిండ దొక
　　పక్షమున న్నశియించు చంద్రుఁడున్
మానునె విశ్వలోక సద
　　నానకు సున్నముఁ గొట్టు చేతలన్.

నేనొక రెడ్డిసానికి జ
　　నించిన మానవకాంత నన్న నా
దీన చరిత్రలోన నిన
　　దించురసంబు విషాద మందులో
నానిన గుండెతోడ గగ
　　నంబున కెక్కితిఁ జావు లేదు నా
మేనికిఁ జంద్రమండల స
　　మిద్ధ సుధాశన కారణంబునన్.

జననీ జనకులు నేఁ బొడ
మిన రెండవ వారముననె మృత్యువునకు భో
జనమై చనినా రే నపు
డనాథ నయి గుడిసెలోన నఱచుచు నుంటిన్.

తల్లి దండ్రులఁ జంపిన దానవి యిది
యాదరించిన నేమి ప్రమాదమగునొ
యనుచుఁ గొఱకొఱలాడి నన్నంటరయిరి
పౌరకాంతలు భీతి గొప్పది గదన్న!

పది దినాలకు ముందు గర్భమునఁ బండి
నిదురవోయిన చిన్నారి నిర్మలాత్మ
యాఁకఁటం దూలు ప్రత్యేక వ్యక్తియయ్యె
నవని భౌతికమైన దేహమునఁ జొచ్చి.

గుడిసెకొప్పున నెన్నఁడో గూఁడు గట్టి
డాగుకొనియున్న కొండొంక నాగమయ్య
వాని దాపునఁ బెట్టిన తేనెపట్టు
ముట్టెతో నొత్తెఁ గ్రొందేనె లుట్టిపడఁగ.

వాయెండ నేడ్చు నా కా
తీయని మధురసము కంఠదేశంబున నా
ప్యాయముగఁ గురియ రోదన
సేయుట మానితిని కొంతసేపు కుమారా!

కాలముచేసిన తల్లి త
దాలయమున నాగమయ్యయై నిలిచెనొ! కా
కీలాటి వింత గలదే?
వ్యాళములకు మానవులకు వైరంబుగదా!

గరిటెడు పాలు నా చిఱుత
కంఠమునం దిడువారు లేక పో
యిరి కొడుకా! యనుంగు జన
యిత్రి దివంబు నలంకరించినన్
గరుణకుఁ దావలంబగు నొ
కానొక పేద కుటీర మందు నేఁ
బెరిగితి రెండునాళ్ళు విల
పించుచు సర్పము పిండు తేనెలన్.

ఒక రే యాకలి దీటి యంగకములం
దుల్లాస ముప్పొంగ నూ
రక మింటిం గన నవ్వుచుంటి నతి జీ
ర్ణంబైన మాయింటి లో
నికి లేవెన్నెల చేతులం జొనిపి నా
నిగ్గుం గపోలంబు లం
టి కృపాశీతల దృష్టులం బుడుకుచుండెం
జంద్రుఁ డుత్సాహియై.

శిరమున నున్న రత్న మణి
చెమ్మగిలం బడగెత్తి యాడుచుం
దిరుగుచునుండె మండల గ
తి న్ననుఁ బెంచిన పాఁపతల్లి మం
దిరము కొనన్ సమస్త ధర
జీవలయంబును గాఢనిద్రలో
గుఱకలు వెట్టుచుండెఁ బసి
కూన మనంబువలెం బ్రశాంతమై.

అలరుం బాన్పుల నున్న దంపతుల గా
ఢాశ్లేషణం గంది వె
న్నెల పన్నీటను దాప మార్పుకొనుచుం
డె న్మంద వాతూలముల్
నెల మా పేద కుటీరమస్తమున నూ
నెన్ బాదముల్, రెండు జా
ముల యీ డేర్పడియె న్నిశాసతికి భీ
ముం దయ్యెఁ గాముండునున్.

ఎప్పుడు కన్ను గూర్కితినొ!
యేనపు డింకొక లోకమందు మా
యప్పయు నంబయు న్ననుఁ బ్రి
యంబునఁ గౌఁగిట గ్రుచ్చి కన్నులన్
జప్పిలు బాష్పపూరముల
చే నభిషేకమొనర్చి యేదియో
చెప్పుట వింటిఁ దత్తుహిన
శీతలదృష్టులఁ దేలిపోవుచున్.

కాచగోళంబులో దీపకళిక వోలి
కంటి కగుపించుచున్నది కడుపుఁ జిచ్చు
వేయి వచియింపనేల నక్కాయమందు
నా స్వరూపంబులేని స్థానంబులేదు.

తనివిదీరక ముద్దాడు తల్లిగారి
యమృతమయమూర్తి నాకుఁబ్రత్యక్షమయ్యె
నాకుటీరంబు నారూపు నా యుయేల
దిక్కు లెస లేని నా ఘోర దీనదశయు.

పరలోకంబున దేహము న్మఱచి, స్వ
ప్న స్వల్పసంతోషమే
దురితస్వాంతతఁ దల్లియంకతలమం
దు న్నిల్పియున్నట్టి నా
సరదా బూడిదపాలుగా గుడిసె ప
జ్జన్ టెక్కలల్లార్చి కు
క్కురుకో యంచును గోడి కూసి నను మే
ల్కొల్పెన్ వికార ధ్వనిన్.

ఉదయ సూర్యుని కిరణంబు లొక్క టొకటి
నా కుటీరంబు కప్పు కన్నములనుండి
పసిడి తీవెలవలె జొచ్చి వ్రాలుచుండె
సలలితములైన తల్లి చూపుల వితాన

కడుపు పండిన యొక సాలెపడతి మిన్న
ప్రియముతో నన్నుఁ గొనిపోయి పెంచుకొనియెఁ
దనదు సంతాన మనెడు ముత్యాల మాలఁ
గొలికిపూసనువలెఁ జూచుకొనియె నన్ను.

ఇంతంత దాననై భగ
వంతునికృపఁ జపల శైశవంబు గడచి ని
శ్చింతంబు నమల సుమనః
కాంతంబగు బాల్య దశను గడచితి నంతన్.

మిసమిసలాడు యౌవనము
        మేలిమి బంగరు వన్నె మేనికిన్
బొసఁగె గులాబి బుగ్గలకుఁ
        బోడిమి హెచ్చె నలంక్రియ క్రియా
వ్యసనమునందుఁ జిక్కి మగ
        వాని సమక్షముఁ గాంక్షసేసితిన్
గుస గుస ముచ్చటల్ వినుట
        కున్ మనసయ్యె రహస్య మేటికిన్.

చణకు చణకున దొణికి నిస్వనము సేయు
జలభరితమైన బిందె బుజానఁ బెట్టి
యువకులకు గోర్కులూరఁ గొండొకదినమున
నచ్చపు టొయారమున నీరు దెచ్చుచుంటి.

తిరిపెపుఁ గూటికై బడుగు
        దేహము నీడిచికొంచు వీథులన్
దిరిగెడు పేదవాఁ డొకఁడు
        దృష్టిపథంబున గోచరించినన్
గరుణ వహించి యాతని మొ
        గంబు నెగాదిగఁ జూచి గేహమున్
మఱచి సజీవ విగ్రహము
        మాదిరి జేష్టలు దక్కి నిల్చితిన్.

వాని మోమునఁ గల దైన్య భావమునకు
కఱఁగిపోయిన నాగుండెకాయ నిండి
పై కుబికివచ్చు కన్నీటి వఱద లోన
వోలలార్చితి నా నిల్చియున్న నేల.

కారు మొయిళ్ళు గ్రమ్మిన మొ
గంబునఁ బేదఱికంబు ముద్ర చె
న్నారఁ బునాదు లూడిన వ
యస్సునఁ గంచముచేతఁపట్టి యా
హారముకోసమై తిరుగు
నా ముసలయ్య కటాక్షముల్ నిరా
శారుచిరంబులై పలుక
సాగె దయాంకిత భావగీతముల్.

ఒకఁడు చిన్నమ్మ కరడోల నూగుచుండ
నొకఁడు పెద్దమ్మ కటికిదృష్టికిఁ దపించు
ప్రకృతి జనయిత్రి యనుగుఁ గారాల సుతుల
నొకని ద్వేషించు నొకని నభ్యుద్ధరించు.

చిన్నప్పటినుండియు నా
కన్ను వరుల కష్టములను గని యోరువలే
దన్నా! బడాయిగా దీ
వెన్నెల నాకనుల నుద్భవించుచు నుండున్.

నా సౌందర్య శ్రీలకు
దాసుండై కట్టుబడ్డ తరుణుం డొకఁడా
శ్వాసించు నెపముతోడ
న్నా సన్నిధి కరిగి చిన్న నవ్వులు గురియన్.

'రాజవీధిని శృంగారరసము లొలుక
జలముఁ గొనివచ్చు పట్టుగాజుల పడంతి!
మోదుగుల బుష్పమట్టు నెమ్మొగము గంద
దుఃఖపడియెదవేల హేతువులు లేక

బాలాతపంబు చుంబనము గావింపని
చిఱుతబుగ్గలు సొమ్మసిల్లి పోయె
పసుపుఁ బూతలతోఁడఁ బనిలేక శోభిల్లు
చిన్నారి మేన ముచ్చెమట వోసె
పడుచువారికి రాయబారంబుఁ బంపించు
కన్ను లశ్రువు లూరి చిన్నవోయె
ప్రణయదేవత కాఁపురము సేయఁదగియున్న
వదనలావణ్యంబు వట్టిపోయె

దర్శనీయమైన త్వద్విలాసమునకు
ముజ్జగంబు మంత్రముగ్ధమయ్యె
జలభరమున నీ భుజంబు గ్రుంగఁ దొడగె
బిందె దింపుమందువే లతాంగి'

అని పలుకరించు యువకునిఁ
గనుఁగొని కనుఁగొనక యొరగాఁ దొలఁగి గృహం
బున కేగుదెంచి విషయము
జనయిత్రికిఁ జెప్పి నాఁటి సాయాహ్నమునన్

నేను వడకిన నూలు మగ్గాన దార్పి
తల్లి యనుమతి నర్ధరాత్రమున కేను
సత్వరంబున నాఱు గజాల బట్ట
నేసి యొసఁగితి బేదవానికిఁ గుమార?

నాఁడు మొదలుగ నా భోజనంబునందు
సగము నిరుపేద కిడి తక్కుసగముతోడ
జీవనము సేయుచుంటి నా జీవితంబు
సార్ధకం బయ్యెనని పురజనులు వొగడ.

నన్ను బెంచు నతివ కన్న సంతానంబు
వాసికెక్కునన్నుఁ బగ వహించి
గాసి పెట్టసాగెఁ గాలక్రమంబున
మారుతల్లి దివికి జారిపోయె.

ఆ యసూయ పెద్దదై యక్క సెల్లెండ్రు
ఇల్లు వెడలనడచి రేమి సెప్ప
బిచ్చగానితోడ భిక్షుకురాలినై
యుండ లేనిదాన నయితి నన్న!

ధనవంతుఁడు దొంగభయం
బున దల్లడ మందినట్లు పుర విట నిచయం
బునకుఁ దలంకితి నెఱ జ
వ్వనమునఁ దుల దూఁగు మందభాగ్యఁ గుమారా!

పాప మీ శీలవతి కెంత పాటు వచ్చె
ననుచు నొకఁనాడు రెండు నా ళ్ళచట నిచట
నన్నముం బెట్టి కొందరు మిన్న కుండి
రంతియ కదన్న! మనుజుల యాదరింపు.

మిలమిలనాడు మేనిపయి
మృత్తిక బేరుకొనెన్ బ్రసూన కో
మలత నశించె వస్త్రములు
మాసి క్రమంబుగ జీర్ణమయ్యెఁ జూ
పుల నిశితత్వముం బలుకుఁ
బొందిక తొంటి యొయారపు న్నడల్
దొలఁగె దరిద్రదేవి కృప
లో నొక లోపము లేకపోవునే.

హెచ్చిన యాకఁట బ్రతికియు
జచ్చిన గతిఁ జూపరుల కసహ్యముగఁ బురిన్
బిచ్చం బెత్తెడు ననుఁ గని
పిచ్చిదనుచుఁ బేరుపెట్టి పిలిచిరి పౌరుల్.

సుకములకు దూరమై కూ
టికి గుడ్డకు లోన తల్లడిలు వేళను మా
నక పోషణ జేసితిఁ గా
టికిఁ గాళులు సాచు నక్కడింది దరిద్రున్.

లేమిచేఁ గందిపోయిన నా మనస్సు
నందు సంతృప్తి తాండవ మాడఁ దొడఁగె
విలసితములైన కలిమి లేములను గూడ
కడలు పరికించునెడల సౌఖ్యంబు గలదు.

ఓరంత ప్రొద్దులును బరి
చారికవలె ముసలివాని చరణంబులు వే
సారక భజించు నన్నొక
జారిణీ యని తలఁచి నింద సలిపిరి లోకుల్.

ఇతఁడుం బండ్లూడిన పెను
ముతుకుం డిది ముద్దరాలు పొసఁగదనక యి
ట్లతికించుచుంద్రు లోకులు
సతులకుఁ బురుషులు నోటి చాపల్యమునన్.

స్వాంతము నెఱుంగు దుర్భిణీయంత్రములను
నలువ సృష్టించియున్న మానవుని జిహ్వా
యనృతము సృష్టిసేయునా యవక తవక
గమన ముందున భువనచక్రమున నిట్లు.

ఒక లేమ కసరి కుక్కకు బోలి పులిసిన
పిడికె డెంగిలి కూడు విసరివేయ
ఒక తల్లి సహజధార్మికురాలు కరుణించి
కమ్మని కూరలుం గబళమేయ
ఒక చుప్పనాతి పెట్టక పోయకయ నోటి
కుండూతిఁ బరుష వాక్యములు పలుక
ఒక కుటుంబిని నన్ను నికటానఁ గని యింటఁ
జొరఁబడి గడియ వైచుకొనియుండ

ఒక్కనాడు గుడిచి యొకనాఁడు పస్తుండి
నెత్తి కొంగుమీఁద నిదురవోయి
ముసలివానితోఁడ మూడేండ్లు కష్టాంత
నాటకంబు నడపినాను నేను.

పేదఱికము పెద్ద వింత విద్యాశాల
దానిలోన లజ్జ గానబడదు
ఉదర మొజ్జ యగుచు నోరంత ప్రొద్దులు
నోర్మి విద్దె నేర్పుచుండు నచట.

'అబలను దరిద్రురాలను
కబళం'బని యొక్క యింటికడ నిలిచితి బా
డబు లున్న వాఁడ నొకనాఁ
డబలామణి యోర్మ రాజహంస నడకతోన్.

గుమ్మము సేరవచ్చి పలు
కుం బులకండము గుమ్మరించుచున్
'కొమ్మ! మొగంబు తామరస
కోరకముంబలె నీదు లేంత ప్రా
యమ్ము వచించుచున్నది క
టా జవరాల వినుంపగజ్జలు
న్నమ్మకుఁ జిక్కినావు మహి
షాంగనకుం జిగురాకు పోలికన్.

ఋణము లొనర్చి నాదు మగఁ
డీలిగె నాకనిపించు నాలుగం
కణములమిద్దె బచ్చుల మొ
గంబునఁ బెట్టితి నద్దెకొంపలో
మిణుకుచు సొమ్ము లమ్ముకొని
మెక్కితి నిన్నటిదాక దేహ ధా
రణ మెటు సాగునో? విధవ
రాలను బిడ్డలకేమి పెట్టెదన్?

దాన కండూతి కలుగు హస్తంబు నాది
పేదవారికి లే దనలేదు నేను
బిచ్చమిడలేని నా రిత్త వేడియూర్పు
లందుకొన్నావు మందభాగ్యవు నిజంబు.'

అని కంటన్ దడివెట్టు నయ్యతివ సౌ
మ్యస్వాంతమున్ గూలిపో
యిన సంసార చరిత్రమున్ బరుల కే
దే నీయనై లేమియం
దును నిట్టూర్పు నిగుడ్చు చాన గుణ మా
దుర్గాయు నా మానసం
బున నానంద విషాద మేఘపటలం
బున్ దీర్చె గాఢంబుగన్.

నీకన్న మందభాగ్య ల
నేకులు గలరమ్మ చూచితే లోలాక్షీ
యీకుల మాకుల మన కని
యాకారము లేని యంతరాత్మ వచించెన్

ఆమె పదాల వ్రాలి నిట
        లాంచల మంట నమస్కరించి 'సా
ధ్వీమణి! మంద భాగ్యులగు
        పేదల వ్రాతఫలంబుగాక నీ
ధామము లేమి దేవతకుఁ
        దావలమౌనె? ప్రశాంతి దీపమం
దాముద మింకునే? పరహి
        తార్థుల కిట్టి విపత్తు మూఁడునే?'

అనుచుఁ గన్నీటి పలుకుల ననునయించి
నాగడించిన నాలుగణాల డబ్బు
ప్రియముతో బాపనమ్మ కర్పించుకొంటి
జన్మ తరియించెనని చిత్తశాంతిఁ గంటి.

ఈడున్ జోడును లేని సంపదల నూ
        యే లూఁగు సంపన్నులన్
మూడంతస్తుల మేడ గట్టుకొని సం
        తోషించుచున్నట్టి మా
ర్వాడీవర్తకుఁ డొక్కరుండు మును నా
        వాల్చూపు గాయాలచేఁ
బీడింపంబడువాడు నా సదనమున్
        వీకించి గుర్రించుచున్

అక్కట సాలెవారి జవ
        రాలవు గావొ లతాంగి నీవు! నీ
చక్కఁదనంబుఁ దొల్లిఁటి మ
        జా యెటు వోయె? బజారులోన నీ
చక్కని వాలుఁజూపులు ర
        చించిన తుమ్మెదతోరణాలలో
నుక్కిరి బిక్కిరై సొలయు
        చుండెగదా మగవారి చిత్తముల్

కడలేని కాలవాహిని
సుడిగుండము లెన్ని గలవొ! చూచినవాఁడున్
వడిదుడుకు లేక బ్రతుకుం
బడవ నడుపుకొనినవాఁడు వసుధం గలఁడే?

అని తొంటి కొద్ది పరిచయ
మున నా యెడ వింత సానుభూతి నెఱపి త
ద్ధనవంతుఁ డాదరంబున
దినవెచ్చం బీయ సమ్మతించె ముదమునన్.

ధనికుఁ డిడుచుండు దినవెచ్చమును గ్రహించి
పేదవడియున్న బ్రాహ్మణ విధవ కొసఁగి
కోరి వృద్ధునిఁ బోషించుకొనుచు నుంటి
నలువురిండుల భిక్షాటనంబుఁ జేసి.

ఏ నొకనాఁడు భిక్షఁగొని
    యింటికి వచ్చితి నర్ధరాత్రి లేఁ
డా నడ లేని వృద్ధుఁడు గృ
    హంబున నాతని చింపి గుడ్డలున్
వాని పదాంబుజంబులును
    వాయని తాతలనాఁటి చెప్పులున్
గానఁగనయ్యె ముంతయును
    గంచముఁ జింతిలు బందులుం బలెన్.

అందందు వెదకి చూచితి
నెందు నతని జాడ లేమి హృదయము వగులన్
గ్రిందంబడి పొరలుచు నా
క్రందన మొనరించితిని మొగంబున్ గందన్.

శ్రేణుల్ గట్టిరి పౌరు 'లేమిటిది జ
    చ్చెన్ వృద్ధుఁ డేమయ్యెనే
యేణీ లోచన తచ్ఛవం' బనుచుఁ ద
    ద్వృత్తాంతమున్ జెప్పినన్
'జాణా వృద్ధుని జంపితే యని' యమ
    ర్ష స్వాంతులై తిట్టుచున్
రాణాకుం గొనిపోయి రిద్ద రదిగూ
    డం బాడియౌ నెంచినన్.

ఆ చెఱసాల జాలకము
లందుఁ బ్రసన్న ముఖాంబుజంబునన్
దోఁచి కటాక్షమాలికల
తో నభిషేకముఁ జేసి ప్రేమ వా
చా చతురత్వ ముట్టిపడ
సాంత్వనముల్ వచియించుచుండు న
బ్బాచులలేని వంటి శుభ
మూర్తి యొకం డల వృద్ధు నాకృతిన్.

తాతా యెందుంటివి నా
యాతనలకుఁ బార మున్నదా యని చింతా
ఘాతమున నలిగిపోయిన
చేతంబున నఱచి సొమ్మసిల్లి పడుటయున్.

ఘంట గొట్టిన లీల నా కర్ణ యుగళి
మ్రోయుచున్నది దేవతామూర్తి గళము
స్వప్నముం గాదు జాగ్రదవస్థ నున్న
నాకు వినవచ్చె పక్ష్యమాణంబుగాను.

దీనుల పాలిఁటి భాగ్యని
ధానమ నా తల్లి నీ సుధాజీవితగా
థానవ్యకుసుమ సురభిళ
మై నా హృదయంబు స్వర్గ మానందించెన్.

మొలిచిన యౌవనంబు వృథ
పుచ్చి దరిద్రుల దేబెరింపు చూ
పులను గఱంగి స్వీయ సుఖ
ముం బలి యిచ్చిన మచ్చెకంటి చిం
తిలవల దూఱడిల్లుము వి
నిర్మలమైన భవచ్చరిత్రలో
వెలసిన నిందలన్ దుడిచి
వేయును కాలము సత్యబద్ధమై.

కోరుకొనుమమ్మ తల్లి నీ కొంగునిండ
వరములిచ్చెదనని సమీపమున నిలిచె
మూడుగాళుల ముసలయ్య గాంఁడతండు
బ్రహ్మతేజస్వి యొక వేల్పుఁ బడుచువాఁడు.

కలుష గర్భితమైన భూవలయమందు
నేను జీవింపలే నర నిముసమైనఁ
దావక పదాబ్జముల సన్ని ధానమునకు
నన్నుఁ గొనిపొమ్మనుచుఁ బల్కినానొ లేదొ!

ఒక సుడిగాలి రివ్వున మ
హోద్ధతి నాకడ వీచి నన్ను మిం
టికిఁ గొనివచ్చి చంద్రధర
ణీ న్నిముసఁబున నిల్పి పోయె న
ర్భకునిని నన్నుఁ దన్పుచున
వారిగ నా పరిచర్యలందు న
య్యా కలుషమూర్తి తొంటి ముస
లయ్యా సుమా యనుమాన మేటికిన్.

అని కథ ముగియించిన తో
దన రాట్నపుఁ ద్రాడు పుటపుటం దెగిపోయెన్
గను విచ్చి చూచినంతన
దినకర మండలము తూర్పు దిక్కున నవ్వెన్.

# అనాథ

## ♦ ద్వితీయాశ్వాసము ♦

పరుల దుర్గతిఁ గని గుండె గఱఁగి వగచు
సదయ హృదయుల వీక్షణాంచలమునందుఁ
బుట్టుచుండును కన్నీటి బొట్టువోలె
ఏఁడి భగవంతుఁ డని సంశయింతు వేల?

◊ ◊ ◊ ◊

అన్నముఁ బెట్టవే యనుచు
నల్లరిసేయు ననుంగుబిడ్డలన్
దిన్నగ నూరడించుచు వి
ధిం దలపోయుచు నొక్కపేదరా
లన్నముఁ దిన్న కొండొక ధ
నాఢ్యుని బంగరు మేడ ముంగిటన్
దిన్నెల వేగుచుండె నతి
దీనత మున్నొకనాఁటి రాతిరిన్.

ఏతలి కన్నదో వ్యథల
నీదుట కీ నిరుపేదరాలి న
న్నాతికి బిడ్డ లార్వురు తి
నంగల తెక్కలు రానివారు రం
జీతని యెంచెనో నలువ
సేయు విలాసమొ చంటిబిడ్డ యన్
ప్రోతఁ దగిల్చుచుం బురుడు
వోసిననాఁడ గతించె భర్తయున్.

అతడు వోయినవెనుకఁ బిత్ర్యమగు ధనము
జోలెయును సంచి దొరకె నిల్లాలి కయయొ
బిడ్డలా నేదరులు చంటిబిడ్డ యొకతె
యెట్లు పోషించు నెటువోవు నేది దిక్కు.

అధిక దైన్యంబు మోముల నధివసింప
నడచు పీనుంగులో యనఁ గొడుకుఁ గుట్టి
లామె వెనువెంట నడువ గ్రామాంతరంబు
వాసి వచ్చిన దొక యమావాస్యనాఁడు.

ఒడలిమీఁది బట్టయును సత్తుగాజు లా
జోగురాలి యాస్తి భోగమెల్ల
నేడు పొట్ట లింక నేరీతి నిండునో
బ్రతుకులెట్లు తెల్లవాఱఁగలవొ.

'నాయనలార! మీకడుపు
నం గల యాఁకటి చిచ్చు లార్ప నా
కాయముదక్క గవ్వయును
గల్గదు నాకడఁ దెల్లవాఱినం
బోయి గడించి తెచ్చెదను
బోనము నోపిక పట్టుడయ్య అ
మ్మాయికిఁ గూడఁ బాలు కఱ
వైనవి యన్నములేమి నాకునున్.'

అనుచు నురలివచ్చు నశ్రుబిందువులను
దుడిచికొనుచు జంటి బుడుతదానిఁ
జిచ్చి కొట్టుచుండె క్షితిమండలం బెల్లఁ
గునికి నిద్రవోవు కుటిలరాత్రి.

ఉప్పరము నీలి యద్ధపుఁ
జిప్పవలెం గసటువోయి చెన్ను వహించెన్
గప్పర కప్పర చీకఁటి
తెప్పలపై నింక నావరించుచు నుండెన్.

విచ్చిన మల్లెపూవువలె
వేకువయయ్యె ద్విరేఫఝుంకృతిన్
మచ్చరకించు రాట్నపు ని
నాదములొప్పె గళుక్కులుక్కుమం
చచ్చట నిచ్చటం జిలుఁగు
టందెలు మ్రోయ జలంబు దెచ్చుచున్
ముచ్చటలాడు నూరి నవ
బోఁదుల సందడు లయ్యె నయ్యెడన్.

పదియాఱేఁడుల లేత జవ్వనము లా
వణ్యంబు మిట్టాడ ను
న్నది లేదన్న ప్రశంస కెక్కి పిడికిం
టన్ జిక్కు మధ్యంబుతో
బెదరుంజింక కనుంగవం గలుగు త
న్వీరత్న మాయింటి కు
ఱ్ఱది చూచెం గలయంపిఁ జల్లుచు వసా
రా యం దనాథాంగనన్.

ఓసీ యెవ్వతె నీవు నీమగని సొ
మ్మున్నట్లు పాపిష్ఠురా
లా సంసారము బెట్టినావు మొగసా
లన్ లేచి పొమ్మంచు నె
దాసీన్యంబుగ మాటలాడి జలపా
త్రన్ గాలితోఁ దన్నినన్
గాసంతేనిఁ గలంక కయ్యబల సం
తానంబు వెంటాడఁగన్.

కదలి చనుదెంచి వీధి వృక్షముల నీడఁ
గూలఁబడి తూలుచుండెఁ గొద్దులను దాను
నంత నొక బుద్ధిమంతురా లా దరిద్ర
మూర్తులం జూచి కరుణించి ముదలకించి.

ఓసిపేదరాల యూర నేఁడొక గొప్ప
పెండ్లి గలదు నీకు బిడ్డలకును
గడుపునిండ బువ్వ గల దా గృహస్థుండు
పెట్టు పోతలందు వెలితి పడఁడు

చలిది గలదు రమ్ము సంతానముం గూడి
ప్రస్తుతంబు క్షుత్తు వాపుకొనుము
బాలు రక్కటకట తూలుచు నున్నారు
అన్న మెప్పుడింత తిన్న వారొ.

ఆకలి దప్పులు దీరెను
నీ కమ్మనిమాట విన్న నిర్మలహృదయా
లోకంబునందు నెల్లరు
రాకాసులవంటి కఠినురాం డ్రుండెదరా?

చుఱుకు చుఱుక్కునం బలుకు
సూదులు గ్రుచ్చి యదల్చి కాపు సుం
దరి జలకుండికం బదమునం
బడదన్నిన చేంత చిత్తమున్
గఱగఱంగోయగా నయిన
గాయము మాన్పె భవన్మృదూక్తి త
ల్లిరొ యెవరింట బుట్టితివి
లేమలలో నను నుద్ధరింపంగన్.

అనుచున్ గన్నుల నీరు గ్రుక్కుకొని య
య్యైతావులన్ క్షుత్తునన్
గనులుం బొట్టలు గ్రుంకి దీనముగ నా
క్రందించు సంతానమున్
గని తల్లీ! చనుదెమ్ము నీ సుతుల భా
గ్యం బంచునుం బోయి వీ
కొని తెచ్చెం బులిగూడు భిస్సటము నా
కుం బొత్తులం గొంగునన్.

కుడువుమని చెప్పి బంగారు గుడులు గట్టి
పెట్టుచుందురు నరులు నైవేద్యములను
సృష్టికర్తకు దాని భుజింపం డతండు
భిక్షకునిచేతి యెంగిలి పిడచ గాక.

అది యారగించి, పేదల
యుదరంబులు చల్లంబడియెనో లేదొ! నభ
స్పదనమునం దిరుగు మేఘము
లుదరంబుల నించుకొనియె నుదధి జలంబుల్.

ఏనుంగు చెక్కిళ్ళపై నివాసము సేయు
కన్ను మిన్నె ఱుంగని గర్వమునకు
కరుణాలవం బెఱుంగని క్రోలు పులినోట
వర్ధిల్లు క్రూరస్వభావమునకు
అత్త పత్తిదళంబులం దుట్టిపడుచున్న
నిను ముట్టరాదను నియమమునకు
పురివిచ్చి యాడు నెమ్ములు కంఠంబునం దోంగు
కలదు నాకను నహంకారమునకు

గండు టెలుకల ప్రత్యంగకమున నలరు
పరులకొంపలు దిని వేయు స్వార్థమునకుఁ
జిక్కుపడకున్న నిరుపేద బక్కదాన!
కరుణ కిరవైనదాన! స్వాగతమునీకు.

కినియుచుఁ బ్రొద్దు నెత్తిపయి
కిం బయనించినదాక భూమిశ
య్యను బవళించి పొంత నడ
యాడుచుఁ బాడుచు నున్న కూర్మి నం
దనులను ముద్దులాడుచు ము
దంబునఁ దేలుచుఁ బ్రొద్దుపుచ్చుచుం
డెను తరుకోటరంబున న
టించెడు పక్షుల నొక్క పక్షియై.

పంగనామాలు నుదుటఁ దుఱంగలింప
పట్టుపంచలు బొజ్జలఁ బరిహసింప
భోజనమునకు బిరబిరఁ బోవుచున్న
విత్తవంతుల నరసె నప్పేదరాలు.

ఎదగాఁ బొమ్మని చీదరించుకొనువా
రీవంక నా వంక నొ
త్తిడిసేయం గరమెత్తి మ్రొక్కుచు మహా
దీనంబుగాఁ బ్రక్కకున్
బుడతల్ దానుఁ దొలంగుచుం బెదరుచుం
బుత్రీసమేతంబ కా
ఱడివిన్ దాటినయట్లు కష్టమున ర
థ్యల్ దాటి శీఘ్రంబుగన్.

పెండిలి గీముం గని క
ట్టెండ కచట నున్న నింబవృక్షముకడఁ గూ
ర్చుండెం గొడుకులతోఁ బెను
గండము గడచిన విధంబుగాఁ గరుణముగాన్.

త్రొక్కుడుబండిపై నడక
క్రొత్తగ నేర్చిన షోకిలా యొకం
డెక్కడనుండియో యచటి
కేగుచు నంకెకురాని భార్యతో
జిక్కులనందు భర్తవలెఁ
జేతులపట్టుఁ దొలంగి ప్రేల్మిడిన్
ముక్కున నెత్తు రొల్కఁబడి
పోయె గుభిల్లునఁ బేదరాలిపై.

ముసలిది చచ్చె చచ్చెనని
మూఁగిరి కొంద అతండు క్రుద్ధుఁడై
కసరుచు లేచి కన్నులకు
గావరమా యటఁ జూవకుంటివా
పసరమ! యంచు రక్తమునఁ
బైవసనంబు మునుంగుచుండఁగా
విసుగును సిగ్గు నాస్యమున
వ్రేల గమించుచు నుండె వీథులన్.

పిల్లలు 'గీ బే' యనుచును
గొల్లున రోదింపఁ గట్టు కోక రుధిరపు
న్వెల్లువను మునుఁగ నల్లన
నలాడుచు లేచెఁ బేదరాల్ రాల్గరుగన్.

ఏఁడు సముద్రముల్ గడచి
యెక్కడ నేపని మీఁదఁ బోయి యు
న్నాడవురా! పరాత్పరుఁడ!
నా కడగండ్లకు మేర యున్నదా?
యేడకుఁ బోవుదాన? నెటు
లీ కసుగందుల పొట్ట నింపు నీ
యాఁడు దటంచు నేడిచె మ
హా కరుణంబుగ డొక్క క్రుంగగన్.

అక్కడ నిలిచిన వారల
నొక్కండును నేల కొఱఁగియున్న పడఁతి పై
నక్కటిక మూని ముట్టరు
దిక్కు దెసయు లేనివారి స్థితి యింతెకదా?

అట నొక మేడపై సరస
        మాడుచు దంపతులిద్ద ఱప్పు డ
చ్చట గుమిగూడియున్న జన
        సంఘము నారసి, పృచ్ఛసేసి యూ
రటపడి, కమ్మఱం బ్రణయ
        రాజ్య విహారము సేయఁ జొచ్చిర
క్కట! సుఖ మొక్కచోటఁ గడ
        గం డ్లొకచోటఁగదా వసుంధరన్!

పరమేశు విలాసమ్ములు
కరము దురూహ్యములు శిశువు కాయమునందున్
జిఱు గాయమేని లే కతి
సురకితముగా హసించుచుం బడియుండెన్.

ఓయి నాస్తికుఁడా విను మొక్కమాట
అరసియుందువు ఘోర దృశ్యంబు నిచట
మృత్యుదేవత కోఱలు మెఱయునపుడు
శిశువు నే మహాశక్తి రక్షించెనోయి.

పరువెత్తి,వచ్చు పర్వతమాలికల వంటి
        జలధిభంగముల నవ్వలికి గదిమి
బ్రహ్మాండగోళంబుపైఁ బ్రయాణము సేయు
        నినబింబమును తూలనీక నిలిపి
ఫెళఫెళార్భటుల మర్త్యులమీఁది కుఱికెడు
        పిడుగుల నోరగా విసరివయిచి
సృష్టిలో నొక చిన్ని చీమ కాలముసేయ
        పొడమిన కన్నీటి మునిఁగి తేలి

గడియ తీరికలేక లోకమును గావ
పరువులిడుచుండు దీనుల పాలివాఁడు
నిజ కరాబ్జంబు నీచిట్టి నిసుఁగుమీఁద
నిలిపె నొక నిమేషం బది నీ వెఱుఁగవు.

చేరువనుండి యప్పుడంతి
చేటు సమస్తముం జూచుచున్న సం
సారులలో నొకండు కడు
జాలి వహించి భిషక్కునింటికిం
జేరిచి యండనుండ నొక
ని న్నియమించి చికిత్స చేయగా
నాఱు వరాల రొక్కము ని
రాకులుండై యిడె వెజ్జు దోసిటన్.

ఓ లలన నీ మగండొక
మాలది పడిపోవ నంటి మైలవడియె వై
ద్యాలయముం జేర్చినాం డిఁక
నేలాగున నయినం గుడియు నెడమయు లేదా.

ఎవ్వరికి లేని పుణ్యంబు నిత డొకండె
దాచికొనవచ్చుం గాబోలు నాతి మిన్న
యెవరి కర్మము వారిది యీ వెఱుంగవొ
ముక్తి కలుగునె మాలలం బులిమికొనిన.

అనుచు నమ్మ లక్క లతని యిల్లాలికిం
ద్రాపి రెలమిం గ్రోధరసము నబల
శివము పట్టినట్టు చిందు ద్రొక్కుచునుండెం
బ్రకుపితో గ్ర శంభురాణి వోలి.

గంగను మునింగిన భక్తుని
యంగంబుల నోలలాడు నానందం బు
ప్పొంగెడు నెదతో సదనము
ముంగిట నడుగిడిన భర్త మోముం గనుచున్.

రావలవ దింటిలోనికి
నావల నిలుచుండి స్నానమాడు మనుచుం గ
న్గేవల నదరులు గురియగ
నా వెలంది వచించె విభు ననాదరణమునన్.

ఇదియొక క్రూరురాలు ఇపు
డేను వివాదము పెట్టుకొన్న చోఁ
బదుగురు నన్నుఁ దిట్టి తల
వంపులు సేయుదు రూరకుంట యి
య్యదనున నుత్త మంబని ని
జాంగన నిల్చినచోట నిల్చి కో
విదమతి స్నాన లీల నెఱ
పెం గుల భేద పిశాచ తృప్తి కై.

భోజనము జేసి కేలఁ దాంబూల మంది
పోక చెక్కలు రెండింటి బుగ్గ నునిచి
చిఱుత రతనాల పీఁట నాసీనుఁడగుచు
నింతి నాహ్వాన మొనరించి మృదులఫణితి.

'అలుక శమించెనా జలక
మాడిన యంతనె! మాల దాని పి
ల్లల కడగండ్లు సూచి బహు
ళంబుగ దప్తమునందు నా మనో
జలజము మైలపడ్డ దది
స్నానము చేసెనె వెఱ్ఱిదాన! యీ
వెలుపలి శుద్ధి జీవులకుఁ
బెట్టునె పోయునె ముక్తి నిచ్చునే!'

స్నానము సంధ్యావందన
మేనాఁడో మఱచినాడ విపుఁ డీవు కిర
స్తానులలోఁ గలయుటకొఱ
కా నీతులు సెప్పుచుంటి వనుచు విముఖియై.

పరుగిడ నల్లత్రాఁచువలె
భామిని కీల్జడ సంచలింపఁగా
శిరము మఱల్చి లేచి నిర
సించుచు ముంగిఁటి కేగె నంత నా
సరసుఁడు కోపగింపక వి
చారము సేయక స్వీయ కార్య త
త్పరుఁ డయి లేచిపోయెఁ బెడ
వాదన సేయరు నీతికోవిదుల్.

తన పనులు మాని మఱునాఁ
డనాథ శరణాలయంబునందు విడిచె ని
య్యనదకుమారులఁ గరుణా
వననిధుకుఁ బరహితంబు పబ్బంబు గదా.

మేనిగాయంబు లలనల్ల మానిపోవ
వనిత కాలక్రమంబునఁ బట్ట  గట్టె
వసుధపై నూక లున్న సంపన్నుఁ డెంతొ
బడుగుపేదయు మృత్యుదేవతకు నంత.

ఒక యరుణోదయమున భి
క్షకుఁ బోవుచునుండ నిండు కౌతుక మతులై
పకపక నవ్వుచు మూగిరి
స్వకుమారులు చుక్కలూడి పడిన విధమునన్.

పోయిన ప్రాణముల్ మగుడఁ
 బొందినిఁ జొచ్చిన లీలఁ దండ్రులా
రా యని కౌఁగలించుకొని
 యాస మెయిం గడు ముద్దులాడి తా
నీ యెడ నా యెడం బికిర
 మెత్తిన రొక్కము నాఱు దమ్మిడీ
లాయమ పంచియిచ్చె హృద
 యంబును బంచినలీల వారికిన్.

అన్నము సరిపోవునె నా
కన్న కొడుకులార విసిఁగి కసరుకొనరుగా
చిన్న సహోదరు నచ్చట
నున్న మహామహులు చూతురో మిమ్ము దయన్.

జగడములు వెట్టుకొనకుఁడు
వగఁగుందిన నాదరించువా రెవ రన్నా
యగచాట్ల నందు నడపీ
నుగు నేనుండుదునొ చత్తునో సుతులారా.

అని పెద్ద కొడుకు కదుపునఁ
దన శిరమును నిలిపి కొంతతడవు వగచి రం
దని పిలుచు చదువులయ్యను
గని చేతులు మోడ్చి చాష్పగంగాముఖియై

వీరు దిక్కు లేనివారు పంతులుగారు
ప్రేమతోడ నాదరింపవలయుఁ
గూలి నాలి జేసి కొంత శక్తి కొలంది
ముట్ట జెప్పుకొందు ముందు కనుచు.

చరణముల నంటినం గురు
వరుఁడు కనికరించి దుఃఖపడవలదు సతీ
పరమేశ్వరుండు లేఁడా
నరుండు నరు నుద్ధరించునా వెఱిదానా.

లలన యొకమ్మ వెట్టు కబ
ళంబు భుజించుచు మందభాగ్యవై
నలువురి యిండ్ల పంచల ది
నంబులు బుచ్చెదు నీ బహూకృతుల్
వలయునె తప్పు సుమ్మిటుల
బల్కుట వర్ణన కందరాని బి
డ్డలపయి నున్న మోహ మక
టా పలికించు ననేక రీతులన్.

బారెడు ప్రొద్దెక్కిన దిఁక
రా రండని పిలువ బిరబిరం జెలియలికిన్
నూరారు ముద్దు లిడి చని
రూరు వెడలి బాలు రంబయుం జరుదేరన్

"ఇది పొలిమేర రాయి జన
నీ యిక నిల్వుము రేపటెండ యు
మ్మదమునఁ గంది పోవును సు
మా మన చిట్టిది వచ్చి పోవుచుం
డెద మని పెద్దవాఁడు దయ
నీయముగా వచియింప శోక వా
రిదము వెలార్చు బాష్ప నిబి
రీప తరంగిత గండభాగయై.

చినిగిన పైఁటకొంగు నొక
 చేతఁ దనూజ శిరాన నుంచి, నం
దను లెడమై నిరీక్షణ ప
 థంబును దాటినదాకఁ జూచి, వె
చ్చని హృదయంబుతో నడువ
 సాగె ననాథ పురంబు వంకకున్
గనుల మెలంగు బిడ్డల వి
 కాస ముఖంబులు సంస్మరించుచున్.

పచ్చని వన్నెతోఁ జిగురు
 బట్టి పసందులు సింద నాలిగా
ద్పుచ్చలితంబు సేయఁ దల
 లూచుచు నున్న పొలాలు దాటి య
య్యచ్చఁపు జోగురాలు పుర
 మల్లనఁ జొచ్చి కుమార్తె నెత్తి పా
లిచ్చుచుఁ గూరుచుండె నొక
 వృక్షమునీడ క్షుధాకులాంగియై.

ఎవఁ డారగించు నమృత భోజనంబున
 గలిసెనో యీలేమ గంజిబువ్వ
ఎఁవడు వాసముసేయు శృంగార సౌధాన
 మునిఁగెనో యిన్నారి పూరిగుడిసె
ఎవని దేహముమీఁది ధవళాంబరములలో
 నొదిగెనో యీన్నాతి ముదుకపంచె
ఎవఁడు దేహము సేర్చు మృదుతల్పములలోన
 నక్కెనో యీయమ్మ కుక్కిపడక

వసుధపై నున్న భోగసర్వస్వమునకు
స్వామిత వహించి మనుజుండు ప్రభవమందు
నెవఁ డపహరించె నేమయ్యె నీమె సుఖము
కలుష మెఱుగని దీని కొడుకుల సుఖము.

ఉఱుములు మెఱుములు గల యొక
శరదము గగనమున మసలి క్షణకాలమునన్
గురిసెం బ్రచండవర్షము
నిరులు గవియ మన్ను మిన్ను నేకమగు గతిన్.

జడివాన గురియులోపల
నడువీథికి నడచి మన యనాథ శిశువుతో
గడగడ వడఁకుచు నొక చా
వటిలోనికిఁ బోయి నిలువఁ బడియె బెదురుచున్.

వానలోనఁ దడసి వచ్చిన పెంపుడు
కుక్క కుపచరించు నొక్క పురుషుఁ
డాగ్రహించి పంచ నంటుకొన్నావఁటే
యరుగు మరుగు మనుచు నాదరించె.

ఈ పసిబిడ్డతోడ నివు
దేడకుఁ బోయెదనయ్య యిచ్చటన్
గాపుర ముందునా యుదయ
కాలమునుండియుఁ బచ్చిగంగ లే
దోపిక జారె మీ సుకృత
మూరకపోవునె వర్ష మాగని
మ్మో పరమోపకారి యని
యూపిరి కన్నుల నిల్పి పల్కినన్.

కనికరపు మొలఁక లాతని
యనాదరణ మలమియున్న యంతఃకరణం
బునఁ బొటమరింప నిష్టము
ననిష్టమును దెలుపు మౌన మతఁడు వహించెన్.

అతని పెండ్లాము కరుణారసార్ద్రహృదయ
నాథునకు లేని కొన్ని గుణములు గలది
మంచి కుదురైన యాఁడుది మాటకారి
యదియనుం గాక చదువుకొన్నదియుఁ గూడ

మెడ దిరుగని సొమ్ములతో
వడి వంకయు లేని హసిత వదనముతో సం
దెడు కొప్పుతోడ మదనుని
పిడియేనుగువోలి వచ్చు ప్రియవచనములన్.

ఎవరైననేమి రక్షణ
మవశ్యకర్తవ్యమే కదా నరులకు ధ
ర్మమునకును గలుగునే కుల
వివక్షతయుఁ జిన్న పెద్ద భేదము నాథా.

అని మనోహరు నుల్లంబు కనికరింప
మధుర మధురంబుగాఁ గొన్ని మాటలాడి
పేదరాలికి భోజన భిక్ష పెట్టి
ప్రేమ వర్షించె నాఁటి వారిదముకరణి.

మగఁడు గొట్టిన రోదించి మానుకొన్న
పెద్ద గయ్యాళివలె వాన వెలిసిపోయె
మమత లుడిగిన సన్యాసి మనసువోలె
గగనమండల మెల్ల నిష్కలుషమయ్యె.

ఆకటం దూలు సస్యశామల క్షేత్ర
కన్య గర్భము చల్లగ భుజించె
బక్కచిక్కిన కొండవాగుం దటాకంబు
జిటుకలో నుప్పొంగి చియ్యబట్టె
ముమ్మాయి ముత్యంబు బోలి తామరమీఁద
వర్ష బిందువు తాండవంబు సేసె
నడయాడు రతనంబు వడుపున నాడాడ
ఆరుద్ర పురువు ప్రత్యక్షమయ్యె

చెలఁగి చేయార దానంబు జేసి చేసి
కొఱత వడియున్న వాని కాపురమువోలి
యుబ్బుసెడి తూలె నొక చిన్ని మబ్బుతునక
యుత్తరంబుగ దిక్కుల కొత్తిగిల్లి.

# పిరదౌసి

# కథా సంగ్రహము

ఒకనాఁడు గజనీమామూదు నిండుకొలువుండి, పారసీక కవులలోఁ బ్రథమగణ్యుం డనఁబరఁగు పిరదౌసి కవిని రావించి షానామా యను గ్రంథమును (రాజచరిత్ర) రచించి తన కంకితము చేసినచో బద్యమునకొక్క దీనారము (బంగారు నాణెము) నొసంగెదనని వాగ్దానముచేసె. అంత నక్కవి సమ్మతించి గ్రంధ రచనమున కుద్యమించి ముప్పది సంవత్సరములు శ్రమపడి యఱువది వేల పద్యములు వ్రాసి ముగించి, రాజసభా మధ్యమునఁ బఠించి, సకల కవి పండిత జేగీయమానమయిన తన కవితా నైపుణ్యమును బ్రకటించి గ్రంథమును ఱేని కర్పించి స్వగృహబునకుఁబోయె. అనంతరము రాజుగారేే కారణముననో బంగారమునకు మారు వెండి నాణెములను పంపించిరి. చిరకాల సంవర్ధమానంబగు ఆశాగేహంబు విచ్ఛిన్నంబగుట కవి వరుండెంతయు వగచి, రాజును నిందించుచుఁ గొన్ని పద్యములను వ్రాసి పంపె.

అంత భూభర్త యాగ్రహించి కవినిఁబట్టి చంపుడని భటుల కాజ్ఞసేయ పిరదౌసి సతీసుతసమేతుఁడై గజని విడిచి స్వగ్రామమయిన తూసు పట్టణముఁ జేరి తల దాఁచుకొన నిశ్చయించి, బహుప్రయాసతో అరణ్యములు నిర్గమించి కతిపయ వానరంబులకు పారసీకముచేరి నివసించుచుండె. కవిహననోద్యుక్తుడయిన మహమ్మదు సామంతరాజులు సేయు హితోపదేశమున శాంతివహించి, కవి ఋణము దీర్చుకొనఁ దలఁచి, యొకనాఁడఱు వదివేల దీనారము (బంగారు నాణెము) లుష్ట్రములపైనిడి వీర భటులకిచ్చి కవికొసంగుడని పనిచె. కాని ప్రయోజనమేమి? ధనము తూసు పట్టణము తూర్పుగవినిఁ ప్రవేశించెను. కవి శవము పడమటి గవిని నుండి ప్రేతభూమికిఁ గొంపోఁబడెను.

అంత రాజభటులు హేమరాశిని కవి యిల్లు సేర్చి పిరదౌసి కుమార్తెను పరిగ్రహింపుమని ప్రార్థింప, "నా తండ్రి నిరంతరము దుఃఖపెట్టిన నీచమైన ధనమును నేను ముట్టను" అని యామె నిరాకరించె. ఈ ఘోరవార్తను విని మహమ్మదుగా రెంతయుఁ జింతించి, యేతద్ధనముతో తూసు పట్టణమున పిరదౌసి పేర నొక సత్రశాలఁ గట్టించెను. దాని చిహ్నములు నేఁడును గలవు. కాని యిందొకరికి కీర్తియు, నొకరి కపకీర్తియుఁ దక్కినది. ఇద్దఱును గాలగర్భమునఁ గలసిపోయిరి. తారతమ్యము లింతియ.

# కృతిపతి ప్రశంస

బ్రహ్మకులమున గల యన్వవాయములను
రాణఁ జెన్నారు శ్రీ సింగరాట్కులమునఁ
బ్రథితయశుఁడైన మల్లపరాజుగారు
ప్రభవమందెను గొనములు పరిమళింప.

ఆ రమ్యకీర్తిశాలికిఁ
గోరికలు ఫలింప ముద్దుఁగొమరుఁడు లక్ష్మీ
నారాయణుండు పుట్టెఁ బ
యోరాశికిఁ బూర్ణహిమమయూఖుండు బలెన్.

తాలిమి మేల్మి సొమ్మయి సదా వదనంబు నలంకరింపఁగా
నాలుకమీఁద సత్యవచనంబు నివాసముసేయ, దొడ్డ యి
ల్లాలగు జ్ఞానమాంబిక ప్రియంబునఁగొల్వ, సుఖాంబురాశిలో
దేలుచు నా గుణాఢ్యుఁడు ప్రతీతి వహించు సుధీజనంబులన్.

నా ముద్దుల కృతికన్యా
యీ మంగళమూర్తి జీవితేశుఁడుగా; ని
త్యామోద కుసుమ విసరము
మోమున వికసింప నంకమున నుండగదే!

అనుకూలుండగు నీ మనోహరుని నామాంకంబు దిగ్దేశ్వరా
ద్జన జిహ్వాంచల సీమలన్నిలుపు మాచంద్రార్కమున్ జారిపో
వని నీ జవ్వన మస్మదాంధ్ర విషయ ప్రాగ్దేశ దీపంబుగా
మని భాషాలలితాంగి కూఁత యిడుమమ్మా! కావ్యకన్యామణీ!

–జి. జాషువ

# కృతజ్ఞత

ఫిరదౌసి ఇన్ని కూర్పులు వడయుటకు దెలుఁగువారి యాదరాభిమానములే కారణములు. అందలి గుణాగుణములు సిద్ధహస్తులగు కవి పండితులచేతఁ బెక్కుమాఱులు విమర్శింప బడినవి. విస్తరభీతిచే వానినిట నుదాహరింపనైతిని. రసగ్రహణ పారీణులగు నాంధ్ర విశ్వకళాశాలా గ్రంథ నిర్ణాయక సభవారు దీని నింటరుమీడియెటు విద్యార్థులకు 1940 సం॥ వఱకును బఠనీయ గ్రంథముగా నిర్ణయించి, నన్నెంతయుఁ బ్రోత్సహించిరి. వారికి నేను కృతజ్ఞుఁడను. దీని తృతీయ ముద్రణావసరమును, సంభాషణ వశంబున నెఱింగి, పరిపూర్ణ ద్రవ్యసహాయ్యమొనర్చి నాకు దోడ్పడినవారును, నా ఖండకావ్యములను రెండు భాగములనుఁ దమ మాతాపితల కంకిత మిప్పించి, ముద్రింపించుచు నన్నాదరించిన దాతలును, గుంటూరు వాసులును, న్యాయవాదులు నగు మ.రా. శ్రీ ఏకా దండయ్య పంతులుగారి యవ్యాజ ప్రేమమునకును వారి మహోదార స్వభావమునకును హృదయపూర్వక నమస్కార సహస్రముల నర్పించుచున్నాను.

తమకు నంకితమైన గ్రంథమును దిరుగ
నచ్చువేయించి యిచ్చువా రరు దనంగ
స్వార్థమును వీడి, యిట్లు పరాంకితమగు
కబ్బమును ముద్రవేయించు ఘనులు గలరె.

—జి. జాషువ

# పిరదౌసి

## ♦ ప్రథమాశ్వాసము ♦

మును గజనీమహమ్మదుఁ డ
భూతపరాక్రమశాలి, వీరవా
హినులబలంబుతో బదియు
నెన్మిది మాఱులు కత్తిదూసి, చి
క్కని రుధిరంబులో భరత
ఖండము నార్ద్ర మొనర్చి సోమనా
థునిఁ బెకలించి, కైకొని యెఁ
దొమ్మిదివన్నెల రత్నరాసులన్.

బంగారు నాణెముల్ బస్తాల కెత్తించి
మదపుటేన్గుల మీఁదఁ బదిలపరచి
లేఁతపచ్చల నేరి గోతాలఁ గుట్టించి
లొట్టిపిట్టలమీఁద దిట్టపఱచి
కురువిందమణులను కుంచాలఁ గొలిపించి
పరువు దెద్దులబండ్లపై నమర్చి
మొలకవజ్రముల జాలెలఁ బోసి కూర్పించి
గుఱ్ఱాల మూఁపులఁ గుస్తరించి

పదియు నెనిమిది విజయరంభల వరించి
గాంగజలమున నెత్తుటికత్తి గడిగి
సర్వము హరించి హిందుదేశంబు విడిచి
గజనీమామూదు గజనీకిఁ గదలిపోయె.

కులుకుం బూఁతపసిండి కుడ్యములపైఁ
గుట్టాణి ముత్యాలుఁబ
చ్చలుఁ జెక్కించి, చిరత్న రత్న ఖచిత
స్తంబంబు లెత్తించి, మే
డలు గట్టించి, మసీదుల న్నిలిపి, తు
ష్టస్వాంతుఁడై, పెంపునం
గొలువయ్యెన్ దనసింహపీఠిక ననుం
గుం బత్ను లుప్పొం గఁగన్.

భారత క్షోణిఁ గల్గు దేవస్థలములు
చెదరి గజనీపురాన మసీదులయ్యె
నిప్పటి మసీదు లేరూప మెత్తఁగలవొ
కాల మెఱుఁగును, ధారుణీగర్భ మెఱుఁగు.

హిందువుల దోర్బలము నాశ్రయించి బ్రతుకు
ద్రవ్యసంపద, తురకభూధవునిఁ జేరి
కాఁపురం బుండె నతనిఖడ్గమును వలచి
సిరి నిజంబుగ వట్టి టక్కరిది సుమ్ము.

ఎందుఁ జూచినఁ దనకత్తి కెదురు లేక
కోరినంత ధనమునకుఁ గొదవలేక
దాయబలఁగంబులను గన్ను మూయనీక
యేలుబడి రాజ్యమునఁ జలాయించుచుండె.

నగరి మొగసాల నుండు గంధద్విపంబు
దంతములమీఁద వ్రాయించెఁ దన చరిత్ర
దనరు దిగ్దంతుల పదాఱుదంతములకుఁ
గలుపుకొనఁబోలు విజయసంగ్రామసంఖ్య.

ఒక్కొక్క వీరభటునకు
నిక్కంబగు నతని యుద్ధనిపుణత్వంబున్
జెక్కించి యిచ్చె నీలపు
టక్కరములతోడ బిరుదులడిదంబులపై.

పడి గల సేనాపతులను
కడానిశాలువులతోడఁ గంకణములతో
గడియింపరాని పచ్చల
పిడికిళ్ళ బహూకరించె విద్వత్సభలన్.

తనకావించిన యుద్ధయాత్ర కమ
రత్వంబు గల్పింపఁగో
రినవాఁడై యల పారసీక సుకవి
శ్రేణీశిరోభూషణం
బనఘుండౌ పిరదౌసినామకవి నా
హ్వానించి యొడ్డోలగం
బున నుద్గ్రంథముసేతకై యొసగెఁగ
ర్పూరంపు తాంబూలమున్.

ఓ కవివర్య, నీసుకవి
తోజ్వలవాఙ్మయ పుణ్యభూమిలో
నాకు కృతిప్రదానసద
నంబురచింపుము శాశ్వతంబుగన్.
మాకులభూషణంబు లగు
మానవనాథుల కావ్యగేహ ది
వ్యాకృతులంబొనర్పుము చి
రాయురు పేతలఁ చేయు మిద్ధరన్.

కవినిఁ కన్న తల్లి గర్భంబు ధన్యంబు;
కృతినిఁ జెందువాఁడు మృతుఁడు గాఁడు;
పెరుగుఁ దోటకూర విఖ్యాత పురుషులు;
కవిని వ్యర్ధజీవిగాఁ దలంత్రు.

తమ్మిచూలి కేలుఁదమ్మిని గలనేర్పు
కవికలంబునందుఁ గలదు గాన
నీశ్వరత్వ మతనికే చలామణి యయ్యె;
నిక్కువముగఁ బూజనీయుఁడతఁడు.

క్షణము గడచిన దాని వెన్కకు మఱల్ప
సాధ్యమే మానవున కిలాచక్రమందు?
దాఁటిపోయిన యుగములనాఁటి చరిత
మరలఁ బుట్టింపఁ గవియ సమర్థుఁ డగును.

ఒక్కొక్క పద్దియంబున
కొక్కొక బంగారు రూక యొసఁగెదను కవీ!
మక్కా మసీదుతోడని
వక్కాణించెన్ మహాసభా మాధ్యమునన్.

మానవేంద్రుని సత్యవాగ్దానమునకు
హృదయగోచరమగుచు వర్ణింప రాని
యద్భుతావేశ మంగంబు నాక్రమించె
స్వాంతమునఁ దోఁచె నూత్న నిసర్గ కవిత.

పారసీక గ్రంథభండారముల నెల్ల
గదలించి తీయని పదము లేరి
వ్యంగ్యవాచ్యార్థ మహాంబోనిధానంబుఁ
దరచి ముత్యములు రత్నములుఁ గూర్చి
లలితంబులైన యలంకారముల నెల్లఁ
బొరలించి మేలైన సరకు లెత్తి
దిరిసెనపుంబూవుకరణి ముద్దులుగారు
శయ్యావిలాసంబు సంతరించి

శాసనము లన్ని పరికించి సకల రాజ
చరితలం దింత సత్యంబు జాఱనీక
ఆర్యసన్నుత షాహనామాభిదాన
భాసుర గ్రంథరచన కుపక్రమించె.

వానిడెందంబు సోఁకిపోవని తలఁపులు
వానికనుసన్నఁ దలలు వంపని యుపమలు
వానికలమునఁ గులుకుఁ జూపని పదములు
మందునకు లేవు నాఁటి వాఙ్మయమునందు.

వసుధ శాసింప గఁల సార్వభౌముఁడగును
ధీరుఁడగు, భిక్షుకుండగు, దీనుఁడగును
దుఃఖితుం డగు నిత్య సంతోషి యగును
సత్కవి ధరింపరాని వేషములుఁ గలవె?

తెలుఁగుగవిత్వపుం జిగి, వి
దేశపుఁగైతల చెన్ను, ద్రావిడే
యుల కవనంబులోని పస
యుం బొసగన్ రచియించుచుండెఁగే
వలరసబంధురం బగు ప్ర
బంధము, సర్వపదార్థ ధర్మముల్
దెలియఁ దదంతరాంతరవి
లీనతఁగొందొకపిచ్చివానిగన్.

అంత నొకనాటి రాత్రి నిజాలయమునఁ
బుష్పశయ్యను బవళించి ముమ్మరముగ
ముసురుకొనివచ్చు తలఁపుగుంపులను, రసము
బొందు చేయుచు గన్నులు మోడ్చియుండ.

ఆకాలంబునఁ బారసీకసతులం
దాకార రేఖాగుణ
శ్రీకిం బట్టపురాణియైన యొక రా
జీవాక్షి యేతించి, "నా
యాకూతంబు ఫలించునే? కవివరే
ణ్యా! నీకు నా రూప మం
గీకారం బగునే?" యటం చడుగసా
గెం బ్రౌఢవాగ్వైఖరిన్.

చెలువము సౌరభంబు వెద
చిమ్మెడు లేఁత గులాబిమొగ్గకున్
దుల యగు నాదుజవ్వనము
దోసిటఁ బట్టి భవత్పదాంబుజం
బులకిడ నిల్పితిం బ్రణయ
పూజకు వేళ యతిక్రమించె నీ
కులసతి నయ్యెదం గవిత
కున్ జిరకాలము తల్లి నయ్యెదన్.

ముద్దరాల, నంతిపురుల నుండెడుదానఁ
దెగువ బూని, సిగ్గు తెరలు చీల్చి
బయలుపడిన నాదు పావన స్నేహంబుఁ
జెప్ప నేల పారసీక కవికి?

తను వెల్లన్ బులకింప జిత్తమున ను
త్సాహంబు రెట్టింప, నం
గన కెంగేలు గ్రహించి, ప్రేమరసదు
గ్ధం బైన వాల్చూపునన్
గని యాశ్లేష మొనర్చినన్ గఱకు బా
ణం బొందు డెందాన గ్రు
చ్చినయట్లయ్యె; నతండు త్రుళ్లిపడి లే
చెం గంపితాంగంబునన్.

హృద్యకావ్యరచన నేకాగ్రత వహించి
కళవళంబు లేని కవి మనస్సు
కాలి కెదురు గట్టు కాచగోళం బయ్యె
గండుచేఁప దాఁకు కమలమయ్యె.

నరుని సుఖదుఃఖముయందు నడచి వచ్చు
నీడలే స్వప్నములుసుమ్ము నిశ్చయముగ
కాలచక్రంబు గంభీరగమనమందు
దాఁగికొని యెన్ని యెన్ని చిత్రములు గలవో?

అతఁడారాతిరి కన్ను మూయక తదీ
    య స్వప్న వృత్తాంతమ
ద్భుత మైనన్ దలపోయుచుండె నపు డం
    భోజాప్తుఁడున్ దూర్పుఁగొం
డ తలన్ గుంకుమ చల్లెఁబశ్చిమగిరిన్
    భస్మచ్ఛవిన్ జంద్రుఁడున్
మృతుఁడై వ్రాలె నభస్సునం దణఁగిపో
    యెం దారకాగోళముల్.

క్రమ మొప్పన్ సులతాను మేడల నగా
    రా మ్రోగె, నాహూత నా
దముల న్నిండె మసీదు, లాష్టనుల స్కం
    ధావారమం దాట గు
ఱ్ఱము కెంజూలు విదల్చి హేషలిడెఁ, బి
    ర్దౌసీ కవీంద్రుండుఁగా
ల్యములన్ దీర్చి వసించె నింటి మొగసా
    లన్ మేలిపీఠంబునన్.

అపు డొకపారసీకుఁడు ర
    యంబున వచ్చి సలాము చేసి తొ
ట్రుపడు 'నెలుంగుతోఁ "గవివ
    రుల్దయ సేయుఁడు తత్క్షణంబ మీ
విపులసు ఖైకసౌధము గు
    భిల్లునఁ గూలిన దమ్మగారు వ్రా
సి పనిచి రంచు నిచ్చెఁదన
    చే నొక యుత్తరము న్వినమ్రుఁడై.

"వత్సరత్రయంబు వయసు వచ్చిన ముద్దు
కాలు సేతు లుండి కదలు ముద్దు
పుత్రనామకమున మొదటఁ బుట్టిన ముద్దు
మాననీయ! యింక మనకు లేదు."

అని తన భార్యామణి వ్రా
సిన కమ్మఁ బఠించి సుకవిశేఖరుఁ డపుడే
తను తూసునగరమునకుఁబ
యనమయ్యె నయోమయ వ్యథాకులితమతిన్.

కొడుకు నెంజిలి హృదయంబుఁ గోయుచుండ
నన్న పానీయములు ముట్టఁడయ్యె నతఁడు;
కాలపురుషుండు దినదినాకారుఁ డగుచు
భావుకునిలీల నోదార్చి పోవుచుండె.

రెండేడు ల్ననినంతఁ జక్కని కుమా
    రైన్ గాంచి సానందుఁడై
గండూషించె మనోవిచారము నలం
    కారంబులున్ జిన్నెలు
న్నిండం గావ్యము వ్రాయఁజొచ్చె మరల
    న్నిద్రాసుఖత్యాగియై
పండాకుంబలె నయ్యెఁ బాపము తనూ
    ప్రాబల్యరక్తచ్యుతిన్

ముదురు కోయిల కంఠమున నివాసము సేయు
    కొసరింపుఁ గూఁతల గుట్టు దెలిసి,
ప్రతిపుష్ప గంధగర్భముఁ జీల్చికొని వచ్చు
    పిల్లగాడ్పుల జన్మవృత్త మరసి,
మేఘంబు తెరచాటు మెఱపుబోగముసాని
    మోసగింపుల యర్థమును గ్రహించి,
శరధినాయకుని క్రొన్నురువు పిల్లల, తీఱు
    బడిలేని యాటలభావ మెఱిఁగి

ముగ్ధమోహనసౌందర్య పూర్ణయైన
ప్రకృతిరమతోడ స్నేహభావమున మెలంగి
ముప్పదేఁడులు సర్వాంగపుష్టి మెఱయఁ
గబ్బము రచించె పిర్దౌసి కవివరుండు.

కృతి ముగియించి యాష్టను మ
హీపతి దర్శన మాచరించి సం
గతి వివరించినన్, నృపతి
గడ్డము దువ్వుచు మందహాసవా
సిత ముఖుఁడై "భళీ, సుకవి
శేఖర! ఎల్లి సభాంతరస్థ పం
డితుల సమక్షమందునఁ బ
ఠింపుమురమ్మని పంపె నాతనిన్

అనుమానం బిసుమంత లేని మదితో,
నంభోనిధానంబు నీ
దినవానింబలె, హేమసమ్మిళిత కీ
ర్తిన్ గాంచు కౌతూహలం
బున, లజ్జాపతియై స్వయంవరసభా
భూమిం బ్రవేశించు ము
గ్ధనుబోల్గ్రంథముఁ జంకబెట్టుకొని యా
స్థానంబు డాయం జనెన్

మేలిమి వీడకుండ కరి
మ్రింగి వెలార్చిన వెల్గపండులన్
బోలి నృపావలంబుమున
బొజ్జలు పెంచిన పెద్ద పెద్ద దా
డీల తురుష్క పండితుల
ఠీవికిఁ దావలమైన కొల్వు గ
ర్వాల సదృక్కులం గనుచు
నాతఁడు చొచ్చెఁ దదంతరాళమున్.

ఎలనవ్వు నెమ్మొగంబున
గులుకం గృతినందు పెండ్లికొడు కాష్టనుభూ
తలనాథుఁ డపుడు కౌతూ
హలియై చనుదెంచి గద్దియను వసియించెన్.

ఆనతినంది సొంపు తడి
యారని షష్టి సహస్రపద్యసం
ధానితమైన గ్రంథము ము
దంబున విచ్చి పఠింపసాగె సు
ల్తానుల రాజ్యపాలన వి
ధానము తండ్రి సబక్తజీను ము
న్నీనిన లేడికొమ్మఁదని
యించుట లాది గలట్టి ఘట్టముల్.

కంపంబు గదుర చెంగట నిల్వు నొకసారి
యుక్కు పుప్పొడిరాలు యుద్ధభూమి
పులకలుప్పొంగఁ గన్నులఁ గట్టునొకసారి
చెదుగురాజుల యేలుబడులబొమ్మ
ఆనంద మొదవఁ బ్రత్యక్షించు నొకసారి
మగువల కడకంటి మంత్రశక్తి
దయ నిండిపారఁ బ్రదర్శించు నొకసారి
బక్క చిక్కిన పేదవాని బ్రతుకుఁ

సున్నితంబైన కవిమనస్సున వసించు
కల్పనాశక్తి బహు విధ గతుల మెఱయ
పాదుషాతోడ నతని దర్బారుసీమ
నంచితానంద జలనిధి ముంచి తేల్చె.

పదముల పొందిక గుబ్బపుఁ
గదనున కెనవచ్చు పద్యగమనము రస సం
పదయును స్వభావశబలత
కదలించె సభాంతరాళ కవుల మనంబుల్.

అరమోడ్పుఁ గనులు పులకిత
శరీరములు పొందుపఱచి సత్కవివరుఁడా
తురకలదొర కొలువును కి
క్కురుమననీ కెలిమి నేలుకొన మొదలిడియెన్.

ఆసులతానునోలగము
నట్టు లొకానొక రాజటీవి ము
మ్మాసములేలి గ్రంథము స
మాప్తముఁ జేసి యొసంగిపోయె పి
ర్దౌసి నిజాలయంబునకుఁ
. దత్ఫలితంబుగ వెండి నాణెముల్
బాసదొలంగి పంపె నర
పాలుఁడు పండితులేమి చెప్పిరో.

ఎన్నో కొండలు గుండెలోఁ గరఁగిపో
యెన్ వార్ధి సంతానముల్
గన్నీరయ్యె సమస్త లోకము నిరా
కారస్థితిం బొల్చె ను
త్పన్నంబయ్యె విషాదమేఘపటల
ధ్వాంతౌఘుమాశాలత
ల్బున్నాలయ్యె నగాధకూపజలరా
సుల్ దోఁచె పిర్దౌసికిన్.

ధనము మరలించి, మానవేంద్రునకు బంపి
పొరలుకొని వచ్చు దుఃఖపుఁ దెరల నడుమ
నాకృతి వహించియున్న నిరాశ వంటి
యుత్తరము వ్రాసె నిందాసహోక్తికముగ.

"ఓ సుల్తాను మహమ్మదూ! కృతక వి
ద్యుద్దీపముల్ నమ్మి యా
శాసౌధంబును గట్టికొంటి నది ని
స్సారంపుటాకాసమై
నా సర్వస్వము దొంగిలించి నరకా
నం గూల్చిపోయెన్ వృథా
యాసప్రాప్తిగ నిల్చినాఁడ నొక దుః
ఖాక్రాంతలోకంబునన్.

పూని కరాసికి న్మనుజ
భుక్తి నొసంగెడు బాతిగుండె సు
ల్తానుల కస్మదీయ కవి
తాసుధఁ జిందిన పాతకంబు నా
పై నటనం బొనర్చినది
వాస్తవ మిట్టి స్వయంకృతైక దో
షానలదగ్ధమై చనిన యర్థము
నాకు లభింపబోవునే.

ఇంక విషాదగీతముల
    కే మిగిలెన్ రసహీనమై మషీ
పంకము నాకలమ్మున న
    భాగ్యుఁడ నైతి వయఃపటుత్వమున్
గ్రుంకె శరీరమం దలము
    కొన్నది వార్ధకభూత మీ నిరా
శాంకిత బాష్పముల్పలము
    లైనవి ముప్పదియేండ్ల సేవకున్.

ఒక్కొక పద్దియంబునకు
    నొక్కొక నెత్తురుబొట్టు మేనిలోఁ
దక్కువగా రచించితి వృ
    థా శ్రమయ య్యెఁ గులీనుఁడైన రా
జిక్కరణిన్ మృష ల్పలుకు
    నే? కవితాఋణ మీయకుండునే
నిక్క మెఱుంగ నైతి గజ
    నీసులతాను మహమ్మదగ్రణీ.

అల్లాతోడని పల్కి నాపసిఁడి కా
    వ్యద్రవ్యము న్వెండితో
జెల్లింపం దొరకొన్న టక్కరవి; నీ
    చేఁబూజితుండైనచో
నల్లా కున్సుఖమే? మహమ్మదు నృపా
    లా! సత్య వాక్యం బెవం
దుల్లంఘింపఁడొ వాడెపో నరుఁడు, ధ
    న్యుం డిద్ధరా మండలిన్.

హాయిగ నీయశస్సు వెల
    యంగల చక్కని మేడ గట్టి దీ
ర్ఘాయువుఁ బోసినాఁడను త
    దన్వయవల్లికి! వట్టి చేతులన్
బోయెద నంధకారమున
    మున్గి సుఖంబులఁ బ్రొద్దుగ్రుంకె రా
జా! యిఁకఁ దాండవించెద భ
    యంకర ఖేద తమాల వాటికన్.

చిరముగ బానిసేని నభి
        షేక మొనర్చితి మల్లెపూవు ట
త్తరు లొలికించి, మాయజల
        తారున రాదుగదా పసిండి, యో
కటుకు తురుష్కభూపతి, య
        ఖండమహీవలయంబునందు: నా
శిరమునఁ బోసికొంటిని న
        శింపని దుఃఖపుటగ్ని ఖండముల్.

అలసట దీర్చు కొందును మ
        హమ్మదురాజులతో సమాధిశ
య్యలపయి ముప్ప దేఁడుల ప్ర
        యాసకు డెందము గందిపోయె ని
ర్మలమగు చిత్త శాంతి కిఁక
        మార్గములే దెన లేని పండు వె
న్నెల గురియించు నా కవిత
        నీకు లభించె నసత్యవాదికిన్.

కనులన్ గెంపు నటింప మైమఱపు హు
        క్కా ద్రావు సుల్తాను లే
ఖను వాల్చూపులతోఁ బఠించుకొని యా
        కంఠంబుగాఁ గ్రోధమె
క్కిన వ్రేటుంగొను కోదె పెద్ద పులి మా
        డ్కిన్ లేచి, సేనాపతిన్
గని పిర్దౌసినిఁ బట్టి చంపుఁడని యా
        జ్ఞాపించె నుద్దండతన్.

అక్కట; పండువంటి మరి
        యాదకు నెక్కిన మీకులీనతన్
దక్కువచేసి వ్రాసిన వి
        ధంబునఁ బద్దియముల్ ధ్వనించెడిన్
చక్కని మల్లికాసుమము
        నన్ జరియించి మదద్విరేఫముల్
రెక్కలు రాచి యందు సవ
        రింపఁగ జాలునె నీలివన్నెలన్?

సరపతి ప్రేమతో నొక తృ
ణంబొ, పణంబొ యొసంగె; దానితోఁ
గరము వహింప కిక్కరణిఁ
గాఱులు కూయునె పారసీకుఁడె
వ్వరు రచియింపలే రితని
పాటి కవిత్వ? మటంచుఁ బల్కఁజొ
చ్చిరి సభలోన నిచ్చకపు
జీతము లందెడు పండితబ్రువుల్.

పాపము పండెనో కవిని
బట్టి వధింపఁదలంచినాడు భూ
మీపతి బాసఁ దప్పి యుప
మింపఁగరాని కృతఘ్నుఁడౌర! యా
శోపహతి న్గరం బుడుకు
చున్న కవీంద్రుని వేఁడి రక్త ధా
రాపతనం బమంగళక
రం బనుచుండిరి ధర్మతత్పరుల్.

రాజుల మీఁద కవి కప్పురంబు చల్లె
సుకవితల మీఁద రాజు నిప్పుకలు విసరె.
కొంద ఱేపుణ్యమో చేసు కొనియె ననిరి;
కొంద ఱేపాపమో పట్టి కుడిపె ననిరి.

సరస కవిరాజపూజా
పరతంత్రుం డొకఁడు మిగుల వ్యాకులపడి యా
పిరదౌసికడకు వేగమ
యరిగి మహమ్మదుని కఱకుటానతి వినిచెన్.

అరువది వేల దిన్నరము
లస్త్రములై తుద కిట్లు కుత్తుకన్
దఱగుట కుద్యమించిన వి
ధానము సర్వము నాలకింపఁగా
పిరదవుసీ ముఖాబ్జమునఁ
బిన్నని నవ్వుదయించె మింటనీ
శ్వరుఁడు కలండొ లేఁడొ యను
సంశయము న్దఱుకొత్తె నెమ్మదిన్.

"కృతి యొక బెబ్బులింబలె శ
    రీరపటుత్వము నాహరింప, శే
షితమగు నస్థిపంజరము
    జీవలవంబున నూఁగులాడఁగా,
బ్రతికియుఁ జచ్చియున్న ముది
    వగ్గు మహమ్మదుగారి ఖడ్గదే
వతకు రుచించునా? పరిభ
    వవ్యథ యింతట నంతరించునా?

ముత్యముల కిక్కయైన సముద్రమున
బెక్కుమాఱులు మున్కలు వేసినాఁడ:
భాగ్యహీనుఁడ ముత్యమ్ము వడయనయితి
వనధి; నను మ్రింగ నోరు వచ్చినది తుదకు."

అనచు లిఖించె నొకపద్దియము మసీదు
గోడపయి నమ్మహాకవి కుంజరుండు
వేగుఁబోక నమాజు గావింప వచ్చి
చదువుభక్తుల నెమ్మేను జలదరింప.

# పిరదౌసి

## ♦ ద్వితీయాశ్వాసము ♦

ఇనబింబంబు గతించెఁ బ్రాతఁపడిపో
యెన్నింగియు న్నేల, పొం
చిన క్రొంజీఁకటు లబ్బు సాఁచి వెలిగిం
చెన్ దారకాదీపముల్
మన దౌర్భాగ్యకవీశ్వరుం డపు డవే
లంబైన నైరాశ్యమున్
వనితారత్నము వెంబడింపఁ బయనిం
పన్ జొచ్చె నుగ్రాటవిన్.

జలదంబు ల్నలు పెక్కి యాకసమునన్
సంచారముం జేసె, భూ
లలనారత్నము స్నానమాడునని వే
ళాఘంటికల్ మ్రోసెఁ గ్రొం
జలిగాడ్పుల్ చెలరేగి దేహముల నం
టన్ గూండ్లలోఁ బండి కూ
నలపైఱెక్కలు గప్పి కన్ను మలిపెన్,
నానాశకుంతచ్ఛటల్.

తన కల్యాణియుఁ గూఁతురున్ జటుల కాం
తారంబులం బాదచా
రిణులై వచ్చుట చూడఁజాలక కవి
శ్రేష్ఠుండు వర్షించు వె
చ్చని కన్నీటికిఁ గారణంబగు మహీ
శమ్మన్యుపై పంథ్ల నూ
టినయ ట్లంబరవీథియం దుటిమి యా
ర్చెన్ గర్భిణీమేఘముల్.

చిటిపొటి చినుకులు చిలుకరించెనుగాని
        కుంభ వర్షంబును గురియలేదు;
ఉఱుములుఁ బలుమాఱు హూంకరించెను గాని
        పిడుగు కైదువులు గుప్పింపలేదు;
కడలేని మెఱపు తీఁగలు పెంచుకొనుఁగాని
        నేత్రావరోధంబు నెఱపలేదు;
చలిగాడ్పు మొలకల వెలువరించెనుగాని
        కసరి యూదరగాలి విసరలేదు;

అతిరయంబున గగనంబు నాక్రమించి
బలిసి గర్జించి యటునిటుఁ బరువులెత్తి,
తెలివి సెడి క్రమక్రమముగాఁ దేలిపోయె
గవికుటుంబము గరుణించి కాఱుమొయిలు.

పకపకనవ్వుచు న్నభము
        పట్టునఁ దోచె ననంతకోటితా
రక లది యర్థరాత్రము; క
        రంబున బెబ్బులి వేఁట మాని కూ
రికి గుఱువెట్టుచుండెఁ బొద
        రింట్లఁ బరుండి; తమాలపల్లవ
ప్రకరము లంధకారమున
        రాజ్యము సేయఁదొడంగె నుమ్మడిన్

ఆనడికిరేయి భీకర కాననమునఁ
బయన మొనరించు కవికుటుంబంబు నరసి
తారకా దివ్యనేత్రపద్మములు విచ్చి
కాచి రక్షించుచుండె జగద్గురుండు.

వాఁగుల వంకలన్ గిరుల
        వన్య మృగంబుల సూదిఱాల యం
దాగహనోగ్రభూములు ని
        జాంగనతో గమియించి పూర్వది
గ్భాగము తెల్లనై మలయ
        వాయువు లల్లన వీవ నొందుచో
నాఁగి; భజింపఁ జొచ్చె, బర
        మాత్ముని మోహన పద్యపంక్తులన్.

విత్తనంబున మహావృక్షంబు నిమిడించి
సృష్టించి గారడీ సేయువాఁడ
కడుపులో శిశువును గల్పించి పదినెలల్
మోయించి యూపిరి వోయువాఁడ
సద్భక్త వరులకు సాక్షాత్కరించియు
నున్న చోటెరిగింప కున్న వాఁడ
పొటమరింపక ముందె పుష్ప సంతతులకు
వింతగా రంగులు వేయువాఁడ

చెలువ మొప్పఁ బుడమి సృష్టించి మాకిచ్చి
అనుభవింపుఁ డనుచు నాన తిచ్చి
నిలువ నీడలేక నిల్చిన కలవాఁడ!
కడుపునిండ నన్నుఁ గన్నవాఁడ!

కుంకుమపంకముం బులము
కొన్నవి తూరుపు కొండనెత్తముల్
పంకజబాంధవుం దరుణ
పాదముల న్నిగిడించె, మింటనే
ణాంకుఁడు చిన్న వోయి చర
మాచలసానుతటంబు లెక్కి మై
జింకయుఁ దాను గడ్డి గఱ
చెన్, బెనుచీఁకటు లార్చె గాకులై.

సంజ కెంజాయలో జలకంబు సవరించి
పఱతెంచు సూర్య బింబంబు లోన
పదునాఱు దినముల పరువు వచ్చిన నాఁటి
చంద్రుని ధవళ హాసముల లోన
పూలతోటలతోడ ముద్దుముచ్చట సెప్పి
చెఱలాడు మొలక తెమ్మెరల లోన
నీలమేఘంబుల నెఱియలలోఁగుల్కి
పరువెత్తు మెఱపు గర్భముల లోన

హాయిగాఁ బవ్వళించి బ్రహ్మాండములను
బల్కరించుచు నున్న దివ్యస్వరూప!
హృదయమును జీల్చి పూజ లర్పించుకొందు
నందుకొనిపొమ్ము, వ్యవధి లేదనక రమ్ము.

గాలికిఁ దూఁగియాడు గిజి
గాని కులాయముఁ జూపి నాకు నీ
పోలిక లాత్మలోఁ గరఁగి
పోసితి, ధన్యుఁడ నైతి, కొండలం
దేలిన మబ్బులోన నెలు
గెత్తి శరీరము పుల్కరింప, రా
గాలాపనం బొనర్చితివి,
యర్థముగా ఆ దెఱిఁగింపు మీశ్వరా!

అలసట లేక హోరుమని
యార్చుచుఁ బారెడు ఇమ్మహానదిన్
గులుకు తరంగమాలికల
కున్ గిలిగింతలు పెట్ట ఫేనపం
క్తుల నటనావిలాసముల
కుం దలయూచుచు నేను మ్రొక్కినన్
గిలకిల నవ్వి నన్నుఁ దిల
కింపని కారణమేమి దైవమా?

కరమున నీవు సున్నితము
గడా జికిలీ లొనరించి పుష్పవ
ల్లరుల నలంకరించుచు ద
ళంబులు మోడిచి వాడి వత్తలై
తొరఁగిన వృద్ధపుష్పముల
దుఃస్థితికిం గరుణించి యశ్రువుల్
గురిసితి వట్టి నీ కనుల
లోన జెమర్చె నజాండ భాండముల్.

ఆ నిదురించు పెద్దపులి
యాస్యబిలంబున కెన్ని జంతువుల్
బోనములై యదృశ్యమయి
పోయెనొ, రేపటి భుక్తి కిన్ దయా
రైనమృగంబు లేపొదల
యం దవుగాము లెఱుంగ కింపుమై
మేనులు వాల్చెనో, యెఱిగి
మిన్నక చూచుచు నంగలార్తువా.

నాకుం దోడయి నిద్ర మేలుకొనియుం
టన్నీదు కన్గోనలన్
రేకెత్తెన్ జిగురాకు వన్నె లవి నిం
డెన్ బూర్వదిగ్భిత్తులన్
నీకే కానుక లీసమర్థుఁడగు నీ
నిర్భాగ్యు డీ దేహమున్
నీకిత్తున్ దలవాల్చి పొ మ్మెలమిఁ దం
డ్రీ! నామనశ్శయ్యలన్.

నన్నుఁబోలు కోటినరుల మృత్తిక నుండి
వెలవరింప శక్తి గలిగియుండి
నన్ను విడువలేక కన్న మూయ వదేల?
యెట్లు తీర్చుకొందు నీ ఋణంబు?

ప్రకృతి పదార్థజాలముల
పై నుదయాస్తమయంబులందు నీ
యకలుషపాణి పద్మము ర
హస్యముగా లిఖియించు పోవు టొ
క్కొకసమయాన నేను గను
గొందునుగాని గ్రహింపఁజాల నెం
దుకు సృజియించినాఁడవొ న
నున్ ఘనుఁడా! అసమగ్రబుద్ధితోన్?

మున్నొకనాఁడు నా కనుల
ముందొక సుందరి గానవచ్చి, య
త్యున్నతపర్వతాగ్రమున
నుండిగుభాలునఁ గూలఁద్రోసి పో
యెన్నను; నాఁటిదృశ్య మిపు
డీసులతానునిగాథలోన ను
త్పన్నముఁ జేసి చూపితివె,
దైవమ! నేఁటికి కన్ను విప్పితిన్.

ఈ విశ్వంభర నీయనుగ్రహములో
హిందోళముం బాడుకొం
చావంతేని యెఱుంగకున్నది గదా
న్యాయంబు నన్యాయ, మున్
దేవా! యెక్కడి దీప్రశాంతగుణ? మా
దిత్యుండు బ్రహ్మాండపురం
ద్రోవ న్నిల్చునె, తెల్లవారునె ప్రభూ!
క్రోధంబు నీకుండినన్.

కమలహితుండు పుడమిగల పదార్థములను
హేమరసముచే మొలాము చేసె
నీకుఁ గోపమున్న నిన్న మొన్నటి వంటి
వారలేని సుప్రభాత మగునె?

ఈ తొలికోడికంఠమున
నే యినబింబము నిద్రపోయెనో
రాతిరి, తూర్పుగొండ లభి
రామము లైనవి, దీని వక్రపుం
గూఁతలమర్మ మేమి? కనుఁ
గొమ్మని యల్లన హెచ్చరించి ప్రా
భాతసమీరపోతములు
పైకొనియెం దొలిసంజ కానుపుల్.

వేగురుఁజుక్కతో నిలిపి
వేసిన నీరచియించులేఖకుం
గాగితమైన యాకసము
నన్ జిఱునవ్వులు గ్రుమ్మరించుచున్
డాఁగెదవేల యర్థవద
నంబున? యేమని వ్రాసికొంటివో
నాగతు లందులోన కరు
ణానిధి! చిత్తము విహ్వలించెడిన్.

పిట్టలఁ బీచుపీచుమని
    పించుచు వేఁగుబడంతి దోసిఁటన్
బట్టె గులాబిగుత్తులు న
    భంబునఁ బుప్పొడి దుమ్ము రేఁగ; నీ
విట్టి నిసర్గపూజలకు
    దృష్టి వహింతువొ, వాస్తవంబులోఁ
బట్టముఁ గట్టుకొందువొ కృ
    పానిధి! గుండెలు గ్రుండెలు గ్రుమ్మరించెదన్.

ఆగడపు మబ్బుశయ్యల నపరశిఖరి
బుదుతచంద్రుఁడు నిద్దుర వోవుచుండె;
ఈ చెఱువునీట నతని కుయ్యేలలు గట్టి
జోలవాడుచు నావంకఁ జూడవేమి?

కులికిన స్వాతి మేఘముల
    కుం దలయెత్తిన కాకిచిప్పలన్
నిలిచిన వాన చిన్కులు మ
    ణిత్వముఁ దాల్చి సముద్ర మందిర
స్థలుల నలంకరించినవి,
    స్వామీ, అనూహ్యములైన నీదు చే
తలకు నమస్కరింతును, గృ
    తజ్ఞుఁడనయ్యెదఁ గ్రుంగిపోయెదన్.

గొలుసులు గట్టి నీవలన
    కుం బరువెత్తుదు నాదు దీన దృ
క్కుల నెదిరించి వచ్చినవి
    కొండల పిండులు కొమ్ములొడ్డి; లో
యల నిదురించు నీ ముదురు
    టంధతమంబుల నీపదాంకము
ద్రలు గమనింపఁజాలను ఫ
    రాత్పర! నాకు శరణ్య మేదిరా!

సుకము లశాశ్వతంబులను
చుం బొగరెక్కిన కొమ్ముటేన్గు వా
రక చెవులూచి, తుమ్మెద రొ
దన్ బెదరించు ననుక్షణంబు, నీ
సకల చరాచరంబునకు,
సామ్యములై, నెఱసున్న పోలికన్
నికటజలాశయంబుల జ
నించిన బుద్బుదముల్ నశించెడిన్.

చీమ చిటుక్కుమన్న బ్రతి
సెప్పుచుఁ గోపము సేయుచున్న యీ
భూముల సుప్రశాంతి పరి
పుష్టి వహించిన దిట్టి తావు నీ
గోమల పాదసేవకుల
కుందగియున్నది పూజ సేయఁదం
డ్రీ! మొగమింత సూపు; మిట
నెవ్వరు లేరు పరాయులీశ్వరా!

భూతపంచకమున మున్గి తేలుచునున్న
నీ యనంతశక్తి నిశ్చయముగ
నాకుఁ బట్టుగొమ్మ నీ వజ్రకవచమ్ము
సిలుఁగు లేమిచేయఁగలవు నన్ను?

కొండలనుండి క్రిందవఱ
కుం దలక్రిందుగఁ జెంగలించి యీ
యెండిన యేటిలోనఁ బ్రవ
హించిన యీ సెలయేటి నీటిలో
గుండము లప్పుడే కుదురు
కొన్నవి పాంథుల నాహరింప; బ్ర
హ్మాండవిలాస! నీకవన
మద్భుత మర్థగభీర, మీశ్వరా!

ఏమిటి కెక్కువెట్టితివా
    యింద్రధనుస్సును మింటిచాయ నా
సామి! పయోదమాలికల
    చాటున సూర్యుఁడు నక్కినాఁడు తా
నే మపచారము న్సలిపి
    యిట్టి విపత్తును దెచ్చి పెట్టె నీ
భూములు నిల్చునా భువన
    మోహన! నీవు పరాక్రమించినన్!

సరదాగా భుజశక్తి మీఱ నెపుడో
    క్ష్మానామకంబైన బొం
గరమున్ ద్రిప్పితి, వీపరిభ్రమణ వే
    గం బింత చల్లారినన్
జరుగ నేర్చునె లోకవృత్తము మహే
    శా! అప్పుడే దిక్కుగా
నొఱగుం బర్యవసాన మెట్లగునొ అం
    చూహింతు నున్మాదినై.

# పిరదౌసి

## ♦ తృతీయాశ్వాసము ♦

ఒక కొన్ని గడియ లక్కవి
ప్రకృతి మహత్వంబు నీశ్వర ప్రణయంబున్
జక చకిత వికచ కవితా
ప్రకాశవాగ్గుంభనములఁ బ్రస్తుతి చేసెన్.
పడమటికిఁ బ్రొద్దువాలిన
నడుగడుగున కులికి పడెదు నబలలతోఁ దా
నడు గొక యామడగా న
య్యడవిని బయనింపసాఁగె నంత నొకదెసన్.

కెలకుల వైరి గుల్మముల,
గిట్టల చప్పుడు గోచరించినన్
దలకిఁ సమీప పర్వత క
దంబిత భూర్జవనంబు సొచ్చి బె
బ్బులులు కరుల్గిరుల్ హరులు
మొత్తములై విహరించు పెద్ద లో
యలఁ బెడదారులంబడి ప్ర
యాణము చేయుచునుండ నత్తఱిన్.

పొద్దుగ్రుంకెఁ, బెద్దపులి యేటి కేతెంచె,
పంది కోఱకత్తి పదును పెట్టె,
అకసంబు భూమి యఖిలపదార్థమ్ము
అంధకారజలధి యందణంగె.

దెసలు బీఁటలువాఱ వసపట్టి పోరాడు
కొదమ సింగములకు బెదరిపడుచు
త్రాటితోపులఁ గల్లు ద్రావు భల్లూకాల
గుటగుట ధ్వనులకుఁ గుదులుకొనుచు,
నూహింపరాని యెవో మ్రుక్కిడిమృగాల
వెఱ్ఱికూఁతలకు తబ్బిబ్బుపడుచు,
కొఱవిదయ్యముల టక్కరి దివ్వియల జూచి
యూరు దగ్గఱె నంచు నూఱడిలుచు.

గొసరి నివ్వరి ధాన్యంబుఁ గొతికి నమలు
నెలుక మునిపంటినవ్వడి కులికిపడుచు,
త్రోవ గమియించు నాఁటి పాంథుల, నదేమొ
అదరి బెదరించె నొక యెండుటాకు కూడ.

మునుకొన్న సాధ్వసంబునఁ
గనుల కరణ్యమున వృక్షగణ మరిగణమై
కనుపట్ట నతని గళమును
బెనఁగొనఁగా సాగి రనుఁగు బిడ్డయు పతియున్.

ఆ దీనులఁ గని యొక్క ని
షాద విభుఁడు కనికరించి చనుదెంచి దయా
మే దురములైన పలుకుల
చేఁ దద్దయు భీతి మాన్పి చేతి ధనుస్సున్.

ఎక్కిడి, రండు మీకు భయ
　　మేమియు లేదని రొండికోరగా
జెక్కిన బొట్టెకట్టియలు
　　చే నమరించి, నిసర్గతేజమున్
గ్రక్కు మొగంబుదంబున గు
　　ణధ్వనిఁ జేయుచు దారిజూపుచున్
జిక్కుటరణ్యము న్గడవఁ
　　జేసెఁ గవీంద్రుని కగ్రగామియై.

పొడుపు గుబ్బలి తొలుదొల్త బూదివంటి
ధవళవర్ణంబుఁ దాల్చి యంతట బసిండి
నిగ్గు మెదిపిన చెంగల్వ మొగ్గఁ దొడిగె
వేగుజామున నూసరవెల్లివోలె.

అంతటఁ బారసీక సరి
　　హద్దులు కన్నుల గోచరించె భా
స్వంతుఁడు తూర్పునం బొడిచి
　　వచ్చె, నిషాదుఁడు భక్తిగుంభిత
స్వాంతుఁడు కేలుమోడ్చి కవి
　　సత్తమునిం గని స్వామివారు న
న్నింత యనుగ్రహించి సెల
　　విచ్చిన నేనును బోయి వచ్చెదన్.

అని పలికి స్వామి! యాదెస
నినరశ్మల నెండమావు లేర్పడి యప్పుడే
వనధింబలెఁ గన్పడు నటు
సనకుఁ దది యెడారి కడు నసాధ్యము దాఁటన్.

ఆ కనుపించు పర్వతపు
టంచున నున్నది పెద్దచెర్వు, మీ
రాఁకలి గొన్నచో నిలిచి
యచ్చట చల్ది భుజింపవచ్చు; సా
మీ!కనుచూపుమేర పిడి
యేనుఁగు పిండులు టేకుమ్రాఁకులన్
గూఁకటి వ్రేళ్ళతోఁ బెఱికి
కూల్చుచునుండును పెళ్ళు పెళ్లునన్.

కొంచెము సాగినన్ జెఱుపు
కొమ్మున మీ కుడిచేతి వాలుగా
మంచి విశాలమైన యొక
మార్గము దాపునఁ గానుపించు మా
చెంచుల గూడెముల్ పుడమి
చేడియ చన్నుల క్రేవదాల్చు రో
మాంచమొకో యనం దనరు
నందలి కొండల కీవలావలన్.

ఈ గచ్చ పొదలయందే నిర్భయము మీఱ
బెబ్బులుల్ పిల్లలఁ బెట్టుచుండు;
ఈ జలాశయములందే జంటలై వచ్చి
యెదలైన యేనుంగు లీఁతలాడు,
ఈ కొండ లోయలందే నిశీథమునందు
దయ్యాలు గుంపులై తాండవించు,
ఈ తాండ్రతోఁపులందే జంతువుల మ్రింగి
కొఁడచిల్వలు మత్తుగొని పరుండు.

తెరువరులఁ బట్టి కట్టి తస్కరుల గుంపు
నిత్య మిచ్చోటఁ బగలె కూనీలు సేయు;
అనఘ! చూపుల కిది యరణ్యంబుగాని
బ్రహ్మసృష్టిని వింతయాపదల పుట్ట.

వాసింగన్న మహమ్మదీయులకు సే
వ్యంబైన మక్కా కర
బ్బీ సన్యాసులు పోవు త్రోవలవి; యా
పెన్గొండ నెత్తమ్ములం
దాసీనుండగు వాని దృష్టికి నభో
వ్యాలంబముల్ రత్న రు
గ్రాసుల్ గన్పడుఁ గాంధహారనగర
ప్రాసాద కుంభాగ్రముల్.

అదిగో, చూడుఁడు రాపులుంగుగము ల
భ్రాంతంబునన్ దూలు నం
బుదపుం దున్కలు నాఁజలించెడి ద
ద్భూభాగమందున్న పె
న్నదితీరంబులె పారసీకుల శాశ్మ
నక్షోణు లచ్చోట జూ
డఁదగు మర్త్యుల యస్థిపంజరపు గు
ట్టల్, మాంసదుర్గంధమున్.

దోరగఁ బండి గుత్తులయి
దొంతలుగట్టిన పండ్ల ప్రేల, వే
మారును దేనెపట్టుల భ్ర
మన్ గలిగించుచు నున్న మేలి ఖ
ర్జూరపు తోఁపులం దిరుగు
చుం బసియొంటెలు మేపు పారసీ
పౌరులు గానుపింతు రిరు
వంకల త్రోవల కింతదాపునన్.

అవలన్ బచ్చిక పట్టులం జిలుఁగు నీ
హారంబు భక్షించి, చే
రువ ద్రాక్షాఫలపక్వ సౌరభమిళత్రో
స్సస్సులం దేలి వా
యువు లింపార మెలంగుచుండు; నవి మీ
కుత్సాహముం గూర్పకుం
డవు సుమ్మీ; యట నున్న వృక్షముల నీ
డన్ గొంతశాంతింపుఁడీ!

క్రొత్తగఁ బుట్టు పుట్టగొడు
 గుల్బలెఁ బెద్దయెడారిపొంత ని
ట్టుత్తరదిక్కుగా వెలయు
 చున్నవి కొన్ని గుడారముల్ దొరా!
ముత్తెపు వర్తకంబునకుఁ
 బోవు నరబ్బులు నిల్చుతావులం
దతి తరుప్రకాండముల
 నాని పరున్నవి వారియుష్ట్రముల్.

ఈ యెడార్ల గండుటిసుకతిప్పలమీఁది
వెట్టచేతఁ బిగిలి పిల్లలయిన
నిప్పుకోడి గ్రుడ్లు నీటికుండలు వారి
కొంటెపాఁడి వారి కుగ్గుపాలు.

పచ్చిపసుపు ముద్దవంటి దేహచ్ఛాయ;
అందమై విశాలమైన నుదురు;
కట్టుబొట్టు వాలకముఁ జూడ మీరును
పారసీకు లనుట స్పష్టపడియె

ఈ పుష్ప కోమలులతో
నీపర్వతమయవనాళి నిట్లొంటరిగా
నీపగిది సిలుఁగులం బడు
నోపిక మీ కెట్టు లబ్బెనో ముసలిదొరా!

ఎఱుఁగనివారో యనుకొని
యెటిగించితి నింతపట్టు నేమేమో, దొరా!
కరుణ న్నను మన్నింపుం
డరుగుఁడు ప్రొద్దెక్కె నింక నని పలుకుటయున్.

వాని మృదూక్తి నైపుణియు,
 వాని వినమ్ర విధేయ భావమున్,
వాని పరోపకార నిర
 వద్యగుణప్రతిభావిశేషమున్,
వాని శరీర సౌష్ఠవము,
 వాని భుజార్గళమాంసలత్వ, మిం
పైన కృతజ్ఞతార్ధకృతు
 లై వెడలెన్ పిరదౌసి వాక్కునన్.

అతనిఁ గౌఁగలించిన ఆనంద సంతుష్టి
చిహ్నితంబు లమృతశీనములు,
గాద్గదికములును, ప్రగాఢదైన్యంబులు
నయిన పల్కులొలయ ననియె నిట్లు.

నరులు గడించి పెట్టిన వి
నాశన సూచకమైన పాప మీ
ధరణి కసహ్యమై బహు వి
ధంబుల మూలుగుచున్న దన్న, ఈ
శ్వరుని క్రుధావిలోకన ద
వానలముల్ నినువంటి వారికై
వెఱచి దహింపకున్న వని
పించె మనంబు నిషాదవల్లభా!

నాదుతనూపటుత్వమును,
నా కవితా తపనీయరాశి భూ
మీదయితుం డొకండు బలి
మింగొని నన్ను వధింపఁ జూచె; నీ
నాదు చరిత్ర విన్నఁగరు
ణన్ జెమరించు శిలాసహస్రముల్,
నీదు మనంబు లేఁతనవ
నీతము ముందె కరంగెఁ జూపులన్.

ఈ నెరసియున్న తలయును
హీనత గనియున్న నేత్రదృష్టియు వృద్ధం
బైన శరీరం బఱువది
పైని పడిన వయసు నాకు బ్రాప్తంబయ్యెన్.

ఆ ముసలి పడంతి నా భా
ర్యామణి; యాపడుచు కూఁతురయ్యా! నేనీ
కోమలుల రక్షణార్థం
బే మేను దొఱంగ సంశయింతు నిషాదా!

ప్రకృతిరహోనభంబున ని
రమ్మదముల్ బలె గోచరించి యొ
క్కొక్కపరి యూరడించి చను
చుందును దేవుని దివ్యలీల! లా
సుకమును జూఱలాడు పరి
శుద్ధులు వోయినత్రోవఁ ద్రొక్కి నే
నిఁక విడియించుకొందు ధృతి
హీన మదీయ శరీరభారముల్.

నీకుఁ గృతజ్ఞుండ నయ్యెద
నీ కాయం బుందుదనుక; ఇంక సెలవని బా
ష్పాకులిత నేత్రయుగళుం
డై కదలెఁ గవిప్రకాండుఁ డబలలతోడన్.

కనుచూపుమేరవల క
వ్యనాటుఁ డీక్షించి పిదప స్వసదనమునకున్
జనియె విషాదముతో న
య్యనఘుని దౌర్భాగ్యచరిత మాత్మఁ గలంపన్

అట గజనీనులతాసుని
భటాళి పిరదౌసి కవిని బట్టుకొనుటకై
చటుల కరవాలకరముం
గుటిలముఖం బగుచుఁ గదిలె గుజ్జాలపయిన్.

ఒక పేదవానిఁజంపుట
కకటా అశ్వికదళంబులాఁ!యని పౌరు
ల్చకితులయి చూడఁ జనిక్ర
మ్ముకొనిరి తచ్ఛూన్యగేహమును రాజభటుల్.

సకుటుంబంబుగఁ బారసీక కవి యీ
సౌధంబునందుండి యిం
తకు ముందె చనె నన్న వార్త విని సే
నా నాయకుం డింత చిం
తకులోనై, పనిచెం బటాలమును నా
నాదిక్కులన్ బ్రోచ్చలత్
భ్రుకుటీఖడ్గనటీకఠోరుఁడయి యీా
ర్ష్యల్ నిప్పులై క్రాలఁగన్.

అల్లన రేఁగి సైంధవ ఖు
        రాహుతి భూమిరజంబు లెట్టిడా
లుల్లెడలై రహింపఁజని
        యూళుల నేళులఁ బక్కణంబులన్
జల్లెడ వట్టి చూచి కవి
        జాడ లెఱుంగక రాజభీతిచే
నుల్లము లూఁగగా నిజ పు
        రోన్ముఖులై రఘఘస్ భటోత్తముల్.

పిరదౌసి యీశ్వరస్తుతి
నెఱపిన వనభూమి శత్రునేత్రంబులకున్
మఱుఁగుపడియెనొ మతేమో
యరిదళములు తొలఁగి నడచె నపమార్గమునన్.

దిక్కుతిన వంటయింటికుందేటి నొక్క
పారసీకునిఁ జేజేత జాఱవిడిచి
స్వామి కవమతిసేయు లుచ్ఛాలటంచు
యవన భూపాలుఁడెంతయు నా గ్రహించి,

తన దివాణంబుఁ గొలిచి, యబ్దముల నుండి
కలహములలోన రక్తముఁ జిలుకుచున్న
భటులఁ గొందఱ గట్టించి బంది చేసె
నెటిఁ గృతజ్ఞత లెఱుఁగ దా నృపుని యలుక.

పిరదౌసి కవికి నెవ్వఁడు
శరణం బిడు నతఁడు నాకు శాత్రవుఁడగు నం
చురు కార్పణ్య మెలర్పఁగ
ఫరమానా లిచ్చి చాటఁబనిచె నృపులకున్.

షానామా యను గ్రంథరాజమున కీ
        క్ష్మాభర్త, తాభర్తయై
పూనెన్ శాశ్వతమైన కీర్తి మకుటం
        బున్ మౌళి, నేతత్కృతి
గ్లానిన్ గుందు మహాకవి న్ముదుసలిన్
        ఖండింప నుంకించి స
మ్మానించెన్ భళి! దొడ్డవాఁడనుచు సం
        భాషించె దిగ్దేశముల్.

సామంత భూమిపాలుర
లో మంచియుఁ జెడ్డ నింత లోఁదలచు లస
ద్ధీమంతులు కొంద ఱది విని
సామోక్తుల వ్రాసి రిట్లు సందేశంబుల్.

"గడియించితిరిగదా, కనకరత్న చయంబు
        దననాయకునకు దంతములు పులియ,
వణఁకించితిరి గదా, పదియు నెన్మిదిమాఱు
        లఖిల భారత హరిదష్టకంబు;
అగలించితిరి గదా, హైందవ దేవతా
        గర్భముల్ రత్నరక్తముల్ చింద,
సృష్టించితిరిగదా, ఇస్లాము మతమును
        బాపనయ్యల గృహాభ్యంతరముల;

ఇట్టి మీ పేరు మృతిలేని కృతులలోన
బొదివి పూజించి యిచ్చిన పుణ్యమూర్తి
నమల తపనీయరాశి నోలార్చ వలెనొ;
తెగడి నైరాశ్యమున ముంచి తేల్చవలెనొ?

"మక్కాలోఁ బయిగంబరుండగు మహ
        మ్మద్‌గారి గోరీపయిన్
బక్కాకీర్తుల వెల్ల వేసిన మహా
        భక్తాగ్రగణ్యుండవై
చిక్కంబట్టితిరేల? ఒక్క కవి మీ
        చేఁగోరు ద్రవ్యంబు మీ
హుక్కా ఖర్చుకు సాటిరాదుగద, రా
        జోత్తంస! యోజింపుమా!

"కవి శాశ్వతుఁ డుర్వర నా
రవితారముగా వసించు రాజా! మీరో
కవితాకన్యకు పతు లా
రవితారముగా సహింతురా యపకీర్తుల్

"దాదాపు నాల్గువందలమంది కవులు గా
నము సేయు మీ దివాణంబు రీవి
అల్లాకుఁ బ్రీతిసేయం గాఫరుల మీఁది
కుఱుకు మీకత్తి వాదర పసందు
సకలించి శత్రుమత్సరము వెల్లడిచేసి
కాల్రద్రవ్వు మీ ఘోటకముల పసరు
పసిడిఁ జల్తారు టంబారీల యొఱపునఁ
దిరుగు మీ గజముల గరువతనము

మా యవన రాజ్యమునకు బూరాయువు లని
తలఁచు కొనుచుందు మెపుడు సుల్తాను వృషభ!
లలితకళలు విడంబించు నెలవు మీదు
నిండుకొలువున కవుల కన్నీరు తగదు.

"షానామా గ్రంథమునను
భూనాయక మేలిరత్నములు గలవు గదా!
వానికి నై యఱువది వే
ల్దీనారము లీయ వెనుక దీయుట తగువే?

"మీరు కళాపోషకులను
కీరితిఁ బోనాడఁ దగదు; కృతికన్యక, బం
గారంబు మణులు గురిసెడు
క్ష్మారాజ్యవధూటికన్న, జక్కనిదిగదా?"

అవాక్యములు ధరావతి
భావమునకు నచ్చి క్రోధభారచ్యుతుఁడై
కేవల పండితగోష్టిం
దావర్షత్రయము గడపెఁదా నస్థిరతన్.

కవులు కలకంఠ బహు కుహూకార మధుర
భావగుంభితకవిత చెప్పందొడఁగిరి;
పండితులు తదంచిత రసాస్వాదనంబుఁ
జేసి సోత్సాహులై విమర్శించుచుండ్రి.

ఒక కవీశ్వరుని కైతకు మెచ్చుకొని నోటి
నిండ మాణిక్యము ల్నింపినాఁడు
ఒక పండితుని విమర్శకుఁ జిత్తముప్పొంగఁ
గనక చేలంబులు కప్పినాఁడు
ఒక్క గాయకుని పాటకు మేను పులకింప
దోసిట ముత్యాలు పోసినాఁడు
ఒక యాటవెలఁది యాటకు 'సెబా' సని పల్కి
కొంగున వరహాలు గురిసినాఁడు

ఏమి చెప్పుదు నిత్యసంతృప్తిఁదేల్చి
విపుల వాఙ్మయసేవ గావించినాఁడు
దానవలయంబు లిరుగేలఁ దాల్చినాఁడు
పిరదవుసి నేమొ పూర్తిగా మఱచినాఁడు

ఒక వాసరముఖమున నిం
చుకయించుక కన్ను విచ్చి సూర్యుని కిరణ
ప్రకటముల ప్రాఙ్ముఖంబున
వికసించెడు వేళఁ గాకి ప్రేలెడువేళన్.

పానుపు డిగ్గి, మేలివలి
పంబును గట్టి పదాలజాళువా
మానికపు జడావుల న
మర్చి మసీదు కేఁగి భక్తి న
ల్లాను భజించివచ్చుచు ని
లాతలనాథుఁడు గాంచె భిత్తికా
ధానము బాష్ప సహేతుక క
థానక మప్పిరదౌసి పద్యమున్.

"కృతి యొక బెబ్బులింబలె శ
రీర పటుత్వము నాహరింప శే
షితమగు నస్థిపంజరము
జీవలవంబున నూఁగులాడఁగా
బ్రతికియుఁ జచ్చి యున్న ముది
వగ్గు మహమ్మదుగారి ఖడ్గదే
వతకు రచించునా? పరిభ
వవ్యథ యింతట నంతరించునా?

"ముత్యముల కిక్కయైన సముద్రముననుు
బెక్కుమాఱులు మున్కలు వేసినాఁడ
భాగ్యహీనుఁడ ముత్యంబు పడయ నైతి
వనధి నను మ్రింగ నోరువిచ్చినది తుదకు"

ప్రత్యక్షరమున నక్రుల్
ప్రత్యక్షమున సేయుచున్న పద్యయుగము పె
న్వ్రాత్య యగుచుఁ గలఁచెన్ భూ
పత్యగ్రణిహృదయ మనెడు వనజాకరమున్.

ఏలిక పారసీకవికి
    నిచ్చెదనన్న పసిండి నూరు బ
స్త్రాలకుఁ బట్టి యొంటియల
    షట్కముపై నిడి వీరులైన ము
ల్లాలపరంబు చేసి పది
    లంబుగ సత్కవి కప్పగింపు దం
చోలి ననుజ్ఞఁజేసె బురి
    నున్న సుధీమణు లుల్లసిల్లగన్.

అట పిరదౌసి కవియు న
ప్పటి కొక యేఁడాది నుండి పరిపూర్ణజరన్
జటులామయపీడితుఁడై
కటకటఁ బడుచుండెఁ బేదకాపుఁరపు సిరిన్.

పెండ్లి కెదిగిన కూఁతురు ప్రియవధూటి
చింతచే డస్సి బిట్టు కృశించి కుమిలి
చేతనయిన సపర్యలు సేయుచుండ
దనువు చాలించె నేమందు దైవఘటన!

సుకవిదేహంబు ప్రేతభూమికి లభింప
అర్థ మప్పుడె శూన్యగేహమును జేరె,
నిమిషభేదంబు నడుమ సంధింపఁబడిన
ఈ రహస్యంబుఁ గనుఁగొన నెవరితరము?

"ఇది నా తండ్రికి కష్టపెట్టిన శరం,
భీస్వాపతేయంబు ము
ట్టుదునా, నాజనకుండు కంటఁ దడిఁ బె
ట్టున్ స్వర్గమందుండి, నా
ముదితండ్రిన్ దయతోడ నేలిన నవా
బుండైన మీ స్వామికిన్
బదివే లంజలు" లంచుఁ బల్కుఁడని బా
ష్పస్విన్న దుఃఖాస్యుయై.

కులగిరులు గరఁగి పోయెడు
పలుకులు దైన్యంబు చిందిపడఁ బలికె నొగిన్
చెలువమున వెలయు కవిసుత
యెలఁద్రాయపుటింపు విడని మృదుకంఠార్తిన్,

ధనము మరల్చుకొంచు సుల
తానుభటుల్ గజనీకిఁ బోయి య
య్యనఘుని దుఃఖ వార్తను మ
హమ్మదుగారికి విన్నవించినన్
దన యవివేకమున్ తన కృ
తఘ్నతయున్, గవి కీర్తిశేషుఁడై
చనుటయు, వజ్రఘాతముల
చందమునన్ గలఁచెన్ హృదబ్జమున్.

కొలువు చాలించి, కన్నీరుఁ గ్రుక్కుకొనుచు
బిరబిరంబోయి శయనమందిరముఁ జొచ్చి
ద్వారములు మూసికొని, కవీశ్వరునిఁ దలఁచు
కొనుచు, దనుఁదాను నిందించుకొనఁ దొడంగె.

"ఓయి కృతఘ్నుఁడా! భవమ
హోదధిలోనిఁక దేలియాడు మా
హా! యఫఘన్ ధరాతలము
నంతయుఁ గావ్యసుధా స్రవంతిలో
హాయిగ నొలలార్చిన మ
హామహుఁడౌ పిరదౌసితోడ స్వ
ర్గాయసుఖంబు నీకుఁ దొలఁ
గెన్ మనుపీనుఁగువై చరింపుమా!

న్యాయము దప్పి యీ ప్రళయ
నాటకదృశ్యముఁ జూచినాఁడ నీ
కాయ మిఁకేల? భూపతి ని
కాయమునం దలయెత్త జాలుదే?
శ్రీయును బౌరుషంబును బ్ర
సిద్ధియునుంగల రాజవంశమం
దీ యపకీర్తి చుట్టుకొని
యెటమృతిలేని కృతిస్వరూపమై.

మురువున్ గూర్చు ప్రబంధ కావ్యరచనా
పూజ్యుల్ విపశ్చిద్దినే
శ్వరులున్నారు చతుశ్శతాధికముగా
పాండిత్యముల్ సూపుచున్
పిరదౌసీ కవి వాక్కునం గల రసా
విర్భూతి గన్పట్టునే?
వరహీరంబును గాలఁదన్ను కొను ని
ర్భాగ్యుం డెవం డుర్వరన్?

అని పశ్చాత్తప్తుండై
వనరి, యతనిపేరఁ దూసు పట్టణమునఁ జ
క్కని సత్రశాల గట్టిం
చె నవాబుఁడు కవిఋణంబు చెల్లింపగన్.

దాని శైథిల్యములు నేఁడు గానఁబడును;
పారసీకులు చూచి కన్నీరు విడుతు
రఁట మహమ్మదుగారికి నపశయంబు,
నిందు సత్కీర్తి కవికిని నిలిచిపోయె.

గజనీపట్టణ వీధులన్ నృపుని కం
కాళంబు సప్రాణమై,
రజనీమధ్యములందుఁ గ్రుమ్మరుచు నా
ర్త ధ్వానముల్ సేయునం
చు జనశ్రేణి వచించుచుండు, నవునౌ
క్షోణీస్థలిన్ వీడినన్
వృజినం బూరక పోవునే? నరుని శాం
తిజ్యోతిఁ జల్లార్చదే?

తెలుగు వచనానికి కండబలం, గుండెబలం, నిండుదనం చేకూర్చిన

## పండిత శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

### గారి రచనలు

చదవండి! చదివించండి!

**ఇంతవరకు వెలువడినవి**

| | | రూ. |
|---|---|---|
| ✷ కథలు 3 భాగాలు | ఒక్కొక్కటి | 100 |
| ✷ అనుభవాలూ - జ్ఞాపకాలూనూ | | 180 |
| ✷ వైద్యక పరిభాష (వైద్య విద్యార్థులకు, పండితులకు, సాహితీ వేత్తలకు ఉపయోగపడే వైద్య నిఘంటువు) | | 60 |
| ✷ బాలల బొమ్మల రామాయణం | | 25 |
| ✷ చాణక్య సూత్రం - శతనీతి (భర్తృహరి నీతి శతకం) | | 16 |
| ✷ నవలలు-1 విషభుజంగము (శ్మశానవాటిక), రక్షాబంధనం | | 125 |
| ✷ నవలలు-2 ఆత్మబలి, నీలాసుందరి, క్షీరసాగర మథనం | | 125 |
| ✷ నాటకాలు, రూపికలు : (రాజరాజు, నిగళబంధనం, స్వప్నవాసవ దత్తం- నాటకాలు, కలంపోటు, పునాదిరాయి, లక్ష్యశుద్ధి, టీపార్టీ, అపిదళతి, వజ్రస్య హృదయమ్, కొనుక్కున్న మొగుడు, వర్కింగు కమిటీ - రూపికలు) | | 125 |

**పై పుస్తకాలు అన్ని విశాలాంధ్ర బుక్ హౌస్‌ల్లోనూ, ప్రముఖ పుస్తక విక్రేతల వద్ద లభిస్తాయి.**

**త్వరలో...**

✧ **రామాయణం** ✧ **మహాభారతం**

# ముంటాజమహాలు

# అంకితము

జననీ! నీ యనుంగుమారుఁడను నీ స్తన్యంబు సేవించి వ్రా
సిన కబ్బం బిది నీకునౌ మనుమరా ల్జేకొమ్మ చేదోడుగా
ననుకూలించి కవీంద్రమాత వగు నీ యాశీస్సులం దేలి నీ
ఘనకీర్తిం బ్రకటించెడిన్ సుగుణసక్తా! లింగమాంబా సతీ!

"కన్న ఋణంబు దీరె కొడకా! కనుగొంటిని విన్నకొండలో
నిన్ను బహూకరించు మహనీయ మహంబును కన్నులార" నం
చన్న పదంబు జ్ఞప్తి గలదా జననీ! యటులాడి నీ ఋణం
బున్నతిజేసి నిట్టి కృతు లూడ్చునె నీ ఋణమున్ సహస్రముల్.

నీవు బ్రతికియుండ నీవాంఛితార్థముల్
దీర్చు శక్తి లేక దిగులు పడితి
వేయి నగలకన్న వెలగల్గు కృతిభూష
నంపుచుంటి స్వీకరింపు మమ్మ!

—జి. జాషువ

# భూమిక

సదాశయులారా!

"కలదే స్వర్గము లాతిచోఁ! గలుగ నిక్కం బిద్దియే
నీతిమంతుల విశ్రాంతి నికేతనంబు"

ఇవి తాజమహాలు కుడ్యములపై సువర్ణ పూజలందిన షాజహాను సూక్తులు. భారతీయ శిల్ప ప్రౌఢిని వేనోళ్ళంజాటు తాజమహాలును గనులారాఁ జూడవలెనను కోర్కె నాకు బాల్యమునుండియుఁగలదు. కాని ప్రాప్తిలేమికిఁ జింతించుచుందును. దేశదేశముల నమస్కృతుల కర్హమై శిల్పులకు గర్వకారణమై ముంటాజమహాలు గోరి గడించిన కీర్తి ఒక్క మొగలు చక్రవర్తికేకాక భారతీయులకు నందు ముఖ్యముగా నాంధ్రులకును దక్కుచున్నది. దాని సృష్టియందు పాల్గొన్న ముప్పది ముగ్గురు శిల్పాచార్యులలో నలువురు మచిలీపట్నము నుండి యాహ్వానితులైనట్లు తన్నిర్మాణ కాలమున స్వయముగాఁ జూచిన బాగ్దాదు వాసియగు నొక చరిత్రకారుఁడు వ్రాయుచున్నాడు. అందలి ప్రధాన శిల్పియగునొక యైటలేయుడు స్వదేశమున కేగి, తాజి సోయగము నూహించి, యుద్ధపు చట్రమున బిగింపనైతిని గదా యని విచారించెనన దాని మహిమ, దాని కోమలత స్పష్టముగాకపోదు. దీని నిర్మాణార్థ మిరువది లక్షల కార్మికులహోరాత్రము లిరువదివత్సరములు పనిచేసినట్లును, ఇరువదికోట్ల రూపనములు వెచ్చింపబడినట్లును చరిత్రలు ఘోషించు చున్నవి. ఒక దృష్టియందిది వృథా వ్యయముగాఁ దోపవచ్చునుగాని లక్షలాది ప్రజ కిరువది రెండేండ్లు పని గల్పించి, యన్నదానము చేసిన స్రుకృత మిందు లేకపోలేదు. అన్నిటికిని మించిన యశస్సు నిది భరతవర్షమున కాపాదించిన దనుట నిస్సంశయము.

ప్రణయమూర్తి యుఁదనయర్ధాగింయునగు ముంటాజి నలంకరించు చున్నట్లూ హించుచు నిరువది రెండేండ్లెత్తిన తలవాల్చక కట్టడమును సమాప్తి చేయించిన షాజహాను చేతలోనొక, పవిత్ర ప్రణయసందేశము, ఒక కళాపోషణదీక్ష, ఒక యావేశము ఒక నిఱుకు, ఒక మూగసారస్వతము దంపతి లోకమున కందించుచున్నదని నాయూహ. సతీవియోగమున నున్మత్తుఁడైన షాజహాను గాఢాంధకారబంధురమై, సర్వశూన్యమైన తన జీవిత బ్రహ్మాండమున సందర్శించిన తేజఃపుంజ మీ తాజమహాలు – ఆ పదార్థమున కితఁడు ప్రాణ ప్రతిష్టఁజేసి శాశ్వతుఁడైనాడు. ఐశ్వర్యమంతుడై యతఁడు శ్మశానమును స్వర్గముగా మార్చివేయఁ గలిగినాఁడు. తచ్చంద్ర శిలాధౌతములయిన కాళిందీ జలముల యందా శుభదంపతుల యాత్మల గుసగుసలు వోవుచుఁ ప్రేక్షకుల.కనంత భావపరంపరల బహూకరించు చున్నవి. తాజమహాలు సౌందర్యాకర్ణనమున బొడమిన యావేశమే నన్నీ కావ్య రచనకుఁ బురికొల్పినది. కవితాజగత్తున నా యూహకొ దవిన దృశ్యమే యిందు వర్ణితము. వాస్తవిక దృశ్యమునకును, దీనికి నిరంతర మెంతయు నుండకపోదు. సృష్టికర్తల దృష్టియందది క్షమార్హము. రసపోషణమున కిందొక పిచ్చివాని కథను ప్రవేశపెట్టక తప్పినదికాదు. దానియుచితానుచితములను రసజ్ఞులు తేల్తురుగాక.

తిక్కన జయంతి సందర్భమున నన్నాహ్వానించి మహాకవి సన్మానమును నా కొసంగి, తన జీవితేశ్వరి పేర నొక కావ్యము వ్రాయమని యానతిచ్చి నాయం దవ్యాజానురాగమును వ్యక్తీకరించిన విక్రమపురీ వాస్తవ్యులును, మహోదార స్వభావులును, సహృదయ శేఖరులును, విమర్శకాగ్రేసరులు నగు శ్రీ తిక్కవరపు రామిరెడ్డిగారు నే నీకృతిని నా ప్రియ  జనని కంకిత మిత్తునని కోర, ఆనందితాత్ములై, గ్రంథముద్రణ ద్రవ్యమును దయతో సమర్పించి వారి సమరస భావమును వెల్లడించిన రెడ్డి జమీందారులకు నా నమస్కారము లర్పించు చున్నాను. వారికిని వారి కుటుంబమునకును శుభమగుగాత:

–గ్రంథకర్త

# జోతలు

తిక్క వరాన్వవాయము ప్రదీప్తముగా నుదయించి, రెడ్డి భూ
భుక్కుల దానశీలతకు ముత్తెపుమేడలు గట్టి సింహపుం
బక్కణ సుప్రతిష్ఠలకు వన్నెలు దీర్చిన పుణ్యమూర్తికిన్
మ్రొక్కు లొసంగెదన్ శుభసముత్కటవార్ధికి, రామిరెడ్డికిన్.

నూరున్నారులు మూడుమారు లిడి నన్నుం దన్పి, నా వాంఛలం
గారుణ్యంబునఁ దీర్పనెంచిన సుధాకల్ప ప్రజల్పుండు, ల
క్ష్మీరమ్యుండు, పరేంగితజ్ఞుఁడగు శ్రీ శ్రీ రామిరెడ్డి ప్రభున్
నూరున్నార్లు సువర్ణగీతుల నుతింతున్ సాహితీసీమలన్.

పలుకులోఁ గలుగు నిశ్చలతఁ జేతల విని
ర్ధారింపఁజాలు నాదర్శమూర్తి
విశ్వంబు మఱపించు నైశ్వర్యలక్ష్మిచే
విఱ్ఱవీఁగని క్షమా విస్తృతుండు
ఉన్నతోన్నతములై యుజ్జ్వలించెడు వినూ
తన భావసత్కళావనధిరాజు
గణన కెక్కిన కావ్యగుణదోషములను వి
మర్శించు పాండితీమండితుండు

స్వీయదేశహిత విశిష్టాశయంబులు
గలుగు స్వచ్ఛమైన తెలుఁగువాఁడు
దొడ్డగుణము లున్న రెడ్డిజమీందారు
ప్రబలుగాత వేయి వత్సరములు.

జాతీయోద్యమదీక్షలం బ్రబలు సత్సంతానముం గాంచి, వి
ఖ్యాతింగన్న కుటుంబిచేత, రసవత్కావ్యాభిమానంబు క్రొం
బూతల్ పూయు రసజ్ఞశేఖరునిచేఁ బూజింపఁగాఁబడ్డ నా
వ్రాతల్ ధన్యములై గడించెడిని, దీవ్యద్భావభాండారమున్.

భువనహితార్థమై, యనుఁగుఁ బుత్రిక నాథునితోడ బందియై
చివుకుచునుండఁగా గలఁతఁ జెందని డెందముతోడ, దీన మా
నవపరితాపతాపిత మనస్కత బొల్చిన రెడ్డిరాజు, తి
క్కవరపువంశమందనుఁడు, కాంచుఁజిరాయురనామయోన్నతుల్

ఈకృతి నస్మదీయ జనయిత్రికి నంకిత మిత్తునంచు నే
వాకొనినంత ముద్రణకుఁ బైక మొసంగిన త్యాగమూర్తి శు
భ్రాకృతి నెత్తి పెంచిన మహత్తరపుణ్య పురంధ్రికిన్ నమో
వాక మొనర్చినన్ బ్రబలు స్వార్థవిహీన విశాలభావముల్.

తనకో! తన తల్లికా! తన
యనుంగులకొ! యంకితంబులగు కృతులకుగా
ధన మిత్తు; రొరుల కృతులకు
ధన మిచ్చి బహూకరించు దాతలు గలరే?

అనుఁగుఁ దండ్రిపేర నల తిక్క యజ్వకుఁ
గ్రమత వార్షికోత్సవములు నెఱపి
కవుల సత్కరించు ఘను రెడ్డిమండను
గుండలీంద్రుఁ డోముచుండు గాక!

# ముంటాజమహాలు

వనితా మండిన దృష్టిగోచర బహిఃప్రాణంబు లోకైక మో
హిని ముంటాజమహాలుతోడ మొగలాయీ ప్రాజ్య సామ్రాజ్యము
న్ననతం బాలనసేయుచుండెఁ బ్రజలా నందింప విఖ్యాతి బొ
ల్చిన షాజాను నవాబు శేఖరుఁడు ఢిల్లీ బర్హి పీఠస్థుఁడై.

పోలికలేని శిల్పలత పుష్పితమై రసముప్పతిల్ల ము
త్యాల మసీదు ఢిల్లి నగరాంతరమందుఁ బ్రతిష్టఁ జేసి యు
న్మీల దుదారచిత్తుఁడయి నీతిపథంబున గాక యన్యథా
కాలు చలింపనీక యధికారము చేసె మృదుస్వభావుడై.

తన యింటం గల రత్న రాసులను సార్థక్యంబు గావింపగాఁ
గనువిందు ల్పొనరించు సౌధ వితతిన్ గట్టించి స్వర్గంబుతోఁ
బనియే లేదను లీల వజ్రమణి దీపశ్రేణి ముట్టించి యం
గన్‌తోడన్ దులదూగసాగె నతి భోగశ్రీ మహాడోలలన్.

అమలస్వాంతుఁడు షాజహాను కులవిద్వేషోగ్ర కల్లోలముల్
సముదాయించి తురుష్క హైందవ సమస్యాపూర్తి గావింపఁగా
సమదృష్టిన్ విరజిమ్ముచుం గుటిల శిక్షా దక్షుడై దిక్కులన్
సమకూర్చెన్ మొగలాయిరాజుల ప్రతిష్ఠా ద్రవ్యభాండారమున్

కృతులుం బొందిన ధీవిశాలుడు జహాంఘీరుం డలంఘీరుభూ
పతికి న్నందనుఁ డన్న పేర్నిలిపి విశ్వస్తుత్యుఁడై విశ్వ భా
రత శిల్పంబు సముద్ధరించి పటుదర్పం బొప్ప సామ్రాజ్య వి
స్తృతి గావించి రసజ్ఞుఁడై కవులకందించెన్ భుజాదండమున్

హాయికి లోపం బనియో
వేయేడులనాఁటి రవల పీఠము లవలన్
ద్రోయించి కొలువు సేయన్
జేయించెం గలికి నెమిలి సింహాసనమున్.

విలసద్రత్న మరీచి మాలికలచేఁ బెంపొందు పండ్రెండు నె
మ్ముల సింహాసన మొలగంబు సిరిపెంపున్ జాట దేవేశుఁడున్
దలవంపన్ రిపురాజగర్భముల నిద్రం బోవుచున్ దాత దం
ద్రుల కన్నుం బయిచేయిగా నృపవరేణ్యుండొప్పుఁ దేజస్వియై.

బిరుదు లందిన యరబ్బీ కవీశుల వాణి
ప్రసవించె మధుర కావ్య స్రవంతి
విఖ్యాతమైన జాబిలి పతాకచ్ఛాయ
చివురించె నా సేతు శీత గిరుల
కడు దీనమైన బుక్కా ఫకీరుల గిన్నె
నిండారె పసిఁడి మానికపు సిరుల
చేయార పనిలేని శిల్పకారుల సుత్తె
నాచికొన్నది దిగంత ప్రసిద్ధి

శ్రీ పదాంకిత మైన ఢిల్లీ పురాన
తొలకరించిన దైదు వేళల నమాజు
భోగపరమైన మొగలాయి నాగరికత
మూడుపూ లారుకాయలై ముమ్మరించె.

గుడి గుడి సేవింపఁడు పా
ల్పడఁడు మజాసేయు మత్తువస్తువులకు న
య్యెడయుఁడు పరికింపఁడు పెర
పడంతుకల నెఱపు నేకపత్నీ వ్రతమున్.

మణు లల్లాకని మీదుగట్టి పనిపెన్ మక్కా మదీనాలకున్
గణనాతీతము లక్కజంబుగ ఖజానాకొట్లలో ద్రవ్యమున్
దొణికించెం బఠియించె నిత్యము ఖురానున్ శత్రుదుర్గాల బా
ర్వణచంద్రధ్వజమెత్తె నన్వయసముద్రం బుబ్బి తబ్బిబ్బుగన్.

ఉదయ సంధ్యాదేవి యొడి నిండి దిగజారి
కుట్టిగాడుపు లాడుకొనెడువేళ
ప్రియుఁడు కొండల కెక్క బెదరి యొక్కొక చుక్క
వినువీధులను జారుకొనెడువేళ
తమ్మిలోఁజెరపడ్డ తుమ్మెద ఖయిదీలు
ఆలుబిడ్డలఁ జేర నరుగువేళ
అంభోజ మిత్రుండు యమున చెక్కిలిమీఁద
పసుపుఁ గుంకుమ సిరుల్ విసరువేళ

పసిడిపాన్పు డిగ్గి పన్నీటి కోనేట
జలకమాడి మేలి వలువ గట్టి
మహిత భక్తి మీర మస్జీదునకు బోవు
బాదచారి యగుచు బాదుషాహ.

క్రూర కర్మఠ మైనట్టి గోవధంబు
దన హయామున యందు బర్తరఫుజేసి
సహన ధనులగు తన పితామహులఁ బోలి
నిఖిల హైందవులకుఁ బూజనీయుఁ డయ్యె.

మత గణంబు వొడమ దతని పాలనమందు
జుట్టుపన్ను పిలక పుట్టలేదు
కుటిలరాజభీతిఁ గుందు భారతభూమి
బెదురుమాని మఱచి నిదురవోయె.

రహిపుట్టం బదివేలదూతిక లహోరాత్రంబు సేవింపఁగా
మొహరున్నీసకు మేనగోడలగు నమ్ముంటాజమాల్ పాదుషా
మహలుద్దీప్తముగా నొకానొక లసన్మాణిక్య గేహంబునన్
మహిమన్ బ్రొద్దులు పుచ్చుచుండెఁ బతి సన్మానింప సానందయై.

అతివ చక్కదనము నభివర్ణనము సేయ
కలము సాగ దెట్టి కవివరులకు
చేయి యాడ దెట్టి చిత్రకారులకును
చెలువ చెలువమెల్ల జిలుకరింప.

అసమసౌందర్యవతి నూర్జహాను రాణి
కోడలి విలాసమునకు సిగ్గును వహించు
వలపుటిల్లాలు పల్లెత్తి పలుకరింప
తురక రాయఁడు నిలువున గరిగిపోవు.

మాణిక్యంబు సహస్ర సంఖ్య లొకవంకన్ భూరి లావణ్యపుం
గాణాచుల్ పనికత్తె లొక్కెడఁ గటాక్ష శ్రీల నాశించి వి
న్నాణంబుల్ పచరించినన్ గలఁత జెందం దంతంగాన నా
రాణీ సాహెబ మీఁద నిశ్చల పవిత్ర స్నేహ మోహంబునన్.

"ముద్దులరాణి మాటకు విభుం డెదురాడడు రేని యాన క
మ్ముద్దియ మాఱుపల్కదదెపో: సహవాస" మటంచు నిత్యమున్
బెద్దలు ప్రస్తుతింప నతివేల సుధా ప్రణయైక రాజ్యపుం
గద్దె నలంకరింతురు మొగల్ మగ లమ్మహనీయ దంపతుల్.

ఆ సతీపతుల గాఢా శ్లేషములనుండి
జారి పోయిన నిమేషంబు లేదు
ఆ దంపతులకు నాహ్లాదంబు గూర్పక
తొలఁగిన వెన్నెల తునక లేదు.
ఆ ప్రేమజీవుల యనురాగ వృద్ధికై
రుత మొనర్పని పరభృతము లేదు
ఆ శుభాకృతుల నెయ్యంపు ముద్దులచేత
తీపి కెక్కని ద్రాక్షతీఁగ లేదు.

అవధి లేనివారి యానంద కేళికిఁ
దోడుపడని పూలదోఁట లేదు
వారి కూర్మి పెంపు వలచి వర్ణనజేసి
సుప్రసిద్ధి గనని సుకవి లేఁడు.

దొరతనపుఁ గల్మి నింతయు దొఱ్ఱుపడక
ప్రథిత సంసార రాజమార్గమున నడచి
దంపతుల కెల్ల నద్భుతాదర్శ మగుచు
జగము నలరించె నయ్యాలుమగల చెలిమి,

పుట్టి పైచిల్కు సంతానభూతి నలరి
కాంచె నుత్తమ మాతృత్వ గౌరవంబు
పాలితలయందు వత్సలత్వంబు నెఱపి
కాంచె నుత్తమ రాజ్ఞీత్వ గౌరవంబు.

మొగలు•దొరసాని లావణ్యభూషణంబు
కన్ను మాయదు సంతాన ఘర్షణమున
జీవితంబున నొక దుష్టచింత లేని
సత్యవంతుల ప్రాయంబు జాఱదంద్రు

పలువురు బిడ్డలు చుట్టుం
బలసి కొలువ మధుర మధుర బహుకావ్య విభూ
షలనొప్పు శారదాంగన
వలె భారతరాణి నేత్రపర్వము సేయున్.

రత్నరుచు లీను యవన సామ్రాజ్య రమకు
నగలు గీలించు రాణి సౌందర్యలహరి
ప్రభువు కన్నులు దాటి యీవలికి రాదు
వలపు లూరింపకుండ నవ్వలికిఁబోదు.

పదియు న్మగ్గురు బిడ్డల గ్గని యనల్పశ్రీ విడంబించుచున్
హృదయేశ ప్రణయాబ్ధిలో మునిఁగి యుయ్యేలూగు ముంటాజికిన్.
పదియు న్నాల్గవ గర్భ మేరుపడియెన్ భావింప దైవంబు సం
పదపై సంపద, లేమి లేమిపయి నాపాదించు చిత్రంబుగన్.

కాలు కదల్పనీక చెలికత్తియ లక్కరలెల్లఁ దీర్పఁజూ
లాలితనంబు కొండొక యలంకృతిగా సులతానురాణి ర
త్నాల మహాళ్ళలో నతి ముదంబుగఁ బ్రొద్దులు పుచ్చుచుండె గా
రాల సుతాసుతుల్ మనసు రంజిల నింటఁ జరించు చుండగన్.

ఉవిదలిరువంక నడచి కేలూఁత లీయ
ప్రమద మొనగూర్పు గమన గర్వంబుతోడ
భాగ్యబంధురమగు నిండు బండివోలె
చక్రవర్తి నట్టింట సంచరించు.

రాజుతోఁగూడి యొక శరద్రాత్రివేళ
కొంతకాలము సల్లాపగోష్ఠి నెఱపి
పూలపాన్పున నిద్దురవోవుచుండె
నిండుచూలాలు మొగలు రాజ్ఞీలలామ.

ఒకటి రెండుమారు లురలి నేలకు జాఱె
కాపలా జవాను కఱకుకత్తి
సురటి విసరుచేటి మఱచి నిద్దురవోయె
ఖంగుమనుచు నొంటిగంట కొట్టె.

ఐదు వత్సరాల యౌరంగజీబుండు
ప్రక్కమీఁద మసలి పలువరించె
చిదికి చిదుపలౌచు చెదరి భూమికి జాఱె
ఆకసమున నొక్క తోకచుక్క

వెన్నెల మేడినీట పృథివీవలయంబు మునింగె రాత్రికిన్
గన్నులు వచ్చె మింట నధికారముచేసె నిరంకుశంబుగన్
బున్నమ చందమామ జగమున్ గనుమోడిచె రాణిగర్భమం
దున్న కుమారకుండు తలయూచుచు నవ్వె నొగిన్ గికాకికన్.

*

ఉలిక్కిపడి లేచి దిక్కులు గలయఁజూచి
ఆత్మగర్భస్థ పిండంబు హాసమగుచు
నా మహారాజ్ఞి విషయంబు నాకళించి
యశుభదం బని విహ్వల స్వాంతయయ్యె,

ఆ కాన్పుతోడఁ దనకున్
భూకాంతుని తోడి చెలిమి ముగిసె ననుచు నే
దో కలఁత నెమ్మనంబునఁ
బ్రాకి మహారాజ్ఞి బిట్టువగలం బొగిలెన్.

కంటఁ దడిపెట్టి యెఱుఁగని
ముంటాజమహలు రాణి ముత్తెమునకు లో
నంటిన చింతన్ చెక్కుల
వెంట నొకటి రెండు బాష్పబిందువు లురలెన్.

విమలంబులయిన చల్లని
హిమరుక్కుల జలకమాడి హృద్యం బగుచుం
బ్రమదంబు గూర్చు నన్నిశి
యమవస నిశియయ్యె రాణి కతిదీర్ఘంబై.

ఏమి మాయయొ కాని సర్వేంద్రియములు
దఱఁగుకొని పోవునంత శీతజ్వరంబు
భూతలేశ్వరి నెమ్మేన ముమ్మరించె
బ్రసవవేదనతోడి నారంభ మగుచు.

తన సంతానము మాతృహీనమయి వంతం గుందుచున్నట్లుగా
తనరాయండు వియోగభారమునఁ జింతన్ మున్గుచున్నట్లుగా
తనకై దొడ్డ సమాధి నయ్యమున పొంతం గట్టుచున్నట్లుగా
ననుమానించుచునుండె సత్సుతుల యూహల్ సత్య సామీప్యముల్.

భక్తి దైవార మానెడు వజ్రమణులు
భూతలేశ్వరుఁ డల్లాకు మ్రొక్కికొనియెఁ
గాని యిల్లాలు స్వస్థత గాంచదయ్యె
చండతరుఁడైన విధి లంచగొండి గాదు.

దాయ మన్నీల ప్రాణముల్ దీయఁగలిగి
యీయలేదయ్యె నిజభార్య కాయువులను
చండశాసనుఁ డగు మహాచక్రవర్తి
ఆత్మ కధికారి గాఁడు న్యాయంబుగాను.

కొడుకులఁ గౌఁగిలించుకొని గ్రుడ్లకు నీరము గ్రక్కుకొంచు ప్రా
న్వడి పెనుశోకమూర్తి యయి పజ్జ వసించు నిజేశు నంగమున్
బుడుకుచు బిట్టుగా మొగిడిపోయిన కన్నులు విచ్చి శబ్దముల్
దడబడఁ బల్కరించె రుచి దప్పిన గద్గద రుద్ధ! కంఠయై.

ఈ సుఖ దుఃఖ మిశ్రమ మహీవలయంబను సత్రశాలలో
నీ సతినై ముగించితిని నేటికి నాదు ప్రవాసయాత్ర యో
ధీసముపేత! యిట్టి పరదేశుల చెల్మి తిరంబు గాదు క్ష్మా
వాసకథా విశేషములు స్వాప్నికముల్ జపలావిలాసముల్

ఈ తనువుండునంతవఱ కింతయు నెమ్మది లేదు ప్రాణి కీ
భూతలమందు గష్టసుఖముల్ జెలికత్తెయలై భజింప నా
శాతరళాక్షి తాండవము సల్పుచునుండును మృత్యుదేవతా
ద్యూత వినోదరంగ మిది తోరపు సంపదలెల్లఁ బాచికల్,

ఆవిరియోడలో జలధియాన మొనర్చెడు బాటసారు లో
భూవర రేవులందు దిగిపోయెద రించుక వెన్క ముందుగా
నీ వసుధాపణంబు పనియెల్ల ముగించి స్వదేశగాములై
పోవుచు వచ్చుచుంద్రు సతమున్ బ్రజ లీ నరజన్మ వర్తకుల్,

భూరిపరాక్రమోన్నతుల పుచ్చిన మేటి కపాలపాత్రలన్
నీరము ద్రావుచున్నవి వనీ వనభూములలోని సింహముల్
వారల యస్థిపంజరముల న్నివసించుచు పూర్ణనాభముల్
దారముదీసె నింతియకదా! భువి నాల్గు చెరంగు ,లేలినన్.

ఏ పుష్పంబును జేసి వాడుకొనునో ఈ దేహమున్ దైవమో
భూపశ్రేష్ఠ! విచార మందకుము మామూలేకదా ఈ మృతి
వ్యాపారంబు సమస్త జీవులకు విశ్వవ్యాప్తి గర్భంబునన్
మాపుల్ రేపులు నెందఱో యిముడుచున్నారందు నేనొక్కతెన్.

సమతా చిహ్నితమైన యీ మరణ మీ సర్వంసహా వేదనా
సమర శ్రాంతుల గౌఁగిలించుకొని విశ్రాంతిన్ బ్రసాదించెడిన్
హుమయూనాదుల మీపితామహుల బోలుర్వీధవుల్ పెక్కురీ
సుమశయ్యంబవళించి మేల్కొన రహస్సుల్ పెక్కులిట్లేగినన్.

మహమూదాదులు పాదముద్రికలచె మన్నింపఁగా మింటికిన్
మహికిన్నిచ్చెనవోలి యేరుపడి సమ్మర్ధంబుగా నున్న యా
రహదారిం జను భక్తులం గలసి స్వర్గక్షోణిఁ బ్రాపింతు నీ
సహరా మందు టెడారి వేదలనం దౌష్ట్యంబున్ విసర్జించెదన్.

కలుషం బింతయులేని నీ మధుర ముగ్ధంబైన చిత్తంబు లో
పల నిద్రింతు ననారతంబు నదె యాహ్వానించుచున్నారు వే
ల్పులు నాకై చనుదెంచె మించులరథంబుల్ టెక్కెలల్లార్చు చున్
సెలవిప్పింపు మటంచు నేత్రములు మోడ్చెన్ భర్తృ వక్షస్థలిన్.

పట్టు పరదాల చీఁకటి వనములందు
ప్రభవమును గాంచి, శోభిల్లి రాలిపోయె
పరిమళం బొండు లోకాన బారజిమ్మి
మొగలు రేరాణి ముత్తైదు ముత్తియంబు.

ఆ ముంటాజమహాలురాణి కడకిట్లన్యాయమై పోయినన్
భూమీశాగ్రణి దీనుడై భుజబలంబున్ బ్రాజ్యసామ్రాజ్యమున్
లేమిన్ జెందినయట్టు బిట్టు దురపిల్లెన్ గ్రుంగి కూలారి, యు
ద్దామైశ్వర్యము లింపుసేయునె కళత్రజ్యోతి చల్లారినన్.

అతఁడున్మత్తుడువోలె, రేఁబవలు నిద్రాహారముల్ మాని; త
త్స్మతి క్రీడించిన చోటులం దిరుగుచున్ సంతానముం జూచి దుః
ఖితుఁడై యూర్పులు సిమ్ముచున్ గడపసాగెం గాలమున్ బంధు సం
తతు లోదార్చిన నూరడిల్లక నిరుత్సాహాతిరేకంబునన్.

నిన్న మణిమందిరంబుల నిదురవోయి
నేఁడు నిద్రింతువే కాటి నేలమీఁద
నిన్ని నాళులవలెఁ గాక నిన్న నేఁడు
లెంత విషవహ్ని గ్రక్కిపోయినవి దేవి!

కుతలం బంతయు భస్మరాశియయి నాకుందోచె నాశాపరా
జితమై జీవిత మంధకారమునఁ జొచ్చెన్ నీ సమావేశముల్
కతలై పోయె సహింపఁజాలని వియోగజ్వాల కావింప ను
ద్గత దుఃఖాంకితమైన యీ శిథిల కంకాళంబు నెట్లీడ్చెదన్

జీవన తారవై యమరసీమల నీవు సముజ్జ్వలింప మా
యావృతమైన విశ్వవలయంబుల శాశ్వత శోకమూర్తి నై
జీవిత మూని యీ చరమజీవిత నాటకరంగ మెక్కి వా
పోవుచునుంటి నీ విధురభూమికతోడ కిరీటధారినై.

ఆయుస్సారము లారగించి, మృతిపంచాస్యంబు నీ దేహమున్
నాయంకంబున డించిపోయె నకటా! నా శౌర్యసంపత్తియున్
జాయారక్షణ చేయఁజాలని యరణ్యజ్యోత్స్నయై పోయెనే
యో యాత్మేశ్వరి! చక్రవర్తియు మనుష్యుం డిట్టి ఘట్టంబులన్.

ఉరుగతి నీవు దాల్చికొని యూడ్చిన వస్త్రమువోలి నీ కళే
బరము పరేతభూతలము పాలయి చిత్తము నుత్తరించెడిన్
దిరుగ ధరించు నీ యమృత దేహముతో నగుపింతువందు ర
మ్యపరమపదంబునందు నదివాస్తవమో! బులిపించు మాటయో!

అయయో దేహములూడ్చినా రయుత సంఖ్యాకుల్ మహా త్యాగులై
పయగంబర్లు ముముక్షువుల్ ఘనతర స్వర్గంబు నాశించి యే
మయినారో యెటువోయిరో కబురుసేయం డొక్కఁడీనాటికిన్
దయనీయస్థితి దుమ్ము గొట్టుకొని ప్రత్యక్షించుఁ దచ్ఛల్యముల్

నిను సృష్టించుట దుర్ఘటంబగును రాజ్ఞీ యమ్మహాశిల్పి ఈ
శున కేహేతువుచేత నీ ప్రతిమ నచ్చున్ భగ్నముంజేసెనో
నను శిక్షించుటకో ప్రపంచమునకు న్వైరాగ్యము న్నేర్ప నెం
చెనొ యాయుర్బలమూడెనో మొగలురాట్సింహాసనశ్రీలకున్.

మృతికి నవ్వలియొడ్డు జేరితివి నీవు
యివలి యొడ్డున నిలిచి పోయితిని నేను
పలుకు లందని భిన్నవాసులగు మనకు
పుణ్యగేహిని స్నేహంబు పొసఁగు టెట్లు?

మానినీమణి నీదు సమాధిమీద
కనులు గప్పుచు కిగ్గాడి కాలరథము
తీర్చిపోయిన చక్రముద్రికలు వోలి
కడచె నొక యహ స్సొక్క నక్తంబు నపుడ.

పయనంబు సాగించు మెయిలు తిన్నెల మీఁద
కనుపింపలేదు నీ కాలిజాడ
అరవిచ్చి మురిపించి మెరుపుల తోఁటలో
మిట్టాడలేదు నీ మేని కాంతి
కొమరారు నిండుపున్నమ చందమామలో
భాసిల్లలేదు నీ హాసలవము
సచరాచరంబైన సర్వ సర్వం సహా
వినిపింపలేదు నీ విమలవాక్కు

ఏ రహస్య సరణి యే హరిత్తుల జాడ
నీ నిలింప రథము నిర్గమించె
నాదు నేత్రయుగళి నాట్యమాడెడు నిన్ను
నెట్లు దొంగిలించె నీశ్వరుండు.

నీవు వసించుచోట వసియింతును నేనును దాచి యుంపుమో
దేవి! యొకింత నేల చను దెంచెద రేపట మాపటన్ నిరా
శావిషదహ్యమానమయి సౌఖ్య పరాఙ్ముఖ మైనయట్టి నా
జీవిత శేష మంకితముఁ జేసెద నీ కవివాహితుండనై.

నా కట్టించు మసీదులన్ మసలుచున్ నా కాన్క లాసించుచున్
నాకుంగీడు దలంచినాఁడతి కృతఘ్నుత్వంబు వాటించుచున్
లోకాధీశుడు దేవదేవుని దయాళుత్వంబు సందేహమై
నాకీ యచ్చపుభక్తి సేతలు వృథా నాట్యంబులై తోచెడిన్.

అక్కటికంబులేని దురితాత్ముడు మృత్యుకిరాతరాజు వి
ల్లెక్కిడినాడు తృప్తిని వహింపఁడు నీ మరణంబుతోడ నీ
జక్కవజంటలో నొకటి చాలదు వాని బుభుక్ష దీర్ప న
న్నుక్కడఁగింపఁగా దొడుగ కుండఁడు రెండవ బాణ ముద్ధతిన్.

అసు పేటిం బదిలంబుగాఁ బతి రహస్యం బెల్లఁ గాపాడు వి
శ్వసనీయంబగు వ్యక్తి భార్యయకదా క్ష్మాచక్రమం దట్టి నీ
వసువుల్ వాసినయంతనే ప్రబల సైన్యం బుండి భీతిల్లుదున్
వసుధారాజ్యము గల్గియుం గటికి నిర్భాగ్యుండనై పోయితిన్.

ఆరిపోవని నీదు శరీర శోభ
దీపమైనది కాళింది తిన్నియలకు
మంజులంబైన నీ సౌకుమార్య మెల్ల
పంచుకొన్నవి తన్నదీ పంకజములు,

గురుతర సత్యలోకమునకుం బయనించి సుఖించుచుంటివో
కరిగి యనంతమౌ ప్రకృతి గర్భమునందున లీనమైతివో
యెఱిఁగినవాడు లేడు హృదయేశ్వరి దుర్ఘటమైన మృత్యనం
తర విషయం బయోమయ మనన్వయ కావ్యము మానవాళికిన్

నీరూపంబను స్వర్గలోక మిచటన్ జీర్ణించె జీర్ణించదే
స్వారాజ్యంబను సంశయంబునకు లోనై యున్న నా బుద్ధి కీ
గోరీ మృత్తికఁ బచ్చగిల్లిన తృణాంకూరంబు నా కేదియో
వైరాగ్యాంశము లుగ్గడించెడి తలం బంకించి జంకించుచున్.

ప్రియముగ దేవదూతలు చరించెడు మూడవ మిన్నుదాఁటి య
వ్యయమగు జీవనిర్ఘము వాఱు నొకానొక దీవి కొంటిమై
బయనము గట్టితే యనఁగు భర్తను నన్ను పరిత్యజించి యో
ప్రియతమ తోడుగా నెగయ ఱెక్కలు గల్గునె నాకు దేహికిన్.

అవనికి దూరమై యెడద కందని స్వర్గము నూహలోన మా
నఁవుడు సృజించినాఁ డది యనాథలు పేదలు నిల్చుతావు భూ
ధవులకు గాదు నీ మృదుపదంబులు కందుఁ గళిందజా తటిన్
జివుకని స్వర్గధామము రచించెద రమ్ము శుభస్వరూపిణీ.

మృతులకు మరు జన్మంబులు
కృతులె కదా దేవి యట్టి కృతిశతములచే
బ్రతికించి నీకు జక్కని
రతనాల సమాధి మందిరము గావింతున్,

ఎల్ల జీవులకు నత్యుల్లాస మొలికించి
ప్రభవించె నీ సుప్రభాత సంధ్య
వలచు కమ్మని పరీమళము గుప్పిటఁ బట్టి
పూచె నీ సంపంగి పూలతోఁట.
నిలువుటద్దమువద్ద నిలిచి జారిన కొప్పు
సవరించె నీ వయస్యాజనంబు
తొలి నమాజుల మేలుకొలిపి లోకాధీశు
మన్నించె బెడఁగు జుమ్మా మసీదు

మదన గోర్వంక నిద్దురమత్తు వోవఁ
దనువు విదళించి యీశ్వరస్తవ మొనర్చెఁ
బ్రాతరానందమున సృష్టి పరిఢవిల్లె
నీవు మాత్రము నిద్దుర లేవ లేదు.

పదియుం దొమ్మిది యేదు లీడుగల దాంపత్యమీనాటితో
యెద నొప్పించి పెకల్చి దోచుకొనిపోయెన్ దైవ మీగాయమున్
గుదిరింపంగల వెజ్జులేఁడు గతరాగుల్ వోవు మార్గంబునన్
బ్రతుకుందేరు మఱల్చెదన్ గృతక విశ్వశ్రీ విసర్జించెదన్

జీవరత్నంబు వగు నిన్ను స్వీకరించి
వట్టి రతనాలు నాయింట వదలినాఁడు
యిచ్చి బులిపించి క్రమ్మరఁబుచ్చుకొనుట
యేటి కలవాటు జేసెనో యీశ్వరుండు.

ప్రియమారన్ దినరాజబాలుఁ డుదయాద్రి న్నిక్కి బంగారు కుం
చియతో నీదు మహళ్ళపై జిలుకరించెన్ గుంకుమశ్రీ లవే
అయయో యెందులకీ యలంకృతులు చానా నీ వియోగాకులం
బయి యాభీల విషాద నీరద శరణ్యంబైన యిక్కోటకున్

ఉడుగక మ్రోగుచున్న యమునోజ్జ్వలనీల తరంగపంక్తి క్రుం
గుడు పడియున్న నా హృదయగోళములోని విషాదవల్లకిన్
దడయక మీటసాగె నొకనాడు ముదం బొడ గూర్చు సృష్టియే
బెడసి మఱొక్కనాఁడు పరివేదన కగ్గము సేయు జీవులన్.

నిన్ను నుదరంబులో దాచుకొన్న మహికి
రత్న గర్భాఖ్య నేఁడు సార్థక్య మయ్యె
నీవు తలమీద దాల్చి మన్నించు కతన
వసుధ నొక బొగ్గు కొహినూరు వజ్రమయ్యె.

పరుగులు వారు నీ సమయ వాహనమున్ నిముషంబు వెన్కకున్
మరలిచి దాటిపోయిన సమంచిత సౌఖ్యములందు వేడ్కకున్
గురియగుచున్న నా వెడఁగు కోర్కె నెఱింగెనొ! యశ్వరాజముల్
దరహసితం బొనర్చెడు విధాన సకిల్చెడి సాహిణంబులన్

గుఱకలు లేని వింత కనుగూరుకులం బవళించి యెన్నఁడో
పరమ పదించి పోయిన నవాబుల రాణులు తోడునీడగా
జరుపుము నీ యనంతమగు స్వార్ధికయాత్ర, పవిత్రమైన నీ
చరితము నాలపించుచుఁ బ్రశాంతి వహింతుఁ గళిందజా తటిన్.

ఉల్లమున దుఃఖభారము
పెల్లింత శమింప రాజు విలపించి, మనో
వల్లభ సమాధి నిర్మా
ణోల్లాసము చెంగలింప నుద్యుక్తుండై.

చాటింపించె నరేంద్రుఁడు
పేటల పల్లియల శిల్ప విఖ్యాత కళా
వాటికలు కుట్మలింపగ
బోటీకి సమాధి మచ్చుబొమ్మలు సేయన్.

ఢిల్లీ రాజ్యంబున నొక
పిల్ల జమీందారుగిరియు బెక్కు రతనముల్
వెల్ల గజారోహణమును
బల్లకియు న్నిర్ణయించె బహుమానముగన్.

యతనముమీద బొమ్మలు తయారొనరించిరి శిల్పులెల్ల భా
రత విషయంబు నంతటను ఱాలను లోహములన్ సహస్రముల్
ప్రతిభలు జింద నమ్మొగలురాయని ప్రేమ రసచ్ఛవుల్ బహి
ర్గత మొనరించు బొమ్మ గనరా దొకటేనియు వానిలోపలన్.

అనుభూ త్యావేశంబుల
జనితములగు లలితకళలు సాధ్యములగునే
కనకపుఁ బోటీలకు ని
మ్మను జేశుల మెచ్చుకోలు మర్యాదలకున్

ఆదేశాన మహోదరిద్రుఁ డొకరుం డవ్యాహతంబైన భా
ర్యాదుఃఖంబున గుందువాడెడఁద వైరాగ్యంబు రేకెత్త ను
న్మాదింబోలి చరించు దీనుఁడు శ్మశానక్షోణులం దుండుచున్
బూదిన్ ముద్దలుజేసిచేయు ననయంబుం బొమ్మలందమ్ముగన్

అతని శిరస్సులోపల విహారము చేయు కళాధిదేవి య
ప్రతిహతమైనవాని విరహాగ్ని గడంగి సముజ్వలించినన్
జితికిన గుండెతో నతఁడు సృష్టి యొనర్చె సమాధి బొమ్మలం
చితములు పెక్కులం దొకటి చిత్తములన్ గిలిగింత పెట్టెడిన్.

షాజహాను ఖాదుషా యూహలో నుండి
మాట కందరాక మసలు ప్రతిమ
సృష్టిశిల్ప రమకు సిగమీది నగవోలె
నవతరించె వాని హస్తమందు.

కళలు మోహించు టొక కులీనులనే కాదు
కులము లేదన్న వానినిఁ గూడ వలచు
సత్కళాదేవతా కటాక్షంబు కతన
సమయు గావుత ముచ్చ నీచతల బెడఁద.

జీవితేశ్వరి కిది ప్రేమ చిహ్న గాఁగ
బసిఁడి రేకుల గట్టింపవలయు ననుచు
దిరిపెమెత్తుచు వాఁడూర తిరుగుచుండు
ప్రేమపొంగున విశ్వంబు విస్మరించి,

వాని కోరిక నాలించి స్వాంతమందు
నవ్వుకొని వాని బొమ్మ సౌందర్యమునకు
సంతసించిన యొక శిల్పి సత్తముండు
దానిఁ దెప్పించి మొగలు సుల్తాను కొసఁగె.

పనితనమునన్ గుదిరికయున్
వినూతనత్వంబు గలిగి ప్రేక్షణ యుగమున్
దనియించు బొమ్మ నరపతి
మనస్సులో నునిచె హర్ష మాధ్వీకంబున్.

'వహవా! సెహబా, సయ్యది
బహుమతికిం దగిన బొమ్మ ప్రజ్ఞాన్వితుఁ డీ
మహనీయుఁ డనుచు నరపతి
బహుభంగులఁ బొగడె నిఖిల పండితుల సభన్.

అవమతియు లజ్జఁ బెనగొన
స్తవము సలుపు టెట్టు లయినఁ దప్పనిసరియై
"అవునవు చిత్త ముచిత"మని
నవాబునకు మాఱు పల్కి నా రీర్ష్యాళుల్.

నృపుఁడు రసజ్ఞుఁడందు రిది యెక్కడివింత యభాగ్యు నొక్క నిన్
శ్వపచుని గౌరవించు తలవంపులుచేసె ననల్ప కల్పనా
నిపుణుల మంచు ధర్మము గణింపక కొందఱు ముచ్చటించి రూ
రుపులు నిగుడ్చుచుం బతి పరోక్షమునన్ కులపక్షపాతులై.

రాజు పఠీవియోగి బయిరాగియు బెండ్లములేని దీనుఁ డ
వ్యాజము లిట్టివారి సహవాసము లింతయకాని యీ పరి
వ్రాజకుఁ డేటి శిల్పి నరపాలకుఁ డేటి పరీక్షకుండు సా
మాజికు లింద ఱుండ నని మచ్చరకించిరి కొంద ఱుబ్బునన్.

చదువవచ్చు గ్రంథ సముదాయ మంతయు
కృతులలోన నెరసు లేరవచ్చు
రసము సృష్టిచేయు ప్రజ్ఞావిశేషంబు
సాధనమున రాదు చదువు గాదు.

ఫిరదౌసీకవి కన్న పండితులు సూఫీకన్న విద్వాంసు లుం
దురు భాషాజలధిన్ మథించిన మహాత్ముల్ భావనిర్మాణ చా
తురి మాధ్వీరససృష్టియుం జిలుగుఁముద్దుంబల్కు కుల్కింపులున్
గురు శుశ్రూషల నబ్బునే యసమశక్తుల్ జన్మసాఫల్యముల్.

ఏదో కొంత కళావిశేషములుగా దీ చిత్రరాజంబునన్
గాదన్నన్ ఫలమేమి? యీ కళకు వ్యాఖ్యానంబు లీ రిత్త వా
గ్వాదంబుల్ పని సేయునే ఇతని భిక్షాహస్తమం దే మహా
వైదుష్యంబు వసించునో యనుచు సంబాషించిరుద్యన్మతుల్.

ఆ నిఖు పేదవానిని మహాసభకున్ బిలిపించి మంత్రులున్
దా నెదురేగి తెచ్చి తన దాపున నున్నతపీఠి వాని నా
సీనునిఁ జేసి క్రొంబసిడి చేలములుం బదివేల నిష్కముల్
గానుకఁ జేసె నమ్మొగలుకాంతుఁడు భూరికళావిధేయుఁడై.

సులతానాగ్రణి! మీ కళాభిరుచికిన్ జోహారు భార్యా వియో
గులు మీకియ్యదె సానుభూతి వినుతోక్తుల్ మీ సభాశాలకున్
వలపు ల్మీసమదృష్టి దార్ఢ్యతకుఁ గైవారంబు మీ నేలకున్
కులుకు న్నెమ్ముల తఖ్తుకుం దిశల నిగ్గుల్ దేరు మీ కీర్తికిన్.

ఆనందించిరి మీ పితామహులు వీరాగ్రేసరుల్ బూర్వ సు
ల్తానుల్ బాబరుమాయునాదులు కృతార్థంబయ్యె మీవంశముల్
పూనెన్ జక్కని సౌధభూషణములన్ ముక్తాఫల శ్రేణితో
లేనవ్వుల్ విరజిమ్ముచున్న యది ఢిల్లీ కన్య మీ కౌఁగిటన్.

హిందువులు ముసలుమానులు
బందుగులం బోలి "భాయిభాయి" యనుచు నిం
పొందెదరుగాక మీ య
ర్ధేందు పతాకంబు నీడ నృపతివతంసా!

పొచ్చె మొకింత లేని పరిపూర్ణ కటాక్షము విస్తరించి నా
బిచ్చపు గిన్నెలోఁ బసిఁడి బియ్యము బోసిన దానవీర నీ
పచ్చల బాహుశాఖి చలువం జెలువారి కళాలతాంతముల్
విచ్చి రహించి భారత సవిత్రికి బొల్పుత మంగదంబులై.

ఆసలు సంహరించుకొని యాకటి కింత భుజించి యెట్టులో
వాసరముల్ గమించెడు నభాగ్యున కంగన గోలుపడ్డ స
న్యాసికి నాకు నీ పసిడి నాణెము లేల కళాసరస్వతే
దాసులు పెక్కులుండెదరు తన్పుము వారి శరణ్యశూన్యులన్.

మొగలు నవాబు శేఖరుల పూజ్యనభాంతరమందు సత్కళా
జగమున నా పరిశ్రమ ప్రశంసితమయ్యె పసిండి పూజలన్
దిగులు సగంబు దీరె గరుణించి పరిగ్రహ మాచరింపుఁడీ
నగదును క్రమ్మరం దమ ఘనంబునకు న్నజరాన వెట్టుదున్.

నావలె వియోగ బాధా
జీవులయిన మొగలు రాజశేఖరులను మీ
కీ విప్రయోగి కాన్క ము
దావహమయి చిత్త శాంతి కనుకూలించున్.

అతఁడట్టు లాడి పసిఁడియు
రతనములు పరిత్యజించి ప్రతిమవలె సభా
యతనం బంతయు నిశ్చే
ష్టితమై కనుచుండ నాలసింపక చనియెన్.

ఇతఁడొక దేవదూత, కలరే? యిటువంటి మహానుభావు లీ
వితముగ పెన్నిధానము లభించినదాని తిరస్కరించు ధీ
యుతులు మదీప్సితంబును ఫలోన్ముఖముం బొనరింప మానవా
కృతి జనుదెంచియున్న జగదీశ్వరుఁడో పయగంబరో యగున్.

అని యాశ్చర్యపరీత చిత్తుఁడయి రాజా వగ్గు నగ్గించి త
ద్ధనముం బేద పకీరుసాహెబులకున్ దానంబు గావించి చ
య్యన దర్బారుముగించి లేచి మణిశయ్యాగారమున్ జేరె మ్రో
గె నగారా నవుబత్తు లాహ్నిక శతఘ్నివ్రాతమున్ గోలగన్.

పిలిపించెన్ బహుదేశ తక్షకతతిన్ విఖ్యాతులౌ గ్రీకు శి
ల్పుల ముంటాజి సమాధి నిర్మితికి ప్రోవుల్సేసె ముక్తావళుల్
నెలఱాల న్మలిపించె నద్దములకంటెన్ నిద్దముల్ గాఁగ వె
న్నెలరేలన్ నెలరేని బింబమునకున్ దీప్తుల్ ప్రసాదింపగన్.

యమునాతీరము నిండినా రఖిల శిల్పాచార్యులున్ సత్కళా
సముదగ్రుల్ వరిగింజపై కలికి పూజల్ సెక్కఁగాఁజాలు ధీ
రమణీయుల్ ఘనవాస్తుశాస్త్ర నిపుణుల్ బ్రాక్పశ్చిమావాసులు
న్న మిత ప్రజ్ఞలు నేల యీనిన విధానన్ తన్నుపాహూతులై.

పరిశీలింపఁ దొడంగినారలపరబ్రహ్మల్ మహాశిల్పులీ
శ్వరసృష్టిన్ బహుపుష్పవల్లరుల సాజంబైన నిర్మాణమున్
గరమాకర్షకమైన వస్తుతతి లోనన్ డాగి లోకంబు న
చ్చెరువున్ గొల్పు విశేషముల్ దెలిసి హర్షీభూతచేతస్కులై.

ఏ వన్నె గల తీవె కే పచ్చ సవరింప
  జెలువారునో దాని చిలికిజేసి
ఏ పుష్పదళమున కే పుష్యరాగంబు
  సరిపోవునో దాని సంఘటించి
ఏ కిసాలంబున కే కెంపు జోడింప
  కొమరారునో దాని కూర్పుజేసి
ఏ గులాబీ మొగ్గ కే రవ్వ బొదిగింప
  నందగించునొ దాని నతుకుబెట్టి

ప్రకృతిసిద్ధమైన వన్నెతో వన్నెకు
చెలిమి గలిపి భావముల నిమిడ్చి
చలువరాతి ఫలకములు దీర్పసాగిరి
చిత్రచిత్ర గతుల శిల్పివరులు

రసికుల విమర్శనా వితర్కముల కతన
బహుకవీశాన మోహన వర్ణనముల
బుడమిగల వాఙ్మయం బెల్ల బొగరుబట్టి
పడంతి ముంటాజి టాజియై పొడమువేళ.

శిలలకుం బ్రాణము గలదను
పలుకు నిరూపింప నుపల ఫలకమ్ములపై
మొలిపించినారు శిల్పులు
పలు వన్నెల లతలు నేర్పుం బరిమళ మొలుకన్

కలము నందుకొను కవివరేణ్యుని మ్రోల
తలలు వంచు శబ్దముల విధాన
నాటి శిల్పిచెంత నవనీతమును బోలి
మెత్తదనముం దాల్చె మేటి శిలలు.

తాకినం గందునోం యనువిధంబున బాలకు సౌకుమార్య పుం
బోకడ లద్దు నేర్పరులు ముప్పది ముగ్గురు శిల్పు లాత్తలో
కైక చమత్కృతుల్ బొదిగి యిర్వదియేండ్లు శ్రమించి భారత
ప్రాకృత శిల్పసంపదకుం బ్రాణముపోసిరి శాశ్వతంబుగన్.

కుమిలిన పాదుషా హృదయ కుండమునన్ దలక్రిందులైన వి
శ్వముల వికార నాట్యరభసంబున రేగిన వేదనా పరి
భ్రమణమునందు జిందె వెలిపాటిన వెచ్చని కంటినీరు తా
జమహాలు బాలపై నుదయ సంధ్యలం బొల్చు హిమచ్ఛలంబునన్.

రాణి మనస్సువోలి మధురంబయి, ముత్తెపుఁజిప్పలోని పిం
గాణి చెమక్కులన్ ధవళకాంతులుజిమ్ముచు చంద్రకాంత పా
షాణపు టింపుసొంపుల దిశల్ వెలిగించెడు టాజిపొంత ని
ద్రాణములై నశించు నమృతాంశుని పున్నమినాటి పోడుముల్.

ప్రతిబింబించు గులాబి మొగ్గల కనుప్రాసంబులై తచ్చిలా
లతలున్ గాలికిఁ దూఁగుపోలిక మహోల్లాసంబు గల్పించు న
ద్భుతమై తాజమహాలు ద్వారములపై ముద్దారు శిల్పంబుతో
బ్రతిరా దీశ్వరశిల్పమున్ మనసులన్ రంజించు మర్యాదలన్.

ఏబదా రక్షరంబుల నెసక మెసఁగు
కలికి భాషకు తెలుఁగున కలివిగాక
అలవియే తాజీ లావణ్య మభినుతింప
తదితరం బైన భాషా వి తానమునకు

"కలదే స్వర్గము లాతిచో! కలుగ నిక్కంబిద్దియే నీతిమం
తుల విశ్రాంతినికేతనం" బనెడు సూక్తుల్ ద్వార బంధంబులన్
విలిఖింపించె నవాబు శేఖరుఁడరబ్బీ పారసీ భాషలన్
గలిమిన్ జాటుచు తాజి సోయగము వ్యాఖ్యానింపగాఁ నేటికిన్.

పున్నమకు టాజి కేగతి
సన్ని హితం బైన మైత్రి సమకూరిచిరో
కన్నెకు యౌవనమటు లు
త్పన్నంబయి మిన్ను ముట్టు తద్రో చిస్సుల్.

తొాదరి విశ్రమించు తుది సుత్తి దెబ్బతో
వట్టిపోయె శిల్పవరుల ప్రతిభ
షాజహాను దీక్ష సఫలీకృతం బయ్యె
మొగలు కీర్తి మొదటి మొగ్గ దొడిగె.

అది మహారాజు భగ్నాశయములయందు
పుష్పితంబైన నెలఱాల మూత కవిత
అదియె మానుష భావ నవ్యతలతోడ
ప్రజ్వలించెడు నజ్ఞాత వాఙ్మయంబు.

అగుపించు నచ్చోట నవధి దాఁటిన పాదు
షాల హేరాళ భాస్వద్విభూతి
నిండారు నచ్చోట నిత్యనూతన వికస్వరమైన యానంద పరిమళంబు
నినదించు నచ్చోట ననుకూల దాంపత్య
విశద రహస్య గంభీర గీతి
విహరించు నచ్చోట విరహ వేదనతోడ
మానవేంద్రుని భగ్న మానసంబు

వేయి చంద్రుల చంద్రికా విలసనంబు
పరిసర క్షేత్రముల జింది ప్రతిఫలింప
హాయి గల్పించు తాజి కుడ్యముల మీఁద
గుసగుసలువోవు నైలింప కువలయంబు.

నరప మిథునంబు మృత్యనంతరము నందు
నాశ్రయము లేక దిశల నల్లాడుచున్న
పావనంబైన ప్రేమహిరావతంబు
మొరయుచున్నది పెను టాజి బురుజులందు.

అహరహము టాజి సౌందర్య మపహరింప
నడుపుచున్నాఁడు కాలంబు తస్కరుండు
మొదటి క్రొత్తదనము చెక్కు చెదర దిపుడు
సత్కృతుల పొంత సాగునే సమయ బలము?

ఘనతన్ జెందిన యందగత్తెయగు నాగ్రారాణి ముంటాజి చే
సిన పుణ్యంబును బోలి తాజమహలున్ సృష్టించి సంతృప్తులై
చని రుద్యన్మతులైన శిల్పులు మహా షాజాను భూజానియున్
దనివిం జెందె ప్రియాముఖాంబుజము సందర్శించుచున్నట్లుగన్

రాజు కడగొట్టు తనయుఁ డౌరంగజీబు
అన్నల వధించి పీఠంబు నపహరించి
యనుగు తండ్రిని చెఱసాలయందు నునిచె
వికటములు సుమ్ము కాలమాంత్రికుని పనులు.

అగ్రజారుణ రక్త పంకాకింత మగు
పాణియుగమున నల్లాను ప్రస్తుతించె
నమ్మహా హత్య తనది గాదన్న యట్లు
సన్నుతుల నంది దైవంబు మిన్న కుండె.

అతని ముత్తాత సుతునకై యసువు లొసఁగె
నతఁడు దండ్రిని బట్టి బంధితునిఁ జేసె
తాత సౌమ్యుడు మనుమఁ డుద్దండమూర్తి
గుణములకు వంగడంబు కారణముగాదు.

జనకుండు భోగి కూరిమి
తనయుండు విరాగి భిన్నత్వంబుల నె
ట్లొనగూడి రొక్కొ తండ్రియు
దనయుడు విధి చిన్న కొంటెతన మొనరించెన్.

కళలు కళ దప్పె దేవళ
ములు మూలం బడియె హిందు ముసిలిమ్ములలోఁ
దలసూపె భేదభావము
తలపన్నుదయించె, శాంతి తలక్రిందయ్యెన్.

అంతడు ఖురాను వ్రాసి ధన మార్జనచేయుచు కష్టజీవియై
బ్రతుకుచు నేలపై తనువు వాల్చుచు రాజ్యము చేయుచుండె నం
చితమగు భక్తి తత్పరత స్వీయమతోద్ధరణకై దీక్ష శు
ష్కిత తనుఁ డై సతం బుపవసించుచు రాచఫకీరు పోలికన్.

గుడిగుడి సేవింపఁడు పా
ల్పడఁడు మజా సేయు మత్తువస్తువులను న
య్యొడయఁడు పరికింపడు పెర
పడంతుకల నెఱపు నేక పత్నీ వ్రతమున్.

చక్కా డెన్ విమతస్థులన్ గరకు టీర్ష్యాస్వాంతుఁడై నిప్పులన్
గ్రక్కెన్ గాఫరులంచు హైందవులపైఁ గల్పించె నానా వ్యథల్
మక్కా యాత్రికులన్ దనించె విలసన్మాణిక్య భిక్షాప్లుతిన్
జిక్కె యోఁ దలతిక్క భక్తి కతనన్ నిత్యంబు మర్త్యాళికిన్.

తనకుం బట్టిన పిచ్చి నల్వురకు రుద్దన్ జూచు వద్దన్న యా
తని నిందించి శపించి పోవు బరమార్థం బెల్ల సాధించి తె
చ్చిన వానింబలె విట్టివీగు భువన శ్రేయోభరం బంతయున్
తన నెత్తిం బడినట్టు దుఃఖపడు నాత్మన్ భక్తు దుద్రేకియై.

సకల లోకమునకు సంతోషకరమైన
మధురమైన తాజమహలు హొయలు
పాదుషాహ మనసు వలపింప లేదయ్యె
భక్తి తోడ కళకు పొత్తు లేదు.

మనుజులకు నెల్ల దైవంబు మహితుఁ డనెడు
గౌరవార్థంబు గల యలంఘీరు బిరుదు
దాల్చె నౌరంగజేబు దుద్దండలీల
నృపతి వలె నన్న బిరుదుల కేమి కొదువ.

అతని పేరు విన్న నఖిల భారతభూమి
దద్దరిల్లి కంటతడి వహించు
నతని గుండెలోన ననయంబు నినదించు
ఘన శివాజీ వాజి కళకు హేష.

కట్టెదుటన్ మహోజ్వలముగా వెలుగొందుచు తాజిమాలు చూ
పట్టుచు నూరడింప నలబంధనగేహమునందు వృద్ధ స
మ్రాట్టు మహేంద్రతుల్యుఁ డవురంగుని కూరిమి తండ్రి కాలమున్
నెట్టుచునుండె జీవములు నిల్చిన పీనుగు వోలె దీనుడై.

ఎండ గాసెడు ధారుణీ మండలమున
కలికమునకైన పగవాఁడు గానరాని
చక్రవర్తి కిఁ దనయుండె శత్రువయ్యె
విధి విరోధింప జరగని వింత గలదె?

ఏడేడుల్ జెలసాలలో నవసి రాజీ లోకముం బాసి, పూ
బోడిం బ్రేయసిఁ జూడఁబోయె దివికిన్ ముంటాజి గోరీ కడన్
జోడింపంబడె షాజహాను తనువున్ బ్రస్ఫుక్కెన్ మొగల్ పీఠ మి
ట్లేడుల్ పైకొనుచున్న టాజి నిలిచెన్ స్మృత్యంకమై నేఁటికిన్.

ఇరువురు నొక్కచోట శయనించిరి తాజమహాలు నీడలం
దిరువురు విస్మరించి రితరేతర పూర్వకథానకంబు ల
య్యిరువురు కీర్తి మూర్తులు మహీవలయంబును హెచ్చరించుచు
న్మఱువక వారి నిశ్చల సమాధుల మీఁద నమాజు జేసెడిన్.

రాణివిడచిపోయె రాజు నొంటరిఁజేసి
రాజు విడచిపోయె రాజ్య రమను
రాజ్యరమయు విడిచె రాజులఁ బెక్కండ్ర
తాజి విడువలేదు రాజసంబు.

# డా॥ దాశరథి రంగాచార్య రచనలు
## పన్నెండు సంపుటాల్లో

**చదవండి!** **చదివించండి!!**

| | | రూ. |
|---|---|---|
| 1వ సంపుటం: | చిల్లర దేవుళ్ళు (నవల) | 50 |
| 2వ సంపుటం: | మోదుగుపూలు, మానవత, శరతల్పం, దేహదాసు ఉత్తరాలు | 120 |
| 3వ సంపుటం: | జనపదం | 100 |
| 4వ సంపుటం: | మాయజలతారు, రానున్నది ఏది నిజం, పావని, నల్లనాగు (నవలలు) | 150 |
| 5వ సంపుటం: | జీవనయానం | 175 |
| 6వ సంపుటం: | అనువాద నవలలు (దేవుని పేరిట, ఉమ్రావ్ జాన్ అదా) | 125 |
| 7వ సంపుటం: | అనువాద కథలు | 80 |
| 8వ సంపుటం: | అక్షర మందాకిని | 200 |
| 9వ సంపుటం: | రణభేరి, రణరంగం (సమర సాహిత్య సంకలనాలు) | 140 |
| 10వ సంపుటం: | కవితా కాదంబిని (మానస కవిత, జనరంగం, ఉర్దూ మదిర, భారత సూక్తము) | 80 |
| 11వ సంపుటం: | (శబ్దశ్వాస) వ్యాసాలు-వచనాలు | 125 |
| 12వ సంపుటం: | అమృతం గమయ (నవల) | 160 |

ప్రతులకు:

**విశాలాంధ్ర బుక్ హౌస్‌లు** & ప్రముఖ పుస్తక విక్రేతలు.

# కాందిశీకుడు

# అంకితము

పైదలి మిన్నయుం గడువు పండిన చల్లని తల్లి, దొడ్డ ము
త్తైదువ, రామిరెడ్డ్యలఘుదాత్త సతీమణి, కీర్తిశేషురా
లాదరణీయ మంజుల గుణాలయ! సాధ్వి! సుదర్శనాంబ, స
మ్మోద మెలర్ప నాదు కృతి పుష్ప వనంబు నలంకరించుతన్!

వినుతింపందగు నీ మనోహరుఁడు గంభీర స్వభావుండు, నీ
కనుల న్నిత్య నివాస ముండిన శుభాకారుండు, నీపేర నీ
తెనుఁగుం గబ్బము వ్రాయఁబంచె ననురక్తిన్ దాల్పు మమ్మా! సుద
ర్శనదేవీ! ఘనదేవభూముల మహేంద్రజ్యోతి ముట్టింపఁగన్.

పొలిచెన్ గ్రమ్మర సింహ పత్తనమునన్ ముత్యాల పందిళ్ళు క్రొం
దెలుఁగుం గైతకు నీ మనోహరుని దాతృత్వ ప్రభావంబునన్
నెలవేర్పడ్డది నా కవిత్వమునకు న్మీ వంగడంబందు, ధీ
గల తల్లీ! నినుఁ గూడి నేర్వఁగల దింకం బ్రోన్నతాకూతముల్.

సంతానంబుల నీడలన్ విరుల సెజ్జల్ నీకుఁ గల్పించుచున్
బంతుల్ దీరి నిలింప కన్యకలు నీ పాదంబు లొత్తన్ సతం
బంతుం బంతును లేని సౌఖ్యముల నైక్యంబందు నీ వెట్లుగా
సంతోషింతువొ! తల్లి! మత్కృతి భుజిష్యా సాహచర్యంబులన్.

పూజాభాజనమైన తిక్కవరపుం బుణ్యాన్వయాయంబునన్
దేజోరేఖలు దిద్దినా వలఘు పాతివ్రత్య ధర్మంబులన్
సౌజన్యంబున, నో సుదర్శన మహాసాధ్వీ శిరోరత్నమా!
గాజున్మెట్టియగల్గు నీ స్మృతి యలంకారంబు నీ కీర్తికిన్.

భౌతికమైన యీ తనువు వాసి, యనంత యశశ్శరీరవై
యాతనలేని స్వర్గవిషయంబునఁ గాపురముండియున్ దయా
శీతల దృష్టి నాదు కృతిఁ జేకొన నాథునిలోన నుండి కెం
జేతులు సాఁచు నిన్ను నుతిసేయుదు నమ్మ సుదర్శనాంబికా!

చల్లని చూపులం బడుచు సంపద నిత్యము నృత్యమాడు నీ
యిల్లు సమస్త భోగములకెల్ల గదా? త్రిదశాలయంబు నె
ట్లొల్లితి వమ్మ?నీకు నయి యుమ్మలికింపని వేళలేదు నీ
వల్లభుఁడున్ సుతాసుతులు బాంధవులుం బరిచార మాప్తులున్!

ప్రతిబింబించెడి నీ స్వరూపము దివారాత్రంబులు న్నేటికిన్
బతి నేత్రంబులఁ గర్ణవీథులఁ బ్రతిధ్వానించు నాలాపముల్
మతి లోకోత్తరులైన మీ మధుర దాంపత్యంబు వర్ణించి, మా
నితమయ్యెం గవికోటి, రెడ్డిదొరసానీ, నీకుఁ గైవారముల్.

చెరయం దున్నది చిన్నకూతురు, కళాస్వీకార దీక్షానిరం
తరుఁడై పుత్రుఁ డమేరికాకు జనియున్నాఁ డమ్మ! నీ పెద్దకూ
తురుఁ దక్కుంగల బిడ్డలుం గొలువ నీ దుఃఖంబునన్ జీవితే
శ్వరుఁ దున్నాఁ డెటు కాలు నిల్పినది దేవస్వామి లోకంబునన్?

అరవిందుం బరిపూర్ణ మానసమునన్ ధ్యానించి, యేత న్మునీ
శ్వర సందర్శన లబ్ధిచే సకల తృష్ణావార్ధు లింకించి, త
చ్ఛరణ స్పర్శఁ బునీతవై, స్వకుల కాసారంబు శోభిల్లగా
అరవింద ప్రభ నుల్లసిల్లితివి, ధన్యా! గేహినీ రత్నమా?

రామకృష్ణుని కృపా రమణీయ దృక్కుల
    సంచార మొనరించు చలువదనము
రమణ మహర్షుల కమనీయ వాక్కుల
    కాపురం బొనరించు కమ్మఁదనము
ప్రథిత పోతన భాగవత కథా రచనలో
    చింది చిల్కిత చిదానంద బలము
జీవితేశుని సమంచిత చరిత్రమునందు
    గర్భితంబై యున్న కరుణ రసము

అలవరించుకొంచు నాదర్శ గృహిణివై
చల్లినావు ప్రేమ సౌరభంబు,
నీవు నిల్పి చన్న నిత్య నూతన కీర్తి
దసిలిపోదు శ్రీ సుదర్శనమ్మ!

ఎలబ్రాయాన ధరాహితార్థమయి ము న్నేసాధ్వి సంతాన మీ
తెలుగుం దేశములోఁ గఠోరమగు బందీగేహముం జేరి, ని
శ్చల కీర్తిం గడియించె? సద్గుణ గరిష్ఠా! సుస్థిరత్యాగ శ
క్తులు నీ స్తన్యములో రహించు నను కొందున్, రెడ్డి రాజ్ఞీమణీ.

కలహ జ్వాలలఁ గ్రాగు పేదలకు భిక్షా దానమున్ జేయుచున్
జెలిమి న్నీ పతి రెండు పక్షములపైఁ జిల్కెన్ సమానత్వమున్
గలఁతన్ జెందక, యావదాంధ్ర మెలమిన్ బ్రశంసింప, నెల్లూరిలో
పొలఁతీ: యీ శుభవర్తమానము నిలింపుల్ మెచ్చఁ జాటింపుమా!

ఎలమి న్నీపతి పంచభక్ష్యములతో నేటేట దన్పున్ దరి
ద్రుల నీపేర నుగాది పుణ్యదినమందున్, వస్త్రదానంబులన్
సలుపు న్నేటికిఁ, దృప్తజిహ్వలు సహస్రంబుల్ నినున్, నీ కుమా
ర్తెల, నీ పుత్రుల, నీ మనోహరునిఁ గీర్తించున్ సమం చద్గతిన్.

దంపతుల కిరువురకు నను
కంపాగుణ మొక్క లీలఁ గలుగదు ధర, పు
ణ్యంపుం దంపతులకు మీ
కింపారుట ప్రజల సుకృతమే హేతు వగున్.

నిరతంబున్ నిరుపేదలం దలఁచి కన్నీరించుచున్ సత్కళా
దరణవ్యగ్ర మనస్కతం దనరు నాత్మస్వామికి న్నీడగా
ధరణి న్నిల్వక దాటిపోయితి మహేంద్రక్షోణికి, న్నీ హృదయాం
తరమందున్న రహస్యమున్ దెలియ సాధ్యంబౌనె మాబోంట్లకున్?

నీ చరితంబు సత్కవుల నిర్మలవాణికి గూర్చె వర్ణనా
ధీ చతురత్వముం, గులసతీమణికోటికి గౌరవంబు, నీ
పూచిన కీర్తిచేఁ దెలుగుఁ పుణ్యపురంధ్రి సముజ్జ్వలించియున్
దాచికొనెన్ భవత్తనులతం గబళించి కృతఘ్ను చిత్తయై.

నీ నిజనాయకుండు కరుణించిన సత్కవికోటిలోపలన్
నే నొకరుండ, నాదు కృతి నీదు గళంబు నలంకరించి, స
న్మానిత మైనచో దివిజనాథుని సంస్కృత సత్కవీశ్వరుల్
బూని ప్రశంస సేయుదురు పూత మెఱుంగు తెలుంగుఁ బోడుముల్.

మగని మనో విశుద్ధమణి మంటపసీమల నచ్చుపడ్డ నీ
యగణిత సుస్వరూపమున కచ్చట నిచ్చట పూజసేయఁ గ్రొ
న్నగవులతో నెదుర్కొనెడు నాకృతి, నీ పతి మేలి మన్ననన్
మిగిలిన పూజ్యవర్తన సుమీ! ప్రమదంబున నాదరింపుమీ!

అలఘు పట్టాభి రామాభిధానుని మేలి
బంగారు కడుపునఁ బ్రభవ మంది,
రామిరెడ్డి గుణాభిరాముని ప్రణయంపు
దొరసాని యగుచుఁ గాపురము చేసి,
కొడుకులు గూతులుం దొడవులుగా దొడ్డ
మాతృతా విభవ విఖ్యాతి నలరి
ఘనతరంబగు శీలమున సింహపురిరెడ్డి
ననబోండ్లలో ఘరానా వహించి

తనివిఁ జెందిన భృత్య బాంధవ సహస్ర
భావసీమల నిత్యనివాస మున్న
శ్రీ సుదర్శనదేవి మంజీర రవళి
సతము నినదించుగాత మత్కృతి ముఖమున!

సరవిం బెండిలియాడె రెండవ తనూజన్ నీదు తమ్ముండు, మం
తిరి గోపాల మనీషి, నే డతఁడు జాతీ యోద్యమావేళ బం
ధురుఁడై బంధితుఁ డైనవాఁడు, చెరయందున్ భర్తతో భార్యయున్
జెరకుంబోయె, సతీత్వ గౌరవ శుభ శ్రీలం బ్రతిష్ఠించుచున్.

నీవున్ ఖద్దరు దీక్షతో మెలఁగి, గాంధీ శాంతి సన్న్యాసి యా
జ్ఞావర్తిం బ్రియు నంపవో చెఱ కనూనంబైన హర్షంబునన్!
నీ వైరాగ్యముఁ ద్యాగముం బ్రబలమై నీ సంతతిం జెందె, నీ
కీ వృత్తాంతము కర్ణపేయమగుగాదే వీరపుణ్యాంగనా?

గొనముల్ పొంపిరి వోవు నీ వలపు
టుగ్గుబాలతో బొల్చి నీ
యనుగుం గూతులునుం గుమారకులు
విద్యాబుద్ధుల న్నేర్చి తం
డ్రిని మెప్పించిరి, వంశముం దనివిజెందెన్
దల్లి! నీవంటి సా
ధ్వని సేవించి మదీయ కావ్యము
శుభాప్తిం దేలి వర్ధిల్లుతన్

నియతిమెయి జరుగు తిక్కన
జయంతి సందర్భమందు సత్కవులకు నీ
ప్రియుఁ డొసఁగు నూరునారులు
స్వయముగ నేటేటఁ గూర్మి జనకుని పేరన్.

నివసింపదమ్మ! నీ ధవుని మానసమందు
విశ్వనాశక కులద్వేష లవము
విహరింపదమ్మ! నీ గృహమేధి కడకంట
నిందార్హ మగు గర్వనీరదంబు
ప్రభవింపదమ్మ నీ ప్రాణేశ్వరుని నోట
వెగటైన యొక చిన్ని వేడిమాట
యెడబాయదమ్మ నీ హృదయేశ్వరుని జిహ్వ
స్తవనీయమగు సత్యసౌరభంబు

సాగ దెన్నఁడు జీవితేశ్వరుని పదము
కలుషితములైన వక్రమార్గములయందు
ప్రేమితంబైన నీదు పవిత్రమూర్తి
మాసిపోలేదు తల్లి నీ మగని యెడద.

గురుదేవుండని గాంధిచే నుతులు మ్రొక్కుల్ గాంచి విశ్వంభరా
భరితోద్గాఢ యశస్సుఁ గాంచిన కళా పాథోధి, ఠాగోరు న
క్కఱదీరం భజియించి నీ కొమరితల్ గారాబుఁ బుత్రుల్ సహో
దరుఁడున్ లీల గడించినారలు ప్రసిద్ధంబైన విజ్ఞానమున్.

శాంతినికేతనంబున బ్రశాంతమరుత్తులు వీచుచోట, భా
స్వంత సమానతేజుఁ డల వంగకవీంద్రుడు విశ్వభారతీ
కాంతకు గీతికాంజలిని కంఠమునన్ గయి సేయువేళ, నీ
సంతతి యభ్యసించె కవి సన్నిధి దేశహితైక దీక్షలన్.

శ్యామలదేవి నీ వలపు చక్కని పెద్ద తనూజ, భూరి వి
ద్యామహనీయయై యనుఁగుఁ దండ్రి మనస్సు హరించి, స్వీయ వం
శామల కీర్తికిన్ దళుకు లద్దినదమ్మ సుదర్శనాంబికా!
నోముల నోచినమ్మల తనూభవ లజ్జలుగా జనింతురే?

ఏపారు ముక్కుపచ్చల
పూపవయస్సు ననఁ దెల్గుఁ బువుబోడులలో
దీపమయి తాల్చె నతి వి
ద్యా పుష్పిత సుప్రతిష్ఠ యం. యే., బిరుదున్,

అమెరికాఖండ దివ్య సభాంతరముల
బత్రిక లలంకరింప నుపన్యసించె
ప్రథమ పుత్రుండు పట్టాభిరామిరెడ్డి
మొన్న మొన్నన, సుతుల యభ్యుదయ గాథ
నీ శ్రవోలంకృతంబుగా నెగడుగాదె?

ఇంతులకు నెల్ల మేలిమి
బంతి యగుచు విభుని మెప్పువడసిన లక్ష్మీ
కాంతమ్మ త్యాగమునకున్
సంతోషించెదరు నేఁడు జాతి ప్రముఖుల్.

అనసూయ కుద్దియగు నీ
యనసూయాంబిక సముజ్జ్వలాదర్శ గుణో
ద్ధన, యనుఁగు దండ్రి కన్నుల
యనురాగము జూరలాడు ననవరతంబున్.

శ్రీమతి శకుంతలాంబ, సు
ధామంజులవాఙ్న ధాన! ధాతృత్వగుణ
శ్రీమహిత, సేమ మిచ్చుట,
నీ మానసమూర్తి విభుఁడు నెగడు న్సుఖియై.

శివకుమారరెడ్డి చిన్ని నీ కడగొట్టు
ముద్దుపుత్రుఁ డెల్ల విద్దియలను
గడనసేయుచుండె, ఘనతరంబైన నీ
ప్రేమవృష్టి, విస్తరింపు మమ్మ!

పరహితమతి గోపాలయ
చెరసాలకు నగ్గమగుచు జీవిత మెల్లన్
గఱకుల, బడియెడి, నీ సో
దరులు న్నిను బోలె, పుణ్యతములు పురంధ్రీ!

పసితనమునఁ దన మెయిఁగల
పసిండి నగ లెల్ల దేశభక్తుల కిడి వం
గసమున కింపొనరించిన
ప్రసిద్ధ కథ నీ మనస్సుఁ బండించెఁ గాదా?

# భూమిక

రసజ్ఞులగుపఠితలకు

ఇందలి కథ కేవలము కల్పితము. ఆంధ్రుఁడగు నొంక బర్మా కాందిశీకుఁడు ప్రాణభీతిచేఁ బరువులిడి భయంకర గిరి గహ్వర నదీనదములను నుత్తరించి కొండొక రేయి నొక కీ కారణ్యమును బ్రవేశించి, చిక్కుపడి కష్టములను దలపోసికొనుచు క్రూరసత్వముల నానావిధ భీషణ ఘోషణంబుల కులుకుచు నిట్టట్టు నడయాడుచుండ, మానవ కపాల మొకటి వాని పాదములకు దగులగా, నులికిపడి కొంతవడికి నిబ్బరించి, దానివంక నారయుచు మరణ స్తవము చేయుచుండ, నప్పునుక పకపక నవ్వి కుశల ప్రశ్నము చేయును. పాంథుఁడా వైచిత్ర్యమున కద్భుతపడి దానితో ముచ్చటించును. అక్కపాల పాంథులకు జరిగిన వాదోపవాదములే యిందలి కథావస్తువు.

నిరపరాధులగు మానవులను నిష్కారణముగా నాహుతిఁ గొనుచున్న నేఁటి ప్రపంచ యుద్ధభీషణ కాలమున శాంత్యహింసల యౌత్కృష్ట్యములను స్థిరీకరించుటయే నా యాశయము.

"కేవల కల్పనాకథలు కృత్రిమ రత్నములు" అని భట్టు మూర్తి సిద్ధాంతము; కాని, కాలపరిణామము ననుసరించి కవి నావేశించిన సత్యమును వ్యక్తీకరించుట కతడెన్నియో పథకములను సృష్టించుకొనును; అవి హృదయంగమములై రసోత్పత్తిని గల్గింపఁజాలినచో, కల్పితాకల్పిత కథావివక్షకు తావులేదని నా యభిప్రాయము. ఈ చర్చ రసజ్ఞులకు వదలి ప్రకృతమునకు వత్తును.

నేనీ గ్రంథమును నెల్లూరు వాస్తవ్యులును, రసికోత్తంసులు నగు శ్రీయుతులు తిక్కవరపు రామిరెడ్డిగారి యర్ధాంగ లక్ష్మియును, పతివ్రతా తిలకమును, కీర్తిశేషురాలు నగు శ్రీ సుదర్శనాంబగారి పవిత్రాత్మ కంకితము చేయుచున్నాను.

నాయం దవ్యాజమయిన యనురాగమును వహించి, నన్ను పలు మరు నాహ్వానించి సత్కరించి, యీ కృతి రచనకు నన్ను బ్రోత్సహించిన శ్రీ రెడ్డిగారి కోమలహృదయము, వారి నిరాడంబర చరిత్ర, వారి విశ్వ మానవ సమత్వదృష్టి, వారి విమర్శనా నైపుణ్యము, నా హృదయము నెంతయు నాకర్షించినవి. తిక్కనజయంతి సందర్భమున వారి నలంకరించిన పద్యముల నిందు బొందుపరచుట యప్రస్తుతము కాదనుకొందును.

కువకువలాడు క్రొందెలుఁగు కోకిల కామనియైన యి మ్మహో
త్సవ సమయంబునన్ జనయితన్ దనియింపఁగ నూరునార్లతో
కవుల బహూకరించు గుణగణ్యుఁ డుదారగుణైకశోభి, తి
క్కవరపు రామిరెడ్డి కవుగాత మనామయ సౌఖ్య సంపదల్!

కలతన్ జెందక రెడ్డిభూపతుల ఖడ్గచ్ఛాయలన్ దెల్గు సీ
మలు శోభిల్లెడు నాఁటి సత్కవుల సన్మానోత్సవానంద రే
ఖలు రేకెత్తెడిఁ గ్రమ్మరన్, రసికలోకశ్రేష్ఠ! మీబోటి దా
తల చేయూతల నుద్భవిల్లెదరు గాదా నన్నయల్ దిక్కనల్!

మరియు, నిక్కావ్య రచనా సందర్భమున శ్రీ రెడ్డిగారు నా కొసంగిన సలహాలు అమూల్యములై నా కెంతయు నుపకరించినవి; అందులకు వారికి నే నెంతయు కృతజ్ఞుఁడను.

భాషాభిమానము సన్నగిల్లిన యిక్కాలమున నిస్పృహాయులై చింతిల్లు కవుల కాశాజనకముగా శ్రీ రెడ్డిగా రేటేట తిక్కనజయంతి మహోమహముల నత్యుత్సాహముతో నెఱపుచు తండ్రిగారి పేర నూరార్లొక తెలుగు కవికి సమర్పించుచు, విశాలకీర్తి నార్జించుచున్నారనుట ప్రశంసాపాత్రము. ఈ గ్రంథము భృత్యబాంధవ కామధేనువై, సకల సద్గుణ గణములచే విరాజిల్లి చన్న శ్రీ సుదర్శనాంబ గారి కంకితము చేయబడుటచేత, నే నుదార గుణ సనాథులగు రెడ్డిరాజులతో శాశ్వత బంధుత్వము నెఱపిన వాఁడ నైతిని.

శ్రీ రామిరెడ్డిగారు మత్కృతి స్వీకృతికి ప్రతిఫలముగా నాకు సముచిత భూదానము సలిపి, ఆదరించు నా కవితావేశమునకు నవనవోత్తేజమును కూర్చిరని చెప్పుకొనుట కెంతయు గర్వించుచున్నాను. వారికి నా హృదయ పూర్వక నమస్కార సహస్రములు. భగవంతుఁడు శ్రీ రెడ్డిగారికిని, వారి సంతానమునకు దీర్ఘాయురారోగ్యములను ప్రసాదించుగాక!

నెల్లూరు రెడ్డి వర్యుల గూర్చి నేను ఒకప్పుడు వ్రాసిన పద్యముల నిట నుద్ధరించుట అప్రస్తుతము కానేరదు.

మునుపు పలె నాటి బ్రహ్మనాయని గృహాన
దళములెత్తిన యస్పృశ్యతా నివార
ణోద్యమ ప్రరోహము పూయుచున్న దిపుడు
రెడ్డిరాజుల నెల్లూరి గడ్డమీద!

సిరులు గల్గియు గర్వదూషితులు గారు,
దేశ దారిద్ర్యవారణ దివ్యదీక్షఁ
బరిపింతురు రెడ్డి భూపాలవరులు,
కరుణగలవారు మధుర విగ్రహులు వారు.

నెల్లూరు
5 ఏప్రిల్ 1943
కృతి సమర్పణ పుణ్యదినము

–జీ. జాషువ

# కాందిశీకుఁడు

తెక్కలతో నభంబున జరించుచు, దిక్కుల నిండ నిప్పులన్
గ్రక్కుచునున్న నేఁటి రణమృత్యువు సేయు దురాగతంబులన్
బిక్కబలంబు సూపి, ధృతి వీడిన కొండొక పౌరుఁ డొంటిమై
జిక్కువడెన్ మహాగహనసీమల రబ్బరు పండు కొండలన్.

భయవిహ్వల చిత్తుఁడు మన
ప్రయాణికుం డొక్క నీప దాపమునకున్
మెయి జేర్చి మూర్ఛ మునిఁగెన్;
వయ సుడిగిన ప్రొద్దు నపరవనధి మునింగెన్.

కాందిశీకుఁడు వనసింహ గర్జనములఁ
దెలివి దళుకొత్త పెనుమూర్ఛఁ దేరి లేచె,
నంధకారంబు దిక్కుల నావరించి
యదిమి భూనభంబుల ముద్దులాడుచుండె

బొక్కిన పదములఁ, జెమ్మట
గ్రక్కు శరీరంబుతోడ, కాఱుటడవిలో
దిక్కరి కన్నుల నీరము
గ్రుక్కుకొనుచు గడపసాగె ఘోరనిశీథిన్.

వనసత్వముల బంచ బంగాళ మొనరించు
సింహమ్ములకు నమస్కృతు లొనర్చి,
జడల దయ్యముల కైవడి గాలిఁ దూగాడు
వృక్షరాజికిఁ జేతులెత్తి మ్రొక్కి
యూర కూరకన గ్రుడ్లురిమి నిప్పులు గ్రక్కు
గ్రుడ్లగూబల కేటికోళ్ళు నెరపి,
కదలు దివ్వెలబోలు కనులఁ గొండలు డిగ్గు
మువ్వన్నె మెకములఁ బూజఁజేసి,

అడవి సత్తికిఁ బలుమరు నంజలించి,
యేడుకొండల దేవుని నెద భజించి,
ఆపదలలోన భక్తి రెండంత లగుట
వాస్తవముజేసె, ధృతిజారి బాటసారి

వాఁ డెక్కి దిగని కొండయు,
వాఁడీదని యేరు, తినని వన్యఫలంబుల్,
వాఁడు భజింపని దేవుఁడు
లేఁ, డంతటి దీనమూర్తి లేఁడు ధరిత్రిన్.

అతడాసాముగమించి యుత్తరముగా
యానంబు సాగించి, భా
రతమున్ జొచ్చి యఖండ జాహ్నవితట
ప్రాంతోరు కాంతార సం
తతులన్ దాటి, మహానదిన్ గడచి, యాం
ధ్రక్షోణిఁ బ్రాపించి, శో
భితజన్మస్థల పుణ్యవాయువులు సే
వించెన్ గత శ్రాంతుఁడై

పర్వతములు నదులు ప్రతిపదార్థంబును
స్వాగతం బొనర్చి పల్కరించి
ఆదరించినట్టులై యింపు గావించె;
కన్నతల్లిగాదె కన్నభూమి.

నల్లమలకొండలం దొకనాఁటి రాత్రి
ప్రొద్దుగ్రుంకిన కతమునఁ బ్రొద్దుబుచ్చె,
కాందిశీకున కత్యుగ్ర కాననములు
దోస్తికతమునఁ దన యింటి తోఁటలయ్యె.

ఆకటిసొద ముమ్మరమై
చీకాకయియున్న యతని చిత్తమున క్షుధా
వ్యాకులిత సర్వమర్త్యా
నీకము గన్పట్టె నెదుట నిల్చిన కరణిన్.

"చెలువుల్ జిమ్మెడు పాలటూలపయి ముచ్చెల్ కుచ్చు లల్లాడ ని
చ్చలు క్రీడించెడు నాకు గర్కశ శిలాసంతాన కాంతార భూ
ములలో, నన్వయమయ్యె నిప్పు డనయంబున్ గట్టియల్ గొట్టు పే
దల పాదాల స్రవించు రక్తగత బాధా దీర్ఘసందేశముల్."

"ఆడంగుల్ కలవారి తొయ్యప లసూర్యంశ్యలై, హాయిగా
మాడీలం బరదాలలో మెరయు శంపావల్లులై యొప్ప నా
నాడుం గొండల కోనలన్ గృషిక కాంతల్ మూపులం బాప ల
ల్లాడం గష్టముచేయు దృశ్యములు నా యాత్మం బ్రపీడించెడిన్."

అని తలంచుచుండ, మానిసి
పునుక యొకటి వాని పాదములకుఁ దగులఁగాఁ
గనుగొని చిత్తము ఝల్లన,
వెనుకకొదిగి నిలిచె నారవిచ్చిన కనులన్.

"వసుధ ననుఁ బోలు నొక మందభాగ్యుఁ డెపుడొ
తనువు చాలించి యుండుఁ గాంతారసీమ,
యుదిత భీషణ విపలబ్ధు లుత్తరించి,
దైవ సన్నిధిఁ జెన్నారు ధన్యుఁ డితఁడు.

ఉభయ లోకాల యనుభూతి నుల్లసిల్లి
శాశ్వత సమాధి నున్న నిశ్చలుఁ డితండు,
ఐహిక విలాస సంతత వ్యగ్రమయిన
బ్రతుకు సాగించు నాశోపహతుఁడ నేను.

చలనములేని యీతని ప్రశాంతిని భంగముసేయ నేర్చునే
ప్రళయ సహస్రముల్? యుగపరంపర మారుపు సేయుచున్న భూ
తల నటనా కథాంక సముదాయము లెన్ని నటించి పోయెనో
మెలకువలేని యీ పునుక మీదుగఁ గాలసముద్ర కుక్షికిన్!"

అని పలుకు కాందిశీకుని
తనువు పులకరింప, గుండెఁ దడయెత్తఁగ, గా
నన మెల్ల మారుమ్రోయఁగ,
నను నిట్లు కపాల మట్టహాసోత్కటమై

"విరమింపవోయి! పాంథా,
మరణ స్తవ మింక, దీన మానవకోటిన్
మురిపించు మాట లివి దు
ర్భరము లనాధార రిక్త వాదాంశంబుల్."

అచ్చెరువు పడుచు పాంథుఁడు,
బిచ్చెన బొమ్మట్లు కొంతవడి నిలిచి "యహో!
పుచ్చెగదా! భాషించుట
యచ్చెరు!" వని గుండె యాని యానక లోనన్.

దయ్యమనుచు గుండె దడయెత్త మృదువైన
పల్కుతీరు చూచి భయము దక్కి,
నమ్మి నమ్మలేక, నలుదెసల్ సూచుచు,
"బాటసారి మారు పలికె నిట్లు.

"నను దౌర్భాగ్యుని గాసిపెట్ట వెనువెంటన్ బడ్డ కర్మంబవో!
వనభూమిన్ జరియించు రక్కసివొ! నీ వాసస్థలం బెద్ది? చ
చ్చిన నీవే గతి పల్క నేర్చితివొ! యీ చిత్రంబు వ్రాక్రుచ్చి నా
యనుమానంబు శమింపజేయుము మహాత్మా; దేహ మల్లాడెడిన్.

అనిన, పకపక నవ్వి యప్పునుక పలుకు;
"కర్మమునుగాను. చిలిపి రక్కసినిగాను,
జగతి నినుఁ బోలి యొకనాఁడు జన్మమెత్తి
క్షోణివాసిన బౌద్ధభిక్షువును నేను.

భయద మానవ భ్రష్టకపాలములను
నా హయామున జూచియున్నాఁడ నేను;
నా కపాలాస్థి, అటువలె నీకు దోచు,
సృష్టి పరిణామమున కింత చింతయేల?

అనుమానించెదవేల? ర మ్మిటు వయస్యా! రేపు నన్నుం బలెన్
దనువుం బాసి స్మశాన భూముల ననంత ప్రేత భూతాళితో
మనవో! చూడవొ! రుండపంక్తులు భయోన్మగ్నాంత రంగుండవై
వనభూమిన్ జరియించు నీ చరితమున్ వ్రాక్రుచ్చు మాద్యంతమున్,

దుమ్మైపోయె సుఖానుకూల్యమగు విద్యుద్దేహ మేనాఁడొ! యీ
యెమ్ముల్ నిల్చె, నెడారి గాడ్పులయి పోయెన్ బ్రాణముల్, సర్వశూ
న్యమ్మున్ బ్రేక్షణ భీషణంబగు స్మశానక్షోణి వేదాంతమున్
నమ్మింపంగల సాధనంబనయి యున్నా నీ కపాలాస్థినై.

జీవితులైన బందుగులు చిందిన బాష్ప నదీనదాలలో
ప్లావితమైన మాదగు కపాల పరంపర తారహారమై
భూ వనితామతల్లి ఋణమున్ దుదముట్టఁగఁ దీర్చి, జీర్ణమై
పోవు, యుగాంతరానఁ గృతపుణ్యుల బంగరు పంటచేలకున్.

అది, మొన్న మొన్న దేహం బూడ్చి విశ్వంబు
వాసి వచ్చిన పిల్లవాని శవము,
అది, రాజ్యకాంక్ష నాహవభూమిలోనఁ గూ
లిన రాచవాని కళేబరంబు,
అది, మనుష్యులఁ జూచి బెదరి యవ్వల బడ్డ
ఆచారవంతుని యస్థిపేటి,
అది, బిట్టు టాకఁటి సొదకు నగ్గంబైన
కడు పేదరాలి కంకాళయష్టి,

అది మహోర్తుల ప్రబల దాహములు దీర్పఁ
గనులు దడిసిన యార్ద్రచిత్తుని సమాధి;
మృత్యువశమైన మా తనూమృత్తికలను
వాయు ధూర్తుఁడు తూర్పారఁ బట్టఁ దొడఁగె.

పరలోక రత్న కవాట దర్శనలబ్ధి
కలుగలే దింక మా కన్నుఁగవకు,
జగము లాశించు నీశ్వర కంఠ నినదంబు
వినుపింప దింక మా వీనుగవకు,
మహితనందన గంధవహ కిశోరశ్రేణి
తాకలే దింక మా తనులతలకు,
అనిమిషుల్ భక్షించు నమృత భోజనతుష్టి
చెందలే దింక మా జిహ్వికలకు,

అబ్దశతకచయము లంతరించెను గాని,
అమరలోకవాస మమరలేదు,
అమరునట్టివేళ యరుదెంచునో ముందు
కలుగదేమొ మాకు క్షపణకులకు.

మతము నిషా యంగంబున
జితించియున్నట్టి కాందిశీకుడు, క్రోధో
ద్ధతుఁడై, యిట్లను, బునుకం
బ్రతికినవాఁడన్న పిచ్చిభ్రమ కగ్గంబై

"వేదంబుల్ తలక్రిందుగా సలిపి, బైబిల్ ప్రేమ సిద్ధాంతమున్
బూదిం బుంపి, ఖురాను సత్యమును వమ్మున్ జేసినా వక్కటా!
లేదా స్వర్గము? సృష్టికర్తయును ఖాళీ యయ్యెనా? యెందుకీ
దూదింబోలిన పల్కు? లింతటి వినీతుల్ చచ్చి సాధించితే?

పుట్టెవుగద! మరచితినొ
పుట్టెన్ జన్మించు బుద్ధి బోదంద్రయయో!
వెట్టికపాలమ! హృదయము
చుట్టు మనెడి, నీ విచిత్రసూక్తులు విన్నన్"

అని క్రోధ రుద్ధకంఠ
స్వనమున వాక్రుచ్చు బాటసారిం గని, య
ల్లన స్వర్గనరకముల నిం
పున నిట్లని నిర్వచించె! బున్క మృదూక్తిన్.

"శాంతి స్వర్గంబు, నరక మశాంతి యనుచు
నిర్వచింతురు మా బౌద్ధ నియమ రతులు
స్వర్గసృష్టికి బుద్ధుండె స్రష్టయంద్రు
సర్వమతముల సిద్ధాంత సార మిదియ.

బుద్ధదేవుని సత్కళాపుంజ మెల్ల
నీశ్వరాకారమని బౌద్ధు లెన్నుచుంద్రు
స్వర్గ నరకాలు రెండు నీ జగతి యంద
నరుడు సృష్టింపగలడని నమ్మగలను.

ఎనలేని దుఃఖవహ్నికి ధ్యాయయైనట్టి
తృష్ణ నెల్లరు సంహరించు చోటు,
నిరపాయకరములై తిరుగు ప్రాణుల మేను
కత్తుల కగ్గముగాని చోటు,
ఎల్లజాతులవార లేకోదరులయట్లు
ముద్దు ముద్దుగ పొంది పొసంగు చోటు,
వెలితిచే శుష్కించు పేదసాదల డొక్క
ముప్పూట లనువుగాఁ బూడు చోటు,

ఇంద్రియ విజేతలైన మునీంద్రకోటి
మానసము దోలి కలఁతలు లేని చోటు,
ప్రేమరసవాహినులు వెల్లివిరియు చోటు,
పరమగను, దాని కొక స్థలాంతరము లేదు.

"ఆ దివ్యలోక సృష్టియె
వేదాదులు పల్కుచుండు వివిధ గతుల, దు
ర్వాదోపవాదములచే
భేదోద్దేశములు జగతి వెలసినవి సభా!

కనుపింపరాదన్న కఱకుటాకటఁ దూలి
క్షుభితమౌన దీ భిక్షుకచయంబు,
ప్రవహింపరాదన్న స్వార్థబీజములఁ బో
షణసేయు దీర్ఘతృష్ణాఘురంబు,
సాగరాదన్న రాచరికంబు సేయు తు
చ్ఛంబైన యిచ్చ నీచతల దాడి,
మనగూడదన్న దుర్మతముల పేరటఁ
దలయెత్తు నెత్తుటి కలహ రభస,

బ్రతుకరాదన్న టక్కరి పన్ను గడలు,
సాగరాదన్న ఘన నిరుద్యోగ ధాక,
ధనము ధాన్యంబు నొకని పెత్తనము క్రింద
కట్టువడి వ్యర్థముగ తుప్పుబట్టరాదు.

నేను పుట్టి గిట్టి నేఁటికి దాదాపు
పుష్కరములు నూరు ముగిసియుండు,
ఏమతాలు వొడమె? యే పోకడలు వోయె
కట్టుబొట్టులేని కాలరథము?

సవరించినా నహింసా దివ్యతరముద్ర
క్రొవ్వాడి సింగంబు కోరమీద,
వారించినాఁడ నూరార నెత్తుటికూటి
శాక్తేయు లొనరించు శక్తిపూజ,
పర్యటించితి మంచువలచు కొండలదాక
చిరు చీమ తలకాయ చిదుకకుండ,
సంధించినాఁడ నిశ్చల సమత్వజ్యోతి
జాత్యహంకార దౌష్ట్యము శమింప,

ఆశ లుపసంహరించి సన్న్యాసి నగుచు
పట్టుకొన్నాఁడ భిక్షా కపాలపాత్ర
వెనుక నాగార్జునుండు స్థాపించినట్టి
స్థూపములమీద నాపేరుఁ జూడఁగలవు.

నాచేతన్ విరచించితిన్ మును పజంతా గహ్వర శ్రేణులన్
భూచక్రేశుని బుద్ధదేవుని మహాత్మ్యన్ జిత్రవర్ణంబులన్,
ప్రాచీనంబగు నాంధ్ర శిల్పమున కాపాదించితిన్ శాశ్వత
ప్రాచుర్యంబును, శాక్యసింహుని పద వ్యాసంగినై పొంగితిన్.

చీనా మున్నగు మిత్రభూముల జిగిర్చెన్ బౌద్ధ సిద్ధాంతముల్
నానాదేశము లాదరించినవి, మా నాగార్జు నాచార్య శి
ష్యానీకంబును, స్థాపితంబులగు సంఘారామ సంతానముల్
మీ నేలన్ గలవే? త్యజించెదరె భూమీశుల్ రణేచ్ఛారతుల్?

ఎట్టు పరిష్కరింపఁబడియెం బలనాటి రణంబు? నాయురా
ల్పెట్టిన చిచ్చు లారిచిరె? పెద్దన బ్రహ్మన లైతమాంబ మే
ల్పట్టి, పొటేటి గుబ్బములపై విహరించిన వీరభూమిలోఁ
బుట్టిన యాంధ్ర యోద్ధలకు బుద్ధుని బోధలు బుద్ధి కెక్కనే?

బ్రహ్మనాయని నట్టింటఁ బ్రభవమైన
యంటుదోష నివారణోద్యమ సమస్య,
మొగ్గ దొడగెనె మహదాంధ్ర భూతములన?
నన్వయించెనె ప్రజ కనైక్యపు టశాంతి?

మృతినందెనే నాగులేటి మిట్టలమీద
పీడాకరంబైన కోడిపోరు?
వారింతురే మీరు పచ్చి నెత్తుటిపూజ
మాచెర్ల చెన్నుని మందిరమున?
చల్లారెనే మహాసతుల నాహుతి గొన్న
సహగమనాచార దహనకీల?
మానిరే ప్రజలు సంపచ్ఛాయ లణఁగించు
నీతిమాలిన త్రాగుబోతుతనము?

ఖరుఁడు దూషణుఁ డిరువురు మరణమైనఁ
కఱకు కారమపూడి మార్గములయందు
నణగిపోయెనె పశ్యతోహరుల భీతి?
శాంతి నెలకొల్పెనే బుద్ధశాసములు?

న్యాయపథంబునన్ నడచునా భువనం? బటుగాన యాజులన్
గాయము నొవ్వ రక్త తిలకంబు ధరించునొ! ప్రాక్తనాజ్ఞతా
వాయుహతిన్ స్వధర్మమును వాసి చరించునె, ప్రేమ తత్త్వది
వ్యాయుధ శక్తి విశ్వ విజయ ప్రదమై తమమున్ హరించునే?

మీ యుగ విశేష మేమిటి?
యేయే భూపతులు రాజ్య మేలెదరు? మతా
లేయవి? నే డెల్ల ప్రజల్
హాయిగ నున్నారె? యాంధ్రి కానందంబే."

అనిన పునుక పల్కు లాలించి పాంథుండు
కినుక దక్కి కొంత తనువు దెలిపి,
బుద్ధబోధ కతన మూడిన సేగియు,
ప్రకృతి యుగచరిత్ర బలుకసాగె.

"పులుల మేకల! గావించి పోయినట్టి
వెడఁగు బుద్ధుని యనుఁగు శిష్యుఁడవు గాన
నెఱపుచున్నావు నిర్వీర్య నిగమబోధ!
మెట్టవేదాంత మిది కట్టిపెట్టవోయి.

ఎక్కడ నాయురాలికథ? యెక్కడి బ్రహ్మనమాట? మా యుగం
బెక్కడ? భూతధాత్రి ధరియించిన పుష్పవసంత వస్త్రముల్
లెక్కిడవచ్చునే? నిదురలేవని నీ తలపుట్టెమీదుగా
చక్కఁగ దాటిపోయినవి శాంతములైన సహస్ర వర్షముల్.

శిలలై, దేవతలై, క్రొ
క్కులకుం గురియై, తెలుంగు గుమ్మెటకతలై,
కలలై, నశించి రప్పటి
నలగాముఁడు, బ్రహ్మనయును, నాయకురాలున్.

పలనాటి భారతంబున
జలజాక్షుం డయిన బాలచంద్రుని పిత, దో
ర్బలశాలి బ్రహ్మనాయఁడు
కలడందురు గుత్తికొండ గహ్వరములలో.

శ్రీనాథ సుకవి భక్షించిన పలనాటి
యలనాఁటి జొన్నకూ డారగించి,
కారెమపుడి గొడ్డుగారంబు ధాటికి
తాళజాలక గింగిరాలు దిరిగి,
నాఁపబండలక్రిందఁ గాపురం బొనరించు
మండ్రగబ్బల పరామర్శ లంది
గురిగింజలంతేసి గురిజాల దోమల
గానంబునకు మేను కంపమెత్తి,

నాగులేట దాగిఁనారు బాలుఁడు బ్రహ్మ
నాది తెలుఁగు మగ లనన్య యశులు!
తలఁచుకొన్న గుండె లలనాడు నీనాఁడు?
పల్లెనాడు మురికి పల్లెనాడు.

శాక్యసింహుండు బోసిన చచ్చుమందు
కారణంబుగ ని మ్మహా కదనవేళ
నొక్క గుజ్జారి జాపనీయునకు వెఱచి,
పరుగులిడుచుంటిమోయి, కపాలమిత్ర!

ముగిసెఁ జరిత్రలో శుభ సముత్కటమైన యుగంబు, లాలపుం
బొగ లెగజిమ్ముచుం బ్రళయభూమిక దాల్చి యనంతవేదనా
యుగ మరుదెంచె నుగ్రనటనోద్ధతి, తత్పద ఘట్టనంబునన్
దెగిన యభాగ్యులన్ మిగిలితిన్, హతశేషుఁడఁ గాందిశీకుఁడన్.

గర్భవతియైన చిరకాల కలుషరాశి,
యుదకలాడిన దిప్పు డాయోధనంబు,
భజన కసరత్తుచేత దుర్బలములయిన
శాంతిదేశాల కిది పరీక్షాయుగంబు.

శాక్యసింహుని మీ యహింసా సుధోక్తు
లాలపించెడు పెను పెగోడాలముందు
సలుపుచున్నారు కదనంపు సత్తికొలుపు
లనపరాధుల రక్తగాహనము సలిపి.

అది, శివాజీవీరుఁ డహితుని కడుపులోఁ
గత్తు లాడించిన కదనభూమి,
అది, ప్రతాపుని వీరకదన సైంధవ హేష
ప్రతిశబ్ద మీనిన పర్వతంబు,
అది, త్రిలోకీ పూజ్యుఁడగు చితోడ్గడరాజు
స్తంభ మెత్తించిన శాసనంబు,
అది, తెల్గురాణి దాయల రక్తపంకంబు
తిలకంబు దిద్దిన దివ్యభూమి,

అక్కటా! భారతంబు ప్రత్యణవునందు
స్వీయ పౌరుష విశ్రాంతి చిమ్మి రేగు,
నట్టి వీరుఁడు సింహసంహననుఁ డిపుడు
దేబెరించెడి నర్ధవిధేయుఁ డగుచు!

బూచి బూచి యనుచుఁ బుత్రుల వెరపించు
పిరికితల్లి మున్ను బెంచ దెవని,
క్రోలినార లుగ్గుబాలతో లోకాల
వీరరసముఁ దల్లి నూరిపోయ.

ముత్యాల తలబ్రాలు బోయించుకొన్నారు
ఘనముగ జయపరిగ్రహణవేళ,
ముదము దైవార నెన్నుదుట దాలిచినారు
దురములో రక్తసిందూర రజము,
అందుకొన్నారు రాయలవారు స్వయముగా
నందించు తాంబూల చందనంబు,
కైసేసినారు బంగారు మువ్వలతోడ
బిరుదు టొడ్డాణంబు వీరదట్టి,

నాఁటి తెలుఁగువారి మేటి జాతీయత,
నాఁటి విజయనగర నగర భూతి,
తలఁచుకొన్న మేను పులకించి పొంగారు,
కాల మిట్టు మమ్ము గాసివెట్టె."

దిగ్గజము లిపుడు గ్రమ్మర
దిగ్గజములఁ గలసె, నచటి దేవుం డ్లయయో!
వగ్గులయి పరిభవంబున
సిగ్గిలుచున్నారు భ్రష్ట శిల్పాంగదులై.

బ్రహ్మనాయని పలనాటి రణచరిత్ర
తిరిపె మెత్తుచు నూరూర దిరుగసాగె,
కనమనీని మహోగ్రహుంకార రవళి
గుమ్మెటల కుత్తుకలయందు నుమ్మలించు.

నాడు పలుచవడ్డ నవ్యాంధ్రతేజంబు
లీలఁ బ్రజ్వరిల్ల లేదు మరల;
వెట్టిగొల్లఁ డొకఁడ వీరుల పూజించి
శివముబట్టి యిపుడు చిందులాడు.

ఏ దేశం బల బుద్ధదేవుని కృపాదృష్టిం బ్రశంసించి, త
త్పాద ద్వంద్వము నాశ్రయించి, ఘన భూత ప్రేమ శాసించెనో
యాదేశంబ మనుష్య రక్తనదులందాప్లావముం జేసె; నీ
వేదాంతంబులు బూటకంబు లనుచున్ విశ్వంబు చింతించెడిన్.

గీతాకృష్ణుఁడు గావలె
నీ తరుణమునందు, గాంధి యేమిటికి? మహా
గౌతమ బుద్ధుం డేటికి?
మా తనువల్లికలు పిరికిమందులఁ జివికెన్.

ఇది నాజూకు యుగంబు, పూర్వులకు లేవీ లాటి సౌకర్యముల్
హృదయాహ్లాదక యంత్రవాహన శతం, బీలాహిరీ గాన సం
పద, లీ బొమ్మలనేత సన్నపని మే ల్మాంధాళి వస్త్రావళుల్.
నిదురింపన్ గల వేల్పు లిప్పటి నరుల్ నిక్కంబు వాక్రుచ్చినన్.

బుద్ధునంతటి యే మహాత్మునకొ కాని
పలుక దానాఁటి యాకాశవాణి మీకు,
ఇరువదియు నాల్గు గంటలు మొరయుచుండు
వాడవాడల జెవియొగ్గువాఁడు లేడు.

శాస్త్రములలోన నెన్నడో చదివియుందు
రమరు లెక్కిన గన విమానముల కథలు,
మెలఁగు నిప్పుడు నిరతంబు తలలమీద
మిన్ను మార్మ్రోయ నినుప తుమ్మెదల కరణి.

కవుల కుపమాన సామగ్రిగా రహించి
మేఘసౌధాలు వెలిఁగించు మెరుపు లతలు
వలసినప్పుడ మా యిండ్లఁ బ్రజ్వరిల్లుఁ
బరువుతక్కువ లితర దీపములు మాకు.

సకియ మీ యుగాన సంతాన యంత్రంబు,
కామతృప్తి సేయఁ గలుగు దినుసు;
అద్యతన వధూటి విద్యావిభూషిత
తెరమరుంగు వాసి మెరయు మెరుము.

చదువు న్మా ముసలమ్మయున్ సకల శాస్త్ర శ్రేణి, యింపై ముదం
బొదవన్ జేసెడు నచ్చుపుస్తక చయంబూరూర నేపారెడిన్,
చదువుం గొందఱ కంటరానిదయి దాచంబడ్డ మీకాల సం
పద మాకిప్పుడు నింద్యమై, యతి జుగుప్సా హేతుకం బయ్యెడిన్.

వ్రతముల్ సల్పి కుమారులం గను ననర్థంబైన మీకాల దు
స్థితి లే దిప్పుడు, కూటి పేదలకు నుద్దేశించినన్ జాలు సం
తతికిన్ లోపములేదు, మేమిపుడు సంతానావరోధార్థమై
వ్రతముల్ సల్పు నవస్థచేకురె, యథార్థంబన్న ముమ్మాటికిన్

మాకలవారు త్యాగు లసమానులు, దేశహితైక దీక్ష బం
దీకృతులై తపింత్రు, శయనింతురు కర్కశభూమి శయ్యలన్:
మా కవు లాలపింతురు సమంచిత నవ్యయుగోచితంబులై
యాకటి చిచ్చు లార్చు హృదయప్రవిదారి దయాకథాంశముల్.

అనుఁగుం భర్తలతోడ దేశమునకై త్యాగంబు గావించి, బం
ధనగేహాలఁ దపించు వీరసతులున్నారీయుగంబందు; మా
తెనుఁగున్ దేశపు రెడ్డిరాజులకు జాతి ద్వేష లేశంబు లే
దనురాగోన్నతముల్ విశాలము లనన్యంబుల్ దదాకూతముల్.

అపుడున్నంతటి నిష్ఠ లే దిపుడు బ్రాహ్మణ్యంబునన్, గొంత నే
రుపుగా నున్నటు లేనటుల్ జరుపువారుం గొంద ఱున్నారు, ధ
ర్మపరుల్ సర్వకళాభిమాను లనుకంపాయత్తులుం బొల్తు రో
రుపు లేనట్టిఁడు లెప్పుడుం గలరు ధూర్తుల్ సర్వవర్ణంబులన్;

కాడవటి టెక్కమున్ దలనుగూరిచి కార్మిక కర్షకాళితో
నడుము బిగించె నీ యుగమునందొక నూతన సామ్యవాద మ
న్గడిబిడి, దాని దెబ్బకు వికావికలైనది స్వార్థ జర్మనీ
జడనిధి, నేటి మారుపు లసంఖ్యము లంచితముల్ విచిత్రముల్.

సుకవి బ్రహ్మ, దిగంతకీర్తి రుచిరాంశుశ్రేణిచే భారతాం
బకు ముత్యాల మహాళ్ళు దీర్చిన మహాప్రజ్ఞాసముద్రుండు, వం
గకవీశానుఁడు, మా యుగంబున కలంకారంబు, టాగోరు నా
మకవి ద్వద్ఋషి, కాంచె 'నోబెల'ను సన్మాన ప్రతిష్ఠాఢ్యతల్.

శాంతిస్యందన మాగబట్టుటకు శస్త్రంబుల్ విసర్జించి, రం
దంతేవాసులు గానటంచు పెను శంఖారావమున్ జేయుచున్
శాంతిజ్ఞాన దయాకదంబిత కళాసన్యాసి నూరేండ్ల వా
దంతశ్శాత్రవజేత లేచె నొకరుండాశా భ్రమాపాదియై.

వెలితిపడ్డది మాకు విశ్వసౌభ్రాత్రంబు
        మధురాతిమధుర సమత్వదృష్టి,
అరగొరంతయ్యె మాకార్థిక సౌఖ్యంబు
        నట్టింట నవ విధానంబు లుండి,
తక్కువైనది మాకు దానపరత్వంబు
        కర్ణుండు కన్నుల గదలుచుండి,
అన్వయింపదు మాకు నైకమత్య విభూతి
        తలమీద పగవాఁడు మెలఁగుచున్న

కొంత స్వేచ్ఛతోడఁ గొంత యస్వేచ్ఛతో,
కొంత కలిగియుండి కొంత లేక,
సర్వమున్న దనుచు సరిపుచ్చుకొందుము
చిత్రమైన బానిసీంద్ర మగుచు

ఆశించుచున్నార మఖిల దేశాల యు
త్తమమైన నిరత బాంధవ్యలబ్ధి,
వలతు మేనాఁడు వాక్స్వాతంత్ర్య విభవంబు,
జబ్బెరుం గని గుండె నిబ్బరంబు,
ప్రణుతించెదము మత స్వాతంత్ర్య, మాత్మ లా
భములేని సానంద భక్తిపదము
కంటగించెదము భిక్షలకు జేతులు సాచు
చేవమాలిన దాస్యజీవనంబు,

జ్ఞానవిభవ మెల్ల మానవ హింసకై
వ్యయ మొనర్చు భూమిదయితకోటి
తలలు వంప శాంతి ధర్మ దయా సత్య
కర్షకతకు సల్పగలము నతులు!

అని పలుక! నక్కపాలపు
కనుగుంటలనిండ నీరు గ్రమ్ముకొనఁగ వె
చ్చని యూర్పు బుచ్చి, నిక్కఁపు
మనుజునివలె మూల్గి యిట్లు మారు వచించెన్.

ఆకర్ణించితి నీ విచిత్రపు టుపన్యాసంబు, దుర్దాంత చిం
తా కాలుష్యము చిమ్మి రేగినది, మిత్రా! శుష్కచిత్తంబునన్
నా కంకాళమునందు మున్నెపుడొ జీర్ణంబైన జీవాణువుల్
బ్రాకం జొచ్చెఁ గదుష్ణ రక్త చలనవ్యాపార దీప్తంబులై,

గౌతముని శుభోత్కట కటాక్షములఁ దడిసి,
ఆరవిచ్చిన శాంతి వాతావరణము
కలుషితంబయ్యెనే జగత్కాండమందు?
ప్రభవ మందెనె క్రమ్మర రక్తఋతువు?

స్తవనీయంబగు బుద్ధదైవతము భిక్షాపాత్ర కన్నీటిచే
చివుకం జొచ్చెనె? బోధివృక్ష మకటా! జీర్ణించెనే? లుంబినీ
సవిధస్తూపము లూడెనే? చటుల హింసారాక్షసీ లాస్యముల్
భువనంబున్ వలపించెనే? అసహనంబున్ స్వార్థ ముప్పొంగెనే?

అన్నా! నీ వధునాతన క్షణిక సౌఖ్యాకాంక్షివై, విశ్వశాం
త్యౌన్నత్యంబు నెఱుంగఁజాలని విమూఢాత్ముండ వై నట్లుఁగా
నున్నా? వెక్కడిపోరు? యెక్కడి ప్రతాపోద్రేకముల్? కూర్చెనే
మున్నే భూపతియేని పూర్ణవిజయంబున్ గత్తులన్ గల్గలన్?

వలసినదాని కిబ్బడిగ భాగ్యము గూరిచి భోగులొౌచు, దు
ర్బలులగు దీనమానవులపై యధికారము సేయుచుండు రా
ట్కలభులు దాహశాంతికి జగత్ప్రళయంబు సృజింత్రు, వారి వీ
నులు విన వార్త సోదర మనుష్యుల ఆలుగరంగు ఘోషణల్.

ఈ విజ్ఞానము పూర్వమున్ గలుగు నోయీ, ధ్యానమాత్రంబునన్
శ్రీ వైకుంఠము సృష్టిజేసిన మహర్షి శ్రేణి జన్మింపదో!
దైవం బొక్కొక మారొసంగెడు మహత్వప్రజ్ఞ విశ్వంభరా
దేవీ తాపకరార్థమా? హృదయ మార్తింగుందు మీ గాథలన్."

అలుగుల జయ మాశింపకు
మలుగులచే నలుగు శాంతి, యఖిల జగంబున్
నలుగున్, సద్ధర్మంబే
యలుగు సుమీ! ముజ్జగ జ్జయాకాంక్షులకున్.

సృష్టిలోన నరుడు సృష్టియై జన్మించి
సృష్టి భంగపుచ్చ నిచ్చగించు,
చిరుతచీమ శిరసు చిదిమి క్రమ్మర దాని
నదుకుబెట్ట శక్యమగునె దనకు?

కాలు సేతు లున్న నాలోన విజ్ఞాన
మలరుగాని, జంతువులకు గలుగ,
దేలుబడి యొనర్తు హింసింతు ననుకొని
బేల యగుచు నరుండు విఱ్ఱవీగు.

కనుగొమ్మా! గిజగాని గూ డొక తృణాగ్రం బెట్టు లంటించి క
ట్టినదో చెట్టు చిటారు కొమ్మలకు! బాండిత్యాదు లచ్చోట ను
ప్పునకుం బోలవు; గాలివానల శతంబున్ చూచి నిర్మించు చ
క్కని కౌశల్యము దాని చంచువునకున్ గల్గున్ యథార్థంబుగన్.

ఆడుతనమును మగతన మమరియున్న
చిన్ని సాలీఁడు పిల్లల జేసికొనుచు,
కట్టుకొన్నాఁడు సన్నని పట్టుపంచె
యిముడునో లోన వేయి రాట్నముల గరిమ.

తేనియ గూర్చి మానవతతిన్ దనియించు ద్విరేఫకోటి వి
జ్ఞాన కదంబకంబు సుమి! న్యాయము దప్పక రాజ్యపాలనం
బూని రచించు నందు మహిమోన్నతిఁ గొండొక రాణియాగ; యా
తేనియ పట్టునం గల దతీత మహత్తర మంత్ర మెంతయున్.

కందువుల బాయలేక పక్షములు గప్పి
కారుచిచ్చున బెళగువ్వ గరగిపోయె,
సకల మానవ సహజ వాత్సల్య గుణము
నిండియుండెడి నలఁతి ప్రాణికిని గూడ.

కొమ్మ కొమ్మ కెగురు క్రోఁతి తొమ్మున నున్న
హరి కిశోరమున కనన్య మోహ
రజ్జు పటిమదక్క రచియించునే వేరు
పట్టుగాని, జోలెతొట్టిగాని?

పెట్టిన గ్రుడ్డు జారి పృథివిం బడి తుత్తుము రైన జూచి, యా
చెట్టున నాడు పావురము; చింతిలుచుండు టెఱింగి చేరువన్
నట్టువ ద్రొక్కుచున్ గుణగుణ ధ్వని సేయుచు నూరడించెడిన్
జట్టుపలార్చుచున్ వలపు జాయను పోతు కపోతి నేర్పునన్.

***   ***   ***

ఆచరణయోగ్యములుగాని వఖిలలోక
వృత్త మొక బెత్తసాగని క్రొత్త క్రొత్త
వింత సిద్ధాంతములు వినిపించినావు
తీర్పగదవోయి! కలదు సందేహ మొకటి.

హింసాత్మకమగు లోక మ
హింసాత్మక మగుట సాధ్యమే మిత్రమ? యీ
మాంసాశనులకు మానవ
హింసకులకు జాలిమందు లెట్లు రుచించున్?

అది గుజరాతు కోమటి దయారసదఘ్న విశాలదృష్టిలో
మెదలెడు స్వప్నలోకము సుమీ! యధునాతన నూత్న ధాత్రి కం
దదు, రుచియింప దీ ప్రజకు, దానికి యత్న మొనర్చి సాధువుల్
బదుగురు రెంటికిం జెడిరి భక్తులు రిక్తవిరక్త మార్గులై.

ఆశావార్ధి గభీరమై యుబికి బ్రహ్మాండ ప్రజానీకమున్
నాశంబుం బొనరించు దుష్టముగ మన్నా; యిప్పు డీ నీతి వి
ద్యాశీతాంశు కళాప్రసారమునకున్ దా పున్నదే? శాంతి కిం
కాశల్ లేవు, గతించిపోయితిరి, మీ రత్యంత పుణ్యాత్ములే.

ప్రేమతో ముట్టుకొన్నను వృశ్చికంబు
కుట్టి మిక్కుటముగ బాధపెట్టితీరు,
పాపమని చేరదీసిన పాపరాజు
చెనకకుండఁడు మరణ దంష్ట్రికలచేత.

ఏగతి పాదమూని చరియింత్రు మనుష్యులు చీమ జచ్చునం
చాగిన? సాగునే భువనయాత్ర? పవిత్రములయ్యు బుద్ధరా
డాగమముల్ విచిత్రము లనాచరణీయము, లెట్టి సత్కృపా
సాగరుఁ డేనియు న్నెరప జాలఁడు జాలి సమస్తవేళలన్

నేనును బుద్ధబోధ తల నిల్పినవాఁడన; క్రీస్తు ప్రేమ త
త్వాన నొకింత బుద్ధి కదపంబడి యూగిన వాఁడనే సఖా!
కాని, ప్రపంచధోరణి యఖండ భుజాబల దుష్టదౌష్ట్యము
ద్రానతమై, మహావిభవదర్పితమై నడచున్ బ్రచండతన్.

అనినన్, బుబ్బ యొకింత కాలము శిరం బట్టిట్టు లాడించి, పాం
థునితో నిట్లను గానలో మెలఁగు జంతు వ్రాత మాలింపఁగా
వినుమో పాంథ! యహింస భోగులకుఁ బృథ్వీపాలక శ్రేణికిన్
దనరున్ సాధన కందరాని యొక స్వప్న క్లిష్ట వృత్తాంతమై.

ఎలమి; నహింస నేర్చుకొన దే మును బెబ్బులికోడె సన్మునీం
ద్రుల పదసన్నిధిన్? ఋషి విధుండగు బుద్ధుని యాశ్రమంబులో
మెలఁగిన సర్పరాజ తలమీద వసించిన కప్ప లిప్పుడున్
గొలుచుఁ దటాక గర్భముల గుంపులుగూడి తదార్ద్ర చిత్తునిన్.

ఫల పవనాహార భక్షనంబునఁ జేసి
బ్రతుకదే మును మునీశ్వర చయంబు?
తృణకందళంబులు దిని పశుప్రచయంబు
దేహదార్ఢ్యంబు సాధించుకొనదె?
ఆలారగించి పారావతంబుల పిండు
కాననంబులఁ బూటఁ గడపుకొనదె?
పలుచని గాలి గర్భమునిండ బూరించి,
దృగ్శ్రోత్రవిభుఁడు నూరేండ్లు మనదె

సింహ శార్దూల క్రూరతా జీవనమున
కివ్వసుంధర మనుజుండ హేతు వగును;
నరుని నైజంబ తత్పరిసర విహార
సకల జంతూత్కరంబున సక్రమించు.

పంచభూతాత్మకంబైన ప్రకృతి సుఖము
ననుభవించెడు హక్కు మర్త్యునక కాదు,
కలదు ప్రతి చిన్ని ప్రాణభృత్తులకుఁ గూడ
బలము గలదంచు దోపిడి సలుపఁదగదు.

చితుక దహింసా జ్యోతి
ర్లతిక ధరాచక్రమెల్ల లయమైన, సమం
చిత బుద్ధ దివ్యచరణ
ద్వితయము మన్నించియున్న దిగ్దేశములన్.

ఘటికాయంత్రం బొక్కటి
ఘటియింపబడియె నీదు కాయమునందున్
బుటుకునఁ జెడిపోయినచో
కటకట! నీ మేను మృత్తికాభాండ మగున్.

పొగలకు మన్న! మీ భరత పుత్రులు దుర్బలులై రటంచు, ము
జ్జగమున కార్యధర్మములు చాటిన పుణ్యుల కన్నదమ్ములై
మిగిలిన మీరు శాశ్వతుల, మిత్రుల యుగ్ర నిశాత హేతులం
దెగని యహింస మి మ్మమృత దేహులఁ జేసి జయించు నుర్వరన్.

ఘన వివేకానందముని యమేరికసీమ
సన్నుతింపఁగ జయ స్తంభ మెత్తె,
అరుణాచలముమీద నరుణ తేజశ్శాలి
రమణర్షి శత్రుషట్కము నణంచె,
అరవిందముని నిరంతర సమాధి న్నిల్చి
లోకత్రయంబు వశీకరించె,
మూడుగాళుల దొడ్డ ముసలికోమటి సెట్టి
స్వేచ్ఛా వికుంఠంబు బేరమాడె

నాల్గుఖండములకు నవనవోజ్జ్వలములౌ
ధర్మమార్గములకు దారి సూపి,
ఘనత నాచికొన్న ఖండంబు మనదన్న!
పౌరుషంబు మనది ప్రజ్ఞ మనది!

స్థిరత దయాపరిశ్రమ ప్రసిద్ధి వహించిన భారతాంబకున్
మురిపెపు బిడ్డ లాంధ్రు, లుడివోని మహత్తర త్యాగదీక్షలోఁ
బెరిగినవార, లీభువన పీడ సహింపరు, ధర్మచింతయున్
బరహితమున్ భవమ్మనిజనంబులు క్రోలిన పాలుమీగడల్.

ఊరకపోదు బుద్ధుని మృదూ క్తిపటుత్వము, క్రీస్తు ప్రేమ వా
క్సారము, రామకృష్ణ మునిచంద్రుని తాత్త్విక సౌరభంబు, ని
స్సారము లీ కటారుల ద్విషజ్జయముల్, దుదిలేని తృష్ణకున్
గారణభూతముల్, తెరపిఁ గానని చింతలకున్ జిరాయువుల్.

ఉడుగని సత్యధర్మముల కూపిరి సల్పని యట్టివేళ లే
ర్పడియెడి నొక్క మారపుడు, భక్తి హుళక్కి, ఋజుప్రవృత్తిగా
రడి, కరుణాగుణంబు వృథరా యనిపించు, సముత్థితంబులై
చెడుగు నదల్చి రాజ్యమును సేయక తీరదు ప్రేమ మిత్రమా!

ఆనందించితి, మీ యుగోన్నతి కసాధ్యంబైన మీ యాంత్రిక
జ్ఞానాభ్యున్నతికిన్ ధనాధిపుల సాంద్రత్యాగ రాగాప్తికిన్;
దీనంబై విలపించు లోకమునకున్ విశ్రాంతిగల్పించి పెం
పూనుంగావుత! మీ పురాణ నిగమప్రోద్గాఢ ధర్మార్థముల్.

గౌతమ బైరాగి కృపా
స్ఫీతేక్షణ పంక్తి విశ్వవిశ్వానంద
ప్రాతఃకాంతుల జిమ్మెడు
గాత! శమించెడును గాత! కదన దవాగ్నుల్.

అని పలికిన పుత్త్రికుని
ట్టను బాంధుం డంజలించి, యనఘా! నీ తీ
యని బోధ తప్తమానస
మునకుం జడివానవోలి ముదము ఘటించెన్.

ఎన్నం డీ రణవహ్ని చల్లవడు, నింకెన్నండు దిగ్దేశముల్
కన్నుల్ విచ్చెడి, విశ్వలోక సమతాకల్యాణ సంపత్తు లిం
కెన్నం డబ్బెడి? నానతీయ గదవే యేదేని మార్గంబు మా
కన్నా! జ్ఞాన కపాలమిత్రమ! దయావ్యగ్రాంత రంగుండవై.

అని పాంథుఁడు పృచ్ఛించిన,
పునుక యొకింతాగి, "కల దమోఘం బగు చ
క్కని మార్గమొకటి విను" మని
వినుపింప దొడంగె మధుర విస్ఫుట పణితిన్.

ఆచారాంతరముల్, నిరంకుశ మతవ్యత్యస్తముల్, వర్ణముల్
నీచత్వోచ్చత, లంటరానితనమున్ బీజంబులై విశ్వధా
త్రీ చక్రప్రళయంబు రేచెడి, విచారింపంగ నేలా? వృథా
వాచాలత్వములున్ బ్రలోభ నటనల్ వారింపఁగా నేర్చునే?

తలనూపం బనిలేదు సాంఘిక మతౌద్ధత్యంబు లెందేని, భా
షలకున్ సర్వకళాలతాంతమున కౌజ్జ్వల్యంబు సిద్ధింపఁగా
వలె; విశ్వైక్యత విశ్వసోదరత విశ్వప్రాజ్య జాతీయతల్
వెలయంగావలె, హిందు ముస్లిములకున్ విఖ్యాత బాంధవ్యముల్.

సమరసభావ నిశ్చల పరిశ్రమకు బ్ర
 హ్మాండంబు లున్ముఖంబయినదాక,
వ్యత్యయంబైన తీవ్రాస్పృశ్యతాజాడ్య
 మన్నివిధాల రూపతీనదాక,
నాజాతి నాయూరు నా దేశమని పొంగు
 స్వాభిమానము శూన్యమయినదాక,
విశ్వసౌభ్రాత్రంబు వెలయించు నైక్య సం
 ఘూవ్యాప్తి దిశల పెంపారుదాక,

జ్ఞానమత సాంఘిక స్వేచ్ఛ నల్వురకును
నేకరీతి లాభించునందాక, రాదు
భావిభారత కల్యాణ పరమ సుఖము!
కాక చల్లార దెపుడు సంగ్రామ మఖము.

ఇది నాలో నగుపించు నూతన మహద్దృశ్యంబు, లే దింతకుం
బదకం బొందు ప్రపంచశాంతికి, ప్రజాస్వచ్ఛంద రాజ్యంబు నం
గదయున్ జింతయు లేని భారత సమాఖ్యం బైన వైకుంఠ సం
పద సంపాదన సేయవోయి నడుమున్ బంధించి మిత్రోత్తమా.

కనులుం గర్ణము లూడిన
పునుక నగుట జూడనయితి పొలయు న్నల్లన్
విననైతి ప్రజల యార్త
ధ్వనులన్, దలఁపోయ నేను ధన్యుఁడ నయితిన్,

"ఏమైనారు కళత్ర పుత్రకులు? నీ విట్లొంటిమైఁ గానకున్
నీ మే న్సేరిచి తప్పుకొంటి" వనినన్, జింతాకులస్వాంతుఁడై
యేమాటాడక మూర్ఛ మున్గి పడిపోయెన్ గాందిశీకుండు, త
త్సామీప్యంబున నున్న చెట్టుమొదటన్ సర్వాంగ నిశ్చేష్టుఁడై

అతని మూర్ఛ దేర్చి యరుణుండు పకపక
నవ్వసాగెఁ దూర్పు నగముమీద,
పునుక పలుకదయ్యె, భూరివిషాదంబు
గుండె నిండి కన్ను గొనల వెడలె.

నిసువుల దలంచి కొన్ని కన్నీళ్ళు సిమ్మి,
పునుకమిత్రుని విజ్ఞాన బోధఁ జేసి
గుండెలోఁ గొంత విశ్రాంతి కుదురుకొనఁగ;
జరిగిపోయిన కథకు నచ్చెరువు పడుచు.

ఇది నాలోగల చిత్రవిభ్రమముగానీ యిక్కపాలంబు ప
ల్కదు, దేశాభ్యుదయాభిలాషి నయి రక్తక్షోభ వారించెదన్
సదయంబై యనఘాత్మకంబగు నహింసా ఖడ్గమున్ బూనెదన్,
గుదియింతుం గదనోగ్రఘాతమును దిక్కుల్ మ్రొక్కులర్పింపఁగన్

అని తలఁచి పాంథు డింటికి
జనియెఁ, గపాలంబు నొక్క సన్యాసి కరం
బున బూని బిచ్చమునకున్
జనియెన్, శుభరుత మొనర్చె శకున ద్విజముల్!

# డాక్టర్ వాసిరెడ్డి సీతాదేవి సాహిత్యం
## మీరు చదివారా?

| | రూ. |
|---|---|
| **మొదటి సంపుటం** | |
| మట్టిమనిషి | 135 |
| **రెండవ సంపుటం** | |
| సమత + వైతరణి + అర్చన + తిరస్కృతి | 190 |
| **మూడవ సంపుటం** | |
| కథలు | 140 |
| **నాల్గవ సంపుటం** | |
| అడవిమల్లె + ఉరిత్రాడు + వెన్నెల మండుతోంది + మరో దయ్యం కథ + కోతి - కొబ్బరికాయ | 200 |
| **ఐదవ సంపుటం** | |
| రాబందులూ - రామచిలకలూ + మృగతృష్ణ + సావేరి | 200 |
| **ఆరవ సంపుటం** | |
| తొణికిన స్వప్నం + మళ్ళీ తెల్లవారింది + బొమ్మరిల్లు | 150 |
| **ఊర్మిళ** (నవల) | 90 |


ప్రతులకు:

**విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్**

విశాలాంధ్ర బుక్ హౌస్‌లు & ప్రముఖ పుస్తక విక్రేతలు.

# బాపూజీ

ఎవడీ యర్ధదిగంబరేశ్వరుడు మా
యింద్లం బ్రవేశింప నం
చవమానంబుగ చర్చలాడగ
బకింగ్‌హాం సౌధమున్ ద్రొక్కి హైం
దవజాతీయత లీను మేల్పిలక నా
ట్యంబాడ, శ్రీ జార్జి భూ
ధవు నింటన్ ఫలహారముల్ సలుపు తాతన్
గాంధి నర్చించెదన్.

# కృతిపతి ప్రశంస

అనుమానింపక నీస్వరాజ్యరణ శంఖారావ మాలించి, క
మ్మని భోగాలు పరిత్యజించి, ద్రఢిమన్ మైమీది వస్త్రంబుతో
నిను వెన్నాడిన రామరాడ్విభునకున్ నీ కావ్య మర్పించి, వ్రా
సిన కష్టంబును విస్మరించితి, మహర్షీ! గాంధి, స్వేచ్ఛారతా!

బెడగారు నీ మేలి యడుగు జాడలలోన
నడుగు సాగించు దయారతుండు
కులమతద్వేషముల్ మొలకలెత్తిన వన్న
కటకటంబడు క్షమాకాముకుండు
సమసి పోయిన పూర్వజాతీయ కళల కా
లంబంబు చూపు కళాపిపాసి
గుణమున్న కృతులన్న కోరి యాహ్వానించి
సత్కారములు చేయు సజ్జనుండు

నీతి నియమములను నినుబోలి పాటించు
తిక్కవరపు కులుడు దీనహితుడు
యెలమి నీచరిత్ర కృతి నందికొన్నాడు
సమ్మతంబు కాదె జాతి జనక!

హరిజన సేవ కై బ్రదుకు నమ్మిన నీమనమూరడిల్ల, నం
తరములు విస్మరించి, నిజధామమునన్ సహపంక్తి భుక్తిచే
హరిజనులం దనించెడు మహత్తర సంస్కృతికర్త రామరా
ద్వరుడు, మహాత్మ! నీదు కృతిభర్తృత కన్యు లనర్హులేకదా?

ఒక రాష్ట్రంబున కొక్క వర్గమునకై యుత్పత్తిగావించు, సాం
ఘికపుం జట్టము గిట్ట దెన్నడు త్రిలోకీ శ్రేయముం గోరు ధా
ర్మికసింహు న్నిను గొల్చువాని కివి సంతృప్తిం బ్రసాదించునే?
మొకమోటంబునకున్ సహింప డొక తప్పున్ రెడ్డి, స్వేచ్ఛామునీ.

మిన్నుల్ గూలిన తత్తరంపడని గంభీరస్వభావుండు వ
ర్ణోన్నత్యంబున విఱ్ఱవీగని బ్రశాంతాకారు దేకాలమున్
ని న్నాదర్శముగా దలంచు విబుధున్ శ్రీ రామిరెడ్డి ప్రభున్
మన్నించుం గవితాప్రపంచము మహాత్మా! కావ్యపుష్పాంజలిన్.

అల్లుంద్రున్ గౌమరుల్ గుమారితలు దేశారాధనాసాధనో
త్ఫుల్లాంతఃకరణుల్ నిగర్వులు కళాపూర్ణేంద్రులై కొల్వగా
యిల్లాల్లేని విచారమున్ మరచి సాహిత్యంబు పోషించుచున్
నెల్లూర్సీమకు రామిరెడ్డి యొక మాణిక్యంబుగా వెల్గెడిన్.

ఒకరు చెప్పుకొన్న నున్న వాడని సంశ
యింప జోటు జిక్క దింతయేని
వేయిమాట లేల వేషభాషల గాన
రాదహంబు రామిరెడ్డియందు.

ధరియించినాడు ఖద్దరుబట్ట తొలుదొల్త
కదురు తుమ్మెదతెక్క గదలునాడు
భుజియించినాడు సమ్ముదితాంతరంగుడై
జైలుఖానాల ఖైదీలబువ్వ
అంపించినా డసూర్యంపశ్య నిల్లాలి
కిగ్గాడి బంధనగేహమునకు
పోసినా డెన్నియో దోసిళ్ళకొలది రూ
పాయ లారంభజాతీయనిధికి

వడియువంకలేని భవదంతరంగంబు
చూఱలాడినట్టి సుజనహితుడు
సింహపురనివాసి శ్రీ తిక్క వరవంశ
తుహినకరుడు మధుర సహనపరుడు.

నిలువుదోపొసంగి నీయంతరం గాన
ముద్రపడ్డ రెడ్డిముద్దరాలు
శ్రీ శకుంతలాంబ శ్రీ రామిరెడ్డి గా
రాలబిడ్డ ఖదరు రాచతపసి!

మోమున వీరకుంకుముబొట్టు రచించి పతివ్రతల్ నిజ
స్వాముల బందిఖానలకు పైన మొనర్చెడువేళ, రామరా
డ్భామ, సుదర్శనాంబిక భవన్నుతులంది ధరించె శాంతిసం
గ్రామ సుదర్శనాయుధము రాట్నము సింహపురాంగనావళిన్.

ఆర్థికమంత్రియై ప్రకృతమాంధ్రిని పాలనసేయుచున్న ని
స్వార్థమనస్కుడైన బెజవాడ కులాభరణంబు రామరా
డర్థపమౌళికిన్వలపు టల్లుడు సుమ్ము భవత్కటాక్ష సం
వర్ధితులయ్యు తిక్కవరవంశజు లక్కజపుం గళానిధుల్.

# వినతి

మహాత్ముని అకాలమరణమునకు విశ్వాంభరానేత్రము చెమ్మగిల్లినది. భారత స్వేచ్ఛకై వ్యయించక మహాత్ముడు దాచుకొన్న రక్తకణములేదు. అతడే భరతవర్షము; భరతవర్షమే బాపూజీ. ఒక ప్రత్యేక వ్యక్తికాదు. నలుబదికోట్ల భారతీయులతడు, “అతడొక మధుర ప్రకృతిగాని మానవవ్యక్తిగాదని” జార్జి బెర్నార్డుషా స్తుతించినాడు. ప్రపంచ చరిత్రలో నెట్టివాడు నేయుగమున గడింపని యమర”కీర్తి నతడార్జించి, అనుగుబిడ్డలగు భారతీయుల కంకిత మొనర్చినాడు. ప్రతిఫలముగా తనకు లభించినది బలవన్మరణము, భస్మస్వరూపము. అది తలంపరాని విషమఘుడియ. నాడు రాలిన యశ్రుకణములే యీ కావ్యము. భారత కవులిప్పటికే పరిపరి విధముల వాపోయి తాత నర్చించి ఋణ విముక్తులయినారు.

మహాత్ముని భక్తులలో ప్రథమగణ్యులై యసహాయోద్యమ క్లిష్ట కాలాన సకుటుంబముగా నామహాముని ననుగమించిన సింహపుర రెడ్డి కులాలంకారు లయిన శ్రీ తిక్కవరపు రామిరెడ్డి గారికీ గ్రంధము నంకితమొనర్చుచున్నాను. ఈకృతి స్వీకృతికి రెడ్డిగారెంతయు నర్హులై గాంధి మహాత్ముని యాత్మశాంతి కుపకరింతురని నా విశ్వాసము. రెడ్డిగారిక్కావ్యమును విని సంతసించి ముద్రణార్థమై ధనమొసంగి, కృతినందుట కంగీకరించి నాకు మహోపకారము చేసినారు. వారికి నేనెంతయు కృతజ్ఞుడను.

-జాషువ కవి

# బాపూజీ

భగ్గునమండు సీమ నరపాలురతోడ నెదిర్చి వెన్కకున్
దగ్గక రక్తపుంజినుకు నష్టముగాని స్వరాజ్య యుద్ధమున్
నెగ్గిచినట్టి భారత మునిప్రవరుండు క్షమాప్రవాసి, యా
ముగ్గిన పండు, బోనమయి పోయెనె నేడు తుపాకిగుండ్లకున్.

జగమొక్కుమ్మడి బొమ్మ గ్రుద్దుకొని మూర్ఛన్‌దేలి, తబ్బిబ్బు జెం
దగ, చేజిక్కిన మొన్న మొన్నటి స్వతంత్ర స్వర్గసౌధంబులో
పొగరేగన్ బగవాడు లేని భువనంబున్ గన్న బాబున్, భవత్
భగవంతున్, దయామాలి చంపుకొనినావా! భారతాంబామణీ!

నీ యంకంబున లాలితంబగుచు శాంతిన్గాలమున్ బుచ్చు న
మ్మాయిన్, జిట్టి స్వరాజ్యబాలికను సామ్రాజ్యేందిరన్, లేతలే
తాయుష్మంతులు తండ్రిలేని యల జవ్హార్‌లాల మాత్య ప్రభుల్
మోయన్గాలుదురే? జగజ్జనక! బాబూ! గాంధిమున్యగ్రణీ!

ఇదియే పోవడమా! జగజ్జనక! రానేరావుగా! నూట ము
ప్పదియేడుల్ మనువాడనన్న నుడికిన్ భంగంబు వాటిల్లెనే?
ముది తాతా! ప్రతిరక్త బిందువును మా పూర్ణ స్వరాజ్యార్థమై
కొదలేకిచ్చిన నీ విషాద మరణాగ్నుల్ గాల్చె ముల్లోకమున్.

ఏలేనవ్వులు లోకలోకముల మోహింపించి, నిర్జించి, స్వే
చ్ఛా లావణ్యవతీ కరగ్రహణ పూజల్ గాంచి, పుష్పించెనో,
ఆ లేనవ్వులరాశి! ఆ యపరవిద్యావార్ధి! ఆ పండుటా
కీ లోకంబును వాసెనే! భరతరాజ్ఞీ! యెంత దౌర్భాగ్యమో!

ఆగిపోయెనె ప్రపంచానందదం బైన
ఖదరు రాటాల ఝుంకార రవళి
ఇంకెనే శాశ్వతాస్పృశ్యుల నోదార్చి
నెనరూను వేడి కన్నీటి బుగ్గ
పడిపోయెనే నేటివర కింత లభియించు
గండు పేదల నోటి కబళరాశి
విరిగిపోయెనె నేటివరమంత్రికోటికి
నవలంబనంబైన యమరతరువు

గంటకొట్టినమాదిరి మింటియందు
మండుచున్నాడు చండమార్తాండమూర్తి
భారతజ్యోతి గప్పున నారిపోవ
ముజ్జగంబున జీకటి ముమ్మరించె.

కలికాలమ్మున కేసు క్రీస్తువని వక్కాణించె దిగ్దేశముల్
తులువల్ సల్పిన గాయముల్ మరల నీలో దోచి యేసుప్రభున్
దలపించెన్ ఋజువయ్యె నీదగు మహత్వశ్రీ, భవత్త్యాగ శ
క్తులలో నెన్ని స్వరాజ్యముల్, భువన వైకుంఠంబు లింపారునో.

అవతారమ్ములు దాల్చినాడు పదిమార్లబ్జాక్షుడం చూరకే
చవు లూరించు సమస్త శాస్త్రములు, సాక్షాదబ్జనాభుండవై
యవతారించిన నిన్నెఱుంగుదుము బ్రహ్మాండం బెఱుంగన్, జగ
ద్భవమున్ చెండితివీవు కొండొక మరంద ప్రేమహాసంబునన్

అలిగి కూర్చుండు చిన్ని బిడ్డల విధాన
నుపవసింతువు భువన ముఖ్యూతలూగ
విశ్వములకెల్ల గారాలబిడ్డ వకట
చంపుకొన్నది భారతక్ష్మాతలంబు.

పగతుర రక్తమున్ దిలకపంకముగా ధరియించు భండనా
ధ్వగులగు పుత్రులం గనెడు భారతదేవత, కడ్పు చల్లగా
పగతుర చిత్తముల్ గెలిచి పాలన సల్పిన బుద్ధదేవునిన్
మిగిలినవాని గాంచె మహనీయుని మోహనచందు గాంధినిన్.

అది తలపోయరాని హృదయ ప్రవిదారి విషాదవాత్య కా
స్పదమయి, పంచఖండములు బావురుమన్న పిశాచివేళ, ము
ప్పది పదికోట్ల భారత తపస్సముదాయము భస్మరాశియై
చిదికిన ఘోరదుర్దినమిదీ! వచియింపగ జిహ్వలాడునే.

భరతవర్షంబిను వజ్రాల ధనరాశి
    తూకంబునకు పెచ్చుదూగువాడు
మూడుమూర్తుల దయాభూతి ప్రత్యంగాన
    తాండవించెడు పవిత్రస్వరూపి
పదివేలయేండ్ల లోపల ధరాదేవత,
    కనియెఱుంగని జగన్మునివరుండు
అనుగు దమ్ములు కోరుకొను స్వరాజ్యార్థమై
    పస్తుండి శుష్కించు పండుముసలి

గోచిపాత గట్టుకొని జాతి మానంబు
నిలిపినట్టి ఖదరు నేతగాడు
విశ్వసామరస్య విజ్ఞాన సంధాత
కామిత ప్రదాత, గాంధితాత!

విమత భూపతుల దోపిడి గుందు జాతిలో
దీపంబు బెట్టిన దినకరుండు
మానవత్వమును భూమండలంబున నెల్ల
చాటిన యాచార్య చక్రవర్తి
సత్యాగ్రహంబను శస్త్రచాలన విద్య
భువికి దెచ్చిన మహాపురుషమౌళి
నిమ్న జాతుల కంటి నీరంబు దుడిచి యా
శ్వాసించు నిఱు పేద బాంధవుండు

పండ్లు నూరుచున్న బహుమతంబులలోన
సహనవిద్య నేర్పు సాధకుండు
భార్య బిడ్డ లున్న ప్రత్యక్ష దైవంబు
కామిత ప్రదాత, గాంధి తాత

ఉపవాసం బుపసంహరించుకొని యెన్నో నాళ్ళు గాలేదు, తా
నుపలాలించు ప్రపంచ శాంతిరమ కాయుర్భూతి సిద్ధింప లే
ద పరాహ్ణంబున గ్రుంకెనో! భరతమున్యాదిత్యబింబంబు, తూ
రుపు ఖండంబుల నస్వభావికముగా రోదస్సు రోదించగన్.

కలముల్ కైతలు మూగవోయినవి, శోకధ్వాంత ముప్పొంగి క
న్నులువోయెన్ సకల ప్రపంచమునకున్, దోడ్తో భయభ్రాంతమై
బలహీనంబయి తూలె భారతము, విశ్వవ్యాపి బాపూజి, గుం
డెలలోనుండి పవిత్రరక్తము చితాగ్నిన్ గ్రాగి ఘోషింపగన్.

వేయేడు ల్దలక్రిందులైన, భరతోర్వీచక్రమీ వింత గో
సాయిన్ సామి దిగంబరేశ్వరు నహింసామూర్తి, శాంతి క్షమా
వ్యాయామ స్థిరు నెత్తి పెంచుకొను భాగ్యం బున్నదే? మానదీ
గాయంబీ మతమత్త చిత్తుల తలల్ ఖండించి, కాల్పించినన్,

అదిగో! రాట్నముచేత నిమ్నజుల కాహారంబు గల్పించి య
భ్యుదయాపాదక సామరస్యమున కాయుర్దాయముం బోసి, ఆ
పదపాలై మరణించి, భస్మచయమున్ భాగించి, దేశాలపై
వెదజల్లించిన గాంధితాత ఋణమున్ విశ్వం బెటుల్ దీర్చునో?

అవతరించిన స్వరాజ్య ప్రాజ్యబాలిక
కక్కటా! ముకుపచ్చ లారలేదు
సకుటుంబముగ వీడి చనుచున్న తెలిరాజు
నిజసీమలో కాలు నిలువలేదు
హస్తినాపురిమీద హైందవ ధ్వజమెత్తి
నిండుగా యేడాది నిండలేదు
స్వాతంత్ర్య ఘనమహోత్సవ జయధ్వానంబు
మార్మోత లూరూర మాయలేదు

సింహపీఠిక నధివసించిన యనుంగు
మనుమలం జూచుకొనుచు నమంద హర్ష
పులకిత స్వాంతుడగు దొడ్డ ముసలివాడు
మాయమయ్యెనె? లోకాల గాయమగుచు.

ఆకటిచిచ్చునం గుమిలియార్చెదు ప్రేవులు మూటగట్టి, ధ
ర్మైక మహారణంబున నహీన జయంబు గడించి, దాస్యపుం
జీకటివాపి, తమ్ములకు స్వేచ్ఛ యొసంగిన తాత, జాతికిన్
జీకుడుబెట్టి, స్వర్గపురి జేరెనె? భారతబాష్పబిందువై.

అచ్చపు గ్రైస్తవుం డనుచు నంజలిబట్టిరి క్రైస్తవోత్తముల్
పొచ్చెములేని బౌద్ధు దని పూజ లొనర్చిరి బౌద్ధభిక్షకుల్
మచ్చరకించి మా ముసలమానని పల్కెం దురుష్కలోకముల్
అచ్చమహాత్ముడన్న నుడికర్హుడు గాంధి ఫకీరు డెంతయున్.

ఆఫ్రికాఖండంబునందు బోయరులకై
చిందిన నెమ్మేని స్వేదధార
హరిజనావళి సముద్ధరణార్థ మనయంబు
వగచి చిమ్మిన బాష్పవారిధార
బహుకాల శృంఖలాబంధనాలయమున
వృథపుచ్చుకొన్నట్టి రుధిరధార
సీమరాజుల శిలాచిత్తాల నగలించి
లాలించు స్మిత సుధాలాపధార

నేల నాలుగు చెఱగులు నిండి పాఱి
మొలకలెత్తించె దేశాల పుష్పపూజ
హరహరా! నేడు బాపూజి మరణవార్త
కత్తులాడించె భారత గర్భకుహరి.

"హా రామా!" యని నేలపై కొరగి, నిర్యద్రక్త సిక్తాంగుడై
వీరస్వర్గమలంకరించిన యశస్విన్ గాంధికర్మంది, గ
న్నారం జూడగలేక ఢిల్లి నగరం బాబాలగోపాల మా
కారం బెత్తిన శోకమై, ప్రకృతిముగ్ధంబయ్యె, నిర్జీవమై.

నవఖాళీ నరమాంస భక్షణ దురంత శ్రేణి నాలించి, మా
నవ ధర్మంబు నశించెనే యనుచు జింతాక్రాంతుడై పోయి, త
ద్దవధూమంబులు శీతలోక్తి మధు రార్ద్రప్రేమను చల్లార్చు సా
ధు వరేణ్యుం గబళించిరే యనుగుపుత్రుల్ దైవభక్త ప్రువుల్.

గొడిసే చేతి తుపాకితో శిథిలితాంగున్ బ్రేమపాథోనిధిన్
బుడమిం గూలిచి మూర్చ వోవునెడ 'బాబూనొచ్చెనే దేహమం
చ డిగెన్ లేనగవుల్ శమింపని యపాంగాలోకనంబుల్, కటా!
పిడుగుల్ గూలెడి నంతరంగమున నీ వృత్తాంత మూహించినన్

చెప్పులు కట్టియు, నన్నపు
జిప్పయును సులోచనములు, చిత్తంబులలో
నొప్పిగలిగించె జూపర
కప్పూజీ గృహము శూన్యమై దుస్సహమై.

శ్రీ వైస్రాయి సతీసమేతముగ నర్చించెన్ సుమశ్రేణిచే
నావిర్భూత కవోష్ణ బాష్పములచే నత్యంత భక్తిన్, బ్రజా
సేవా శుష్కిత వృద్ధమూర్తిని, ధరా క్షేమంకరున్, బుణ్యపుం
బ్రోవున్, గాంధి నకాలమృత్యు సుఖసుప్తున్, రక్తసిక్తాంగునిన్.

ఐదార్మైళ్ళు ప్రజాసమూహ మిరుపాయల్గట్టి వెంటాడ, ము
న్యాదిత్యుండు వికుంఠసీమకు మహాయానంబు సాగించె మై
మీదం బూవుల వర్షముల్ గురియ గంభీర స్మితచ్ఛాయలన్
బూదేరెక్కి కళిందజాతటికి మామూల్దివ్య తేజంబునన్.

మంతురులెల్ల నప్పరమ మౌనిశవం బరుదేరు నేనుగుం
దంతపుదేరులాగ గవనర్ జనరల్ బహరా యొనర్పగా
యంతములేని మానవ మహానది సూర్యసుతాస్రవంతి ప
ర్యంతము నేలయీనిన దెరంగున బొంగి రహించె నెంతయున్.

ఎందరో నాటి రక్తంబు జిందుచున్న
నూనుకొనని యహింసా ప్రసూనలతిక
బాపుజీ రక్తబిందు సంస్పర్శనమున
నాటుకొన్నది ఖండ ఖండములయందు.

ఏజన్మాంతర పుణ్యశాలుర తనూ మృత్సంచయంబంటి యా
రాజాఘట్టము ధన్యమయ్యెనో! పవిత్రంబై ప్రకాశించు బా
పూజీ సంచయన క్రియా సమధికంపుం బుణ్యమార్జించి ది
గ్గాజీ దంతురిత ప్రతిష్ఠ కిపు డగ్గంబయ్యె, సుక్షేత్రమై

మందంజొచ్చెం బడమట
దండకరుని చితి, యదెట్టి సంఘటనంబో
మందంజొచ్చెం గాంధీ
చండకరుని చితి కళిందజా తీరమునన్.

ద్వాదశపుణ్య తీర్థములు భారత భాగ్యవిధాత మేని కొం
బూది తరంగ హస్తముల ముద్దిడి యొద్దిక నాణిముత్తెపుం
గాదెల నింపుకొన్నవి సగర్వముగా, కలుష ప్రపంచపుం
బూది స్పృశించి యంటువడిపోయిన కల్మష మూడిపోవగన్.

బూది బంచుకొనుచు భూరిచింతా క్రాంత
వదనులగుచు దిరిగివచ్చినారు
మంత్రిమణులు భరత మౌనీంద్రమణి లేక
వగల బొగులు ఢిల్లి నగరమునకు.

నిమ్న జాతుల మేను నిమిరి పైపై చెల్మి
నటన సాగించిన నైష్ఠి కుండు
ప్రాతవారిన సీమవసన మొక్కటి దెచ్చి
దహనంబు జేసిన త్యాగధనుడు
ఖదరు గట్టనివాని గని వేడినిట్టూర్పు
విడిచి కుందిన భక్త వేషధారి
మాలవాడలకు నామడదూరమునగాని
నిలువని శాంతిసందేశహరుడు

నడుపుచున్న దొంగనాట్య రహస్యంబు
స్పష్టమయ్యె గాంధి చావుతోడ
భరతభూమినింక భగవంతుడుండునా
దేవళంబు లుత్త తిత్తులయ్యె.

పోరుబందరు పురంబున బుట్టి గుజరాతు
సీమకు గౌరవశ్రీ ఘటించి
ఆబాల్యముగ సూనృతాలాపములు నేర్చి
సన్మార్గమున కాలుసాచి నడచి
మూడులోకంబుల నోడింపజాలు చి
త్రంబైన నవ్వు సాధనముజేసి
మనుజుడై పుట్టి సంపాదింపగాలేని
సహనంబు పదిపుట్లు సంతరించి

బలము గలిగిన గంపంత బలగముండి
వెతలపాలైన మాతృభారతిని జూచి
యెంత చింతించెనో సుంత హింసలేని
బవరమును లేపె శ్వేత భూపతుల తోడ.

పదుగురి నోళ్ళలోన గుణవంతు డితండను శబ్దరత్నముల్
బొదిగి, సమస్త విద్యలను పూర్ణముగా గ్రహియించి, సీమకున్
గదలి, వినీతికిం జిఱుతగాయము సోకని న్యాయవాదియై
సదనము జేరె, ప్రాయము బుసల్ పచరించెడు యౌవనంబునన్.

అనుగుం గస్తురిబా గీ
చిన గీటు దొలంగనట్టి చెలువ, మనసులో
మనసై, మెలంగ భారత
జనకత కనువైన గుణము సంపాదించెన్.

మగని చిత్తం బగుర్వగ నెగ్గులేకుండ
హరిజనాళికి పరామిరిక నెఱపి
విభు దుపాధ్యాయుడై, వినుచు నహింసా మ
హాధర్మ సూత్రంబు లభ్యసించి
పతిపదంబులు మెట్టు బాటలో వెలుగు ని
శ్చలశాంతి రమకు పుష్పములు సల్లి
భర్తృ జిహ్వా పల్లవమున బూచిన సత్య
మధుకోశ మధువు కమ్మగ భుజించి

ఆడురూప మెత్తినట్టి రెండవగాంధి
యనగ భరత జనని యను ప్రతిష్ఠ
గడనచేసి సాధ్వి, కస్తూరిబా యభ్య
సించె నద్వితీయ శీలవిద్య,

కడుపున బుట్టిన కొడుకుల
నడుగంగా నేల న మ్మహో జంపతికిన్
గడుపున బుట్టని కొడుకులు
గొడిసేతో మూడుపదుల కోట్లటు నిటుగా.

తిండి లేక భారత సతీసుతు లెల్లరు దక్షిణాఫ్రికా
ఖండముజేరి సీమ సరకారుల వేడికటాక్ష వీక్షణో
ద్దండ నిదాఘ తప్తులయి దాస్యము సేసెడువేళ నండగా
నుండి యెదిర్చె శ్వేత పదనోగ్ర పిశాచుల వర్ణదౌష్ట్యమున్.

అతిధికి పరిచర్య లాచరించుటగాక
పాయఖానా శుభ్రపరచినాడు
నిష్కారణముగ తన్నిన తెల్లదొర గుండె
నలిగిపో జిరునవ్వు నవ్వినాడు
అంతరాత్మకు భిన్నమైన పాపపు లేశ
మేని ప్రాణాల బోనీయలేదు
తగవు దప్పినవాడు భగవంతుడేకాని
యురమిచ్చి యెదిరించ కుండలేదు

తెలుపు నలుపు వన్నె కులభేద పరమైన
సీమ పెద్దపులికి చెలిమి గరపి
భరత సుప్రతిష్ఠ బహుదేశములమీద
చల్లినాడు మాట చెల్లితీర.

సత్యాగ్రహ స్వర్ణశంఖంబు పూరించి
స్వాతంత్ర్య సమర బీజములు నాటి
సీమబట్టలు ధరించెడు పుట్టుభోగికి
చేనేతి మగ్గాలు చేతికిచ్చి
దొరల చేజిక్కిన భరత సామ్రాజ్యంబు
నుపవాసములచేత నూచి యూచి
స్వీయదేశీయ సిపాయి ఖైదీయౌట
గౌరవంబను సుద్దు గట్టిజేసి

పొదలు మంచుకొండ మొదలు సేతువుదాక
భారతంబు వెంట బరుగులెత్త
జడుపుగిడుపు లేని శాంతిపటాలంబు
సిద్ధపరచె ధర్మ బద్ధుడగుచు

ముద్ద తరుగయ్యె పాపము
ఖద్దరుచే సీమ నేతగాండ్రకు, గుండెల్
దద్దరిలె రాచవారికి
ఖద్దరు ముని మ్రింగరాని కబళంబనుచున్

ముసలమ్మ మొదలుగా పసిపాప వరకు ఖ
 ద్దరుబట్ట నెమ్మేన దాల్చినారు
పాలకుడాదిగా బంట్రౌతువరకు గాం
 ధీటోపి ధరియించి తిరిగినారు
ధనికుండు కోలె, ముద్దకులేని పేదయు
 కడగి సన్నని నూలు వడికినారు
ఆస్తికుండును వీరనాస్తి కుండును గూడ
 బాపూజి కంజలి బట్టినారు

గాంధి నామకంబు గాంధి సందేశంబు
మారుమూలలందు మారుమ్రోగె
ఖండపంచకమును గౌగిలించినవాని
సీమశక్తు లేమి సేయగలవు?

రోజు సబర్మతి మునివరుం గని ప్రార్థన మాలకింపగా
హాజరు జెందు దైవము, మహాత్ముని హత్యను కండ్లజూచి యీ
పూజల కాసజెంది చనిపోవుట తథ్యమటంచు లేచి, యా
రోజె ప్రయాణమై చనె, గురుఘ్నులులేని పరాయి భూమికిన్.

అసహాయోద్యమ మాంగ్లరాజ్యరథ రథస్తంభనాపాదియై
దెసల న్నిండి నినాదముల్ సలుప ఖాదీయూనిఫారాల సా
హసికంబైన స్వతంత్ర సైనిక నికాయవ్రాజియై, గాంధి తా
పసి సాగించె, నిరాయుధంబగు నపూర్వంబైన పోరాటమున్

లాలా లజపతిరాయ్, మో
తీలాల్ నెహురూ, తిలక్కు దేశాయి, పటేల్
మాళవ్య ప్రభృతి ప్రముఖులు
మౌళిం దాలిచిరి గాంధి మహితోద్యమమున్.

ఆశీర్వదించి దేహంబు చాలించె సం
గర రంగమందు గంగాధరుండు
లాటీల కగ్గమై లజపతిరాయండు
నొరిగె నుత్కట వీరమరణశయ్య
ఇల్లువాకిలి దానమిడి పండితుడు మోతి
లాలు వీరుండు కాలంబుజేసె
సహచరాగ్రేసరుండు మహదేవ దేశాయి
తన చేతుమీదుగా దహనమయ్యె

జహ్వరాది బాలసత్యాగ్రహులు వెంట
నడువ నుగ్రమై యనంతమైన
శాంతిభండనంబు సాగించె గాంధిజీ
పిలకతోడ, నవ్వుమొలకతోడ.

ఏమనరానిదై, హృదయమేర్చు మహాత్ముని ప్రేమతత్వ సం
గ్రామ విచిత్రపద్ధతికి గందరగోళము జెంది యిండియా
స్వాములు 'రౌలటా'ది పటుశాసనశక్తుల కాసదీరగా
నా మెతపెట్టినా రదయు లై బలహీనుల వేడిరక్తమున్.

ఉద్యమములు సత్తులుత్తుత్తమాటల
ఫలితమునకు రావు వాస్తవముగ
త్యాగులైనవారి తను రక్తమున దక్క
సాధురక్తమునకు జయము ధ్రువము.

నలుబదికోట్ల వక్త్రములు, నల్బదికోట్ల శిరాలుగల్గి, చు
క్కలు తలపూవులై పెరిగి కమ్మని నవ్వులతోడ నుజ్వలో
జ్వలమగు గాంధి రూప మనివార్య మజేయమునై బ్రిటీషు రా
జుల భయభక్తి తత్పరత జూఱగొనెన్ సహనాభిరామయై.

మౌలానాయజదున్ గఫూరుడు ముసల్మాన్నాయకశ్రేష్ఠుల
య్యాలీసోదరులం జలించి హృదయం బర్పించి వెంటాడగా
చాలాకాలమునాటి జాతిమత భాషాద్వేషముల్ మాన్పుచున్
బాలు న్నీరముగా నొనర్చె నుభయ వ్యత్యస్త సిద్ధాంతముల్.

ఆవేశంబున గాంధి పాదముల నభ్యర్చించి వెంటాడుచున్
యావద్భారభూమి కట్టుకొనిపోయెన్ ఖాదీ జగావస్త్రమున్
బ్రోవుల్ వెట్టి దహించె సీమవసనంబున్ జీల్చి చెండాడుచున్
జైవెట్టెన్ బసిపిల్లయున్ భరతదేశ స్వేచ్ఛ నాశించుచున్.

కటిక చీకటి బంధిఖానాలలోనుంచి
కఠినశిక్షలు ప్రయోగంబుజేసి
కీల్తుపాకులు ఫిరంగీ మింటికి గాల్చి
బ్రిటనుపటుత్వంబు వెల్లడించి
గాభరాపెట్టి బందోబస్తు లొనరించి
వెలయిచ్చి కొన్న దోర్బలము జూపి
రాజన్య విద్రోహ వ్యాజంబు గల్పించి
యొక్కరి నిద్దరి నురికి బంపి

భూమిపతులకుండు మొనగానితనమెల్ల
నిఖిల చిత్రగతుల నెరపినారు
మౌనముద్రగాని మందస్మితముగాని
చెదరదయ్యె గాంధిజీ ముఖాన.

వేళాకోళము సిగ్గుచేటగుచు నవ్వించెన్ దిశాగోళమున్
పోలీసన్నల మొద్దుకత్తి బెదరింపుల్, దేశభక్తాళికిన్
గేళీ సౌధములయ్యె జైళ్ళకట! యాంగ్లేయ ప్రభుత్వ ప్రతి
ష్ఠాలీలావతి చిన్న బుచ్చుకొనియెన్ స్వాంతంబునన్ గుట్టుగన్.

అడుగు వేయిన్నూరు లడిగి బేరముసేయ
సకల భారతభూమి సంచరించి
నగవు ముప్పదికోట్ల జగము నాకర్షించ
స్వాంతముల్ కరుగ నుపన్యసించి
పలుకు పందుము రత్నములకు తూకము దూగ
పరిపాలకులతోడ వ్యవహరించి
వేషమాశాతాపవిశిఖంబు చల్లార్ప
మూరెడు వసనంబు మొలకు జుట్టి

బట్టలుదుకుకొనుచు బట్టలు నేయుచు
పాలుపండ్లు గుడుచి బ్రతుకు నీడ్చి
సుకము మరగియున్న సోమరిభూమికి
కరువులేని బ్రతుకుదెరవు సూపె.

బాపూజి నామరూపములు సొమ్ములుగాని
దినపత్రికలకు జీవనములేదు
గుజరాతు ముని పాదరజము సోకని పురీ
రత్నాల కర్మమర్యాదలేదు
ఘన సబర్మతి మునీంద్రుని సమ్మతికిగాని
ధర్మ సంస్థకు ప్రజాదరణలేదు
కస్తూరిబా భర్త వస్తు లారంభింప
జగతి వృత్తము బెత్తసాగలేదు

తఖిలి చేతబట్టి తాత ఖైదుకుబోవ
ప్రభుల సభకు నిబ్బరంబులేదు
రాజుగాని రాజు; ప్రతిగాని ప్రతియౌచు
నేల నాల్గుచెరగు లేలసాగె.

ఉప్పు సత్యాగ్రహంబున కుత్సహించి
కణ్ణమోపున జలధికి గదలునాడు
శాంత గంభీర భంగహస్తములు సాచి
యంజలి ఘటించె బాపూజి కబ్ధిరాజు.

పిల్లల వెంటబెట్టుకొని భిక్షకు బోవు కుటుంబివోలె, మా
చల్లనితాత, విశ్వపరిచారకు డర్ధదిగంబ రేశ్వరుం
డల్లన నబ్ధియాత్రకు బ్రయాణ మొనర్చెడువేళ జిత్తముల్
వెల్లువలై స్రవించినవి ప్రేక్షకులౌ సరకారు వారికిన్.

జలనిధిలోని యుప్పొకరి స్వాస్థ్యముగాదు, ప్రభుత్వ శాసనం
బులకు శిరస్సులేదు, ప్రభువుల్ దయమాలినవారు, సూర్యచం
ద్రుల వలె నబ్ధులున్, బుడమి, రోదసి పేదలసొమ్ము, భారతీ
యుల నిఱు పేదగంజి కయయో! కరవయ్యెనె యుప్పురవ్వయున్.

జయజయనాదముల్ దశదిశాతటపాటవ మాచరింప, న
క్షయముగ సర్వభారత భుజాబలసంపద సంతరించి, భూ
దయితులతో నెదుర్కొను సుధాచరితుం గుజరాతుసెట్టి, తా
తయ గని హైందవంబు ముదితంబయి పొంగె, మహాసముద్రమై

పన్ను కట్టరాదు పరిపాలకులకు, శి
క్షింప నిండు కడకు చెరకు బొందు
జాతి ముక్తి కిదియ సరియైన వెరవంచు
హెచ్చరించి రెచ్చగొట్టసాగె.

అలఘు ఫిరంగి దెబ్బ కెదురై తలయొడ్డిన శాంతియోద్ధలన్
గెలుచుట దుస్తరంబు, తలక్రిందులు గావలె ముజ్జగంబు, క
త్తుల కసరత్తు ప్రేమ రణదూతలవద్ద నిరర్థకంబగున్
సలిలముపొంత నిప్పునకు సాగునె ప్రోన్నత సప్త జిహ్వకల్.

కదురును రాటము దాలిచి
యెదిరింపుడు రాచవారి, నీ యాయుధముల్
ముదమిచ్చు, నన్న వస్త్ర
ప్రదములు, బీ ప్రదములాంగ్ల పారివ తతికిన్.

మన రాచవారు మనపై
గనుపరచెదు సవతితల్లి కరుణాప్రేమల్
జలియన్‌వాలా బాగున
యనదల రక్తమున దేలి యాప్లావించెన్.

కత్తులొసంగి, హస్తములు గట్టిన టక్కరి పార్థివేంద్రులన్
మెత్తగ సాగనంపగల మేలి యుపాయములేదు శాంతియే
యుత్తమ మిందు స్త్రీ పురుషయోద్ధలు చేరగవచ్చు, బావుటా
యెత్తి, విశాలభారతికి నీ రణపద్ధతు లందజేయరే!

తిరి పెపుజోలె బట్టి చనుదెంచితి, గర్జుని గన్న తల్లియై
మురిసిననేల నింక జనిపోవదు నేడు నుదారబుద్ధి, సో
దరులకు నిమ్న జాతులకు దానముచేయుడు చేతులార, మీ
పొరుగున దీనులై, కుమిలిపోవు దరిద్రజనావనార్థమై.

ఏటికి తెల్లసేన మనకిచ్చుట శాత్రవభీతి మాన్పి, యా
రాట మణంచి దేశపరిరక్ష యొనర్చెదమంచు దృష్టిగా
మాటలు చెప్పుచుందురు క్షమాపతు, లొక్క సిపాయి మేత ము
ప్పూటల భత్య మీ భరతపుత్రుల కార్గుర కించుమించుగన్.

ఇంటను బైట పాదుకొనియెం బరభాష, నిషాపదార్థమై
యంటిపరంజుకొన్నది హిమాచల శృంగముదాక, జ్ఞానపుం
బంట, స్వదేశవాఙ్మయము బట్టకు బొట్టకు లేని లేమి వా
ల్లంటికి నగ్గమై తెరవు గానక కన్నుల నీరు నించెడిన్.

ఎపుడో మీకు స్వరాజ్య మిత్తుమని నా రింగ్లీషురాజుల్ దదా
లపనంబుల్ గృపనంబులై విక నాలస్యంబు గావింపరా
దపకారంబు ఘటిల్లె నిప్పటిక; ప్రాచ్యజ్ఞాన సంపత్తి యూ
రపు వాతావరణ ప్రభావమున గార్శ్యంబందె నిద్రాణమై.

దొర లీ దేశము వాసి, సీమ సరిహద్దుల్ ద్రొక్కినంగాక సా
గరపర్యంత విశాలభారతికి సౌఖ్యంబుండ దప్డే పర
స్పర విశ్వాసము భారతీయులకు సంప్రాప్తించు సత్యాగ్రహా
స్థిర దీక్షారతు లై యెదుర్కొనుడు ఖాదీ చక్ర చండాంశులై.

కదలక నిల్చి నా వెనుక గచ్చ బిగించి స్వరాజ్యయాత్రకున్
గదలు దహింసయే నిశితఖడ్గముగా, నడుగడ్డ విఘ్నపుం
గదుపుల నుత్తరించి, చరఖా శుభగీతము లాలపించుచున్
ముదుసలి దేశమాతకు ప్రభుత్వ కిరీట మలంకరించెదన్.

ఒకతల్లి పిల్లలై, యొక మహోన్నత జాతికి జెంది, భారతాం
బిక ప్రసవించు సంపదలు వెల్లువ లన్యుల జెందుచుండ ను
ప్పుకు గొఱగాని వర్ణముల పోరుల కాయువు బోయు శాంతి హం
తకులకు దావులేదు సమతా క్రమబద్ధ స్వరాజ్య సంస్థలో.

ఢాకాలో నొకనాడు మేల్జిలుగు బట్టల్ నేసి, చీనా జపాన్
దాకన్ గీర్తిరథాలపై మసలు ప్రజ్ఞావర్తకుల్ నేడు నా
నా కష్టంబుల కగ్గమై చివుకుచున్నా రుగ్రదారిద్ర్యపుం
జీకట్లన్ దొలగించు భారత కళాశ్రేణిన్ వెలింగింపుడీ!

తనరంగావలె దేశదేశముల కాదర్శంబుగా, భారతీ
యుని సత్యాగ్రహసచ్చరిత్రము, చిరాయుర్భాగ్య మింపారుతన్
మన జాతీయ కళాసరస్వతులకున్ జాతీయ సాహిత్య గో
పునకున్, దావుల జిమ్ము ప్రేమరసదీప్తుల్ సల్లు క్ష్మామాతకున్.

మనము బానిసలము మనకు బానిసల్
శాశ్వతముగ నిమ్నజాతివారు
బానిసేంద్రక్రింద బానిస లున్నచో
బలము ముమ్మరించు పాలకులకు

క్రొంగొత్త గుళ్ళు పెక్కులు నిక్కెనే కాని
మత దురాచారముల్ మారలేదు
విద్యాలయ శ్రేణి పెంపొందెనే కాని
అస్పృశ్యతారోగ మణగలేదు
న్యాయస్థలాలు జన్మం బెత్తెనే కాని
లంచాలనిప్పు చల్లారలేదు
సభ లుపన్యాసాలు ప్రభవించెనే కాని
ఆచరణంబున కాసలేదు

అన్ని దేశాల పరిచయ మయ్యెగాని
మూఢవిశ్వాసముల చావు మూడలేదు.
ప్రభువు గలడని సంతృప్తి పడుటకాని
సుకము గల్పించుచున్న నమ్మకములేదు.

చెర్చిపై కన్నెఱ్ఱజేయు హైందవుని సం
ధ్యావందనమున కర్థంబు గలదె?
దేవాలయమును నిందించు సాహెబుగారి
యేకాంతపూజ లల్లాకు సుకమె?
పరుల దోషముల నల్లరిచేయు క్రీస్తు బో
ధకున కావల బారదైను గలదె?
స్త్రీల విజ్ఞానంబు చిదిమి బందీజేయు
దేశాన శిరులు వర్ధిల్ల గలవె?

గుళ్ళు గోపురాలకొఱకు చందాలెత్తి
పొట్టబోసికొనుట పుణ్యమగునె
అన్నమునకు నీటి కంటుజాడ్యం బున్న
చప్పనాతి మతము గొప్పదగునె?

అంటరానివారి యంతరంగంబున
బ్రేలు నగ్ని పర్వతాల ఘోష
అంటరానివాడనై ఆఫ్రికాయందు
తెల్లవారి నడుమ దెలిసికొంటి.

ధనమున్ దొంగిలి దొంగ లుంద్రు భగవద్దత్తం బుదాత్తంబునౌ
మనుజత్వంబును దొంగిలించి యతి నిమ్నత్వంబుం నటించి, త
మ్ముని నేపాప మెఱుంగనట్టి పరమాప్తుం బంచమున్ మంచిగా
దినుచున్నాడ వహింస కింక బ్రతుకేదీ? హిందు సంఘంబునన్?

ఆస విశేషమై, చిలిపి యంతరముల్ చెలరేగి, యాత్మ వి
శ్వాసము వ్యర్థమై, పిరికి వర్థిలి భారతజాతి స్వార్థమున్
మోసము నభ్యసించిన దభూత కథానక కల్పనా కవి
వ్యాసుల సూదిమందుల ప్రభావమునన్ దలకాయ లేనిదై.

సత్యాహింసలు రెండే
ముత్యాలసరాలు సకల పుణ్యంబులకున్
గత్యంతరములు ప్రేమ
వ్యత్యస్థములేని మోక్షపతి నేత్రంబుల్.

నిజమునకు కులమతంబులు
సృజించలే దీశ్వరుండు హిందూసఖు డీ
గజబిజికి కారణంబని
గుజగుజలు పురాణశాస్త్రకోటి ధ్వనించున్.

యుగములనుండి మొత్తుకొనుచున్నవి వేదపురాణముల్ జగ
న్మృగమును బ్రేమతోడ నెదిరించి సమత్వము సంఘటించగా
పగలకు గాలు దువ్వెడు స్వభావ మభావముగా నహింసచే
జగము జయించి జాతిమత శాశ్వత సఖ్యము నుద్ధరింపరే..

మన యింట శాక్యసింహుడు
మునుపే గుప్తంబు జేసిపోయె నహింసా
ఘనతర శస్త్రం బయ్యది
మన కాధ్యాత్మిక బలంబు మన విజయంబున్

దశకోటి పంచముల దు
ర్దశ కై కన్నీటి చుక్క దాల్పని వేల్పుల్
దశలక్షలేల? వెన్నుని
దశావతారంబు లేల? ధర్మములేలా?

న్యాయముగా చరాచర నియంతకు మర్త్యున కాదినుండి, పే
చీ యిసుమంతలేదు, భ్రమచేత విభిన్న మతాభిమాను లై
హాయిగ నున్న లోకమున నగ్ని రగిల్చెదరేల? ప్రేమ త
త్త్వాయతనంబులో శతసహస్రవికుంఠము లుల్లసిల్లెడిన్.

మాటలుదక్క చేత లనుమానముగా తమ పట్టుకొన్న కుం
దేటికి మూడు కాళ్ళనుచు దేవునియంతటివాని కీర్తికిన్
గాటొనరింపజూచు మతగర్వితచిత్తుల భక్తి, శాంతికిన్
జేటగు, వారి బుఱ్ఱకు రుచింపవు కోటిపరాయిధర్మముల్.

భక్తిపరుడుగాడు భగవంతు డీతని
మొగము చూడడంచు పొరుగువాని
విమలచరితలోన విషము జిల్కుట గూడ
సుకరమైన నాగరికపు హింస.

కులములు మెట్లుగా మలచి, గొప్పతనాలను గోపురాలపై
నిలిచి, యవిద్యలోపల మునింగిన నాలుకలేని తమ్ముగు
ఞ్లల నొక తల్లిపిల్లల చిరంతన వత్సలతా సుఖంబులో
కలతలు బెట్టువారి కధికారములేదు స్వరాజ్యపీఠిపై..

ఘోషాలోబడి క్రుళ్ళిపోయినది దిక్కున్ మొక్కులేకుండ నీ
యోషామండలి యెండ కన్నెఱుగ కీ యుత్తుత్త ధర్మాలకున్
భోషాణంబయి బూజుపట్టినది హిందూజాతి చిత్తంబునం
దీషత్ప్రేమ వహించి స్వేచ్ఛ యిడవోయీ! అక్కచెల్లెండ్రకున్.

ప్రొద్దు గ్రుంకని సామ్రాజ్యభూతి గలిగి
సీమరాజుల చిరకాల సింహపీఠి
నొక్క ముసలయ్య యుఖ్ఖాత లూచసాగె
ఆత్మశక్త్యున్నతులకు ప్రాయంబు లేదు.

నేరములేనిది, భీకర
కారాగారములచేత కట్టువడనిదై
భారతము నాక్రమించిన
పోరుం గని బ్రిటిషువారు పూర్ణభయాప్తిన్.

బందికి బోవుచుం దిరిగి వచ్చుచు గ్రమ్మర రాజ్యచక్రమున్
బంది యొనర్చుచుం గటికి పస్తులు సేయు విచిత్రవృద్ధు, కా
మందుల కాలిబంధమయి, మంచితనాన బ్రిటీషువారి ని
బ్బందుల పాలు జేసె తలవంచక వీర స్వరాజ్య భిక్షువై.

మదమన్ ద్రిప్పక దేశభక్తులు ముసల్మానుల్ స్వరాజ్యార్థమై
నడుముల్ గట్టి సబర్మతీ ముని పిఱుందన్ బందిఖానాలకున్
నడువన్‌జొచ్చిరి భాయి; భాయి, యనుచున్ నల్దిక్కులన్ స్వేచ్ఛకున్
గడియల్ సొచ్చిన సూచనల్ దెలిపె, చర్ఖాచక్ర సంగీతముల్.

ఇత డొక పీడరాక్షసి, మహేంద్రుని వజ్ర సహస్ర ధారలన్
వ్రత మొనరింపజాలిన తపస్విరుడింక బ్రిటీషు బావుటా
బ్రతకదు, భారతీయులకు రాజరికంబును కట్టబెట్టుటే
హితమని నిశ్చయించుకొనియెన్ బరిపాలక మంత్రివర్గముల్.

అవలన్ గుంఁడని బల్ల లేర్పరచి యాహ్వానంబు లంపించె పా
ర్థివ ఖండం బిరుమూడుమారు లనురక్తిన్ నౌకలం బంపి య
ర్ణవముల్ దాటి ఁబ్రిటీషు దేశజుల కార్యస్థానముల్ ఁద్రొక్కి హైం
దవ మర్యాదలు నాటె సంచిత బకింగ్‌హాం సౌధరాజంబునన్.

పంచభూతాల పిడికిట బందిజేసి
వలపుదములందు లండనుపురవరంబు
ముతక బట్టల యిండియా ముసలి తబిసి
కడుగులకు మడ్గులొత్తి వెంటాడి నడచె.

జలజాప్తుం జనిపోవనీయక మహాసాఁమ్రాజ్యమున్ గీర్తి నీ
డలలో నిల్పిన యింగిలీషుల ఁప్రచండ ఁప్రజ్ఞ నీ వెట్టి బా
గుల బైరాగి జయించినాడనుచు సిగ్గుం జీదరంజెంది ని
శ్చలమై చూడదొడంగె లండను మహాశ్చర్య స్ఫురన్నేఁత్రమై,

ఈడుడిగి, దుష్టశక్తుల
నోడించెడువాని, వలపు లొలికెడు వానిన్
మూడుం గాళుల ముదుసలి
నోడ దిగినవాని, జగము నూచెడు వానిన్.

ముక్కద్దంబులతో, ఁబశాంత కళతో ముత్యాల లేనవ్వుతో
పక్కా ఖద్దరు టంగవస్త్రము కటిన్ బంధించి మే యెమ్ములన్
లెక్కం బెట్టగ జాలు, వార్ధకముతోన్ జెన్నారు గాంధీమునిన్
పక్కై పండినవాని, విస్మయ రసాపాదిన్ దయామేదురున్

బట్టలమిల్లు వర్తకము బాడొనరించి ఁబ్రిటీషు సింహమున్
దట్టి లడాయి రేచిన యుదఁగ్ర పరాఁక్రమశాలి, ముజ్జగ
జ్జెట్టి సబర్మతీముని ఁప్రసిద్ధుడు వచ్చెనటంచు నంజెలుల్
బట్టిరి స్వాగతం బొసగి లండను నాగరు లోడ రేవునన్.

హరిహరుల లక్ష్యపెట్టని
బెరనారుడుషా మహాకవి ఁప్రవరుండున్
దరిసెనము జేసికొనియెన్
నెరసిన తలవంచి వచ్చి నెచ్చెలికాడై.

రాముసే మేగ్దనాల్డు సర్ సాముయేలు
హోరు మున్నగు సున్నతోద్యోగివరులు
హర్ష పులకితగాఁత్రులై యర్ఘ్య మిచ్చి
గౌరవించిరి గాంధి మేకకును గూడ.

ఒకడననేల పేరుగల యూరపుఖండపు వాసి నల్లవా
నికి తలవంచరాదనెడు నిష్ఠ రహించెడు స్వాభిమాని య
య్యకలుషమూర్తి చిర్నగవుటమ్ములు తొమ్ములనాటి కేలుమో
డ్పుక విరమింప దయ్యె ననజాలుగదా? భరత ప్రతిష్ఠకున్.

పుట్టిననేల కేల్మోగిచి పూవుల పూజలు సేయుచుండగా
పుట్టిన గడ్డ పుత్రకుని భూరియశస్సు గణింపకుండ కా
బట్టక మిన్నకుండుట శుభ్రప్రద మచ్చటి మానవప్రభువుల్
పుట్టను పుట్టి గిట్టు చెదపుర్వులు సుమ్ము వివాద మేటికిన్.

తేనీటి విందు కాహ్వానించి పూజించి
చరితార్థుడై పోయె జార్జిరాజు
సలహా నెపమున చెలిమికాంద్రైనారు
రాష్ట్రపాలురు వయిస్రాయివరులు
ఇండియాముని కోర్కె నీడేర్పుదని మాట
గలిపినా రమెరికా ఖండ ప్రజలు
దరిసెనం బొకమారు దయచేయుడని మెచ్చి
ప్రణుతించినా రక్ష రాజవరులు

ఘనత కెక్కిన పాశ్చాత్య ఖండమెల్ల
ప్రేమతో గాంధిమూర్తి ముద్రించుకొనియె
జాతిజనకుని విశ్వవిఖ్యాతి దలప
నరనరంబున గర్వంబు మెరసిపోవు.

లండను పోలీసుకాండరవీరులు
వేయిగన్నుల కాపలా యొనర్ప
ఇనుపముక్కలను లో గొనజాలు సూదంటు
జాతి యంత్రాలు సంరక్షసేయు
ఇరుకెలంకులను మోటరు గుఱ్ఱములమీద
రాజకీయోద్యోగి రాజి నడువ
భీకరార్భటులతో నాకాశమార్గ మ
ధ్యమున దోడుగ విమానములు దిరుగ

హిందుజాతి జనకు డితని కెట్టి ప్రమాద
మంటదగదటంచు నధిక భక్తి
పూలలోన నుంచి పూజించి రౌదార్య
భూషలైన యింగిలీషు నృపులు.

పుట్టువుతో ధరావలయముం బరిపాలనసేయు హక్కు, జే
పట్టినదీ బ్రిటీషు పరిపాలకవర్గ మటంచు దంబముల్
గొట్టిన మంతురుల్ ముతుక గోచులరాయని యాత్మశక్తి క
ట్టిట్టయి యంజలించిరి మహత్తర భారత ధర్మదూతకున్.

గడియలో సీమదుస్తులు గట్టబెట్టి
నల్లదొరలను జేయు లండను పురంబు
విశ్వభారత జాతీయ వేషవహుని
కాలి చెప్పులు దీయించ జాలదయ్యె.

చెప్పుల కాళ్ళతోడ జని సీమనృపాలుని సౌధసీమలో
గొప్పగ గౌరవింపబడి కూరిచినాడు యశస్సు జాతికిన్
దుప్పటి దుద్దుగట్టుగల తోరపు వృద్ధుడు గాంధి, యిండియా
తిప్పలు దీర్ప బుట్టిన యతీర్షభుడంచు నుతించె దేశముల్.

# రాయబారము

హిందూదేశము రాజభక్తి నిలయం బిన్నాళ్ళు మీ పాలనా
బందీగేహములో కృశించినది మా బంగారమున్ రత్నముల్
సందైనంతగ దోచికొంటిరి నమస్కారంబు మీ కింక మా
యందొక్కింత యనుగ్రహించి దొరలారా! పొండు మీ యిండ్లకున్

ప్రకృతి యూడిగ మాచరింపగ యనంత
బలము సాధించినట్టి భూపతులు మీరు
ధర్మదేవత పాదపద్మములవద్ద
యూడిగము జేసికొని నిరాయుధుల మేము.

స్వాతంత్ర్యమ్మును, రాజదండమును మీ స్వాధీనమున్‌జేసి, మా
భ్రాతల్ దాస్యము చేయసాగి కడచెన్ బహ్వబ్దముల్ జుట్టు మీ
చేతన్ జిక్కె దయాంతరంగమున నాశీర్వాదముల్ సల్పి మా
జాతీయ ధ్వజ మెత్తుకొందు మిక స్వేచ్ఛా భిక్ష గావింపుడీ!

పాలకులైన మీరు పరిపాలిత జాతి శిరస్సు నెక్కి గు
఼్రాల రథాలు దోలుకొను టాతిమనస్కులుగారు, కోటియం
త్రాలకు సాటియౌ కదురురాటముతోడ సహస్రకోటి వ
ర్షా లెదిరించి తీరెదము జాతి యెఱుంగని దుష్టశక్తులన్

తెలుపు న్నల్పను రంగు భేదమున సంధీభూతమై యున్న క
న్నులలో ధర్మము కాలు మోపదు, కృతఙ్ఞుల్ నేటికిన్ భారతీ
యులు మీ మారటతల్లి ప్రేమలకు మీ యూడించు స్వర్గాలకున్
తలిభాషన్ మరపించు భోగపు నెలంతం బోలు మీ భాషకున్.

ఊడల్ బ్రాకిన పిచ్చి నమ్మకము లెన్నో పట్టి వేధింప మా
యాడంగుల్ పరువెత్తుచుండెదరపత్యార్థంబు తీర్థాలకున్
తేఢాలుం దెగదెంపులున్ మధురశాంతిన్ జంప నజ్ఞానపుం
బీడై యున్నది భారతక్షితి దగావేదాంతకాంతారమై.

ఈ తబ్బిబ్బుల పిచ్చి పోకడలతో నీ స్వార్థవారాశిలో
నీతల్ గొట్టెడు నా సహోదరుల నింకెన్నాళ్ళు బంధించి, మా
స్వాతంత్ర్యం బరికట్టజూతు రనుకంపంబూను దొక్కింత, వే
ణోతల్ మీకు; సహింపజాల మిక విచ్చుంగత్తి రాజత్వముల్.

అలవాటైనది హింస మానవునకీ యాపత్తు వారించి, బె
బ్బులికిం బ్రేమతపస్సు నేర్పి భువనంబున్ దిద్ది, యాధ్యాత్మికో
జ్వల విద్యన్ వెలయింపగా వలయు నీ సత్యప్రచారార్థమై
బలియిత్తుం దుదిరక్త బిందువును దైవంబాన ముమ్మాటికిన్.

హిందువుల జుట్టుతోడ సాహెబుల దాడి
పెనచి ముడివైచి రాజీకి బిలిచినారు
రాజనీతిజ్ఞులగు తెల్లరాచవారు
జములు మాటల రాయబారములు నెఱపి.

నో రూరించు ప్రియోక్తులం బలికి యిన్నూరేండ్లు పాలించు బం
గారుం బిచ్చుకలైన భూపతులు వాగ్దానంబు పాటింతురే
దారా లుచ్చులుగా రచించు నవధూతన్ గాంధి మన్నింతురే
క్ష్మారాజ్యంబును గట్టిపెట్టగ బ్రిటీష ర్లాహరిశ్చంద్రులే.

పలుమారుల్ వలపారు లండనున కాహ్వానించి పేచీలు, చి
క్కులు గల్పించుచు రిక్తహస్తముల వీడ్కోలిచ్చి పంపించినన్
గలతం జెందక సత్యధర్మ ఘనదీక్షాదివ్యమార్గంబునన్
బలగంబున్ నడిపింపసాగె మహిత స్వాతంత్ర్య లగ్నాత్ముడై.

తెనుగుం దేశమునందు గర్తపురి గాంధీ దివ్యసందేశ శం
ఖనినాదంబున కాసెగట్టి రణరంగక్షోణి లంఘించి, స
ల్పిన పోరాటమునం దఖండ బహుళ క్లేశంబులం గుంది కం
దిన యోధుల్ గల రిప్పుడుం బురమునన్ దేశక్షమారాధకుల్.

ఘనభక్తిన్ గుజరాతు సాధునకు భిక్షాపాత్రలో చిత్తమున్
గనకంబున్ గురియించి యేలికల ఖడ్గచ్ఛాయలం బందియై
తను వర్పించిన త్యాగభూమి సుమి యాంధ్రంబన్న సత్కీర్తి తె
ల్లని కుళ్ళాయము లల్లి యిచ్చినది తొల్తన్ తోడు దేశాలకున్.

నిలిచి లాటీల దెబ్బలకు మస్తము లొడ్డి
స్వాతంత్ర్య దుందుభుల్ సఱచినారు
ప్రాయంబులో మూడుపా ళ్ళిట్టునట్టుగా
కిగ్గాడి చెర కప్పగించినారు
చెరసాల కుడ్యముల్ కరగి ఖంగున మ్రోయ
జాతీయగీతముల్ సదివినారు
మువ్వన్నె జెండాల ముదురునీడలలోన
స్త్రీ దళంబులు నూర ద్రిప్పినారు

పేదవడియున్న మాతృకవిత్వమునకు
సభలు సన్మానములు చేయ సాగినారు
గాంధి వీరర్షి శాంతి శంఖారవంబు
దెసల మార్మోగినంతన తెలుగువారు

క్రమ్మెన్ ఖద్దరు కొత్తబట్టల జగాగంధంబు నల్దిక్కులన్
గ్రమ్మెన్ దొంటి స్వదేశ నాగరికతా కల్యాణ వాతూలముల్
గ్రమ్మెన్ బల్చని రక్తనాళములు ధైర్య స్థైర్య శౌర్యాంశువుల్
గ్రమ్మెం గమ్మని గాంధి సూక్తులు ప్రజాకరప్రమోదంబునన్.

ఇల్లున్ వాకిలి వీడి త్యాగధనులై యిల్లాండ్రతో బండి యం
దుల్లాసంబుగ కాలమున్ గడిపి మాన్యుల్ ద్రావిడాంధ్రప్రజల్
కొల్లంగొట్టిరి గాంధి సన్నుతుల నక్కుం జూపి పోరాడుచున్
జెల్లెన్ శ్రీ హనుమంతు ప్రప్రథమ గాంధీ శాంతియుద్ధంబునన్.

ఖయిదీ లై కృశియించి ప్రాయమున రోగగ్రస్తులై తీరి, య
క్షయ కీర్త్యబ్జ కిరీటధారులయి నక్షత్రంబులై, విశ్వ వి
స్మయముంగొల్పు తెలుంగువీరులు శిరోమాణిక్యమున్ బ్రాహ్మణా
న్వయ రత్నంబును కృష్ణయం దలచి యాంధ్రం బిప్డు శోకించెడిన్.

# జిన్నా

దెబ్బకు రెండుముక్కలగు ధేనువుగావలె భారతంబు మా
లబ్బికులంబు హైందవుల లాతితనంబు సహింప దెందు కీ
జబ్బు సమష్టిపాలనము సాగదు మా కనుచుం దగాయిదా
మబ్బులు రేగదీసె మతిమంతుడు జిన్నయ శాంతికామియై.

జిన్నా కోరిక రెండుగా నెడదవిచ్ఛేదించినట్లే, కటా!
యిన్నాళ్ళందినపాటులెల్ల వితయయ్యెన్ రెండుగా జీల్తురే
కన్నమ్మన్ బహుళాద్రిరాజములతో గంగాది తీర్థాలతో
గన్నుల్ పండువుచేయు దేశమును లంకాపీఠికాదేవతన్.

అని కన్నీటి కషాయనేత్రములతో నారాటమున్ జెంది, భో
జనమున్ ముట్టక పస్తులుండ దొడగెన్ సర్వంసహాచక్ర మ
ల్లన భీతిల్లగ నాశ్వినేయులను కాలంద్రోయగాజాలు మేల్,
ఘనవైద్యు ల్బనులందజొచ్చి రెలమి న్గాంధ్యాయురాకాంక్షులై.

నిరశన దీక్షారతుడగు
నరాల ముసలయ్య, యొక్కనాడును మూర్ఛా
భరమున దూలక సోలక
దరహాసము వంటి మేలి దారము వడకెన్.

క్రిప్సు వచ్చి రాజకీయ నాయకులతో
సంప్రదించి సంధి సలుపలేక
వ్యర్థయత్ను డగుచు భారతీయులమీద
నేరమంత రుద్ది దారిబట్టె.

ప్రశయాగ్నింబలె చుట్టు ముట్టుకొని సంగ్రామంబు వాటిల్లె, క
వలె మీ ఖుమ్మకు మాకు నుమ్మడిగ జాపాన్ జర్మనీ నా జీజ
జ్వలనం బార్పుదమంత మీ కథినివేశ స్వేచ్ఛ నర్పింతుమం
చలరుం దేనియలూర క్రిప్పుదొర యభ్యర్థించె సాహాయ్యమున్.

నరమాంస భక్షకుల్ జరమనీ దేశజుల్
కరకుందనంబు హిట్లరుని సొమ్ము
జాపనీయులు జగజ్జన కంటకులు వారి
నరపాలకుడు శుద్ధ నాస్తికుండు
ముసులోని నిలువెల్ల విసమూరి వెలికెక్కు
నైటలేయులకు న్యాయంబు సున్న
టోజోకు మీమీద నాజన్మ వైరంబు
గోరింగు పాపాల భైరవుండు

ప్యారచూటు దళము లగ్ని చల్లకముందె
మందభాగ్యమైన హిందు ధరణి
కాంగిలేయ ప్రభువు లభయంబు బంపిరి
లెండు రండు వేళ లేదు మనకు.

అని క్రిప్సుం డుపదేశమీయ విని, దూరాలోచనా చాతురీ
వనధీశుండగు గాంధి క్రిప్సు సలహా బాటింప కీ దాస్యబం
ధన బందీకృతమైన దేశమునకున్ సాంగ్రామికంబైన భీ
తి; నిరాధార మటంచు తద్విముఖతన్ దెల్పెన్ వినిర్భీకుడై

కదనముచేయు భారతము గాదిది రక్త చరిత్రచేత నా
పదలకు నగ్నమై కటికి పార్థివ కోటిని మేపి వెట్టిదై
బెదరి నమస్కరించు నల పెద్దలనాటిదిగాదు మానవా
భ్యుదయము గోరు నూతన మహోదయ భూమి సుమీ సహోదరా!

చిరపరాధీన బంధుర శృంఖలంబును
రక్తపాతము లేక వ్రక్కలించి
మానవత్వము నాదమఱచిన జాతిలో
చెలికారమున కింత నెలవు సూపి
ముదురు సోమరితనంబున మ్రగ్గుగడ్డలో
దేశీయ కళలకు దీపమెత్తి
అజ్ఞానమున నీతలాడు సోదరులకు
విద్యాపరిజ్ఞాన భిక్షపెట్టి

పరిహసించెడు పొరుగుదేశములతోడ
సభ్యతా గౌరవంబు నార్జనముచేయ
సిద్ధపడుచున్న దస్మత్ప్రసిద్ధభూమి
వలదు మాకింక సీమభూపతుల చెలిమి.

ఆనాజీలును జప్పనీయులును మ మ్మాగ్నేయ గోళాలతో
ఖూనీచేయ పురావిరోధములు మాకున్ వారికిన్ లేవు క
య్యాన న్నిల్చి పెనంగినం దొరుకు భాగ్యంబెల్ల మా కీ పరా
ధీనంబైన యదంత్రపుం బ్రతుకు గాదే? క్రిప్సు మంత్రీశ్వరా?

జాతిం బీలిచి పిప్పిజేసెడు సమస్యల్ పెక్కు, నట్టింటిలో
సైతానుల్ బలె గూండ్లు గట్టుకొని సంసారంబు సాగించెడిన్
శాంతంబై, సుఖదాయకంబగు నహింసాఖడ్గమున్ బట్టి మ
ద్భ్రాతల్ సాధనసేయు రోజు లివి పోరాటంబు లాశింతురే.

హరిజనుల యంటుదోషపు
మురికిం దొలగించుకొన్న ముడిబట్టలతో
కరుణా పరిణత మతియగు
భరత క్షితి సాయపడదు భండనములకున్.

పోరికి సాయము గండని
కూరిమి పాటించు క్రిప్సు కోరిక వృధగా
మారాడి పంపి యావ
ద్భారతికి విధించె సమర వైముఖ్యంబున్.

నలుదెసలం గరాళ దహనంబు రగుల్చుచు విస్తరించి య
గ్గలపు కపాల మాలికలు గజ్జెలుగా రణరక్త లాస్యమున్
సలిపెడు నక్షరాజుల కషాయ కటాక్షము సోకదయ్యె, సిం
హళము మొదల్ హిమాద్రివర కంచిత గాంధి తపోబలంబునన్,

పో రైదేడులు మర్త్యమాంసమును సంపూర్ణంబుగా మెక్కి నా
నారాజ్యంబుల నస్థిపంజరములన్ గావించి యాంగ్లేయ భూ
దార గ్రామణులన్ వరించు వరకాదర్శ క్షమాశాంతి వి
స్తారున్ బందియొనర్చి తృప్తిపడియెన్ సర్కారు చర్మామునిన్.

పచ్చినెత్తురు ద్రావు ప్రళయ సంగ్రామంపు
టురుములంతికమున నురుముచుండు
జాతీయసేన ఘూర్జరసాధుతో గూడ
ముద్దాయిలై క్రుళ్లి పోవుచుండ
క్షామదేవత భుభుక్షాశాంతికై నోరు
దెరచి పేదల గొంతు గొఱుకుచుండ
ఆహవనిధికి ద్రవ్యము గావలయునంచు
సర్కారు చేతులు జాచుచుండ

తరుణ మమరినదని, కులాంతర మతాంత
రముల నెడమైన నల్లమార్కట్లవారు
వెలలు మింటికి బెంచి, దీనుల రుధిరము
బిందుకొన్నారు బెబ్బులిపిండువోలె.

చిట్టెడు గంజికై వగచి, చేతులు సాచి, కృశించి పాపపుం
బొట్టలతో ననంతధనమున్ గడియించిన సాహుకార్ల కా
బట్టని, జాలిసోకని యపాంగ తిరస్కృతులంది, కల్కతా
పట్టణ వీధులం దరచి ప్రాణము వీడిరి దీనమానవుల్.

మానవుల రక్తమాని సంపన్నులయిన
పరమభక్తాగ్రణుల మ్రొక్కుబళ్ళకతన
నాపదల కడ్డపడు గుళ్ళుగోపురాలు
కడుపు నిండినవారికి గుడువబెట్టె.

ఆగస్టు విప్లవానల
మూగించె న్నాల్గుచెఱగు లుర్వీతలమున్
రాగల స్వరాజ్యలక్ష్మికి
త్యాగుల రక్తంబు తిలకమై విలసిల్లెన్.

పరమాణు గోళ మొక్కటి
పరిష్కృతము జేసె ప్రళయభండన జయమున్
మెరసెం బ్రిటీషు జెండా
పరాఙ్ముఖంబైన భరతవర్షము నందున్.

చెరబట్టంబడి పంచవర్షములు శుష్కీభూతులై యున్న జ
హ్వారులాల్ మున్నగు దేశభక్తులకు నిర్బంధంబు మన్నించి రా
దర మేపారగ సీమభూపులు సమాధానంబుతో, మోహమున్
జిరునవ్వుల్ జెరలాడు త్యాగధనులన్ స్వేచ్ఛా రణోద్దండులన్.

బందియందు గాని భవనంబునం గాని
ముదముతోడ నేండ్లు పూండ్లు గడపు
పరమ సాధుమూర్తి బాపుజీ దృష్టి నం
తరము లేదు స్వర్గనరకములకు.

నిముసం బుండగరాదు తెల్లదొర లీ నేలన్ బ్రజాభీష్టమున్
సమయింపం బనిచేయజాలవు భుజాసారంబు శస్త్రాస్త్రముల్
క్షమ మాసొమ్మొడబాసి పొందనుచు గర్జత్సింహమో నాగ నం
తిమసందేశమునంపె భూపతులకున్ గ్విట్టిండియాకాండమున్.

కినుకన్నేరని గాంధి బంపిన మహాక్విట్టిండియా వీరశా
సనమాయంబున గాయమున్ సలుప పాశ్చాత్య ప్రభుల్ మెత్తనై
మొనగాంఢ్రన్ దలయెత్తి చూడని కళాపూర్ణోజ్జ్వలున్ గార్యద
ర్శిని లారెన్సును బంపిరింపలరు రాజీ రాయబారాలకున్.

వరములు చేతబట్టుకొని వచ్చిన రాజుల కార్యదర్శి సా
దరముగ దేశనాయక సదస్య సదీప్సితముల్ ఫలింపగా
త్వరగ స్వరాజ్యసిద్ధి కగు సత్పథకంబు తయారుచేసిన చె
చ్చెరజనె గోచిపాతల ఋషిర్షభునాశిషముల్ గ్రహించుచున్.

ఎన్నికలలోన బాల్గొని
మిన్నంటిన జయముతోడ మేధానిధు లై
యున్నత పదవుల నెక్కిరి
కన్నుల పండువగ గాంధి కాంగ్రెసు భక్తుల్.

నేరగ్రస్తముగా గణించబడు యన్నేతాజి సిబ్బందికిన్
గారాగార విముక్తిజేసి పదవుల్ గల్పించి మన్నించి స
త్కారంబుల్ సభ లాచరించి రెలమిన్ గాంధీ శుభాశీర్వచః
శ్రీరమ్యుల్ ఘన దేశభక్తులు స్వదేశ న్యాయవాదీశ్వరుల్.

చిరకాల శ్రమముల్ ఫలింపగా లభియించెన్ స్వీయ రాజ్యంబు సా
గరపర్యంత వసుంధరా రమణి శృంగారించె మస్తంబునన్
గరిమన్ గల్కితురాయిగా ఖదరు జెండా దేహ ముప్పొంగగా
వరియించెం బ్రథమ ప్రధాన సచివత్వ శ్రీ జవర్పండితున్.

పాకీస్థానముగా సగంబు నరికింపం బడ్డ నెమ్మేనితో
ఆకారంబు వికారమై మనసునం దారాటమున్ గూర్చుచున్
చీకాకై కలహ ప్రమాదములతో చేజిక్కి యున్నట్టి స్వే
చ్ఛాకల్యాణి ఘటించె నించుక నిరుత్సాహంబు తాతయ్యకున్.

కుంపిని వారు కేతనము గ్రుచ్చిన చోటన జాతి బావుటా
యింపలరారు చున్న నిను తృప్తి యొకింత తురంగలింపగా
కొంపయు గోడులేని ఋషికుంజరు డెల్ల మతాలవారు మ
న్నింపగ నుద్యమించె మరణించిన హిందు తురుష్కమైత్రికిన్.

కాశ్మీరమున నాలుకలు సాచు ప్రబల సం
    గర వార్త మనసును కలతపెట్ట
హైదరాబాదులో పాదుకొన్న యశాంతి
    యంతరంగమున గాయంబు చేయ
కలకతా నగరాన మొలకలెత్తిన వర్గ
    కలహంబు గుండెలు నలిచి వేయ
సకుటుంబముగ బారి చనుదెంచి మొరపెట్టు
    కాందిశీకుల కాత్మ కళవళింప

కోటికొమ్మలతో నెదుర్కొనుచునున్న
మత మహా మూర్ఖ మహిషాల మలుప లేక
శాంతి రణరంగదూత స్వేచ్ఛాప్రదాత
తపిత చిత్తాన గ్రమ్మర నుపవసించె

ప్రతిరక్త కణము భరత
క్షితికై వెచ్చించి స్వేచ్ఛ జేకూర్చిన యా
శతవృద్ధు నాహరించెన్
ధృతిహీన మతస్వరూప, మృత్యువు కినుకన్.

గాంధి దేశసేవ కాసుకు రాకుండ
నిరసనంబు సేయ దురితరతుల
ఊతిగుండె లూషరక్షేత్ర మృత్తిచే
సృష్టి చేసెనేమొ సృష్టికర్త.

ప్రతిమల్ సెక్కి శిలాసహస్రముల నారాధించినన్ గాదు భా
రతదేశాన ననైకమత్యములు, నీర్ష్యాద్వేషముల్, స్వార్థమున్
గతమై దోషపుజాఅలేని యొక సాక్షాత్ స్వర్గ మింపారినన్
బ్రతుకుం గ్రమ్మర శ్రీ సబర్మతి మునిబ్రహ్మంబు ముమ్మాటికిన్.

ఆ కన్నుంగవలో వెలింగెడు సుధాహాసంబుతో, నా ప్రశాం
తాకార ప్రభతో, నిటాతటలవిన్యస్తాబ్జహస్తాలతో
వైకుంఠంబున నుండి జాతిపిత సంప్రార్థించుచున్నాడు హిం
సాకాలుష్యములేని భారత భవిష్యద్దివ్య సామ్రాజ్యమున్.

నా మేని భస్మచయమున్
నీమంబుల బుణ్యనదుల నిల్పినయంతన్
నా మనము చల్లవడదని
ప్రేమోక్తులతోడ హెచ్చరించు న్నేడున్,

పరరాజ హస్తగతమై
వరవుడ మొనరించు హైందవంబున కదియే
మెరుగనిపించినచో నిక
స్వరాజ్య సంపాదనంబు వ్యర్థంబ కదా?

గుడులకు బిల్చి పంచములకున్ బెనుఋలాలను జూపి యూరిలో
నెడముగ సంచరించు ధృతిహీనములైన సమత్వ ధర్మముల్
బుడిబుడి సానుభూతులును మూర్ఖునిచేత తుపాకి గాయముల్
దడవుటగాక గాంధి మునినాథుని యాత్మకు శాంతి గూర్చునే?

గాంధి రక్తధార క్ష్మాతలంబున జింది
ప్రభవమంద దొక్క బాపుజీయు
బాపుజీకి బదులు పదివేల గోడిసేల్
బ్రబలి రందు రేమి పాప మొక్కొ!

పూర్వ పశ్చిమగోళాలు మోకరించి
యే మహావ్యక్తి కొగి నమస్కృతులు సలిపె
నట్టి బాపూజి మనమధ్య బుట్టు కతన
సభ్యతాస్ఫూర్తి భరతవర్షమున కమరె.

చెదరిపోయినది నీ చిత్త వైశాల్యంబు
బహుకాల పరదాస్య బంధనమున
నీటిపాలయ్యె నీ నిస్వార్థనియమంబు
యినుపగజ్జెలతల్లి కనికరాన
సడలిపోయినది నీ సర్వసమత్వంబు
దృఢమైన వర్ణభిత్తికల కతన
మొక్కవోయినది నీ భుజదర్ప గరిమంబు
రిక్త వేదాంత పరిశ్రమమున

జాతిపిత చూపి చన్న విశాలమైన
నమ్రతఘంటాపథంబున నడుగు మోపి
సాగనీవోయి స్వాతంత్ర్య సంసరణము
బ్రతికి చెడియున్న వీరభారతకుమార.

పదునై యున్నది భారతం బిపుడు శ్రీ బాపూజి రక్తంబునన్
వెదబెట్టందగు శాంతి సస్యమును ప్రాప్తించెం గిరీటంబు నీ
కుదుటంబడ్డ కుటుంబమందు కలహాంకూరంబులన్ మాన్పి యా
పదపాల్గాక సుఖింపవోయి భరతాంబా గర్భముక్తామణీ!

త్రావుచున్నది వినిర్దయత పేదల నల్ల
ప్రాకిన దొంగవర్తకపు జలగ
ఉరుముచున్నది పండ్లు గొరికి మార్మ్మాలల
నంటుజాడ్యంపు టంకమ్మసత్తి
జననమందినది భాషారాష్ట్రవర్ణాల
మరుగున స్వార్థంపు టెరుసుదనము
సోకుచున్నది కళాశుద్ధాంత కాంతకు
నీతి దప్పిన పక్షపాత దృష్టి

శ్వేతరాజుల చేతుల జిక్కుపడ్డ
వసుధ సాధించి యిచ్చిన ముసలివాని
పచ్చినెత్తుటి ఋణ మెట్లు బాపగలవొ!
నిక్కి సామ్రాజ్య హరి నెట్లు లెక్కగలవొ!

కలుపుంగోరుతనంబు గోలుపడి ముక్కల్ ముక్కతా హెచ్చుత
గ్గుల తత్త్వాల మహాపిశాచముల యుక్కుంగోరలం జిక్కి శో
షిలు మర్త్యత్వము నుద్ధరించి చనియెన్ శ్రీ గాంధి రాజర్షి! కా
గల హిందూ సఖ! నిల్పుకొ మ్మిక నిజాంకప్రాప్త రాజ్యేందిరన్.

తురకల ఖడ్గపాతమున తుండములైన యఖండభారతో
ర్వర! చిరకాల శాంతిసమరశ్రమ క్రమ్మర సంఘటింపగా
పరమపదించినట్టి యుపవాస విశుష్కితవృద్ధు, సృష్టిసా
గరమున లీనమై భరతగౌరవకాంక్ష దపించు నిప్పుడున్.

# ముళ్ళపూడి వెంకటరమణ సాహితీ సర్వస్వం

రూ.

**మొదటి సంపుటం: కథారమణీయం-I** 150

సీతాకల్యాణం, ఇద్దరమ్మాయిలూ-ముగ్గురబ్బాయిలూ,
జనతా ఎక్స్‌ప్రెస్, రాజకీయ బేతాళ పంచవింశతి - ఇతర కథలు.

**రెండవ సంపుటం: కథారమణీయం-II** 150

ఋణానందలహరి, కానుక, రాధాగోపాలం, సాక్షి,
ఆకలీ-ఆనందరావు, విమానం కథ - ఇతర కథలు.

**మూడవ సంపుటం: బాలరమణీయం - బుడుగు** 80

**నాల్గవ సంపుటం: కదంబరమణీయం-I** 150

నవ్వితే నవ్వండి, పీరికలు, వ్యాసాలూ, ఇతర రచనలు.

**ఐదవ సంపుటం: కదంబరమణీయం-II** 150

గిరీశం లెక్చర్లు, కృష్ణలీలలు, వ్యాసాలు, ఇతర రచనలు.

**ఏడవ సంపుటం: సినీరమణీయం-II** 150

కథానాయకుని కథ (అక్కినేని నాగేశ్వరరావు జీవితచరిత్ర),
చలనచిత్ర ప్రముఖులపై వ్యాసాలు.

## త్వరలో...

**ఆరవ సంపుటం: సినీరమణీయం-I**

విక్రమార్కుని మార్కు సింహాసనం కథలు, చలనచిత్ర ప్రముఖులపై
వ్యాసాలు, స్వదేశీ-విదేశీ చిత్రాలు సమీక్షలు.

**ఎనిమిదవ సంపుటం: అనువాదరమణీయం**

ఎనభై రోజుల్లో భూప్రదక్షిణం, పిటి 109.

## ప్రతులకు:

**విశాలాంధ్ర బుక్ హౌస్:**

హైదరాబాదు (సుల్తాన్‌బజార్, అబిడ్స్), విజయవాడ, అనంతపురం,
విశాఖపట్నం, హన్మకొండ, గుంటూరు, తిరుపతి, కాకినాడ.

# నేతాజి

# భూమిక

శ్రీ సుబాసుబోసు చరిత్ర మద్భుతమైనది. అతని అజ్ఞాత పలాయనముతో నాసేతు హిమాచల మాశ్చర్యచకిత నేత్రమైనది. ఒక భరతదేశమే కాదు - ఖండాంతరములు, కన్ను దెరచినవి. బోసు మహాత్యాగి. అతని త్యాగముతో దేశ మతనికి ఋణపడ్డది. గగన మగ్ని వర్షములు కురియు కాలాన, మన కతడాతపత్రమై నిలిచి ఆదరించినాఁడు. నేఁడు మనము చూఱలాడు స్వేచ్ఛా స్వరాజ్యమునకు సుబాసుబాబు రత్నస్తంభమై నిలిచినాఁడు. అతఁ డభినయించినది మహోత్తమపాత్ర, నేఁ డత డవనికాభ్యంతరమున నున్నాడు. బోసు శాశ్వతుఁడు, ఆ మహనీయునకు - కావ్యనమస్కారము చేయక నా చేతు లూరకొనకపోయినవి. పరమపదించిన నా తండ్రిగారికి యీ కావ్యము నంకితము చేయుచున్నాను. వీరగాథాకర్ణన కుతూహలస్వాంతులయిన మా నాయన గారి యాత్మ కీకావ్యము శాంతి సమకూర్చుగాక.

-గ్రంథకర్త

# అంజలి

పాలిత ప్రజల ప్రాణాలు పన్నిదముగా
నధిపతుల్ జూదంబు లాడువేళ
ప్రళయ సంగ్రామ దేవత మింటి కెగబ్రాకి
చిచ్చర పిడుగులు జిమ్ముువేళ
పేరైన బ్రిటిషు నౌకా రాణివాసంబు
ముక్కలై మున్నీట మునుఁగు వేళ
అఖిల జాతీయ నాయకకోటి గుజరాతు
సెట్టితోఁ జెరసాలఁ జేరువేళ

గుండె లరచేతిలోఁ బట్టుకొని, జపాను
పొట్టి తోడేటి ధాటికిఁ బొక్కుచున్న
దేశ జనయిత్రి కభయ సందేశ మంపి
ఆదరించిన నేతాజి కంజలింతు.

నాలుగు దిక్కులం గమిచి నాట్యముసేయు బ్రిటీషు నేత్ర దీ
పాల వెలుంగునం బడక భారతభూములు నిర్గమించి, కా
బూలునఁ గాలు మెట్టిన యపూర్వ చమత్కృతివార్థి, బోసుతో
బోలుదురే? యుగంధరుడు మున్నగు తొంటి యమాత్య శేఖరుల్.

అడుగడ్డునకు వెంటనంటి, వాసనబట్టు
కరకు సి. యై. డీల కన్నుమాపి
సహజ గంభీర వర్చస్సు గుప్తము సేయు
చక్కని మొలక మీసములు బెంచి
అనుమానమున కింతయును దావుసూపని
ప్రకృతి సిద్ధంబైన పలుకు మార్చి
నాడెంపు లొడుగు చల్లాడంబు దాలిచి
కాబూలువాని పాగా ధరించి

ఖర్చుకై చేత నొక చిల్లిగవ్వలేక
కదుపులై వచ్చు నాపద లెదురుకొనుచు
భరత జనయిత్రి శిరమున భారముంచి
బోసు గావించినాడు కాబూలుయాత్ర.

సెలవందుకొన్నది కలకతా నగరంబు
    నిండిన వేడి కన్నీటి తోఁడ
సాగనంపినది రోషము వోసి, వంగంబు
    బాలింప నెలకొన్న భద్రకాళి
చిన్నవోయినది, కుంచిత కళాపుంజమై
    మేలైన నిలువుటద్దాలమేడ
దీవించినది రత్న దీపాంకురములతో
    మర్యాద లొనరించి మంచుగొండ

దేశదాస్యదళన దీక్షానిబద్ధోగ్ర
కరణంబు మెరయ కత్తిబట్టి
కటిక రాత్రి బందిఖానా నుడాయించి
బోసుబాబు దాటిపోవువేళ.

# కన్నతండ్రి

కాలుంజేయియుఁ బక్షవాతమున శుష్కంబై, బలాఢ్యున్ నినున్
దూలింపన్ మనుమల్ దనూభవులు ముద్దుం గోడలున్ సర్వ సౌ
ఖ్యాలోలిన్ సమకూర్ప, నిత్యమును శయ్యం బండి కన్పట్టు, నీ
వేలోకంబునఁ బ్రక్కవైచితివి? తండ్రీ! నేఁడు వీరాభిధా!

నా సన్మానముఁ గన్నులార గని, ఆనందించు నీ జన్మమున్,
నీ సంతాన విభూతి, మెచ్చుకొనుచున్ నీ మూర్తికిన్, ఠీవికిన్,
"దాసోహమ్మని" యంజలింపదె? కవీంద్రశ్రేణి? యే గొల్లవాఁ
డేసూక్రీస్తుని భక్తుఁ డందుకొనె తండ్రీ! యిట్టి మర్యాదలన్.

సుద్దుల్ సెప్పుచు వీరగొల్లల యశంబున్ బాహుపాండిత్యమున్
ముద్దుల్‌గారు విలక్షణం బయిన యేద్పుం బాణితో బాడి, మా
పెద్దల్ వీరని పొంగిపోయెడు భవ ద్వీరోత్సుకత్వంబ కా
ప్రొద్దుల్ నిండిన కైతయై వలచె బాబూ! నన్ను బాల్యంబునన్.

ముక్కుల్ నొక్కి కుమాళ్ళ మ మ్మిరువురన్ ముద్దాడి పొంగారు నీ
పక్కా మోహము మా యనుంగు జననీ వ్యామోహమం దైక్యమై
గ్రుక్కం బట్టెనె యేదుపున్ జనక! నీకు న్నాకు సంబంధమున్
ముక్కల్ చేసిన దుర్దినంబు హృదయంబున్ జీల్చి చెండాడెడిన్

ఎక్కడ కేగుచున్న సెలవీక, శిరాన కరంబు నుంచి, పె
న్మక్కువ నాశిషం బిడక మానని నీవు శ్మశానవాటి ని
న్నొక్కని నుంచి దుఃఖమున నూరి మొగంబయి పోవుచున్న మా
దిక్కును చూడవైతివిగదే? ముది తండ్రి! ఋణంబుదీఱెనే.

తానమునంది క్రైస్తవమతంబున జేరి కులంబు గోత్రమున్
మానని వెట్టి గొల్లఁడ వమాయకమూర్తివి గాని తండ్రి! యి
ట్లేనుఁగు నెక్కు పుత్రుని, కవీశుని పుట్టువు గుట్టెఱుంగు వి
జ్ఞానివి నీవు నీదు చరణంబులకుం గవితా నమస్కృతుల్

గుట్టమువారి వంశమున గొఱ్ఱెల కాపరివై జనించి యీ
మొట్టికులంబునం గలసి భూపసభాంతర గౌరవాఢ్యులన్
కుట్టల గాంచి నీ విచట గూర్చిన కీరితి, చందమామలో
నిట్టిని గొఱ్ఱెగా సలిపె యెట్టి తపస్సు ఘటించినాడవో!

వెలగల పట్టభద్రుఁడు వివేకి చలాకి గలట్టి దొడ్డ పంతులు, తులలేని భక్తి భరితుం డిశరాయెలు నామకుండు, నీ మలి కొమరుండు నీ మరణ మార్గణఘాత సహించలేక, శోషిలి విలపించెడిన్ జనకజీ! తను జన్మల నూరడింతువా?

బహుకాల భక్తి సంపత్తి వెంబడిరాగ
 సాగెనే నీ స్వర్గ సదనయాత్ర?
ప్రత్యక్షమయ్యెనే ప్రత్యహం బీవు సం
 భావించి మోహించు పారదైసు?
సంతసించితివె మోక్షస్వామి సభలోన
 యర్హాసనంబుల నధివసించి?
కొడుకుల యెడబాటు పిడుగుసోకిన నిన్ను
 నోదార్చెనే మింట నున్నవాఁడు?

జగము గ్రుంగిన గాని నీ జపతపంబు
మానని యనంతభక్తి సంభరితమతివి
భాగ ముండకపోదు కైవల్య ధరణి
పల్లవులరాయ! ముక్తిరంభావిధేయ.

# తొలి నిట్టూర్పు

జాతీయ సభాపతియై
నేతాజి సుబాసుబోసు నిఖిల భరత వి
ఖ్యాతిం గడించి, గాంధీ
చేతంబున కెక్కె, సాహసిక సింహంబై.

వలచెన్ జాతీయసభా
లలనామణి మూడుమార్ల లంకారముగా
వలపుల పతిగా బోసుఁడు
వలపించెన్ భరతవర్ష భక్తగణంబున్.

పెండిలిని మాని, భారత
ఖండమునకు సేవ సల్పి, కారాగృహముల్
గండములు గడచి, జాతికి
గుండె యగుచు మెలగె పగర గుండెలలోనన్.

మాతృ పరాధీనస్థితి
శాతాయుధ మగుచు మానసము నగలింపన్
నీతులకు వేళగాదని
తాత నెదుర్కొనుచు క్రొత్తదారిన్ ద్రొక్కెన్.

కత్తుల్ బట్టక స్వేచ్ఛ రా దెపుడు, చర్ఖాపద్ధతుల్ పూర్తిగా
చిత్తైపోవు నటంచు గాంధిమునితో సిద్ధాంతమున్ జేసి, భూ
భృత్తుల్ దెల్లని చక్రవర్తులు, భయాప్తిన్ గ్రుంగి, కంగారుగా
నెత్తించెన్ యవరెస్టు నెత్తములపై హిందూరణ స్తంభమున్.

పలుకు పల్కున నిప్పులొలికి రక్తము పొంగు
పౌరుషాంశంబు లుపన్యసించి,
అడుగుజాడలలోన నడచి, చెప్పినచోట
నిలిచి పోరాడు సైనికుల గూర్చి
దరిదాపులేని దుర్భర దాస్యమున గుందు
తల్లి కన్నీరు ప్రత్యక్ష పఱచి
విస్మృతమైన గంభీర భారత బాహు
పాండిత్య పటిమ జ్ఞాపకముచేసి .

స్వీయసంస్థ దిశల జెలగి ప్రోజ్వలముగా
పల్లెపల్లియలకు పర్యటించి
శ్రీ సుబాసు వంగ సింగంబు జాతికి
వీరరసము నోలి నూరిపోసె.

తెలవారి దొరతనంబుల్
దెలవాఱుచు వంగ వీర దినమణి నౌరా
యిలు దాటని ఖైదీగా
నిలిపెన్ దొరతనము గుండె నిబ్బరమునకై.

శ్రీ సుబాసుబోసుఁ జెరసాలయం దుంచి
పీడ వదలెననుచు విశ్వసించి
అగ్ని రణములో నిమగ్నమై రక్తాలు
గురియుచుండె సీమదొరతనంబు.

యుద్ధ శబ్దంబు ప్రతిపల్లెటూరి పూరి
గుడిసెలో మారుమ్రోగిన గడియ లవ్వి
కదనదేవత మానవ గర్భపటలి
జీల్చి చెండాడు రక్త నిశీథమద్ది.

అగ్ని పర్వతంబు లంతరంగంబున
పగలు రేయి బ్రద్దలగుచునుండ
పొంగులీను రక్త గంగల నరికట్టి
కాళరాత్రు లతడు గడిపినాఁడు

తావుగొన్న కోడెత్రాచు పోలిక వేడి
బుసలు జిమ్ముచున్న బోసుబాబు
నీచమైన స్వీయ నిర్బంధమున్ దప్పు
కొనెడు త్రోవ లల్లుకొనుచునుండ.

ఒక స్త్రీ మూర్తి నిశీథమధ్యమున విద్యుత్కాంతులన్ జిమ్ము, దై
విక సమ్మోహనరూపధేయమున నావిర్భావమున్ జెంది, ఆ
గక గంగాయమునానదుల్ గనుల సాక్షాత్కారముం జెందగా
నికటక్షోణి నతాస్యయై నిలచియుండెన్ జీర్ణవస్త్రాలతో.

నదులుం గొండలు సింగముల్ బులు లరణ్యంబుల్, శరీరంబునన్
బొదలన్ దెల్లని మంచుకొండ మకుటంబున్ బూని, యంభోధిపై
పదముల్ మెట్టి, యనంతభాషలు ముఖాబ్జంబందు జన్మింపగా
యెదురన్ నిల్చితి వెవ్వరమ్మ! ఘనవేణీ! నన్ను గన్నమ్మవా!

అని పలుకు బోసుబాబుని
గనుగొని, యమ్మధురమూర్తి కరమెత్తి వెసన్
వినుపింప దొడగె నిట్లని
తనదగు సుఖదుఃఖయుత కధానక మెల్లన్.

ఆరుగురు చక్రవర్తులు
దారాశయు లేలి నన్ను దనిపిరి, నేనే
భారతమాతను, కవితా
భారతి నా లచ్చిసుతుల భార్యకుమారా!

పాండవ కథ, రాముని కథ
మండనములు నాకు నా కుమారులు, ప్రజ్ఞా
మండితులు హస్తినాపురి
గుండియ, నా బొట్టు రక్తకుంకుమము సుతా!

పిల్లనగ్రోవిం దాలిచి
గొల్లెతలకు వలపు నేర్పి కువలయ వినుతుల్
కొల్లంగొట్టిన టక్కరి
గొల్లఁడు నా పెద్దకొడు కగుం దనుజన్మా!

వర్ణించినాడు నా బాహుపాండిత్యంబు
    గరిమతో యోజగంధి కొడుకు
చాటించె నా యహింసా మహామంత్రంబు
    సన్న్యాసి యయి శాక్యచక్రవర్తి
సృష్టించినాడు నా ప్రేమ సామ్రాజ్యంబు
    నవఖండముల యేసునాధ మౌళి
స్థాపించె నా శాంతిసమర దిగ్విజయంబు
    రాటాలదొర బోసినోటి తబిసి

నిన్ను గన్నదాన, నీ తండ్రి తాతల
గన్నదాన, గాంధి గన్నదాన,
బ్రతికి చెడినదాన, భావాలుగలదాన,
ధనికురాల, దుఃఖ దగ్ధురాల.

పిదికితి రత్నరాసులు నవీనములెల్ల నదీనదాలలో
బ్రదికితి సాటి భూతల పురంధ్రులకుం దలమానికంబుగా
యదను దొలంగనీక మధురాన్నపురాసుల పంటబండితిన్
చిదికి పరాయి భూపతుల చేతికి జిక్కితి చిక్కిపోయితిన్.

అలుగున్ బట్టని ధర్మవీరుడు దయా యత్తాంతరంగుండు, భ
క్తుల తాతయ్య, సబర్మతీ తబిసి, దిక్కుల్ జెక్కలైపోవు బాం
బుల కయ్యంబును కంటగించుకొని రేపుల్ మాపులు న్నూలుపో
గులతో నా కభయప్రదాన మిడి పల్కుం బ్రేమ సిద్ధాంతముల్.

కనుగొంటి న్మహనీయులన్ గొడుకులన్ గాంధిన్ మహాబుద్ధ దే
వుని, హింసాత్మకమైన సప్తభువనంబుల్ మ్రొక్కి మోహింపగా
తనయా! నేటికి వర్ణభేద మతభేద స్వార్థదేవేరి పూ
నినదో, విప్లవ గర్భిణీ తరుణినై నిత్యంబు శోకించెదన్.

తొలుత న్నల్వురు నాల్గు త్రోవలయి పుత్రుల్ నాటుకొన్నారు మొ
క్కలుగా వర్ణచతుష్టయం; బిపుడ సంఖ్యాకంబులై, యైక్యతా
బల విచ్ఛిత్తి యొనర్చి నన్నొరులకున్ బట్టించె, నీ హెచ్చు త
గ్గుల కయ్యా లొక తల్లి పిల్లలకు సిగ్గుంజేటు యోచింపగన్.

కడ చూడంబడరాని నా పరిభవోగ్రజ్వాల చల్లార్చు, మే
ల్కొడుకుం జండకర ప్రతాపసముదగ్రున్ నిన్ను గాంక్షించి, నే
ముడుపుల్ గట్టితి నెల్ల వేలుపులకున్ మున్నూరువర్షాల నా
కడగండుల్ వడగండులై కరగె, వంగక్షోణి గంగాసుతా.

నను వేధించు సమస్యల న్విను మనంతంబుల్ మహాలోపముల్
వినిపింతున్; గనుమీ స్వరాజ్య జయలబ్ధిన్ నీవు నీవార లం
దిననాడే సరిదిద్దుకోవలయు కాదే, రిక్తవర్షాలలో
మునుగుం దేశము చుట్టబెట్టుకొనిపోవున్ శాంతి కైవల్యముల్.

విసిగి వేసారడే వేమన్న ఘన యోగి
భరత విజ్ఞాన దౌర్బల్యమునకు
వాపోవడే మొన్న శ్రీ పోతులూరయ్య
భావి భారత మతప్రళయమునకు
అంగలార్చడె వివేకానంద సన్యాసి
తల్లి దేశపు దరిద్రత్వమునకు
భుక్తి మానడె, దేశభక్త మార్తాండుండు
నిమ్నజాతుల దాస్య నిర్భరతకు

అన్య దేశాభ్యుదయ గాథ లాలకించి
భారత క్షీణదశ కన్నులార గాంచి
యెంద రెందరు పుణ్య మునీంద్రు లకట
బాధపడిరొక్కొ జీవసమాధులందు

తొలుతన్ గాంధి ఫకీరు మాకు భగవంతుం డంచు పూజించి, భ
క్తులలో గొందరు పంచమోద్ధరణమున్ దూషించుచున్నారు నిం
దలు నీలాలు సృజించి; యీ కటకు సంతానంబు నా కద్దునం
ద లుగుల్నాటి నటించుచున్న యది మాయా నాట్యకౌశల్యమై

జుట్టుం బొట్టు ధరించి సీమదొర దుస్తుల్ దాల్చి క్రీడింతు ర
ట్టిట్టుం గాని విచిత్ర వేషములతో యే యెండ కా గొడ్డులం
బట్టన్ జాలిన పొట్టపోతల గుణ భ్రష్టాధముల్; నీవు కాల్
మెట్టంబోవు స్వరాజ్య రక్తరణభూమిం దోడుగా నిల్తురే!

అంటంగూడదు ముట్టకూడదను వాక్యం బాత్మ గారింప న
ట్టింటం గుందు నభాగ్యజీవులను మున్నే రాము డే కృష్ణు డి
ట్లంటం గాలిడ నిచ్చిరో తెలుపు మోయీ! వారి కన్నీటి వి
ప్పంటం గాలిన గుండెతో బొడమె నన్నా! గాంధి కర్మందియై.

మైనపు టుండవంటిది యమాయకమైనది నా యనుంగు సం
తానము; స్వార్థశీలురు సనాతన శిల్పులు మల్చుచుంద్రు కా
లానుగుణంబుగా పెడ మతాంతరులన్ మను కీలుబొమ్మలన్
మానవుల న్మరామతుకు మాలిన కొమ్ములులేని దున్నలన్

సత్యంబన్న హుళక్కి, ధర్మము తమాషా మాటయేకాని, యే
సత్యం బేడిచె, వర్ణభేద విషదూష్యంబుల్ మహాధర్మముల్
వ్యత్యస్తంబుల నైకమత్యము లసూయా ద్వేష భావంబులే
సత్యాల్ చచ్చినవాడు శాయియగు మస్తానౌ మరేమోయగున్.

పెద్దలనాటివన్న యవివేకపు టుక్తులు వంకబెట్టి బో
దెద్దులు విద్యలేని ప్రజ లెల్లెడ సత్తుల పూజసేయుచో
వద్దని యడ్డగించెడు కృపాపరు డొక్కడు గానరాక నా
ఖద్దరుచీరగాంధి మొనగానితనంబును వ్యర్థమే కదా?

ఒకఁ డేడ్చియేడ్చి పాఠకు లేడ్వలేదంచు
కోపించి తెలివి తక్కువకు వగచు
ఒకఁ డాత్మజాత్యున్నతికి ముప్పు రాకుండ
మాటిమాటికి రామకోటి వ్రాయు
ఒకఁడు ముత్యాల మాలిక లల్లుకొని వచ్చి
అమ్ముడువోక లో నుమ్మలించు
ఒకఁడు దిక్కరి రాజ మూరేగు సమయాన
పెడకన్ను కులికించి వెక్కిరించు

ప్రణయ కవి యొకండు, పాషాణ కవి యొక్క
డేడ్పు కవి యొకండు; నేకమగుచు
నొండొరులను జూచి యోదార్చుకొనుచున్న
బాగుపడునె భావి భరతజాతి.

కడుపు మంటచేత పెడమొగంబయి యున్న
జాతిభేద మను పిశాచి మ్రోల
నాల్గు చేతులున్న నలువ కౌశలమేని
నిక్కువముగ వన్నె కెక్కబోదు.

దోచుకొన్నారు ముద్దులు మూటగట్టించు
నవరత్న దివ్య భాండారభూతి
అరికట్టినారు సింహమ్ముల కెదురెక్కు
భువనైక వీరుల భుజబలంబు
కాజేసినారు దిక్కరి దంతకుంతాలు
మెరుగు బెట్టిన కళాభరణములను
కలిపినా రఘు మెరుంగని తనూభవులకు
నడుమంతరపు రిత్త నాగరకత

ప్రశుభములు జిందు నాతనూరక్తమెల్ల
పిండుకొన్నారు ముప్పూట లెండగట్టి
జాతి మత భేద మద పిశాచములు గూడ
తానకము లన్న నా పరాధీనదశకు

ఎంతటి దాస్యమేని సహియింతును గాని; సహింపజాల నీ
స్వంత సహోదర ప్రబల బంధుర దాస్యము గబ్బిలాల శు
ద్ధాంతములైన వేల్పుల సుధా భవనాలకు దూరమైన నా
సంతతి నుద్ధరింపగల సత్పురుషుం డుదయింపకుండినన్.

జీవితమెల్ల భారత విశిష్ట సమత్వ జయాభిలాషియై
సేవలు సల్పినట్టి మునిసింహము గాంధి పకీరు గుండెలో
నావము లుప్పతిల్ల నవురా! యల తిర్పతి వేల్పు నింటిలో
దావు నొసంగలే దనుగు తమ్ముల కీ నరరూప రాక్షసుల్.

హిందూధర్మము లంటుపడ్డవని నే డింగ్లీషు చట్టాలలో
సందుల్ సాకులు వట్టి పంపిరి మఠస్వాముల్ నిరోధింపగా
సందేశంబులు తెల్లవారికి తనూజా! మానవ ద్వేషులై
పంది న్నందికి గొల్చువారి కయి నీ ప్రాణంబు లర్పింతువే.

బ్రదుకెల్లన్ దమ లాభ నష్టముల బేరా లాడుటేగాని న
చ్చదు తద్భిన్న విశేష మిందొక తెగన్ జన్మించినన్ విద్యకుం
బ్రదుకుల్ లే విట, పంతులయ్య లిచటన్ వ్యర్థుల్ దరిద్రుల్ కళా
సదనా లెమ్ముల గూడులై చివికి బాష్పశ్రేణి వర్షించెడిన్.

ఇలు దీర్పం బనిచేయు యంత్రములుగా సృష్టించి పర్దాలలో
పల బంధించుటజేసి భారత సతుల్ స్వార్థాశయుల్ సెప్పు నీ
తులలో స్వర్గము జూఅలాడెదరు సంతోషింత్రు నెమ్మేని సొ
మ్ములతో యెమ్మెలతో పురాతన కథా పుణ్యప్రసంగాలతో.

తల బొప్పిగట్టు పెద్దలనాటి బూజు బ
ట్టిన దొంగ ధర్మాలు వినిచి వినిచి
సర్వాంగములయందు జలువ నెత్తురు జిందు
అబల మున్నగు పేళ్ళ నంటగట్టి
కాంతు దెంతటి దురాగతము సల్పుచునున్న
పల్లెత్తరాదని భయము సెప్పి
కడుపులో కోర్కె వెల్లడిచేసి యెదిరింప
జాలని చిలుకల చదువు నేర్పి

వ్రతములని నోములని బుద్ధిబలము నదిమి
బత్తి చెరసాలలోనుంచి బందిజేసి
సతుల నైసర్గిక జ్ఞాన సస్వరమను
చిత్రచిత్రంబుగా హత్య చేసినారు

గొప్ప దేవుడంచు గుండ్రాళ్ళు జూపించి
బాగుపడెదువారు పలువు రుండ
ప్రాణమున్న బీదవాని కన్నుల జూచి
బాగుచేయు ధర్మపరుడు లేడు.

ఈ కులవాహినీ ప్రళయ మీ నవఖండములందు లేదు మా
చాకలివాడు మంగలియు జాతుల గొప్పదనాలకోసమై
బాకులుబట్టి నిల్చెదరు, పంచమజాతియు రెండు ముక్కలై
తాకదు ముట్టదీ దుడుకు తత్వము లెట్లు పరిష్కరింతువో.

మోస మెఱుంగనట్టి పరిపూత మనస్కుడు పెండ్లమున్న స
న్న్యాసి, ఫిరంగికిం దమక నట్టి యఖండుడు బందిఖాన యా
వాసముగా వయఃపటిమ పండిన గాంధి ఋషిర్షభుండు నా
యాస ఫలింప శాంతి విజయధ్వజ మెత్తకపోడు పుత్రకా!

హృదయంబున్న జగన్నియంతయనువాడే స్వర్గమందున్న, ము
ప్పదివందల్ తెగ లుండునే? మత విషవ్యాళంబు లాటాడునే?
చదువుల్ సంధ్య లొకే కులంబున నివాసం బుండునే? భారతా
భ్యుదయ స్థాపక! విశ్వసింపవల దెప్డున్ మెట్ట వేదాంతముల్.

నీ తో బుట్టువు లీ యుదగ్రకదనాగ్ని వ్యాఘ్రి నీక్షించుచున్
భీతిన్ బిత్తరవోయినా రిపుడు గాంధిన్ బంది గావించి రీ
శ్వేతస్వాములు, మాతృభక్తుడవు గంభీరుండ వీ వక్కటా!
నేతాజీ! నిదురింపరా దిపుడు తండ్రీ! వీరమార్తాండుడా!

దాయలు, దేశభక్తి సముదగ్రుని నిన్ను గ్రహింపలేక, ము
ద్దాయిని జేసినారని వ్యథం దపియింపకు మన్న; పంచమా
మ్నాయముతోడు, నీ ప్రతిభ నాలుగు దిక్కుల విస్తరించు, లే
వోయి! ధరింపవోయి! జగదుగ్ర సమున్నత మండలాగ్రమున్.

బ్రదుకుల్ బందికి ధారవోసికొని, సర్వత్యాగులై గాంధితో
బదవల్ బడ్డ పటేలు, పండితుడు జవ్హారులాలుడు న్నీ యెడం
బదనుల్ దీరి బహిర్గమించు పలుకుం బ్రహ్మాస్త్రముల్ జూచి మే
నెదుగం బొంగి నమస్కరించెదరు తండ్రీ! బోసు వీరాగ్రణీ!

కోరిక నీవు నా శుభముకోసము ద్రొక్కిన త్రోవలం దస్పృ
గ్ధారలు జిమ్మి నీ యనుగు తమ్ములు నాటగలా రజాదు గం
భీర పతాక లెమ్మఖిల విశ్వము నీకు నమస్కరింప, నా
పేరు ప్రతిష్ఠల న్నిలువబెట్టుము శీతనగమ్ము కొమ్ములన్.

వెరవకుమన్న! నీ వెనుక వీపుల మూపుల వెంబడించి నీ
తెరవుల నడ్డగించెడు ప్రతి క్షణ భూరి విపత్పరంపరల్
నరికి, జపాను దాస్య దహనంబున వ్రేగెడు భారతీయ సో
దర పృతనాసహస్ర పరితాపము దీర్చి జయమ్ము గూర్చెదన్.

సకలోర్వీతలి దద్దరిల్ల, విజయ స్తంభమ్ము నాటించి, ఢి
ల్లికి, నీ తల్లి పతాకతో సుఖము లుల్లేఖింప యత్నించు పు
త్రక! నీ మేని కవోష్ణనాళములలో రంజిల్లు నారూపు పా
యక నీ వెంట నటించు లెమ్మచల ధైర్యస్థైర్య! యోధాగ్రణీ!

చింతారుద్ధ గళంబుతోడ నెడదన్ ఛేదించుచున్నట్టి వృ
త్తాంతంబుల్ వినిపించి తక్షణమ యంతర్ధానమున్ జెందె న
క్కాంతారత్నము బోసుబాబు తనురక్తం బుత్సుకత్వంబునన్
గంతుల్ వేయగ నిర్ణయింప దొడగెన్ గత్యంతర ప్రక్రియల్.

# మళి నిట్టూర్పు

గడ్డము బెంచి పచ్చి తురకంబలె వేషము మార్చి కాపలా
గడ్డ జవాను తండముల కన్నులు దాటి, యనుంగు వంగ పు
న్గడ్డ నతిక్రమించె నొడికంబుగ కొండొకనాటి రాత్రి, మా
దొడ్డ సుబాసుతోడ దులదూగునె తచ్ఛివరాట్సహస్రముల్.

అంతర్ధానమునందె బోస నుచు, బ్రహ్మాండంబు మార్మ్రోయగా
గొంతుల్ రాయగ తంతులొక్కమొగి నుద్ఘోషించె లోలోపలన్
సంతోషించిరి దేశభక్తులు ప్రజా సన్న్యాసికిన్ గాంధికిన్
దంతాల్లేని యలంతినవ్వుల గముల్ దల్కొత్తె నెమ్మోముపై.

రైలెక్కి పెషావరులో
ప్రాలి దినద్వయము గడపి పరమాప్తులు మి
త్రాళీ సహాయ్యమున గా
బూలునకు బ్రయాణమయ్యె మోటారుపయిన్.

భగవంతు రాము దను నొక
సగంధ రత్నము తోడు జనుదేరంగా
పగలనక రేయి నాకను
భగవంతుం డెఱుగకుండ ప్రస్థానించెన్.

పనిలేక పలుమారు ప్రశ్నించి విసికించు
        బాటసారులకు జవాబు లిచ్చి
అపరాధ పరిశోధకాధికారులఁ జూచి
        బెదరు జూపుల ప్రక్క కొదిగి నడచి
ఆలస్యభీతి లారీ లెక్కి పయనించి
        ముప్పూట లుపవాసములఁ దపించి
కాబూలు వాగు వంకలనెల్ల తరియించి
        అడుగడ్డు గండాల నధిగమించి

కూర్మి తమ్ముల నలువదికోట్ల ప్రజకు
దాస్య దళనంబు గావించు త్యాగమూర్తి
పడిన కడగండ్లు కాబూలు పంట వలతి
వ్రాసికొన్నది గర్భగహ్వరమునందు.

వేషము దాల్చి పఠానుల
వేషంబుం బూని వంగ వీరుండు, యశో
భూషణుడు కాలగతిచే
భాషణములు రాని మూగవలె నటియించెన్.

అద్దాషరీఫమను నొక
పెద్ద మసీదునకు బోయి, పేర్మార్చి జియా
యుద్దీ నయి, దేశపు సరి
హద్దులు లంఘించె రహమతాఖ్యుడుఁ దానున్.

మరునాడు లాలుపురా
పురిదాక పఠానుభటులు ముగ్గురు రాగా
గిరిగమనమార్గ దుర్భర
నరకము రహమతునితోడ నడచి తరించెన్.

ఘనకష్టంబున తోలు సంచులపయిన్ గాబూల్ నదిం దాటి, య
ష్టను పోలీసులబారి దప్పుకొని వక్రంబైన మార్గాలలో
తనిఖీచేయు స్థలాలు దాటి యవలన్ దాకా ప్రవేశించి ర
య్యనఘుల్ దేశహితాభిలాషులు మహాత్యాగుల్ నిరాహారులై.

లారీపై బడి టీ కషాయమున కాలక్షేపమున్ జేయుచున్
దారిం బ్రోన్నత వృక్షశాఖల ప్రమాదాల్ దాటి పానీయ మా
హారం బందని భూములం గడచి గమ్యస్థానమున్ జేరె, ఖా
దీ రాటాల జయేతి ఝాంకృతులు సందేశంబు లందించగన్.

సుకుమారి, త్యాగివీరుడు
సుకముల కెడమై పరాయి క్షోణీస్థలిలో
చకిత స్వాంతత కొండొక
బికారియయి తిరిగె విశ్వవిహితాసక్తిన్

అది కాబూలు, తుషారవర్షములచే నాచ్ఛాదితంబై, మహా
సదనంబుల్ జలిచె వడంకెడని పర్షాృ పుస్తు భాషావకుల్
కదమున్ ద్రొక్కుచు నన్యదేశజులవంకన్ వారగా జూచుచున్
బెదురుం బెట్టెడు పట్టణం బభిరుచుల్ భేదించు తా వెంతయున్.

ఖరముల్ లొట్టిపిటల్ గుఱాల్ మెలగ దుర్గంధంబుతో నిండి, దు
ష్కరమై, చీకటి చిందులాడుకొను నక్కాబూలు సత్రాలలో
జరపెం గొన్ని దినాలు జీవితము నుజ్జీలేదు వాక్రుచ్చగా
భరతక్షోణి సుబాసుబోసా కడె సర్వత్యాగి ముమ్మాటికిన్.

కునుకుం గూరుకు మాని రే బవలు మాస్కోయాత్ర గావింప, ర
ష్యను కాన్సల్ జనరల్ కటాక్ష లవమ భ్యర్థించి వేసారి, జ
ర్మను దేశస్థుల నాశ్రయించి గడపె న్మాసార్థ మల్లాడు వె
చ్చని చిత్తంబున నష్టకష్టపు నిమేష బ్రహ్మకల్పంబులన్.

సీయై డీ యొకడు, సుబాస్
భాయీపయి కన్ను వేసి ప్రతిదినముం గా
జేయc దొడంగె ధనంబే
దో యొక నేరంబు మోపి దుశ్చరితుండై.

ఠాణాకు రండు శీఘ్రుంబంచు బెదరించి
యొకనాcడు గడియార మూడగొట్టి
అధికారి పిలిచినాడని హడావిడిచేసి
బక్షీసుగా కొంత పైక మడిగి
పురివీడి చనకున్న పరువు దక్కదటంచు
స్వాపతేయము కొంత చప్పరించి
మొదట మోపిన నేరమును క్రమ్మరంజుట్టి
ఆయంబు దెమ్మంచు చేయి సాచి

పిడుగువంటి బోసువీరుని ప్రచ్ఛన్న
వేషధారి గరిమ విశదపడక,
నివురుగప్పియున్న నిప్పుతో జలగాట
మాడదొడగె నా సియైడి భటుడు.

ఉన్నతాధికారి, చిన్నయుద్యోగియు
చేయి సాచకుండ సాయపడరు
లంచ మీయకున్న మంచ మెక్కనివారి
వ్రేళ్ళమీద లెక్కపెట్టవచ్చు.

చెలగున్ లంచములాగు దుర్గుణము రాజీవాక్ష ముఖ్య త్రిమూ
ర్తులయందున్, ఫలపుష్పదోయముల నేదో యిచ్చుకోకుండ వే
ల్పుల నట్లుంచి, మహానుభావులగు న ప్పూజారులే పల్క ర
న్యులమాటల్ దడవంగనేల? ధనహీనుల్ జల్దిపీన్గుం గముల్.

ధనికుల్ సోమరిపోతులై, కటికిపేద న్నెత్తురుల్ బిండి, కూ
ర్చిన విత్తంబును వెచ్చపెట్టి ధరణిన్ జీర్ణించియున్నట్టి రా
మునకో, రంగనికో నిఖా లవసరంబుల్ సల్పుచున్నారలే
గొనబుం గైతలచే గుదుర్పనగు నీ ఘోరప్రమాదోద్ధతిన్.

ఘనసంకల్ప నిమగ్నమై, యుడుకురక్త ధ్వస్తమైయున్న, వీ
రుని చిత్తం బతిలోక యాతనల యోర్పు న్నేర్పునో; బోసుబా
బుని వెన్నాడు విరోధిరాడ్భటచయంబున్ బోలి వేధించుచున్
వెనువెంట న్నడచెన్ ప్రతిక్షణ మకుంఠీభూత దీర్ఘవ్యథల్.

పుట్టినగడ్డలో భరత భూములలో గజదొంగవోలి, కా
ల్మెట్టుట కింత నేలయును లేక తపించు సుభాసు వీర స
మ్రాట్టును జూచి తద్ధిమ ధరాధర మెంత కఱంగి యేడ్చెనో
గట్టులు దన్ని పారు నల గంగ యెఱుంగు నెఱుంగ రెవ్వరున్.

ఉత్తమచందను కొండొక
యుత్తమ జాతీయ వీరుఁ డుత్సుకమతియై
యెత్తుకొనె, బోసు రక్షణ
మొత్తముఁ దలమీద నెంత పుణ్యాత్ముండో.

బోసుని భగవత్ రాములు
వేసమ్ములు జూచి యతని పెండ్లాము మదిన్
బోసని యెఱుఁగక యాత్మా
వాసంబున వలదటంచు వారణచేసెన్.

అమరుల్ మెచ్చ సుబాసుబోసునకు సాహాయ్యంబు గావించు ను
త్తమచందుండు, నిజాంగనామణికి యాథార్థ్యంబు వాక్రుచ్చినం,
బ్రమదంబంది, ప్రసన్నచిత్తయయి, సర్వస్వంబు వెచ్చించి, గం
డము దాటింత మటంచు నిల్పుకొనె నింటన్ వింతనేరస్థులన్.

ఆలోకించి, సుబాసుగా దలచి మేనల్లాడ నిల్లప్పుడే
ఖాళీజేసి యొకండు దుర్గ్రహణి రోగగ్రస్తుడైపోయె, భూ
పాలాఖండల చండశాసన భయోత్పాతంబు, జాతీయ ఖై
దీలన్ ద్యాగుల, వీరమూర్తులను సందేహించు దయ్యాలుగా.

అమలునందున్న నేటి ధర్మములు రేపు
కూలిపోవచ్చు కాలానుకూలముగను
రాజధర్మాల దుష్ప్రచారముల కతన
త్యాగియు నొకా నొకప్పు ముద్దాయి యగును.

ముసలివాడును మిత్రుండు ముసలిమామ
కులజుడైనట్టి హాజీకి గుట్టు విడచి
శ్రీసుబాసుని విషయంబు జెప్పి చూచి
శరణ మర్థించె నుత్తమచందురుండు.

సింగము బోసుబాబ తని జీవిత దివ్యచరిత్రచే మహా
వంగము ధన్యమయ్యెనని పల్మరు మెచ్చి నుతించు, హాజి, మా
తంగము సింహనాదమున దత్తర బిత్తరలాడు రీతిగా
కొంగరవోయి పల్కె ననుకూలముగాని మృషాపదేశముల్.

ఆయాసం బిడకుండ లభ్యపడు సభ్యత్వంబు సాధించి, కు
ళ్ళాయీ ల్దాలిచి, శుద్ధఖద్దరు జగా లాల్చీలతో వచ్చి, జా
తీయ స్వర్గముపన్యసించెదరు గాంధీభక్తు లట్లెందరో
మాయాశీలురు, దేశభక్తులనుచున్ భావింపరా దెప్పుడున్.

డబ్బుల్ కోట్లు గడించి సంస్థలకు బేడల్ మాడ లర్పించుచున్
డబ్బాదాతలు, దేశ నాయకుల చిర్నా కెక్కుచుండుర్వికిన్
జిబ్బీబాపతు మర్త్యరూప ధర రక్షఃశ్రేణి చే(వ్రాలుగాం
(ద్రుబ్బు న్గర్వము గండరించిన హతాయుష్కుల్ ప్రజాశాత్రవుల్.

అటు లుత్తమచందుని ఘన
కటాక్షమున బోసుబాబు గడపం దొడగెన్
బ్రిటిషు భటకోటి వీక్షణ
కుటిలాగ్నిం బడక తప్పుకొని కొన్నాళుల్.

బోసుండు పట్టువడె స
న్యాసి యగుచు హరిద్వారమం దను వార్తల్
బోసు విని నవ్వుకొనె, పో
లీసు భటుల వట్టి తెలివిలేనితనంబున్

**అక్షరాజుల** చెలికార మాసపడక
సోవియట్టుల గడ్డకుం బోవఁ దలచి
నెరపిన ప్రయత్న మంతయు నీటిమీది
వ్రాతయై పోవ శ్రీ బోసుబాబు కలఁగి.

ఇటలీ కార్యాలయపతి
కటాక్షమున రోము యాత్రగావించి హుటా
హుటి రషియా భూముల కే
గుట సుకరంబనుచు వాని కూర్మి గడించెన్

సీనారుకరోనీ యను
వాని రమణి దెచ్చు రిత్తవార్తలు వినుచున్
మానసము కలతపడగా
మాని ప్రయత్నాంతరముల మగ్నుం డగుచున్

శ్రమ లెక్కింపక పాదచారియయి రష్యాకుం బ్రయాణించు చి
త్తముతో నుత్తమచందునిం బిలిచి మిత్రా! యింక గాబూలులో
నిముసం బుండుట క్షేమదాయకము కానేకాదు మాస్కో ప్రయా
ణము గావింతును నేర్పుతో వలయు సన్నాహంబు గావింపుమీ.

నీకు న్నీ సతికి న్నమస్కృతులు మీ నిత్యోపచారాళికిన్
మీ కాలుష్యము లేని చిత్తములకున్ మీ భక్తి సంపత్తికిన్
బాకీపడ్డది నాదు జీవితము ప్రాప్తం బున్నదో లేదో! నా
కీ కాయంబున మీ సమాగమము భాయీ! దేశభక్తాగ్రణీ!

ప్రళయ ఝుంఝూహతంబైన జలదమట్లు
క్రాలుచున్నది నా యంధకార యాత్ర
దిక్కులేనట్టి నా చేరు తీరభూమి
నాకపురి యౌనొ! దుర్భర నరకమౌనొ!

నాలోనం బరువెత్తుచున్నవి విమానా లెన్నియో, చిత్తమాం
దోళింపన్ జెరసాలలోన మను పీన్గుంబోలి జీవించి న
న్నాళుల్వెచ్చని యూరుపు ల్విడుచు కన్న న్సోవియద్భూములన్
గూలీనై నివసించుటే సుఖము నాకున్ దేశభక్తర్షభా.

నూరు గజాల వేగమున నూత్నపథంబున ద్రొక్కు నాత్మ దీ
క్షారథ మాగబట్టుకొనజాల నిమేషము దేశ మాతృ సం
సారమునం బ్రశాంతము ప్రచార మొనర్చినదాక వేడి ని
ట్టూరుపు టగ్నిలో గుములుటో ర్వదు నా తుది రక్తబిందువున్.

తడవన య్యెన్ మన కెన్నడో వలపు స్వాతంత్ర్యోత్సవాల్ జూటలా
దెడు భాగ్యంబు ప్రమాదదంబయిన గాడిం బడ్డ యీ మేలి పు
త్తడి తేరిన్ మరలించు నుత్తమ నియంతల్ లేరు, రాటాలతో
మడివస్త్రంబులతోడ రాగలవె? సంపూర్ణ స్వరాజ్యార్ధముల్.

అర్ధచంద్ర ప్రయోగాంతంబునం గాని
తొలగిపోదీ తెల్లదొరతనంబు
త్యాగవీరుల రక్తదానంబునం గాని
దర్శనం బిడదు స్వాతంత్ర్య సంధ్య
నైనరింతలేని శాసన శస్త్రమున గాని
తగ్గ దీ కులవిభేదాల కణితి
కులము కల్తిలేని కలము పోటున గాని
చావ దీ యజ్ఞాన సర్పధాటి

మేలి ఖద్దరు పగటి వేషాలు జూచి
బెదర దెన్నడు పగవాని పెత్తనంబు
బహు మతాంతర చంచలాశ్వములమీద
సాగునే స్వరాజ్యానంద స్వర్ణరథము

నా సృష్టింప దలంచుకొన్న యతి నూత్నంబైన జాతీయ హిం
దూ సామ్రాజ్యమునందు సర్వులు మహేంద్రు ల్సోదరుల్లేదు వ్య
త్యాసం బున్నత నిమ్నతల్ తగవు బ్రహ్మత్వంబొ! శూద్రత్వమో
భాసిల్లన్వలె నట్లుగాకఖిల విశ్వంబుల్ నశింపన్ వలెన్.

తల్లిదండ్రు లెపుడు బిడ్డలకు నేర్పగరాదు
కులగోత్రముల వారి గొప్పతనము
చదివింపగారాదు చదువు లయ్యలు పాఠ
శాలలోన వర్ణాల గొడవ
రచియింపగారాదు రచయితల్ శాశ్వత
దాస్యంబు నిలుపు కథానకములు
సలుపరా దెట్టి ప్రచారంబు లీ దినం
బములు నందున్న కృతిమపు సంస్థ

లన్నదమ్ముల తనమున కడ్డువచ్చు
శబ్దజాండంబు సర్వంబు చావవలయు
స్వర్గ మటచేతియం దూడి పడగవలయు
మోక్షరాజ్యంబు బొందితో పొందవలయు.

ఒకజాతి రక్త మిచ్చిన
నొకజాతికి సానుభూతి యుందని ధరలో
నొక బోసు దొక్క నెహురూ
యొక గాంధీ మరణ మెవని యుల్లము గలచున్.

పర్దా పద్ధతి చించివైచిన కెమాల్‌పాషా యొకం డిండియా
సర్దుంబాటునకై జనించుట యవశ్యం బట్లు గాకున్న నీ
పర్దాలోపలి గ్రుద్దులాటలు సమాప్తం బెన్నడుం గావు, నా
నిర్దేశం బిది నిశ్చితార్థ మిది సందేశం బిదే మిత్రమా!

ఆపద్వార్ధి తరించినాడను వయస్యా! నేను కాబూలునన్
మీపుణ్యంబున పుణ్యదంపతులు జుమ్మీ! మీరు మీ సత్కృపా
దీపజ్వాల వెలుంగున న్నెరపెదన్ దీక్షా మహాయజ్ఞమున్
రేపో! మాపో! స్వతంత్రభారత శుభోర్వీం గన్నులం జూచెదన్.

అన్నా! యుత్తమచందు! విప్లవ మహాయజ్ఞంబు సాగించి నా
యన్నా దమ్ములతో స్వరాజ్య మధురాహారంబు భక్షింతునో
మన్నైపోయిన దేశభక్తులకు సంప్రాప్తించు రిక్తోత్సవాల్
గన్నుల్‌లేని కబోదినై, యపర లోకంబందు వీక్షింతునో.

ఆటంబాంబు సహస్రగోళముల తీవ్రాటోపభీమంబులై
బైటంపడ్డ సుబాసుబోసుని పలు వ్యాహారముల్, వైరికిన్
జేటుం గూర్చుట నిశ్చయంబని మదిన్ జింతించి, వాక్రుచ్చగా
మాటల్ జాలక యుత్తముం డెదద సంభావించె గేల్మోడ్చుచున్.

ఇన్నూరేడులు నిద్రవోయినది మా హిందూధరాదేవి, మా
యన్నా! నేటికి నిద్రలేచినది దాస్యభ్రష్టలై యున్న నీ
యన్నా దమ్ముల కర్థమైనది మనుష్యత్వంబు నీ చెల్మిచే
కన్నుల్ విచ్చితి మేను నాసతి జగత్కాండంబు కొండాడగన్.

నా యిలు సొచ్చి నా సతికి నాకు ఘటింపగ జేసినావు నీ
సేయము దీర్ఘ దాస్య తమసీవృతమైన నిశీథమిప్పుడే
హాయిగ దెల్లవార్చిన సుధాంశుడ వీవు సుబాసుబాబు, దీ
ర్ఘాయువు నీకు నీదు హృదయస్థిత దీక్షకు, నీదు మూర్తికిన్.

వర్ధిల్లుగాక నీ ఫార్వర్డు బ్లాకు సం
స్థారాజ మాచంద్రతారకముగ
ముద్రణం బగుగాక ముందు నీ శుభమూర్తి
భరత పుత్రుల మనఃఫలకసీమ
లేచుగా కలఘు ఢిల్లీ గుండెకాయపై
నీ వెత్తు మూడువన్నెల పతాక
నీళ్ళాడుగావుత నీ పలాయనగాథ
నవకవీశాన ఘంటములయందు

మింట మెఱయుచున్న మృత్యుదేవత నోట
నుమియు నగ్ని గోళములనుండి
జన్మదేశమునకు సంపూర్ణ భద్రత
భిక్ష పెట్టుచున్న విశ్వవీర!

యమ్మనువా డొకండు రషియా వివరంబు లెఱుంగువాడు, సా
యమ్ముగ వచ్చునట్టుల ప్రయత్నము జేసి యతండు కోరు ద్ర
వ్య మ్మిడి యుత్తముం డది సుబాసునకున్ వివరించి చెప్పగా
సమ్మతి జూపె వచ్చె నల జర్మనువారి కరావలంబమున్.

బోసునకు దారి జూపెడు
కాసంత శ్రమంబు వంకగా వందలు వే
లాసపడె యమ్ము మదిరా
దాసులకు ధనంబుకన్న దైవము గలదే?

చుక్క కల్లులోన బెక్కు స్వర్గంబులు
దనువుతోడ గాంచు త్రాగుబోతు
యమ్ముగాని దృష్టియందు, బోసు డెంత
దేశ మెంత! దేవదేవు డెంత!

మానుకొన్నాడు నేతాజి మానుకో ప్ర
యాణ యత్నం బనెడు మాట యమ్ముతోడ
నుగ్గడించుట వీరున కుత్తమునకు
గండమయి తోచె బోసు రక్షణముకన్న

ఇటలీ కేగుట కష్టమైన నల మధ్యేమార్గ యానంబునం
దటు రష్యా చెలికారమున్ సలుపగా నౌనంచు, యోజించి, య
ప్పటి రష్యా పయనంబు మానుకొని సర్వజ్ఞుండు నేతాజి, య
య్యిటలీ యాత్ర కుపక్రమించె, ఘన దైవేచ్ఛ ల్మహాశ్చర్యముల్.

భగతు రామాభిధుని పెషావరున కంపి
యుత్తముని మేలు నెమ్మది పెత్తనింప
జర్మనుల విమానాశ్వరాజంబు నెక్కి
దివ్యమని వ్రాలె బోసు బెర్లిను పురాన.

పొగరుంబోతు నియంత, నాజిజపు నిప్పుం బంచఖండాలపై
నెగజిమ్మించిన హిట్లరుం డెదురుగా నేతెంచి, సెల్యూటు సే
యగ శార్మణ్యని మండలాగ్రములఛాయన్ వెండి మోటారు టే
నుగు నెక్కించిరి, బోసువీరుని సమానుల్ లేరు భూమండలిన్.

జరమనీయులు బరాబరు లిచ్చి కొనియాడ
స్వాగతోత్సవ గౌరముల నంది
ఆదిభారత శౌర్య మభివర్ణనముచేసి
కరతాళ నినద నిర్ఘరుల దేలి
హెరు హిట్లరుని శిలాహృదయంబు ద్రవియింప
దేశభక్తుల పాట్లు తెలియపరచి
భరతఖండ స్వేచ్ఛ నురిమాని కెక్కించు
కలుకు రాజుల మోస మెఱుకజేసి

ఖండ పంచకమును గడగడ లాడించు
నుగ్ర జర్మనీయు లొడలు మరచి
పరువరింప, బోసుబాబు బెర్లినువీట
నాటినాడు కీర్తి వాటికలను.

పదివేల కంఠములతో
పది దిక్కులు నిండ గగనవాణి వచించెన్
బెదరింతలేని బోసుని
కదనాశయు నన్యదేశ గౌరవవార్తల్.

ఒక చిరుబాంబు భారత మహోర్విపయిం బడనీయ బొందియం
దొక చిరురక్తనాళమున నూపిరి నిల్చిన నంచు దేశనా
యకులకు గాంధినేత కభయంబని వార్త లొసంగె బోసుబా
బొకడకదా! జగద్ధిత మహోద్యమ వీరుడు దారుడారయన్.

పొద్దుం గ్రుంకని రాజ్యమేలెడు బలాబ్ధుల్, సీమసమ్రాణ్మణుల్
గద్దెన్ డిగ్గి స్వరాజ్య మిత్తురని యాకాంక్షించి కేల్మోడ్చుచున్
బ్రొద్దుల్ బుచ్చిరి మాసలే దిపుడు సంపూర్ణ కృపా దృష్టితో
మద్దత్తిచ్చినచో, నియంతృమణి సామ్రాజ్యంబు సాధించెదన్.

అని ప్రార్థించిన హిట్లరు
మనస్సు పొంగారి మారు మాటాడక, జ
ర్మను బంది గుందు హిందూ
వినుత మహావీరసేన విడుదలచేసెన్.

ముక్కోటి దైవతములకు
మ్రొక్కితి మొక్కనికి గరుణ పుట్టెనె? యౌరా!
యెక్కటి వీరుడు బోసుడె
నిక్కమయిన వేల్పటంచు నిండిన భక్తిన్.

ఆ నేతాజి పదంబుల
నానందాశ్రువుల స్నాన మాడించి తలం
బూని నుతించిరి, హిందూ
సైనికులు, ససంభ్రమ ప్రసన్నాశయులై

క్రొంగ్రొత్త పద్ధతులతో
సంగర కళ నేర్పి, భరత సైనికులకు శౌ
ర్యాంగార మూది బెంగాల్
సింగము జపనీయ లంక జేరం జనియెన్.

మికడోమేలికడానిమోటరుపయిన్ మిత్రున్, సుబాసేంద్రు న
ట్టోకియోవీధుల స్వాగతోత్సవములన్ టోజోముఖామాత్యనా
యకు లుత్సాహసమేతులై కొలువ బ్రహ్మాండంబుగా సల్పి, కా
నుక లర్పించి భజించె ముజ్జగములున్ జుట్టాలకా త్యాగికిన్.

ఒడ్డుపొడవు గల్గి యుజ్జ్వలంబయి యున్న
బోసుబాబు దివ్యమూర్తి నరయ
ననుభూతపూర్వమైన కొండొక భక్తి
కిరణ మెడద మెరసె హిరొహిటోకు.

ఎంత మచ్చుమందు ఏ మహత్తరశక్తి
శ్రీ సుబాసు వదనసీమ గలదొ
జాపనీయరాజు, జర్మనీయ నియంత
తలలు వంచి నతులు, సలిపినారే.

మును పోక బుద్ధదేవుడు ప్రభూతమునంది యహింస నేర్పె, హిం
సను ప్రకటించుచున్ మరల జన్మము నందె సుబాసు బుద్ధు డీ
తనికి జపాను రాజ్యమును దత్త మొనర్చి తరించునంచు బో
సునకు నమస్కరించె, సరసుండగు నమ్మికడో, వినమ్రుడై.

సేనానాయకులై మహామహిమతో శ్రీ సింగపూర్లంకలో
నే నేరంబు నెఱుంగనట్టి సఖులన్ హిందూప్రజన్ బంధన
గ్లానింబాపి, తయారుజేసె రణశిక్షాదక్ష సైన్యంబుగా
శ్రీ నేతాజి యజాదుహిందుపవుజున్ జెండాల్ నభం బంటగన్.

ఒక లక్ష సేన సంశ
ప్తకులై నెత్తుటి సిరాను వ్రాసి యిడంగన్
మకుటంబులేని రాజై
ముకుద్రాడై పొలిచె జానుబులు భూములన్.

మూడు జగాలు దద్దరిలు బోసు వచోనల మింత కర్ణ సం
తాడితమైనయంత భరత క్షితి పుత్రిక లుక్కుమీరి నీ
ల్లాడిన బెబ్బులుల్ బలె దళంబున జేరి యలుంగు దాల్చి వెం
టాడిరి లక్ష్మి మున్నగు నవాబ్జముఖుల్ దరిబీతు లీయగన్.

డిలనున్ సైగలు షానవాజు దుకు కెప్టెన్లై జగాయుద్ధ వి
ద్యలు శిక్షించి యధైర్యముం జిదుమనై యన్ యే మహాసేన, ని
ప్పులు వర్షించుచు కౌరవేంద్రుని బలంబున్ గాల్చు దీవ్యద్భుహ
న్నలవోలెన్ దెలిసేనపై కుఱుకు కిన్కన్ దూలె నుచ్చండమై.

అదిగో! వచ్చె సుబాసుబో సనెదు భీతాహంబు గర్భంబులో
బదివేల్గాడిద తన్నులై మెలగ సప్తద్వీప సామ్రాజ్య సం
పద సాధించిన రాచవారలకు సింహస్వప్నముల్ సేసె, చా
లది మా జాతి చరిత్రయం దొక సువర్ణాధ్యాయమై నిల్చెడిన్.

బాబు వచ్చునంచు పదివేల కనులతో
నెదురు సూచుచున్న హిందు ధరణి
స్వేచ్ఛ నందుకొన్న చేతులతో నేడు
బయలు కవుగిలించి వగచుచుండె.

కలుగునే మాకూర్చు కల్హార మాలకు
వంగ వీరుని గళాలింగనమ్ము
ప్రాప్తించునే వీర భరతనందనులకు
నేతాజి మధుర సాన్నిధ్య సుఖము
చెందునే స్వచ్ఛంద సింహపీఠమునకు
బోసుని పాదాల భూరజంబు
అమరునే కావ్య కన్యా సహస్రములకు
యజదు పటాల నాయకుని చెలిమి

పుణ్యనదుల చల్వ భూమిదేవత చల్వ
మంచుకొండ చలువ మాకు గలుగ
శ్రీ సుబాసుబోసు సింగంబు క్రమ్మర
వచ్చి దర్శనంబు నిచ్చుగాక.

# జాషువ రచనలు

జననం: 28 సెప్టెంబర్ 1895 మరణం: 24 జూలై 1971

| | |
|---|---|
| రుక్మిణీ కల్యాణం | 1919 |
| చిదానంద ప్రభాతం | 1922 |
| కుశలవోపాఖ్యానం | 1922 |
| కోకిల | 1924 |
| ధ్రువ విజయం | 1925 |
| కృష్ణానది | 1925 మే |
| సంసారసాగరం | 1925 అక్టోబర్ |
| శివాజి ప్రబంధం | 1926 |
| వీరాబాయి | 1926 |
| కృష్ణదేవరాయలు | 1926 మార్చి |
| వేమనయోగీంద్రుడు | 1926 జూన్ |
| భరతమాత | 1926 |
| భారతవీరుడు | 1927 జనవరి |
| సూర్యోదయం | 1927 ఏప్రిల్ |
| చంద్రోదయం | 1927 జూన్ |
| భారతవీరుడు | 1927 అక్టోబరు |
| గిజిగాడు | 1927 డిసెంబర్ |
| భారతమాత | 1928 ఫిబ్రవరి |
| రత్నచ్యుతి | 1928 జూలై |
| ఆంధ్రుడను | 1928 డిసెంబరు |
| తుమ్మెద పెండ్లికొడుకు | 1928 ఉగాది |
| సఖి | 1929 జులై |
| బుద్ధుడు | 1929 ఆగష్టు |
| తెలుగుతల్లి | 1929 సెప్టెంబర్ |

| | |
|---|---|
| శిశువు | 1929 అక్టోబర్ |
| బాష్ప సందేశము | 1929 నవంబర్ |
| దీర్ఘ నిశ్వాసము | 1930 ఫిబ్రవరి |
| ప్రబోధం | 1930 మే |
| శిల్పి | 1930 సెప్టెంబర్ |
| హెచ్చరిక | 1930 ఆగష్టు |
| సాలీడు | 1930 ఆగష్టు |
| మాతృప్రేమ | 1930 |
| | 1931 జనవరి |
| యుగంధరమంత్రి | 1931 డిసెంబర్ |
| సమదృష్టి | 1931 |
| నెలబాలుడు | 1931 మార్చి |
| నెమలినెలత | 1931 ఏప్రిల్ |
| లోకబాంధవుడు | 1931 జూన్ |
| అనసూయ | 1931 ఆగష్టు |
| శల్య సారథ్యము | 1931 సెప్టెంబర్ |
| సందేహడోల | 1931 ఉగాది |
| స్వప్నకథ | 1932 |
| అనాథ | 1932 |
| ఫిరదౌసి | 1932 |
| ముంటాజమహలు | 1932 |
| సింధూరము | 1932 జనవరి |
| బుద్ధమహిమ | 1932 మార్చి |
| క్రీస్తు | 1932 జూలై |
| గుంటూరుసీమ | 1932 సెప్టెంబర్ |
| వివేకానంద | 1932 నవంబర్ |
| చీట్లపేక | 1932 ఉగాది |
| జేబున్నీసా | 1932 మే |
| పశ్చాత్తాపం | 1932 డిసెంబర్ |
| అయోమయము | 1933 జూన్ |


| | |
|---|---|
| అఖండ గౌతమి | 1933 ఉగాది |
| ఆశ్వాసం | 1933 ఏప్రిల్ |
| మేఘుడు | 1933 ఆగష్టు |
| శ్మశానవాటి | 1933 డిసెంబర్ |
| ఆంధ్రభోజుడు | 1934 మార్చి |
| గబ్బిలం | 1941 |
| కాందిశీకుడు | 1945 |
| తెరచాటు | 1946 |
| చిన్నా నాయకుడు | 1948 |
| బాపూజీ | 1948 |
| నేతాజి | 1948 |
| స్వయంవరం | 1950 |
| రాష్ట్రపూజ | 1963 |
| కొత్తలోకం | 1957 |
| క్రీస్తు చరిత్ర | 1958 |
| ముసాఫరులు | 1963 |
| నాగార్జునసాగరం | 1966 |
| నా కథ | 1966 |

## జాషువ కవికి లభించిన బిరుదులు - సన్మానాలు

| | |
|---|---|
| కవితా విశారద | 1933 |
| కవి కోకిల | 1936 |
| కవి దిగ్గజ-నవయుగ కవిచక్రవర్తి | 1947 |
| మధుర శ్రీనాథ | 1952 |
| విశ్వకవి సమ్రాట్ | 1964 |
| కళాప్రపూర్ణ | 1970 |
| పద్మభూషణ్ | 1970 |
| ఆం.ప్ర.శాసనమండలి సభ్యత్వం | 1964 |

(జాషువా సాహితీ ప్రస్థానం నుండి)

## రచయిత గురించి



జాషువ గుర్రం వీరయ్య - లింగమాంబలకు 1895, సెప్టెంబరు 28న వినుకొండలో జన్మించారు. సాహితీ క్షేత్రమందు కృషీవలుడు కావాలనే కాంక్షతో ఆనాటి అననుకూల వాతావరణాన్నీ సానుభూతి కేర్పడిన దుర్భిక్షాన్నీ ఎదుర్కొంటూ ముందుకు సాగారు. కృషితో "నాస్తిదుర్భిక్షం" నానుడి యదార్థమైంది. అనావృష్టులు, గాలివానలు గత స్మృతులయ్యాయి. కవితాసుక్షేత్రంలో పసిడినే పండించారు.

ప్రాథమికోపాధ్యాయునిగా జీవితం ప్రారంభించి, నాటి మూకీ చిత్రాలకు వ్యాఖ్యాతగా ఊరూరా తిరిగి, వీరేశలింగం, చిలకమర్తుల ఆశీర్వాదాలు పొంది కావ్యజగత్తులో స్థిరపడ్డారు. తిరుపతి వేంకట కవుల ప్రోత్సాహం ముందుకు నడిపింది.

ఉభయ భాషా ప్రవీణులై తెలుగు పండితునిగా, ద్వితీయ ప్రపంచ సంగ్రామ సమయంలో యుద్ధప్రచారకునిగా, స్వాతంత్ర్యానంతరం 1956 నుండి 1960 వరకూ ఆకాశవాణి మద్రాసు కేంద్రంలో తెలుగు ప్రొడ్యూసరుగా ఉద్యోగాలు నిర్వహించారు.

కవితాభిమానులు, సాహితీ సంస్థలచే వేయికిపైగా సన్మానాలు పొందారు. కవికోకిల, కవితా విశారద, కవిదిగ్గజ, మధుర శ్రీనాథ, నవయుగ కవిచక్రవర్తి, విశ్వకవి సామ్రాట్ బిరుదులు పొందారు. గండ పెండేరం ధరించి, కనకాభిషేకాలు పొంది, గజారోహణము చేసి, పగటి 'దివిటీల పల్లకీలో ఊరేగారు. గుంటూరు పట్టణం స్వేచ్ఛా పౌరసత్వమిచ్చి గౌరవించింది.

కేంద్ర సాహిత్య అకాడమీ "క్రీస్తుచరిత్ర" కావ్యానికి అవార్డు బహూకరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శాసనమండలి సభ్యునిగా నియమించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం "కళాప్రపూర్ణ" బిరుదాంకితుని చేసింది. రాష్ట్రపతి "పద్మభూషణ్" ఇచ్చి సత్కరించారు. ముప్పదికి పైగా రచనలు చేసి 1971 జూలై 24న కీర్తిశేషులైనారు.